కవికోకిల గ్రంథావళి - ౪

వ్యాసములు

కవికోకిల

దువ్వూరి రామిరెడ్డి

ప్రచురణ:

కవికోకిల గ్రంథమాల

నెల్లూరు.

ప్రతులకు:

సోల్ డిస్ట్రిబ్యూటర్స్

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్,

రాష్ట్రపతి రోడ్డు,

సికింద్రాబాదు. (A.P.)

2. తెలుగు కవితలో క్రొత్త తెన్నులు

పుట

కవిత్వతత్త్వ నిరూపణము

౧. కవి

ఓ కవీశ్వరుఁడా, నీవు సృష్టికర్తవు. నీ సృష్టి లోకోత్తరము; అనన్య పరతంత్రము; ఆనందదాయకము. నీమహిమ వర్ణనాతీతము. నీ నిర్మాణము దైవసృష్టిని సైత మధఃకరించుచున్నది. నీ కల్పన యాదర్శప్రాయము.

నీ సృష్టియందు లతికలు జంగమలు; శంపాలతలు నిశ్చలములు. కలువకంటులు, కలకంఠకంఠులు, చంద్రముఖులు, విద్యుల్లతాంగులు నీ పట్టములలోఁ జరియించు సామాన్య స్త్రీలు! నీకు పరిచితలైన యువతులెల్లరు సౌందర్యవతులు; హృదయ సమ్మోహన మంత్రాధిదేవతలు! అందరు సీతలు, సావిత్రులు, దమయంతులు, చంద్రమతులు, ద్రౌపదులు, శకుంతలలు.

ఓయి కవితాశిల్పీ, నీచే సమ్మానింపఁబడిన పురుషులందఱు వీరులు, లోకోత్తరకార్య దురంధరులు! భూమిని చాపకట్టుగాఁ జుట్టగలిగిన హిరణ్యాక్షులు; విశ్వమును మూఁడడుగులతోఁ గొలువఁగలిగిన వామన మూర్తులు; రాజలోకమును గండ్రగొడ్డంట నఱికి రక్తప్రవాహముచేఁ బితృతర్పణము గావించిన పరశురాములు; ఆల్గరగంగ వేణుగానము గావించిన శ్రీకృష్ణమూర్తులు, సముద్రమును మథింపఁగల

దేవదానవులు, స్వర్గమందుఁ బ్రవహించు గంగానదిని భూమికి నవతరింపఁజేయఁగల భగీరథులు,సృష్టికిఁ బ్రతిసృష్టిగావింపఁ గలిగిన విశ్వామిత్రులు!

నీ పట్టణములోని చంద్రశిలా సౌధములు సూర్య చంద్రుల రాకపోకల నడ్డగింపఁగల యంతటి యున్నతములు, నీతోఁటలోనివృక్షములెల్ల ఫలవంతములు,లతలెల్లఁ గుసుమ భరితములు, షడృతుధర్మము లేక కాలమున నీ యుద్యాన మును సేవించుచుండును, ప్రకృతియంతయు నీ దృష్టికి సచేత నము, మేఘములు, హంసలు, కాముకీకాముకుల ప్రణయ సందేశములఁ గొనిపోవుచుండును!

ఓయీ, నీసృష్టి కాలబద్ధముగాదు. అనుక్షణ యౌవన విజృంభణమువలన, కంచెల బిగియుచుండ "ప్రియంవద నిర్దయ ముగ నా కంచెలవల్కలమును బిగించి ముడివేసినది. నీవు కొంచెము సడలింపుము" అని యనసూయతో ముగ్ధముగఁ బలుకుచుఁ బూఁదీవలకు జలసేచనము సేయుచుండిన శకుంతల దుష్యంతుని కన్నులకు నిర్వాణసామ్రాజ్యమై కనుపట్టిన శకుంతల, నేఁటికిని అదేవిధముగ మా కన్నులకు బొడకట్టు చున్నది! కాని,ప్రకృతి సృజించిన శకుంతలయేమైనది? యౌవ నమును, సౌందర్యమును గాలక్రమముగఁ గోలుపోయినది. జరాభార మామెను సైతము పీడించినది. తుట్టతుదకు ఆ మోహనదేవత,ఆ శకుంతల యనంత కాల సాగరమున బుద్బు దమువలె మఱఁగిపోయినది!

ఓ యైంద్రజాలికుఁడా, నీవు కుంచె నొక్కసారి విసరి నంతనె మాయాత్మలు తేలికయై పూలతేకులు ఱెక్కలుకట్టు

ొని నిర్వృతి పదంబునకుఁ జల్లగ నెగిరిపోవును. మొగము
మొత్తినట్లు, కన్నులు మిటారించుకొని మమ్ములను గనుఁ
ొనుచున్న ప్రాపంచిక యాథార్థ్యము, మెల్లమెల్లగ సమసి
ోయి యనిర్వచనీయమగు నానంద స్వప్నము అవతరించును!
అయినా, నీ కలము సోఁకిన ప్రతివిషయము, ప్రతిపదము, ప్రతి
భావము, ప్రతిరూపము శాశ్వతమై యమృతమై యొప్పారును!
ఒక్కనిమిష మనంతకాల స్వరూపముగఁ గన్పట్టును. భూమి
స్వర్గముగఁ బరిణమించును. ఓ కవీ, మానవ జీవితమును
ఆనందమఖముగ నొనరింపుము.

———

౨. కవితాఽవతరణము

" ఋషే. ప్రబుద్ధోఽసి వాగాత్మని
తత్ బ్రూహిరామచరితం
అవ్యాహతజ్యోతిరార్షం
తే చక్షుః ప్రతిభాతి; అద్యఃకవి రసి"

''నీవు మొదటికవివి'' అని బ్రహ్మ వాల్మీకి మహర్షితోఁ
జెప్పినటుల రామాయణమునఁ గూర్పఁబడియున్నది. అందు
వలన వాల్మీకి యాదికవియనియు రామాయణ మాదికావ్య
మనియుఁ గాలక్రమముగఁ బ్రజలు విశ్వసించుచువచ్చిరి. నేఁటి
కిని విశ్వసించుచున్నారు. బోయచేఁ గూల్పఁబడిన క్రౌంచ
మును గాంచినప్పుడు వాల్మీకికిఁ గలిగిన శోకావేశమే ప్రథమ
కవిత్వావతరణమని లోకప్రసిద్ధి. కాని, నేను వేఱుగఁ దలం
చెదను. క్రౌంచ మిథునగాథ వాల్మీకి కవియైన విషయమును

మాత్రము తెలుపుచున్నది. రసార్ద్రమైన వాల్మీకిహృదయము క్రౌంచపక్షి శోకమునకు మఱింతయుద్రిక్తమై శ్లోకరూపమున బయలు వెడలెను. కవితాశక్తి అతని భావమునఁ బిక్కటిల్లుచు వెలికుఱుకుటకు సమయము వేచియుండెను. అట్టి సమయము క్రౌంచపక్షి యాక్రోశవేదనవలన సిద్ధించినది. అప్పుడువాల్మీకి నోటినుండి యొక లయాన్వితమైన వాక్యము ఆకాంక్షితము గను, అప్రయత్నపూర్వకముగను బయలు వెడలెను. అది యపూర్వము. కావున వాల్మీకి యాశ్చర్యపరవశుఁడై దానినే తలపోయుచుండెను. అంతట బ్రహ్మ ప్రత్యక్షమై ఆయనుష్టుబ్ఛ్లోకములతో రామకథను రచింపుమని యాదేశించెను.

వేదములు ఛందోబద్ధములు. ఛందస్సు వేదాంగములలో నొకటిగఁ బరిగణింపఁ బడుచున్నది. రామాయణము కన్నను వేదములును వేదాంగములును బూర్వము లనక తప్పదు. ఇట్లగుట వైదిక కవులేల ఆదికవులు కాకపోయిరి? దీనినిగుఱించి నేనిట్లూహించుచున్నాను. వేదమును విరాట్స్వరూపుని నిశ్వాసములనియుఁ గావుననే యవి యపౌరుషేయములనియు ఆర్యులు విశ్వసించియుండినందున ఆ ఛందములు మానవు లనుకరింప సాధ్యములు గావని తలంచియుందురు. కొంతకాలమునకు వాల్మీకి యుద్భవించి, అంతకుమున్న కథల మూలమునఁ బ్రజలయందు వ్యాపించియున్న రామాయణ గాథను కావ్యముగ రచియించెను. ఇట్లనుటవలన వేదముల కనంతరమును రామాయణమునకుఁబూర్వమును కవిత్వరచన లేదని చెప్పుటగాదు. నన్నయ భారతమునకుఁ బూర్వము తెలుఁగు దేశమున వ్యాపించియున్న గ్రామ్య సారస్వతము,

తరువాత, అభినవమార్గ మవలంభించిన ఆ యుద్గ్రంథముతో పోటీకి నిలువ లేక యెట్లునశించెనో, అట్లే రామాయణమునకుఁ బూర్వమున్న చిన్న చిన్న కావ్యములు, గేయములు ఈబృహత్ప్రబంధముధాటికి నిలువ లేక యాత్మహత్య గావించుకొని యుండును. రామాయణమునందు వర్ణింపఁబడిన నాగరకతను గమనించినయెడ ఆకాలమున కవిత్వశిల్పము కొదువపడి యుండెనని చెప్పుట కెవ్వరును సాహసింపరు. సత్యము భూత కాలగర్భమున దాఁగియున్నది. వాల్మీకి ఆదికవియైనను కాక పోయినను, రామాయణ మాది కావ్యమైనను కాకపోయినను సీతారాములు చారిత్రక నాయికానాయకులైనను లేక, వాల్మీకి మహాకవి యగాధ భావసాగరము మధింపగాఁ బైకిబికిన యమృత నవనీతరాసులైనను మనకొక్కటియె! ఇందలి సత్యాసత్యములు చరిత్రకారులకు వదలిపెట్టెదము. వారికి సాధ్యము గాని రసాస్వాదనమునకు మనము పూనుకొందము. రామాయణము శాశ్వతకల్పనమైనది! దాని యధికార మనంతము! సర్వకాలీనము!

కవిత్వము ప్రత్యేకముగ నొక దేశమునకును, ఒక జాతికిని, ఒక నాగరకతకును సంబంధించియుండునదిగాదు. అది విశ్వజనీనమైనది. మొట్టమొదట మానవ హృదయమెప్పుడు రసార్ద్రమాయెనో, అప్పుడే కవితాబీజ మంకురించెను. అప్పుడే మానవుని కల్పనాశక్తియు ప్రతిభయు బయలయ్యెను. అప్పటి నుండియు కవితామహాలత శాఖోపశాఖలుగఁ జీలి మానవ సంఘమునం దల్లుకొనుచున్నది. మానవజాతి యజ్ఞాన నిమగ్నమై బాల్యదశయందున్నప్పుడు, రామాయణము మహా

భారతము మున్నగు పెద్దకల్పనలకును, శాకుంతలాదిమనోహర నాటక రచనలకును కావలసినంత లోకానుభవమును, సృజనశక్తియు, శిల్పనైపుణియు నలవడి యుండదనుట స్పష్టము. హైందవసమాజము చాల ఉన్నతదశకు వచ్చిన యనంతరము అట్టికావ్యములు, నాటకములు పుట్టియుండునని నిర్ణయించుటకు వానియందు వర్ణింపఁబడిన సాంఘికాచార వ్యవహారములే తగిన సాక్ష్యములుగ నున్నవి.

మానవునికి భావప్రకటనము గావింపవలసినయక్కఱ అజ్ఞాన మంకురించినప్పటినుండియుఁ గలదు. ఉద్దేశములు వెలిపుచ్చుటకుఁ దగినభాష యుత్పన్నముగాని ప్రథమదశయందు కూడఁ, జేసైగలు, కనుసైగలు మున్నగువానిచేత మనుజులు తమ వ్యవహారములను సాఁగించుకొనుచుండిరి ఆ కాలమున వారిబుద్ధి యంతగా వికసింపకుండినందువలనవివిధభావోత్పత్తి కంతయవకాశ ముండియుండదు. కాని, బహిః ప్రకృతిసంబంధమువలన వారిహృదయములందుఁ గ్రమక్రమముగ భావవికసనమును, ఆభావమును బ్రకటించుటకుఁగావించుప్రయత్నము వలన భాషయు నభివృద్ధి చెందుచు వచ్చెను. ఉరుములు, మెఱుములు, మేఘములు, వర్షములు, వడగండ్లు, ఉల్కాపాతములు, నక్షత్రములు, సూర్యోదయాస్తమానములు. నదులు, కొండలు మున్నగు నైసర్గికచిత్రములను దర్శించి నప్పుడు ఆయా కారణములఁ దెలియమి, ఆదిమమానవులు సంతోషాశ్చర్య భయవిషాదముల వెలిపుచ్చుచుండిరి, నాట్యములు సలుపుచుండిరి, పాటలు పాడుచుండిరి, ప్రార్థనలు సలుపుచుండిరి. కాని, వారి యాటపాటలకు నియమములు

లేవు. మానవసంఘము రానురాను నాగరకత నొందుకొలఁది ఆ యాటపాటలు నియమబద్ధములు గావింపఁడినవి.

నాట్యము, గానము, కవిత్వము, ఆద్యకళలు. ఇతర కళలు పరికర సాధ్యములు గావున తదనంతరము పుట్టినవి. అన్ని జాతులవారి యాద్యకవిత్వమును బరిశీలించినయెడల సామాన్యముగ నది గేయరూపముగ నుండును. వేదములు గూడ నొకవిధమైన గేయములె. వానిని ఉదాత్తానుదాత్తాదిస్వరములతోఁ జదువకుండిన శ్రుతిహితములుగ నుండవు. ముఖ్యముగ సామవేదమును సామగానమని చెప్పుటయుఁ గలదు రామాయణముగూడ గేయకావ్యమె. దానిని కుశలవులు గానము చేసినట్లు రామాయణమందు మనము చదువుచున్నాము. నేఁటికిని, అక్షరములులేని ''కొడగు'' మున్నగు అనాగరక భాషలుగలవు. వానియందు, కవిత్వము గేయరూపమునఁ బ్రచారములో నున్నది. అనాగరక జాతులయందు గేయప్రతిభ మిక్కుటముగ నుండును. వారియం దొక్కఁడొక్కడును కవియె! ఒక్కఁడొక్కఁడును నటకుడె! ఈ విషయమును,మనము ప్రత్యక్షముగఁ జూచుచున్నాము. ఏనాది, యెఱుకల, జోగుల, మాలమాదిగజాతులవా రొక సారి యొక క్రొత్తపాటనుగాని వర్ణమెట్టునుగాని వినుట తటస్థించెనేని, మఱునాఁడె అట్టివియెన్నియో వారు రచించి పాడుచుందురు. హృదయము నాకర్షించు నేవిషయమును గుఱించియైనఁ గ్రొత్తక్రొత్త ఛందస్సులలో, అకృత్రిమముగ వారు పాటలల్లి పాడుచుందురు. కోటప్పకొండ మీఁద పోలీసువారికిని, అచ్చట మ్రొక్కుఁబడి

ప్రభల నూరేగించుచుండిన రెడ్లకును బరస్పరము కలహము సంభవించి హత్యలుజరిగిన విషయమును గుఱించి, బిచ్చ మెత్తు జోగుల జాతివారు "ఔరా! చెన్నప్పారెడ్డి, నీ పేరే బంగార్పాకడ్డి" అను వీరరసోద్రేకపూరితమైన యొక గేయ మును రచించి పాడుచుండిరి. ఇట్టివి యెన్నియేనియుం గలవు. కలుపుఁదీయు కాలమున నిట్టి చిత్రవిచిత్ర గేయములను మనము యథేష్టముగ వినవచ్చును. పల్లెటూరి కాఁపులకీ విషయము చక్కఁగ బోధపడఁగలదు. మధురమైన గ్రామ్య సాహిత్యముతో వారికెక్కుడు పరిచయము గలదు.

ప్రకృతితత్త్వ జిజ్ఞాసయు, శాస్త్రజ్ఞానమును, విమర్శ శక్తియు, మానవసంఘమునందు హెచ్చుకొలదికవిత్వశక్తియు దగ్గిపోవుచుండును, ఎన్నియో బుక్కులకు కారణభూతము లైన యురుములు, మెఱుములు, ఉషస్సులు నేఁడు మనకు సామాన్యములైనవి. వానిని గాంచినప్పుడు మనము ఆశ్చర్య పడుటలేదు. వెఱపొందుటలేదు. ఈకాలమునఁ బిడుగును ఇంద్రునిచేతి శతారధారనుగ మనము తలంచుటలేదు. ఎందు వలన? "వాతావరణమున సంచరించు సవ్యాపసవ్య విద్యు త్ప్రవాహములు మేఘముల మూలమున కలసికొన్నప్పుడు భూమిని దాఁకును! అదియే పిడుగు" అని మనము పాఠశా లలోఁ జదివితిమి. స్త్రీల ముఖములకు చంద్రబింబమును సరి పోల్చి పూర్వకవులు సంతసించుచుండిరి. కాని, నేఁటికవుల హృదయములో నొక మాలిన్యము ప్రవేశించినది. చంద్ర బింబమునుచూచినంతనే యందలిసౌందర్యముగోచరించుటకు బూర్వమే ఖగోళశాస్త్రములోఁ జదివిన చంద్రవర్ణనము పెను

భూతమువలె మనమునందుఁ బొడకట్టును. చంద్రబింబము సుధాకర బింబముగాదు అందు అగాధములగు పల్లములు, ఎత్తైన కొండలు, అగ్నిపర్వతములు గలవు. చంద్రునిలోని మచ్చ కుందేలుగాదు, మఱ్ఱిచెట్టుగాదు; జింకకాదు. ఏకులు వడుకు అవ్వయుఁగాదు. అది అంతులేని చీఁకటి పల్లము! మనమునందు ఈ భావము లుదయించుటతోడనే సుధాకర మండలము నావరించియున్న కవిత్వము నాశనమై పోయినది.

ఇట్లనుటవలన నింకమీఁద కవులు లోకములో పుట్టరా? నూతన కావ్యములు రచియింపఁబడవా, అని కొందఱు ప్రశ్నింపవచ్చును. కవులును బుట్టుదురు. నూత్న కావ్యములును రచియింపఁబడును. కాని, గుణమునందును గల్పన యందును వ్యత్యాస మగుపట్టును. ఇందుకుఁ జాల కారణములు గలవు. పరిస్థితులు మాఱినవి. ప్రజల విశ్వాసములు, భావములు, ఆదర్శములు మాఱినవి. బుద్ధికి బలము హెచ్చినది. భావమునకు బలము తగ్గినది. కవులేకాలమునఁ బుట్టినను వారి మనఃస్థితి కవిత్వ రచనకుఁ దగినదియే యయ్యును, సమకాలీన భావములకును, నాగరకతకును, వశవర్తియై యుండును. వాల్మీకి మహాకవి యీ కాలముననే జన్మించి యుండియుండిన రామాయణమువంటి మహాకావ్యమును రచియింపఁజాలఁడనియే చెప్పవలయును. నాగరక దేశములలో నగ్రగణ్యమగు అమెరికా దేశమునందు నేఁడు రచియింపఁబడు కవిత్వమును జదివినయెడల ఈ రహస్యము కొంతవఱకు తెలిసికొనవచ్చును. ఆ కవిత్వమునందు మోటారుకారుల శబ్దము, ట్రాంబండ్ల గడగడలు ప్రతిధ్వ

నించుచుండును. యంత్రాగారములలోని పొగ, రస్తాలలోని దుమ్ము ఆ దేశపుఁ గవిత్వమును గ్రమ్ముకొనినట్లుండును. ఆ కవితలందు కోకిలాలాపములు వినఁబడుటకు మాఱు శ్రవణ దారుణములైన రైలుబండి కూతలు వినఁబడుచున్నవి!

మన తెలుఁగు కవిత్వమున కీ గతి యెప్పటికినిఁ బట్టకుండుఁగాక!

---

3. కవిత్వ తత్త్వము

కవిత్వ తత్త్వమును గుఱించిన చర్చ లాక్షణికులు తలచూపినప్పటినుండియు జరుగుచున్నది. కవిత్వమన నేమి? అను ప్రశ్న అన్ని దేశములందును, అన్ని కాలములందును అడుగఁబడుచున్నది. కవులును, లాక్షణికులును, విమర్శకులును వారివారికిఁ దోఁచినరీతిని కవిత్వ లక్షణములను తత్త్వమును నిర్వచించిరి. నేఁడును ఆ ప్రశ్న యంతరింప లేదు. చాల తేలికగ నడుగఁబడి యసంపూర్ణముగఁ బ్రత్యుత్తరము పొందు ప్రశ్నలలో నిది యొకటిగ నున్నది.

ఛందోబద్ధమగు పదసముదాయమె కవిత్వమని యభిప్రాయ పడువారును గొందఱు గలరు. కాని, యీ యూహా యవిచార మూలకమైనది. యదార్థ కవిత్వమునకు ఛందస్సు అనివార్యముగ ననుగతమగును. అయినను ఛందమును కవిత్వ మనుసరింప వచ్చును, లేకపోవచ్చును. నిఘంటువులు, వైద్యశాస్త్రములు, వ్యాకరణములు మున్నగునవి ఛందోబద్ధములై యున్నను వానియందు కవిత్వము పొడసూపకుండు

టయు, కాదంబరి, వాసవదత్త మున్నగు గద్యకావ్యములందు రసస్ఫూర్తి గన్పట్టుటయు నందుకు నిదర్శనము. సంస్కృత లాక్షణికులు గద్యములుగూడ కావ్యముగఁ బేర్కొనిరి. పద్యకావ్యములను రచియించి సహృదయులను మెప్పించుట కన్న గద్యముల రచించి మెప్పించుట కష్టతరమను నభిప్రాయము ఆ కాలమున నలవాటులో నుండినటుల, వామనుఁ డుదాహరించిన "గద్యం కవీనాం నికషం వదన్తి" అను లోకోక్తివలన మన మూహింపవచ్చును.

కవిత్వమునకు వలయు వస్తుగుణ సామగ్రి యంతయు గద్యపద్యములకు సామాన్యమయ్యును ఛందము పద్యమునకు విశేషము. ఇట్లనుటవలన వాని రెంటికింగల భేదము ఛందస్సు నందేగాదు, దానిననుసరించు మఱికొన్ని గుణములయందుఁ గూడ. గాన లయా సమ్మేళనమువలనఁ గలుగు శ్రుతి మనోహరత్వమును భావప్రేరకశక్తియు ఛందమునందుఁ గలదు. ఛందస్సు కేవలము మానవ నిర్మితమగు కృత్రిమ శాస్త్రము గాదు. ఇందుకుఁ బ్రకృతియందె బీజములు గలవు. శోకరసావేశుఁడైన వాల్మీకినోట అప్రయత్నపూర్వకముగ ఛందోబద్ధమగు వాక్యము వెడలుట స్వభావ విరుద్ధము గాదు. కవి హృదయము భావశబలితమై యుద్రిక్తమైనపుడు, భావములు తమంతఁదాము ఉచితమయినభాష వెదకికొని లయాన్వితముగఁ బ్రవహించును. కోపభయాదులచేఁ జిత్తము చంచల మయినప్పుడు మనము మాటలాడుభాష కును, ఉచ్చారణకును, సామాన్య మనస్థితిలో నున్నపుడు మాటలాడు భాషకును జాల భేదము గనుపట్టుచుండును.

భావతీవ్రతయు గాంభీర్యమును ననుసరించి వాక్యమునందు
మాటలు వెనుక ముందు ముందు వెనుక లయి యేదోయొక
లయాధర్మమున కనుగుణముగఁ గుదురు పడుచుండును.
"వచ్చెడువాడు ఫల్గుణుఁ డవశ్యము గెల్తుమనంగరాదు"
అను పద్యపాదమును "ఫల్గుణుఁడు వచ్చెడుఁవాడు" అని
మార్చినయెడల మొదటివాక్యమునఁ బిక్కటిల్లు ఆతురతయు
భావతీవ్రతయు రెండవవాక్యమునఁ సన్నగిల్లి చప్పిడియగును.
ప్రకృతియందు బీజరూపముగను అస్పష్టముగను, అసం
పూర్ణముగను, సంకీర్ణముగ నున్న రామణీయకమును గేంద్రీ
కరించి సహృదయుల భావమునందుఁ బరిపూర్ణముగస్ఫురింపఁ
జేయుట శిల్పముయొక్క ప్రధాన ధర్మముగావున, కవిత్వ
మునందు లయాస్వరూపము సర్వాంగసుందరమై పొడకట్టు
చున్నది.

గద్యము పద్యముతోఁ గొంచె మించుమించుగఁ దుల
తూఁగుచున్నను, ఛందోలోపము వలన రూపసౌందర్యమును
కొంత గోల్పోవుచున్నది. గద్యము రసవంతముగను భావస్ఫో
రకముగ నుండవచ్చును. కాని దానిని గద్యకావ్య మందు మే
గాని కవిత్వమనము. *కవిత్వమునంగల శ్రుతిరంజకత్వము
గద్యమున నుండుటకు వీలు లేదు. "మనకు భావము, రస మే

---

* పూర్వము పద్యకావ్యములు చెవికి వినఁబడునటుల పెద్దగఁ జదువ
బడుచుండెడివి. అందువలన కర్ణేంద్రియ ద్వారమునఁగూడ సుఖము
నొందుచుండెడి వారము. కాని నేఁడు అలవాటు మాఱినది. చెవులు
చేయవలసిన పని కన్నులు చేయుచున్నవి. పెదవులు కదలింపక నవలలు
చదువ నలవాటు పడిన మనము పద్యకావ్యములనుగూడ నట్లే చదివి,
పొందవలసినంత యానందమును బొందుటలేదు.

గదా ప్రధానము, ఛందస్సుతో నేమిపని?'' యని కొందఱు ప్రశ్నింపవచ్చును, అర్థము లేని శబ్దముల సంయోగ వియోగ భేదములవలన నుత్పత్తియగు రాగములు మనల నానంద పరవశులఁ గావించుచున్నవి. ఒక్కొక రసము నుప్పతిల్లఁజేయుటకు నొకొక్క రాగ మనుకూలించు నని గానశాస్త్రవేత్తలు నిర్ణయించి యున్నారు. వీరణము (వీరంగము) వాయించినపుడు కొందఱికి ఆవేశము వచ్చుటగలదు. యుద్ధపు బ్యాండు విన్నంతనే పిఱికివాని హృదయమునందైన రణోత్సాహము చిప్పిల్లును, ఇట్టి వికారములన్నియుఁ గేవలము శబ్దసంయోగ సారస్యమువలన హృదయమునఁ గలుగు మార్పు లేగదా! ఇఁక భావయుక్త పద్యములమాట వేఱుగఁ జెప్పవలయునా?

ఒక ఇంద్రియమునకంటె రెండింద్రియములకు సుఖము గూర్చు వస్తువు ననుభవించునపుడు మన యానందము ఇమ్మడించును. శిల్పముయొక్క పరమప్రయోజనము ''సద్యఃపర నిర్వృతి''ని కలిగించుటయెగాన నొకేసమయమున నొకటికన్న నెక్కుడింద్రియములకు సుఖము గల్గించునదియె యుత్తమ శిల్పమని మనము నిర్ణయింప వచ్చును. *కావున ఛందోబద్ధమగు కావ్యము వచనముకంటె నెక్కుడు సుఖదాయక మనియె చెప్పవలయును.

సంస్కృత లాక్షణికుల కవిత్వ తత్త్వ నిర్వచనములు కొన్ని యెడలఁ బాక్షికములుగను అసంపూర్ణములుగనున్నవి.

---

*There is something magical in rhythm. It even makes us believe that the sublime lies within our reach—Goethe.

లాక్షణికులు తత్త్వవేత్తలును తార్కికులును కావున వారి బుద్ధి యవయవ పృథక్కరణమునందు నిశితముగఁ బ్రవేశించును. వారొకరూపముయొక్క యంగాంగ సంయోగతను సమష్టి సౌందర్యమును గమనింపక, యవయవములను, గుణములను ఆత్మను వేఱుపఱచి వానిలో నేవి ముఖ్యములో యను దీర్ఘ చర్చలకుఁ దొడంగి తుదకుఁ దమ యభిమానమునకుఁ బాత్రమైనదానికిఁ బట్టాభిషేకము గావింతురు. కాని, వానివాని స్థానములందు ఉచితమొనఁగిని అవియవి ముఖ్యములనియు, వానిలో నేవి లోపించినను అంగవైకల్యమో గుణవైకల్యమో లేక ప్రాణాపాయమో సంభవించుననియు వారు తలంపరు.

"తదదోషౌశబ్దార్థౌసగుణౌ అనలంకృతీపునఃక్వాపి" అని మమ్మటుఁడు కావ్యలక్షణమును నిర్వచించెను. కాని, యీ వాక్యమును సాహిత్యదర్పణకారుఁడును, రసగంగాధరకర్తయు విమర్శించి తీవ్రముగ ఖండించియున్నారు. నిర్దోషత్వముచేత కావ్యత్వము సిద్ధించునెడలఁ బ్రాణరహితములగు కావ్యములు గూడ సమ్మానార్హములగును. పేరువడసిన యుత్తమ కావ్యములందేవో కొన్ని దోషములున్నయెడల అట్టికావ్యములు ఆదరణపాత్రములు గాకపోవలసి వచ్చును. ఇట్టి ప్రమాణము నంగీకరించినయెడల మన కావ్య ప్రపంచము చాల సంకుచితమై పోఁగలదు. ఎట్టి యుత్తమ కావ్యమందైనను ఏదోయొక విధమైన దోషములు కొన్ని యుండకపోవు. రామాయణ మహా కావ్యమునందు పునరుక్తి దోషములు గలవు. మమ్మటాది సంస్కృత

లాక్షణికులు రసౌచిత్యముల యుత్కర్షాపకర్షములను దెలుపుటకు కాళిదాసాది మహాకవుల గ్రంథములనుండి యుదాహరణములను గ్రహించిరి. కావున అటువంటి కావ్యములు పరిత్యాజ్యములు కావలయునా? బండి ఱాకను మేలు రాకను యతి ప్రాసమైత్రి గూర్చెనని అప్పకవివలె పోతన్నను దిట్టిపోసి భాగవతమును నీటఁ గలుపుదుమా! ఏవో కొన్ని వ్యాకరణ విరుద్ధ ప్రయోగములను చేమకూర వెంకన్న యంగీకరించెనని యాతని విజయవిలాసమును, క్త్వార్థక ఇకార సంధులు గలవని ఆముక్తమాల్యదను మనము నిరాదరింతుమా? రసాస్వాదన నిమిత్తము కావ్యముఁ జదువువారికి నిటువంటి దోషములపై బుద్ధి చొరదు. ఈలాటి భాషావిషయక దోషములకంటెను అనౌచిత్యము, నీరస కల్పనము మున్నగు రచనాలోపములు రమణీయతకు భంగము గలిగించును

మమ్మటుఁడు కావ్యముల కిట్టి కఠినమైన బహిష్కార దండనము విధించునా? ఇది చింత్యము, పూర్వాపరముల యోచించినయెడల ఆయన యభిప్రాయమును మఱికొంత విరివిగ మనము తెలికొనవచ్చును. కావ్యప్రకాశికయందుఁ బ్రారంభముననే మమ్మటుఁడు కవిసృష్టి నిట్లు కొనియాడెను:

"నియతికృతి నియమ రహితాం
హ్లాదైక మయీ, మనన్య
పరతంత్రాం నవరస రుచిరాం,
నిర్మితి మాదధతి భారతీ కవేః"

ఇందలి యొకొక్కపదము నొకొక్క వ్యాసమునకు

శీర్షికగ నుండఁదగినంత భావగంభీరముగ నున్నది. కవి యొక్క భారతి ప్రకృతి నియమ బద్ధకముగాదు! హ్లాదైక మయమును నవరస రుచిరమునైన యొక స్వతంత్ర నిర్మాణము! మఱియు లోకోత్తర వర్ణనా నిపుణ కవికర్మ కావ్యమని మమ్మటుఁడు వివరించెను. ఈ యభిప్రాయమును లాక్షణికు లందఱు నేదో యొకవిధముగ నంగీకరించి యున్నారు. లోకోత్తరత్వమనఁగా అనుభవసాక్షికమయిన యాహ్లాదగత చమత్కారమని పండితరాయలును, చమత్కార మనఁగా చిత్త విస్తార రూపమగు విస్మయమని విశ్వనాథుడును వివరించిరి. ఇట్లనుటవలన చమత్కార రహితములగు కేవల శబ్దార్థములకు కావ్యయోగ్యత సిద్ధింపదనియు, అవి ప్రతిభాశాలియగు కవి రచనా నైపుణ్యము వలన నలౌకిక రూపగుణ సౌందర్యములను దాల్చి, కావ్యమనిపించుకొనుననియు మన మూహింపవలయును. లోక సామాన్యమైన రూపములను జూచినప్పుడు మన కేలాటి విస్మయము జనింపదు. దానియందు మన చిత్తము నాకర్షింపఁజాలినంత యసాధారణ విశేష మేదియు గోచరింపదు. కాని, మన మెన్నడునుజూచి యెఱుఁగని యొక సౌందర్యవతిని దారిలోఁ గనుగొన్నపుడు, ఆహా? యీమె యెంత రూపవతి! అని యచ్చెరుఁవొందుచుఁ గొంతసేపు నిలబడి నిర్వ్యాజముగ నామెతట్టు చూచుచుందుము. అసామాన్య రూపసందర్శనమువలన నిటువంటి వింతపొడముచుండుట సహజము. కవిత్వమునఁ గూడ నీలాటి లోకోత్తరత లేని యెడల కావ్యము చదువరుల హృదయమును లౌకిక

వ్యాపారములనుండి మరల్చి తనయందు లగ్నమగు నట్లొనరింపఁజాలదు. చిత్రకారునికి రంగులకు నెట్టి సంబంధము గలదో కవికిని కవితాసామాగ్రికిని అట్టిసంబంధమే. అంగాంగ సంయోగత, ఔచిత్యము, వర్ణనా సౌందర్యము, జీవకల్పనము మున్నగునవి కవియొక్క శిల్పనైపుణ్యమునకుఁ జెందినవి. కావున కవి ప్రతిభా శక్తివలన కావ్యమునకు సాధుత్వమును, ప్రతిభా దౌర్బల్యమువలన అసాధుత్వమును సిద్ధించును. ఇట్లనుటవలన కావ్యములు వ్యాకరణదోష భూయిష్ఠములుగ నుండవలయుననుట నామతముగాదు. కాని, భాషావిషయక దోషములకన్న శిల్పకల్పనాదోషములె రస రామణీయకములకు భంగము వాటిల్లఁజేయునని నామనవి.

*విశ్వనాథుఁ డొక దోషమును ఖండించి మఱియొక దోషమును దెచ్చి పెట్టెను. ఆయన 'వాక్యంరసాత్మకం కావ్యం' అని కావ్యలక్షణమును నిర్ణయించెను. ఇది♦(ఆచార్య దండిమతముతప్ప) పూర్వాలాక్షణికుల మతములకన్న విశాలముగ నున్నట్లు తోఁచినను, విమర్శించిచూడ నీ వచనము

---

*నేను "రసరామణీయకములు" అను వ్యాసమునఁ దెలిపినటుల చేతనాచేతన భేదములేక రమణీయ భావము లన్నిటియందు రసముండునను మతము నంగీకరించు పక్షమున "వాక్యం రసాత్మకం కావ్యం" అను నిర్వచనముగూడ నంగీకృతమైనట్లె. అట్లుగాక రసము కేవలము మానవ చర్యలకు సంబంధించినదే యని తలచుఁనెడల ఈ వ్యాసమునందుఁ జూపఁబడిన యభ్యంతరమువలన విశ్వనాథుని నిర్వచనము సంకుచిత మగును.

♦"(ఇష్టార్థవ్యవచ్ఛిన్నా పదావళీ)"
ఇచ్చట "ఇష్టార్థ" మనఁగా హృద్యార్థము, లేక రమ్యార్థము.

కూడ కవిత్వావరణమును సంకుచితము చేయుచున్నది. ఏల యన: 'విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రసనిష్పత్తిః' అని భరతముని రసలక్షణము. దీనిఁబట్టిచూడ రసము కేవలము మానవచర్యలకు సంబంధించినదని తెలుచున్నది. తిర్యగ్జంతువుల చేష్టలయందు రసాభాసము (రసస్పర్శ) మాత్రము గలదని విశ్వనాథుని యభిప్రాయము. కావున రసమనునది మానవ చర్యలయందుఁ బూర్ణముగను, పశుపక్షి మృగాదుల చేష్టల యందు ఆభాసముగను ఉండునని తెలియ వచ్చుచున్నది. కాని, యచేతన వ్యాపారములందు ఏలాటి రసస్పర్శకుఁగూడఁ జోటులేదు. కావున 'వాక్యం రసాత్మకం కావ్యం' అను లక్షణమును మన మంగీకరించినయెడల పాశ్చాత్యుల ప్రకృతి కవిత్వమును, (Lake Poetry, Nature Poetry) సూర్యాస్త మయములు, ఉద్యానవనములు, నదులు, కొండలు, మేఘములు, నక్షత్రములు, చంద్రుఁడు మున్నగువాని వర్ణనములకు కావ్యత్వము సిద్ధింపదు.

'ఉపవన జల చంద్రికోత్సవార్తవలీల లాత్మవిహారంబు లనఁబరగు' అని యుండుటవలనఁ బైనఁ బేర్కొనఁ బడిన యుద్యానాది విషయములు ఉద్దీపన విభావములకు నాధార భూతములుగావున రసవ్యంజకములగును. అట్లగుట 'వాక్యం రసాత్మకం కావ్యం' అను లక్షణములో నివిగూడ నిమిడి యున్నవి, అని కొందరు తలంపవచ్చును. కాని, యీలాటి వర్ణనములు నాయికా నాయకుల వ్యాపారములలోఁ గలసి పోయి వారి చర్యలకు సంబంధ పడినప్పుడె అవి యుద్దీపన విభావములకుఁ గారణములగును. కాని, కవియె యట్టిదృశ్య

ములను నాయికానాయక సంబంధమపేక్షింపక, తన యాంత
రంగిక ప్రేరణమువలన రచియించిన యుద్యాన విషయాది
వర్ణనములకు ఉద్దీపనత్వము సిద్ధింపదుగాన, వానిని నీరసము
లనియె నిర్ణయింపవలయును. ఇదియొక సందిగ్ధ విషయము.
ఇప్పుడు మనము విశ్వనాథుని లక్షణము నంగీకరింపవలసి
యున్న, సంకుచితమైన రసలక్షణమును మఱింత విరివిచేసి,
యుద్యానాది వర్ణనములకు గతి కల్పింపవలయును. లేక,
పూర్వికుల రసలక్షణ మంగీకరింతుమేని విశ్వనాథుని కావ్య
లక్షణమును సంకుచితమైనదని తలంపవలయును.

సాహిత్య దర్పణకారుని కన్నను, నర్వాచీనుఁడైన
పండితరాయలు 'రమణీయార్థప్రతిపాదక శబ్దః కావ్యం' అని
రామణీయకమునకుఁ బ్రాధాన్య మొసఁగినందువలన కవితా
నర్తకి నాట్యరంగము విశాలమైనది. కావ్యమున మనము
చూడవలసినది చిత్తాకర్షకమగు రామణీయకము. అట్టిగుణ
మేకావ్యమునందుఁ బూర్ణముగ నుండునో నదియెల్ల సాధు
వును, ఉత్తమము నగును.

పాశ్చాత్య లాక్షణికులును, కవులును కవిత్వ లక్షణము
లను వచియించియున్నారు. *భావోత్కర్షతను వెలిపుచ్చు

---

*(1) Poetry is the spontaneous outflow of powerful feelings. It takes its origin from emotion recollected in tranquility. —*Wordsworth.*

(2) Poetry we will call Musical Thought. —*Carlyle.*

(3) Poetry may be defined as the expression of the imagination. —*Shelley.*

(4) (Poetry is) the utterence of a passion for truth, beauty; and power, embodying and illustrating its

టయె కవిత్వమని వర్డ్సువర్తును, షెల్లీయు (Wordsworth, Shelley) అభిప్రాయపడిరి. కాని, యీ లక్షణము సందిగ్ధముగ నున్నది. భావోత్కర్షతను ప్రకటించుటయంతయు కవిత్వమగునా? ఇదియె యథార్థమైనయెడల? గోష్ఠిరక్తుఁడై తిట్టెడి వాని మాటలను, సభ్యుల హృదయము చెలరేఁగునటుల నేదోయొక రాజకీయ విషయమును గుఱించి యుపన్యసించు నాయకుని వాక్యములును కవిత్వము కావలసివచ్చును. కేవలము భావప్రకటనము కవిత్వముకానేరదు.

కార్లయిల్ పండితుఁడు (Carlyle) గానాన్వితమైన యాలోచన కవిత్వమని నుడివియున్నాఁడు. ఈ లక్షణము సత్యమునకుఁ గొంచెము సమీపముననున్నది; అయిననుపూర్ణ సత్యముగాదు. కార్లయిలు పండితుఁడు గానాన్వితమైన యాలోచన యనుటలో కావ్యమునందు భావములకును శిల్పమునకునుగల సంబంధము నించుక సూచించెను. ఇంతకంటెను లే హంటుగారి (Leigh Hunt) నిర్వచనము మఱికొంత సత్యసమీపవర్తిగనున్నది. ఆయన కవిత్వమునకు సత్యసౌందర్యముల స్పర్శను గలిగించెను కాని, యమెరికా దేశపుఁ బ్రఖ్యాత కవియగు ఆలన్‌పో (Allan Poe) గారి నిర్వచనమునందు కవిత్వ లక్షణము పరిపూర్ణత నొందినది. ఆలన్ పో గారిని అమెరికాదేశపు పండితరాయలని చెప్పవచ్చును. 'రామణీయకమును లయారూపమున సృజించుటయె

---

conceptions by imagination and fancy and modulating its Language on the principal of variety in unity.

—Leigh Hunt

(5) Poetry is the rhythmic creation of beauty.

—Allan Poe.

కవిత్వము' అని ఆయన తెలిపియున్నాఁడు. ఈ లక్షణము ప్రాచ్యపాశ్చాత్యులకుఁ బరమసమ్మతమైనదిగ నుండ వచ్చును.

కవిత్వప్రభవమును దెలిసికొన్నఁ గొంతవఱకు కవిత్వ స్వభావమునుగూడ మన మూహింపవచ్చును. సహజమైన ప్రతిభయె కవిత్వమునకుఁ గాకరణము. ఇతరములు సంస్కారములు. అవి కవిత్వమునకు వన్నె దెచ్చును. *నవనవోన్మేషణ శాలినియగు ప్రజ్ఞయె ప్రతిభ యని భామహుఁడు నుడివి యున్నాఁడు. ఇట్టి శక్తి కవియందు లేనియెడల నాతని రచన లన్నియు నిర్జీవములుగ నుండును. అట్లయిన కవికి పాండిత్య మెక్కఱలేదా ? కవుల పాండిత్యమునకును పండితుల పాండిత్యమునకును జాలభేదమున్నది. కవుల పాండిత్యము సహజమయి ప్రతిభాంత ర్భూతమయి యుండును. పండితుల పాండిత్యము విశేషగ్రంథపఠనము వలనను శిక్షవలనను నలవడు విషయజ్ఞానము.

కవి యందఱివలె నూరకుండక రమ్యమైనభావప్రపంచము నేల సృజింపవలయును ? ఇది కవియొక్క యాంతరంగిక ప్రేరణము; శమనాతీతమైన సౌందర్యపిపాస; అనివార్యమైన రసావేశము ! భావోన్మాదము; కవి హృదయైకవేద్యము. 'తుమ్మువచ్చినను నవ్వువచ్చినను పట్టరాదు' అనెడి సామెత యొకటికలదు. కవి ఆవేశముగూడ నిట్టిదియె. మనోహరమైన

---

* "ప్రతిభా అపూర్వ వస్తునిర్మాణక్షమా ప్రజ్ఞా; తస్యా విశేషో రసావేశ వైశద్య సౌందర్య కావ్యనిర్మాణ క్షమత్వం.

లోచనవ్యాఖ్య—అభినవ గుప్త పాదాచార్యులు

దృశ్యమును జూచినపుడు మన మానందము నొందుదుము. అంతట మన యనుభవమును నితరులకుఁ దెలుపవలయు నను కోరిక యొకటి పుట్టును. వినినవారు సంతసించుచుండ మన యానందమును వర్ణించి వర్ణించి సంతృప్తి నొందుచుందుము కోరిక పుట్టిన వెనుక దానిని దీర్చుకొననిదే మన మనసు కుదుటఁబడియుండదు మన యనుభూతి నితరులకుఁ జెప్పుటకుఁ జేతకానియెడల నొకవిధమైన యతృప్తి గలుగును. మనభావ ములను పదిమంది స్నేహితులకు వెల్లడిచేయనిదే ఆనందము పరిపూర్ణమైనటులఁ దోఁపదు. అందువలననే మన మేదైన సంతోషవార్త వినినప్పుడు దానిని నందఱికి జెప్పుచుందుము. ఇది సామాన్యమైన మానవ స్వభావము. కాని, కవియందిట్టి స్వభావ మతి బలీయముగనుండును. నిశితములును, శిక్షిత ములును, సంయమితములును. అందువలననే యుత్పతనక్షమ ములును నైన కవి మనోవికృతులు తుట్టతుదకు నిర్భరములై లయాన్వితవాగ్రూపమునఁ బ్రవహించును. భావోద్రేకము గలిగినపుడు ఆయావికారములకుఁ దగినటుల వాక్యములు వెడ లుట మానవులకందఱికి సహజమైనను, కవియందు మఱొక విశేషము గలదు. కవి వాక్యములు ఏవోకొన్ని నిర్మాణన్యా యముల కనుగుణముగ మూర్తీభవించుచుండును.

ముత్తెపుఁజిప్పలో వానచినుకు పడినపు డది మంచి ముత్యముగ మాఱునుగాని, కాకిచిప్పలోఁ బడినపుడుమార్పు నొందదు. ఎందువలన? ముత్తెపుఁజిప్పయందుఁగల సృజనశక్తి కాకిచిప్పయందుండకపోవుటవలన. నీటిబొట్టు ముత్తెపుఁజిప్ప కడుపులోఁ బడినప్పుడు అందొక వికారము పుట్టును. అందు

వలనఁ జిప్ప లోపలిభాగమున కంటుకొనియున్న పింగాణిరంగు వానచినుకుపైఁ. జుట్టుకొని దానినొక యమూల్యమైన ముత్యముగ మార్చివేయును. ఇటులనే బహిఃప్రపంచసంగతి వలన కవి మనమునఁ గొన్నివికారము లుప్పతిల్లి అవి యాతని రసార్ద్రభావములందలి యింద్రధనుర్వర్ణములతో వెలిఁగుటకై లోకమోహన స్వరూపమును దాల్చును. కవిభావ మేవస్తువు పైఁ బ్రసరించునో యదియెల్ల రూపాంతరము నొందును. అనిర్వాచ్యమైన సౌందర్యము దాని నాశ్రయించి యుండును. ఎన్నియో వస్తువులను పలుమాఱు చూచియుందుము. కాని, అవి మన చిత్తముల నాకర్షింపఁజాలక పోయియుండవచ్చును. ఆ వస్తువే కవిభావముతో మెలాముచేయఁబడినప్పుడు ఇది వఱకు లేని క్రొత్తందనమును జక్కందనమును వహించి మన దృష్టి నాకర్షించును. ఎన్నిమాఱులు ఆషాఢమాసమునందలి మేఘములను మనము చూచియుండలేదు? ఆ మేఘమె కాళిదాసమహాకవి కావ్యాంబరమున భావకిరణశబలితమయి పొడకట్టి మనలను ఆనందపులకితులను జేయుట లేదా? ఇదియే కవిత్వేంద్రజాలము!

---

౪. కావ్య జీవితము

నిర్జీవములగు కావ్యములు సహృదయానురంజకములు గానేరవు. అట్టివి చచ్చుబిడ్డలు. అవి నిరాదరణ పాత్రములై యెట్టకేలకు నశించిపోవును. కొందఱి కవుల యొక్కయు కావ్యములయొక్కయు పేరులు కవుల చరిత్రలందు మాత్ర మె భద్రపఱుపఁ బడియుండును. కాని, మఱికొందఱి కవుల నామ

ములు అనుదినమును స్మరింపఁబడుచున్నవి. వారికావ్యములు నిరంతరము ప్రజల హృదయములపైఁ ప్రభుత్వము చేయు చున్నవి. రామాయణము, మహాభారతము, భాగవతము, అభిజ్ఞానశాకుంతలము, ఉత్తర రామచరిత్రము, మేఘసందేశము మున్నగు కావ్యములును నాటకములును, షేక్స్పియరుమహాకవి రచియించిన నాటకములును (అందు ముఖ్యముగ విషాదాంతములు) స్వదేశములందేగాక పరదేశములందుగూడ సమ్మానింపఁబడుచున్నవి. ఎందువలన? అవి యుత్తమశిల్పలక్షణముల కనన్యసాధారణ లక్ష్యములయి ప్రధానకావ్యప్రయోజనమగు సద్యఃపరనిర్వృతినిఁ గలిగించుచున్నవి. కావున నిట్టి యానంద ముప్పతిల్లఁజేయు ప్రతికావ్యమును సజీవమని మనము తలఁపవలయును. కావ్యములను ప్రాణవంతములుగఁ జేయు చిచ్ఛక్తియేది? ఇందుకు సంస్కృతలాక్షణికు లేమి ప్రత్యుత్తర మిత్తురో దానిని మొదట దెలిసికొందము.

౧. రీతిరాత్మా కావ్యస్య.

—వామనుఁడు.

౨. వక్రోక్తిః కావ్యజీవితం.

—కుంతకాచార్యుఁడు

౩. అలంకారా స్త్వలంకారా గుణా ఏవ గుణాః సదా
ఔచిత్యం రససిద్ధస్య స్థిరం కావ్యస్యజీవితం.

—క్షేమేంద్రుఁడు

౪. కావ్యస్యాత్మా ధ్వనిరితి బుధైర్యః సమామ్నాతపూర్వః

—ఆనందవర్ధనాచార్యులు

౫. శబ్దార్థౌ మూర్తి రాఖ్యాతౌ జీవితం వ్యంగ్యవైభవం.

— విద్యానాథుఁడు.

౬. యే రసస్యాంగినో ధర్మాః శౌర్యాదయ ఇవాత్మనః.

—మమ్మటుఁడు.

౭. వాక్యం రసాత్మకం కావ్యం.

—విశ్వనాథుఁడు.

పై లాక్షణికులలో వామనుడు రీతియు, కుంతకా చార్యుఁడు వక్రోక్తియు, క్షేమేంద్రుఁడు ఔచిత్యమును, ఆనందవర్ధన విద్యానాథులు ధ్వనియు, మమ్మట విశ్వనాథులు రసమును, కావ్యజీవితమని నిర్వచించియున్నారు. కాని, వీని యన్నిటిలో నిశ్చితమైన ప్రమాణమేది? ఆలంకారికు లిట్లు భిన్నాభిప్రాయులైనపుడు సహృదయుల యంతరాత్మయె కడపటి ప్రమాణముగఁ దలంపవలయును. పై మతములను విమర్శించి చూడ లాక్షణికుల తీర్మానములు, * ఏనుఁగును జూచుటకై పొరుగూరికిపోయి వివాదములు పెంచుకొన్న గ్రుడ్డివారి రూపజ్ఞానముగ నున్నది.

రీతి, రసపోషణమున కనుకూలమైన వర్ణసంఘట నము; కావునఁ గావ్యాంగమునకు సంబంధించినది. అంగము

*కొందఱు గ్రుడ్డివారు ఏనుఁగును చూచుటకై పొరుగూరికి పోయిరి. వారిలో మొదటివాఁడు తొండమును తాఁకి, ఏనుఁగు తనచేయివలె నున్న దనియు, రెండవవాఁడు కాలును తాఁకి ఏనుఁగు స్తంభమువలె నున్నదనియు, మూడవవాఁడు పొట్టను తాఁకి ఏనుఁగు గాదెబొట్టవలె నున్నదనియు, నాల్గవ వాఁడు తోఁకను తాకిఁ ఏనుఁగు కఱ్ఱవలె నున్నదనియుఁ దలంచి తమ యూరికి తిరిగి వచ్చుచు దారిలో తాము చూచిన విషయములను సరి పోల్చుకొనిరి. ప్రతివాఁడును సత్యమే చెప్పినను వారిజ్ఞానము పాక్షిక మైనందున భేదాభిప్రాయములు గలిగి వివాదములు పెరిగి తిట్టుకొన సాఁగిరి. అంతలో ఏనుఁగును చూచిన మరియొకఁడు వచ్చి వారు చెప్పిన దంతయు సత్యమేయనియుఁ, బరిపూర్ణసత్యము తేలుటకు వారొకరొకరు తాకిన యంగములను గలిపి చూడవలయుననియుఁ దెల్పెను.

జీవితమున కాశ్రయమగునుగాని, తానే జీవితము కాఁజాలదు.

వక్రోక్తి యొకవిధమైన అలంకారము. అలంకారమస్ఫుటముగ నున్న వాక్యములకుఁగూడ (అనఁగా అలంకారము తర్కముచే మాత్రము సాధింపఁబడి, దాని మూలమున రాఁదగిన సౌందర్యము, 'యః కౌమారహరః' అను శ్లోకమునందువలె * అభావ మయినపుడు) కావ్యత్వము సిద్ధించుచున్నదిగాన, అలంకారములు కొన్ని యెడల నావశ్యకములయ్యు, ఔపచారికములు గావునను, వానికి జీవత్వము లేదు.

ఔచిత్యము అన్నిశిల్పములకుఁ బరమావశ్యక మగు నియమము. ఇది రసపోషకము. సౌందర్యమున కొక యంగము.

ధ్వన్యాత్మకముగాని వాక్యము సైతము కావ్యమని నిరూపింపఁబడియుండుటచేతను, వ్యంగ్యవైభవము ఉత్తమ

---

* శ్లో. యః కౌమారహరః సఏవ హివరస్తా ఏవ చైత్రక్షపా
స్తేచోన్మీలిత యాలతీ సురభయః ప్రౌఢాః కదంబానిలాః,
సాచైవాస్మి తథాపి తత్ర సురతవ్యాపార లీలా విధౌ
రేవా రోదసి వేతసీ తరుతలే చేతః సముత్కంఠతే.

(మమ్మటోదాహృతము.)

పతస్పత విరుద్ధములగు విభావనావిశేషోక్తుల సాంకర్య మిందు స్ఫుటముగ నున్నదని విశ్వనాథుని యభిప్రాయము. కాని యీ శ్లోకమును మనము చదువునపుడు మనకుఁ గలుగు ఆనందము అలంకార మూలకమైనదికాదు. రసమూలకమైనది.

కావ్యలక్షణమని పలువురచే నంగీకరింపఁబడి యుండుట చేతను, ఉత్తమ మధ్యమాధమ కావ్యవిచారము జీవత్వము సిద్ధించిన వెనుక జరుగు చర్చ యగుటచేతను, ధ్వనిని కావ్య సౌందర్యాపాదకము లగు నుత్తమ గుణములలో నొకటిగ గ్రహింపవచ్చును.

రసము కేవలము మానవచర్యలకు సంబంధించినదే యైనయెడల అవ్యాప్తిదోషమువలన కావ్యాత్మ కానేరదు.

అట్లయిన నిఁక కావ్యాత్మ యెట్టిది? ఆత్మ అంత స్సారభూతము యినది. ఇదిమిత్థమని వర్ణించుటకు నలవిగానిది. కావుననే భిన్ననిర్ణయములకుఁ బాత్రమయినది! ఉపనిషత్తులు బోధించు ఆత్మ వేఱు; ఆ యాత్మ అవాఙ్మానసగోచరము. కావ్యాత్మ ఇంద్రియ గోచరమును అనుభవసాక్షికము నగు సౌందర్యస్ఫురణము. పాంచభౌతికమయిన ప్రకృతి చిత్సం బంధమువలనఁ బ్రాణవంతమగునట్లు, కావ్యసామగ్రి కవి ప్రతిభతోడ సంయోగమునొంది జీవస్ఫూర్తిని దాల్చు చున్నది. కావ్యమునకు కవిప్రతిభయె జీవితము. కావ్యము నందలి చిత్ప్రకాశము సౌందర్యస్ఫురణముగ గోచరించును. శిల్పనైపుణ్యమును కవితాసామాగ్రియు నవిభాజ్యముగ నొకదానియం దొకటి లీనమయినపుడు సజీవవిలసనము కావ్యమునందుఁ దేలియాడుచుండును. అది సహృదయ హృదయైకవేద్యము. గాలి కంటికగుపడక యున్నను స్పర్శేం ద్రియమువలనఁ దెలిసికొనఁబడునటుల, కావ్యాత్మ యిట్టిదని వచియింపనలవిగాకున్నను ఆనందజనకశక్తివలన నూహింప సాధ్యమగును.

ప్రతిభావంతులగు కవుల రచనలను మనము విమర్శించి చూచితి మేని, అవి చిరంజీవములగుటకుఁ గారణములు మనకు గోచరింపక పోవు. వానియందు కాలమును ధిక్కరించు శాశ్వతగుణ మేదియో యొకటి తప్పక యుండితీరును. ఉత్తమ కృతుల విమర్శనమువలనఁ దేలిన సామాన్యాంశముల నిటఁ బొందుపఱచుచున్నాను :

(౧) అంగాంగ సంయోగత.

(౨) అనురూపత.

(౩) వస్తువునందలి సర్వజనీన స్వభావము.

(౪) కవి వ్యక్తిత్వము.

అంగాంగ సంయోగత ప్రతి రూపమునకును ఆవశ్యకమైన నియమము. విచ్ఛిన్నావయవ సమూహము సమష్టి రూపజ్ఞానము బుట్టింపనేరదు. కావున 'సంయోగత' శిల్ప శాస్త్రమునందుఁ బ్రధాన సూత్రము. ఈ సూత్రమునకు లోఁబడని కావ్యములు నిర్జీవములుగ నుండును. ఉత్తమ కావ్య నిర్మాణమునం దీనియమము బహుజాగరూకతతో ననుసరింపఁబడును.

ఉచితానుచిత జ్ఞానము లేనివాఁడు కవి కానేరఁడు. అనౌచిత్యము రసభంగమునకుఁ బ్రధాన హేతువు. కాండ జ్ఞానము, కళాభిరుచియు లేనందునను, లోభమువలనను, కవి యనౌచిత్యదోషమునకుఁ బాల్పడుచున్నాఁడు. అది వఱకు వ్రాసికొనియుంచిన రసవంతములగు పద్యములందలి లోభముచేతఁ గొందఱు కవులు అనవసరముగను, అసందర్భముగను తమ కావ్యములయందో, నాటకములయందో

వానిం జొప్పించి రసభంగమునకు సహాయపడుచున్నారు. అట్టివారియందు కళాభిరుచి లోభ తిరస్కృతమై యడంగి యుండును. మఱియు కవి మొట్టమొదటఁ దన ప్రతిభ కను రూపమైన వస్తువును రసమును రూపమును గుర్తెఱింగి యేర్పఱచుకొనవలయును. ఇది చాల ముఖ్యము. కొందఱు కవులు కొలఁది యెఱుంగక కొండను కౌఁగిలించుకొనఁబోయి భగ్నమనోరథు లగుటయు, మఱికొందఱు తమ ప్రకృతి కనుకూలింపని రసములఁబోషింపఁ బ్రయత్నించి చెడఁగొట్టు కొనుటయు మనము చూచుచున్నాము. కాళిదాసు శృంగార మును బోషించుటలో నసదృశుఁడు. భవభూతి కరుణయం దద్వితీయుఁడు కాని, ఆయన ప్రతిభ నాటక రచన కనుకూ లించునది గాదు. కావుననే యుత్తరరామ చరిత్రము దృశ్యప్రబంధమునకన్న శ్రవ్యప్రబంధముగ నెంచఁబడు చున్నది. సర్ వాల్టర్ స్కాటు మొట్టమొదట కవిత్వము వ్రాయుచుండెను. కాని, యంతకన్నఁ దన ప్రతిభ నవలలు రచియించుట కనుకూలించునని యెఱింగి, యపూర్వ కథా సాహిత్యమును నిర్మించెను. రవీంద్రనాథ టాగూరునందు గేయ ప్రతిభ మిక్కుటముగ నున్నది. ఆయన వేలకొలఁది చక్కని గీతములను రచియించెను. కాని, మయికేలు మధు సూదనదత్తువలె 'మేఘనాథవధ' వంటి పెద్ద కావ్యమును రచియింపలేదు. ఒక్కొక్క కవి అంతఃప్రకృతి యొక్కొక విధమయిన కావ్యకల్పనకుఁ దగియుండును. కావున వారివారి కనుకూలమైన త్రోవలు వెదకికొనుట విజయమునకు మూల సాధనము. అందుకు భిన్నముగఁ బ్రవర్తించువారు ఏటికి నెదు

రీఁదినట్లు శ్రమకుఁ బాత్రులయ్యు గమ్యస్థానము చేరఁజాలరు.
ఉత్తమ కవులెల్లరు తమ ప్రకృతి కనుగుణించిన రచనల
యందే శక్తిసామర్థ్యములను వినియోగించి కృత
కృత్యులైరి.

కావ్యము చిరంజీవముగ నుండవలయునన్న అందలి
వస్తువుగూడ సర్వజనీన స్వభావమును, దనుగుణమయిన
మనోవికారములను వెల్లడించుట కనుకూలమైనదిగ నుండవల
యును. ఏలయన, దేశ కాలపరిస్థితులకు లోఁబడిన సంకుచిత
విషయములును, భావములును అన్ని కాలములందు నందఱి
నిని రంజింపఁజేయఁజాలవు. ఆచార వ్యవహారములు, భాషలు
వేరైనను మానవుల మనోవికారములు అంతటను నేకవిధముగ
నుండును. సుఖదుఃఖములు, మంచిచెడ్డలు, జన్మమరణ
ములు సర్వసామాన్యముగ మానవజాతికంతయు సహజములు.
శృంగార వీర కరుణాదిరసము లందఱకు ననుభోగ్యములుగ
నుండును. అట్టిరసములాదర్శప్రాయముగఁ జిత్రింపఁబడినపుడు
దేశకాలపాత్రాతీతములై సర్వజనానురంజకములుగ నుండఁ
గలవు. ఇంగ్లీషు నాటకములు చదివి మనమానందించు
చున్నాము; సంస్కృత నాటకములను జదివి పాశ్చాత్యులు
సంతోషము నొందుచున్నారు. ఏమువలన? నోటిగుండ
వెడలు భాష రెండు దేశములవారికి వేఱయ్యును హృదయము
నుండి వెడలు మనోవికారములభాష మానవజాతికంతయు
సామాన్యము. కావున నొక కావ్యము చిరంజీవముగ నుండ
వలయునన్న సర్వజనీన స్వభావ ద్యోతక వస్తు సంవిధాన
కల్పనా చమత్కృతితో నొప్పియుండవలయును. ఇందుకు

భారతాది మహాగ్రంథములును, శాకుంతలాది నాటకము
లును నిదర్శనములు.

కవి వ్యక్తిత్వము ఆతని రచనలయందుఁ బరిస్ఫుట
ముగ నంకితమై యుండును. ఒకే విషయమును పలువురు కవులు
కావ్యములుగ రచియించిరేని వానియం దొకటొకటియుఁ
బ్రత్యేకరూపగుణవిశిష్టముగ నుండును. ఒక్కొక్కరియందు
కళానైపుణ్యమును, ప్రతిభయు, నభిరుచియు భిన్నభిన్న
ముగ నుండుటవలన వారి కృతులందు సైత మట్టి భేదములు
గను పట్టుచుండును. సర్వసామాన్య వస్తువైనను, అది కవి
యంతః ప్రకృతితో సమ్మిళితమయి రూపాంతరమునొంది,
కావ్య కుటుంబమునకుఁ జేరినదయ్యుఁ బ్రత్యేకత వహించి
యుండును. కవి తనకు మాత్ర మిష్టమైన వస్తువును భావ
మును మనోవస్థను సర్వజనీనముఁ జేయుటకుఁ బ్రయత్నించుట
కన్న, సర్వజనీన వస్తుభావ మనోవస్థలను దన వ్యక్తిత్వముచే
నంకితముఁ జేయుట మేలు. అనఁగా అన్ని ప్రకృతులకు
సామాన్యమైన భావావస్థలకు రూపముఁగల్పించి యే ప్రకృతి
నైన రంజింపఁ జేయవచ్చునుగాని, యొక ప్రకృతికి మాత్రము
సమ్మతమైన దానిని సర్వజనీన మొనరించుట యసాధ్యము.

మహాకవుల కావ్యములందుఁ బైన చర్చింపఁబడిన
నాలుగంశములు ననివార్యముగ నుండును. ఇంకను విమ
ర్శించుకొలఁది యెన్నియైన సూక్ష్మాంశములు తేలవచ్చును.
కాని, గ్రంథ విస్తర భీతిచే వానినిఁ జర్చింప మానుకొంటిని.

౫. కవిత్వ శిల్పము—అనుకరణము

కవిత్వము లలితకళలకుఁ జేరినది కావున, నిచ్చట శిల్ప విచార మనివార్యమైనది. శిల్పము నిదర్శక మనియు నాదర్శక మనియు రెండు విధములు. కొంచమైనను భేదము లేక ప్రకృతి ననుసరించునది మొదటిది. వలసినంతవఱకు ప్రకృతి ననుసరించి దానిని మించిపోవునది రెండవది. మొదటిది మాతృకకు సరియైన నకలు; రెండవది, స్వతంత్ర కల్పనము. శిల్పులు భూమ్యాకాశములందు సంచరించు రససిద్ధులు. కావున వారి సృష్టియు మర్త్యలోకమునకును స్వర్గలోకమునకును సంబంధించి యుండును. నిదర్శ కాదర్శక శిల్పములలో రెండవది యుత్తమమైనది. ఒకరూపమును పొల్లుపోక యనుకరించి చిత్రించుట నయనేంద్రియము యొక్కయు బుద్ధియొక్కయుఁ గార్యము. కాని, అందు శిల్పకారుని భావనాప్రదర్శనమునకుఁ జోటులేదు. అనుకరణమునందు నూతనసృష్టి యుండదు గాన అది యుత్తమ శిల్పము గానేరదు.

శిల్పము అనుకరణమా? లేక సృష్టియా? అను విషయమును గుఱించి చాల అభిప్రాయ భేదములు గలవు. వానిని గొందఱు అనుకరణ మనియు, మఱికొందఱు సృష్టియనియుఁ బలుపలు విధములుగఁ దలంచుచున్నారు. శిల్పము అనుకరణమని తీర్మానించిన వారిలోఁ బ్రథముఁడు గ్రీసు దేశస్థుఁడైన అరిస్టాటల్ అను తత్త్వ శాస్త్రజ్ఞుఁడు. అప్పటినుండియుఁ బాశ్చాత్యులెల్లరును శిల్పము ప్రకృతియొక్క

యనుకరణ మనియే విశ్వసించుచుండిరి. కాని; *అరిస్టాటలు నిర్వచించిన అనుకరణము (Imitation) నకును మన మిప్పుడు అనుకరణ మను మాటకుఁ జేసికొను నర్థమునకును జాలభేదమున్నది. ఆయన యుపయోగించిన పదము విశాల భావగర్భితముగ నున్నదని ఆయన యొనరించిన నియమముల వలననే మనము తెలిసికొనఁ గలము.

శిల్పము తన మాతృకను ఉన్నదియున్నట్లు అనుకరింపక యింద్రియములకు గోచరించినవిధమునఁ బునర్నిర్మాణము చేయుననియు, ఆదర్శప్రాయ మగు మానవజీవితము, ప్రవర్తనములు, చర్యలు మున్నగునవి శిల్పమునఁ బ్రతిబింబించుచుండు ననియు అరిస్టాటలు చెప్పియున్నాడు. ♦ఇందువలన శిల్పి యనుకరించువాఁడు గాఁడనియు, రసార్ద్రమైన యాతని భావమున నింద్రియములద్వారా ఏవేవి యంకిత మగునో వానిని మాత్రమే మూర్తీభవింపఁజేయు ననియుఁ దేలు

*అరిస్టాటలు కవిత్వతత్త్వ నిర్వచనములను సంపూర్ణముగఁ దెలిసికొనవలయునన్న ప్రొఫెసర్ బుచ్చెరుగారి "Aristotel's theory of poetry and fine art" అను గ్రంథమును జదువవలయును.

♦ (1) **The art may imitate things as they ought to be.**

(2) A work of art reproduces its original not as it is in itself, but as it appears to the senses.

(3) A work of art is in idealised representation of human life—of character, emotion, action, under forms manifest to sense.

—*Aristotel.*

(Butcher's translation.)

చున్నది. శకుంతలనాటకములోని కథ షుమారు ఆరు సంవత్సరములకాల పరిమితి గలదిగాఁ దోఁచుచున్నది. కాని, కాళిదాసమహాకవి దానిని రెండుమూడు గంటలలోఁ బ్రదర్శింపఁబడుటకు వీలగు నాటకముగ రచించెను. ఏయే కథాభాగములు గ్రహించినయెడల కథావిషయమునకు లోపము వాటిల్లక, శిల్పధర్మమునకు విరుద్ధము గాక యుండునో అట్టిరీతిని ఉచితమైన సన్నివేశములను గల్పించి, ఆది మధ్యాంతములు గల యొక మనోహర దృశ్యమును రచించెను. లోకసామాన్యము లగు మానవచర్యలను గ్రహించి, వానిని లోకోత్తర వర్ణనాచమత్కృతి వలన అపూర్వమును, ఆదర్శప్రాయమునైన యొక విచిత్ర సృష్టిసిగ మార్చివేసెను. ఇట్టి నిర్మాణమును సృష్టియందుమా? లేక యనుకరణ మందుమా? దీనిని అనుకరణ మనుటకంటె ప్రతిసృష్టి యనుటయే సమంజసము. అరిస్టాటలు గ్రంథమును చాల శ్రద్ధతో తర్జుమాచేసి, చక్కగ విషయము బోధపడుట కొఱకు విపులమైన వ్యాఖ్యానము వ్రాసిన ప్రొఫెసరు బుచ్చెరుగారు, అరిస్టాటలు ఉపయోగించిన 'అనుకరణము' అను పదమునకు, 'నిర్మాణము' 'ప్రతిసృష్టి' అను అర్థములు కలవని వ్రాసియున్నారు.*

మమ్మటాచార్యులు కవిత్వమును నియతికృత నియమరహిత మనియు, అనన్య పరతంత్రమనియుఁ నిర్మితి యనియుఁ

---

* 'Imitation' so understood is a creative act. It is a Rivalry of Nature, a completion of her unfulfilled purpose, correction of her failures.

—*Butcher.*

జెప్పియుండుటవలన సంస్కృతలాక్షణికులకుఁగూడ, శిల్పము స్వతంత్రసృష్టి యను నిర్వచనము సమ్మతముగ నున్నట్లు దోఁచుచున్నది.

అపూర్వవస్తునిర్మాణమునందు కావ్యశిల్పము ప్రకృతిసృష్టిని మించుచున్నది; కావుననే కళకు ప్రత్యేకమైన స్థితి కలిగినది. జంగమ వల్లులు, నిశ్చల చంచలా లతికలు, నొక్కిన పాలుగారు చెక్కిళ్ళు, పుష్పాడికట్టల నొరసికొనుచు ప్రవహించు తేనె వాకలు, ఆకసము నంటు మేడలు మున్నగునవి కవికల్పనములు; వాస్తవజగత్తులో లేనివి.

లయవిభాతి

చలువగల వెన్నెలల చెలువునకు సౌరభము
గలిగినను, సౌరభముఁ జలువయుఁ దలిర్పం
బొలుపెసఁగు కప్పురపుఁ బలుకులకుఁ గోమలత
నెలకొనిన, సౌరభము జలువ పసయుం గో
మలతయును గలిగి జనముల మిగులఁ బెంపెసఁగు
మలయ పవనంపుఁ గొదమలకు మధురత్వం
బలవడిన, నీడు మఱి కలదనఁగవచ్చుఁ గడు
వెలయఁగల యీ సుకవి పలుకులకు నెంచన్.

ఈపద్యమునందు పింగళి సూరనార్యుఁడు ప్రకృతిపై నొక పంతము వేసినాఁడు వెన్నెల చెలువునకు సౌరభము గలుగవలయును! కప్పురమునకుఁ గోమలత నెలకొనవలయును! పైగుణము లెల్లను గల మలయపవనమునకు మాధుర్య మలవడవలయు! అప్పుడుమాత్రమే అది సుకవి

పలుకులకు ఈడనవచ్చును! కోటి సంవత్సరములు తలక్రిందయి తపసుజేసినను ప్రకృతి యిట్టి యపూర్వ వస్తు గుణ సమ్మేళన మొనరింప లేదు. కావున సుకవిపల్కులకు అసంపూర్ణమయిన సృష్టి యెట్లు ఈడనవచ్చును? వస్తుగుణములను అపూర్వముగ నేర్చి కూర్చుటయందు కవి అత్యంత నిపుణుఁడు. ఈ నైపుణ్యము భావనకు సంబంధించిన మహిమ. కవి కల్పనములు కొన్నియెడల అలౌకికము లైనను చదువరులకు బోధపడకపోవు. ఏలయన: సంయోగము క్రొత్తదైనను వస్తువులుమాత్రము పూర్వపరిచితములె. తాను సృజించిన వస్తువు స్వభావికమా, లేక యస్వాభావికమా యను విచారము కవి కవసరము. ఇట్టివస్తువు భావప్రపంచమున నుండిన నెంత రమ్యముగ నుండును అను తలంపె కవికి ముఖ్యము; రసనిష్పత్తికి సాధక మగునేని నట్టి యలౌకికేంద్రజాలమునైనఁ బన్నవచ్చును. ఏలయనఁగా కవిసృష్టి యానందమాత్ర ప్రయోజనము గలది.

ఆదర్శప్రాయమగు రూపమును జిత్రించు చిత్రకారుఁడు ఏదో యొక బహిరాకృతినిఁ దన రచనకు ఆలంబముగఁ గొనఁడు. ఆ రూపమును తాను భావనచేసిన తన మానమునందుఁ బ్రతిబింబించిన విగ్రహమును పటముపైఁ జిత్రించును. అటులనే కవియు భావనా కల్పితమైన చర్యలను వాగ్రూపమున వెలిపుచ్చును. ఒక యుదాహరణము: చిత్రకారుఁ డొకఁడు రతీదేవి స్వరూపమును లిఖింపవలయునని తలంచి యొక సౌందర్యవతిని ఆదర్శముగఁ దీసికొని తత్ ప్రతిబింబకముగఁ జిత్రించును. రతీదేవి స్వరూపమునందు

స్త్రీ సౌందర్య పరమావధిని మూర్తిభవింపఁ జేయవలయునని తని యుద్దేశము. తాను రచియించిన రూపముకన్న మణీయవతి యగు మఱొక కాంత గాన్పించిన యెడల చిత్ర ారుఁడు పూర్వచిత్రమును జించి పాఱవైచి, క్రొత్తరచనకుఁ ానుకొనవలయును ప్రకృతి పరిణామ శీలము; రూపము ను సృజించుచుఁ బోవుచుండును. స్త్రీసౌందర్య పరమా ర్శమును సృజించుటకుఁ బ్రకృతి యెన్నినమూనాలను వ్రాసి ింపివేయవలయునో, యెన్నివేల సంవత్సరములు పట్టునో ెవరి కెఱుక ? నిపుణుఁడైన చిత్రకారుఁడు స్వయముగ ౌందర్యమును ధ్యానించి తదనుసరణముగ లిఖించిన చిత్రము రంజీవముగ నుండగలదు. శకుంతలాది యద్భుతసృష్టు తెగకుఁ జేరినవే.

---

౬. రస రామణీయకములు

'విభావానుభావ వ్యభిచారి సంయోగాద్రస నిష్పత్తిః' ని భరతముని రసలక్షణము నిర్వచించెను. అప్పటి ండియు రసస్వరూప విచార చర్చ నిరంతరముగఁ జరుగుచు చ్చినది. వ్యాఖ్యాతలును ఆలంకారికులును వారివారికిఁ ోఁచినట్లు భిన్నభిన్నముగ భరతసూత్రమును వివరింపుచు చ్చిరి. సూత్రమునకు అనుకూలమును బ్రతికూలము నగు న్నియో మతములు బయలుదేరినవి.* కాని వానినెల్ల

* మతభేదముల వివరములను, వాద ప్రతివాదములను దెలిసికొనఁ

నిచ్చట వివరింప నవసరము లేదు. సంస్కృతలాక్షణికుల వాదప్రతివాదములవలనఁ దేలిన సారాంశములను క్రిందఁ బొందుపఱచుచున్నాను :

(౧) విభావము (ఆలంబనోద్దీపనములు), అనుభావము (సాత్త్వికము అనుభావము నందె చేరియున్నది.), వ్యభిచారి యని భావములు మూఁడు విధములు.

(౨) విభా వానుభావ వ్యభిచారి సంయోగమువలన నొక భావము పరిపూర్ణతనొంది 'స్థాయి' అని పేరొ్కనఁ బడుచున్నది

(౩) ఆ స్థాయిభావము, చర్వణమువలన రసత్వము నొందుచున్నది.

(౪) భావత్రయ సంయోగము వలన రూపాంతర పరిణామము గలుగుచున్నది. (దధ్యాదులవలె)

(౫) * భావ్యమాన భావత్రయములో నేదైన నొకటి రసమగును.

పై సారాంశములను వలసినచోట్ల గ్రహించి విమర్శించెదము.

పాంచ భౌతిక ప్రపంచమును మనము శబ్ద స్పర్శ రూప రస గంధముల వలనఁ దెలిసికొనుచున్నాము. ఇంద్రియములు సాధనమాత్రములు. వాని నుపయోగించునది బుద్ధి. మన మనస్సు పరాయత్తమైనపుడు దగ్గర నిలుచుండు

* భావ్యమానో విభావ ఏవ రసః అనుభావ స్తథా,
వ్యభిచార్యేవ తథా పరిణమతి.
ఇవి రసగంగాధరమునం దుదహరింపఁ బడినవి.

వారినిఁ గూడ (చూచుచుండియు) కనుఁగొనలేము. ఇంద్రియములు గొంపోవు సూచనలను బుద్ధి గ్రహించునప్పుడే జ్ఞాన ముదయించుచున్నది. అది యెట్లన: మన మొక పుస్తకమును జూచి దానిని పుస్తకమని గుర్తింతుము. నయనేంద్రియములు కొనిపోయిన రూపమును ఇదివఱకు స్మృతియందడఁగియున్న పుస్తక రూపముతో సరిపోల్చి, దానివంటిదే ఇది కావున 'ఈ రూపము పుస్తకము' అని బుద్ధి నిర్ణయించును. కాని, యీవ్యాపారము అమిత త్వరితముగను అలక్షితముగను జరుగుచుండును గావున సామాన్యముగఁ దెలిసికొనుట కష్టము. మొట్టమొదట బుద్ధికి పుస్తకరూపజ్ఞానము లేనియెడల అట్టి వస్తువును జూచినపుడు 'ఇది ఫలానిది' యని నిర్ణయించుటకు వీలులేదు

వస్తుస్వభావజ్ఞాన ముదయించిన వెంటనే ఆలోచనయు, దాని వెంట భావమును (మనోవికారమును), తరువాతఁ గోర్కెయు, దానితోడ సంకల్పనమును, అనంతరము కార్యమును బుట్టుచుండును ఉదాహరణము: మన మొక దారిలో నడుచుచుండగా నొక పుట్ట యొద్ద, కాలికి మూరెడు దూరమున పామును జూచితి మనుకొందము. దానినిఁ జూడఁగనె పైన వివరించిన విధమున వస్తుస్వభావజ్ఞానము గలుగును పాము దగ్గరనున్నందువలనఁ గఱచునని తలంతుము (ఇది ఆలోచన), తలఁచిన వెంటనే భయము గలుగును (ఇది భావము), తరువాత దానినుండి తప్పించుకొనవలయునని కోరిక పుట్టును(ఇదికోరిక), దానిని నెఱవేర్చుకొనుటకు దృఢసంకల్పనము గలుగును (ఇది సంకల్పము),

అనంతరము వెనుకకుఁ బరుగెత్తి తప్పించు కొందుము (ఇది కార్యము), అట్లుగాక మనము చూచినది నిరపాయకరమగు నీళ్ళపామని తెలిసికొన్నయెడల భయము శమించి యూరక నిలుచుందుము. ఇంద్రియ సందేశమును బుద్ధి గ్రహింపలేని యెడల భావములు పుట్టవనియు వ్యతిరేకముగ గ్రహించిన యెడల వ్యతిరేక భావములే కలుగు ననియు నిందువలన మనము తెలిసికొనవచ్చును. వస్తువు లెట్లు అనుకూల ప్రతికూలములో వాని వలనఁ గలుగు భావములుగూడ నట్టివియె వస్తువుల సుఖదుఃఖ భావజనకతా పరిమితికి సమముగ ఆకర్షణ వికర్షణములు పుట్టును.

ప్రతి వస్తువును జిత్తము నందొక భావమును రేఁపును. అట్టిభావములు అనుకూల్య ప్రాతికూల్యముల ననుసరించి సుఖదాయకములుగనో క్లేశ దాయకములుగనో యుండును. సుఖదుఃఖ తారతమ్యముల కనురూపముగ భావములు కొన్ని దుర్బలములుగను, మఱికొన్ని తీవ్రములుగ నుండును. భావములవలె రసములును అనంతములు. అయినను ఇందుఁ బ్రధాన రసములు తొమ్మిది. వానియొక్క సాంకర్య సాజాత్య భేద సంబంధముల వలన రసములు వివిధములగుచున్నవి.

ఒక్కొక భావము తనకనురూపమైన రసమును బుట్టింపఁ గలుగునెడల భరతాదులు భావత్రయ సంయోగము నేల బోధించిరని కొందఱు శంకింపవచ్చును. ప్రధాన రసములు పుట్టుటకు విభావానుభావ వ్యభిచారి సంయోగ మావశ్యకము, ఏలన, భిన్న ప్రకృతులందు నొకేవిభావము

పరస్పర విరుద్ధములగు రసములం బుట్టించును. పులిని చూచి నపుడు పిఱికివానియందు భయమును, శూరునియందు శౌర్యమును బొటమరించును. భావానుభావములకుఁ గారణ కార్య సంబంధము గలదుగాన, భావము తీవ్రముగ రేఁగి నప్పుడు అనుభావములు తప్పక పుట్టును. మనము గ్రహింపని యెడలఁ బులిని చూచినవానికిఁ గలిగినదిఁ పిఱికితనమా లేక శౌర్యమా యని నిర్ణయింపఁ జాలము. గడగడ వడఁకుచుఁ గంటనీరు పెట్టుచుఁ బరుగెత్తఁబోయి తొట్రుపడుచుండుటఁ గని అతడు భీతిల్లెననియు, లేక, బొమలు ముడివైచి. పండ్లు పటపటఁ గొఱుకుచుఁ, గత్తిదూసి పులిపైకి దూకుటనుగని, యాతనియందు శౌర్యము దొనికినదనియు మన మూహింప వచ్చును. వీనికి వ్యభిచారి భావమును దోడ్పడినఁ బ్రధాన భావము పరిపూర్ణత నొందును. అనఁగా మూడు చిన్న దీపపు వత్తు లొకటిగఁ జేరినపుడు వేడిమియుఁ. గాంతియు హెచ్చునటుల, మూడుభావములు చేరి యొకస్థాయి భావ మయి తీవ్రతను దాల్చును. కావున పరిస్ఫుటమగు రసము బుట్టింప వలయునన్నఁ బ్రధానభావమునకుఁ బరిపోషకముగ ననుభావాదులు గూడ వలయును.

ఇఁక రసస్వరూపమును జర్చింతము. స్థాయి భావమో లేక మఱియేదైన నొక భావమో చర్వితమగునపుడు రస త్వము నొందుచున్నది. అనఁగా ఆభావమును సహృద యుఁడు తన హృదయమునందు నిలిపికొని పలుమాఱు భావించుట వలన ఆనందముప్పతిల్లును. రసము ఆనందమాత్ర గ్రాహ్యము, కావున, భావము అనుభవయోగ్యమైనది.

రసము అనుభవ సిద్ధమగునది. భావచర్వణము, రసాను భవము నేకకాలమున జరుగుచుండును.

వస్తువునందు భావము లేదు; కాని భావస్ఫోరక హేతు వున్నది. అటులనే కావ్య సమర్పిత విషయములు అనుభవ రసికుల హృదయములందు భావముల స్ఫురింపఁ జేయును. ఉదాహరణము: నీటియందు బాయి గుద్దఁబడిన పుడు తరంగములు రేఁగును. నీటియందు లీనమైయున్న యలలు కారణ మలవడుటవలన వ్యక్తము లయినవి. అటు లనే మన మనము నందు వాసనారూపముగ లీనమైయున్న సుఖక్లేశాది భావములు కావ్యగత హేతు ప్రేరితములై స్వరూపములు దాల్చి యనుభూతము లగుచున్నవి.

అట్లయిన కావ్యమునందు రసము లేదా? కావ్యము నందు భావ ప్రేరకవిషయములు గలవు. ఆ భావములె అను భూతము లగునపుడు రసత్వము నొందుచున్నదని యిదివరకే తెలిసికొనియుంటిమి. అట్లయిన కావ్యము రసవంతముగ నున్నదని యేల చెప్పుదురు? సామాన్యమైన వాడుకనుబట్టి బియ్యము అన్నమునకు వలెనే భావమునకును రసమునకును గొంత భేదముగలదు. అప్పుడె యెసటిలో బియ్యమును బోసి ప్రొయ్యి మంటపెట్టువంటవానిని 'నీ వేమి చేయుచున్నా'వని యడిగిన, 'నేను అన్నమువండుచున్నా'నని జవాబు చెప్పును. అన్నమే యైనయెడల వండనక్కఱ లేదు, ఈ సందర్భమున బక్వము కాని బియ్య మెట్లు అన్నమని పేర్కొనఁబడినదో అటువలెనే కావ్యము గూడ, అంత్యఫలముదృష్టియందుంచు కొనఁబడి, రసవంతమని యూహింపఁబడుచున్నది.

రసము మానవచర్యలకే సంబంధించియుండుననియు, తిర్యగ్జంతువుల చేష్టలయందు రసస్పర్శ గలదనియు, అచేతన వస్తువర్ణనములు రసాభాసము లనియు, ఆలంకారికులు చెప్పుచున్నారు. ఇది చింత్యము. ఏలయన, అచేతన వస్తువులు గూడ రమణీయ భావముల బ్రేరించును. అవి యనుభవింపఁబడునపుడు ఆనందము పుట్టును. సుఖానుభవ యోగ్యమగు ప్రతిభావమును రసత్వము నొందఁగలదు, క్రౌంచపక్షి శోకము వాల్మీకిని అశ్రుగద్గద కంఠుని గావించినది. గొఱ్ఱెపిల్ల బుద్ధుని హృదయమునఁ గరుణారస మొలకించినది. ఉషస్సులను దర్శించిన వైదికఋషులు ఆనంద నిర్మగ్నులై వాని నత్యద్భుతముగఁ గొనియాడిరి. ఆషాఢమేఘము నీరస భావద్యోతకమైనయెడల, కాళిదాసుఁడు దానినిఁ దన కావ్యమునకు ఆలంబముగఁ గొనునా? అయిన మఱియొకటి. మానవచర్యలు హృదయమునకు దగ్గఱివి గావున వాని మూలకముగ భావోత్కర్షత గలిగింపవచ్చును; కాని యింత మాత్రముననే తదితరములు నీరసములని శాసించుట సాహసము. తేనెలో మెదిపిన వస్తువేదైనను రుచిపుట్టించునట్టుల ఏభావమైనను సౌందర్యావాహకమై సుఖానుభోగ్యమగును. రస నీరసత్వములు కావ్య సమర్పితవస్తువుల చేతనాచేతనత్వమునకు సంబంధించియుండక కేవలము అలౌకిక కల్పనా చమత్కృతియొక్క భావాభావములపై నాధారపడియుండును. రసమునకుఁ జమత్కారమే ప్రాణమని విశ్వనాథుఁడు నుడివియున్నాఁడు. కల్పనా చమత్కృతిలేనిదే వాక్యమునకు కావ్యత్వము సిద్ధింపదు. కావునఁ బ్రతి కావ్య

మును స్వగత చమత్కార తారతమ్యమున కనురూపముగ రసవంతముగ నుండవలయు ననియె నిర్ణయింపవచ్చును. పండితరాయలు రసమునందు రామణీయకమున్నదని నుడివి యున్నాఁడు. అంతకన్న రామణీయకమునందు (రమణీయ భావమునందు)రసమున్నదని చెప్పుట సమంజసముగనుండును.

లోకమున శోక బీభత్సాదిభావములు మనకుఁ గష్ట మును గలిగించును. అట్టివి కావ్య సమర్పితము లైనపు డెట్లు ఆనందముఁ గలిగించుచున్నవి? ఎట్లన, అటువంటి భావములు శిల్ప నిపుణుఁ డగు కవిహృదయమునుండి వెడలి సహజ కర్కశత్వమును బోనాడి, లోకోత్తర రమణీయములై అద్భుతా నంద సంజనకములయి సహృదయులకు సుఖానుభోగ్యము లగుచున్నవి. కావుననె విషాదాంత నాటకములుగూడ నను భవింపఁబడుట. కావ్యగతమైన ప్రతిభావమును రుచికర ముగ నుండును. ఇఁదుకు కవియొక్క శిల్పకల్పనా నైపుణ్య మును, భావనేంద్ర జాలమును గారణము.

రామణీయకము ఇట్టిదని నిర్వచించుటకు సాధ్యము గాని భావము. ఒకేరూపము చూచు వారి హృదయ పరి పాకము ననుసరించి కొందఱికి సుందరముగను మరికొందఱికి నసహ్యముగను దోఁపవచ్చును. ఇది యందఱికిఁ దెలిసిన విషయమె. లంబాడి వారికిని యెఱుకల వారికిని జాల యింపుగనుండు గవ్వలదండలు దంతపు కడియములు మన యూఁడువారికి నేవ పుట్టించును. వీరికి రమ్యముగ నుండు కాసులదండలు తావళములు మున్నగునవి ఆంగ్లేయ స్త్రీలకు

మోటు సగలుగఁ దోఁపవచ్చును. అట్లయిన, సౌందర్యము వస్తుగతమా లేక మనోగతమా? ఈ విషయమై తుద ముట్టని చర్చలు జరిగియున్నవి. జగన్మిథ్యావాదులు (Idealists) సౌందర్యము మనోగతమనియు, జగత్సత్యవాదులు (realists) సౌందర్యము వస్తుగతమనియుఁ దీర్మానించియున్నారు. కాని, యిరువురి వాదములందును సగము సగము సత్యము గలదు. రూపమునందు సౌందర్యభావము రేఁపు శక్తిలేని యెడల భావజ్ఞత యుండియు నిరుపయోగము. అట్టి భావము ప్రేరించు శక్తి రూపమునందుండియు దానిని దెలిసికొనఁగల యనుభవజ్ఞానము బుద్ధికి లేనియెడల రూపగత సౌందర్యమును నిరుపయోగము. అనఁగా అటువంటి మందబుద్ధికి రూపమునందు సౌందర్యము లేనట్లై తోఁచును. ఇంద్రియ వ్యాపార మందఱికి నొకే విధముగ జరుగుచుండును; కాని తత్సందేశములను జక్కఁగ నర్థము చేసికొనుటపై జ్ఞానమాధారపడియున్నది. కావుననే యాలంకారికులు సహృదయుల హృదయములందుమాత్రమె కావ్యము రసముపుట్టింపఁగలదని పలుమాఱు నొక్కి చెప్పియున్నారు. భావ స్ఫోరక శక్తి బుద్ధియందును గలదు. కావున రెండును ముఖ్యములె.

రామణీయక మనునది యేకవస్తువుగాదు. అది సమష్టి భావము. రోజాపువ్వు రమ్యముగ నున్నదనుటలో, దాని యాకారము, రంగు, పరిమళము మున్నగునవి చేరియున్నవి. సౌందర్యమును గ్రహింపవలయునన్న సింహావలోకము చేయవలయును. అనఁగా సమష్టి దృష్టితోఁ జూడవలయును.

ఆకారము మన సమష్టి దృష్టికి నందక మించిపోవునంత పెద్ద దైన యెడల దానిని మెచ్చుకొనఁజాలము.

సౌందర్యమున కేదోయొక లక్షణమును గల్పించి దానిని బందిఖానాలో వేయుటకంటె స్వేచ్ఛగ వదలుట మేలు. ప్రతి మానవుని బుద్ధి నిర్ణయమె సౌందర్యమునకుఁ బ్రమాణము. అది ప్రత్యేకము. సామాన్య వస్తువులలోఁ గూడ ననంత సౌందర్యమును దర్శించిన మహానుభావు లెందరో గలరు.

> "In all poor foolish things that live a day
> Eternal beauty wandering on her way"

అని సుప్రసిద్ధ ఐరిషు కవి ఈట్సు గానము చేసి యున్నాఁడు.

౭. శిల్పసీమలు

లలితకళలన్నియు, నొకే మూలసూత్రమునకు బద్ధము లైయును, ఒకే యంత్యప్రయోజనము గలవైయును వాహక భేదముల ననుసరించి వానివాని యధికార సీమలును భిన్నములుగ నుండును. కళలన్నియు నొకే విధమైన శక్తి పరిమితులు గలిగియున్నయెడల; గానము, కవిత్వము, చిత్రలేఖనము, భాస్కర్యము మున్నగునవి పృథగ్భావము భజింప నవసరముండదు. ఒక్కొక కళయందు నితరకళలలో లేని యానుకూల్యమును గుణమును హెచ్చుగ నుండుటచేతఁ గళలన్నియు మనకు నావశ్యకము లైనవి.

గానమున రాగము ప్రధానము. తక్కిన గుణము
లన్నియు రాగమునకు లొంగియుండును. కవిత్వమున రామ
ణీయకము ముఖ్యము; ఇతర గుణములు దానికి పోషకము
లుగ నుండును. భాస్కర్యమునందు నిమ్నోన్నత స్థలములును
ఘనిష్టతయుఁ జక్కగఁ బ్రదర్శింపఁబడును. చిత్రకళ మూల
మున వివిధ వర్ణములతో సూక్ష్మాతి సూక్ష్మములైన వివర
ములనుగూడఁ జిత్రించి దృశ్యమును కన్నులకుఁ గట్టినట్లు
చేయగలము. కావున నొక్కొక కళకు నొక్కొక విష
యము ప్రధానముగ నేర్పడినది. కవిత్వమునకుఁ బ్రతిక్షణ
భిన్నములగు మానవచర్యలును, చిత్రలేఖనమునకు విశాల
దృశ్యములును, భాస్కర్యమునకు విగ్రహరచనయు నను
కూల వ్యాపారములు. ఇట్లగుటవలన, కళలన్నిటిని పృథః
కరించి వాని వానికిఁ గల సంబంధమును ద్రెంపివైచుటకు
నేను సాహసింపను. కళలన్నియుఁ బరస్పర సాపేక్షకములు.
కవిత్వమునఁ గొంత చిత్రలేఖనము చిత్రలేఖనమునందుఁ
గొంత కవిత్వమును అవిభాజ్యముగ మిళితమైయున్నది.

చిత్రకారుఁడు స్థలపరిమాణ బద్ధములగు రంగుల
నుపయోగించును. కవి కాల పరిమాణ బద్ధములగు
శబ్దముల నుపయోగించును. చిత్రకారుఁడు రూపమునకుఁ
జర్యను వశవర్తినిఁ జేయును. కవి చర్యకొఱకు రూపమును
వర్ణించును. చిత్రకారుఁడు అనంత కాలమునుండి యేదో
యొక క్షణమును (అనఁగా ఆక్షణములో జరుగు కార్యమును)
గ్రహించి దానికి శాశ్వతస్థితిఁ గల్పించును. కవి క్రమముగఁ
బ్రతిక్షణమునం జరుగు కార్యముల వర్ణించుచుం బోవును.

ఇంతింతై వటు డింతయై మఱియుఁ దానింతై నభోవీథిపై
నంతై తోయద మండలాగ్రమున కల్లంతై ప్రభారాశిపై
నంతై చంద్రునికంతయై ధ్రువునిపై నంతై మహర్వాటిపై
నంతై సత్యపదోన్నతుం డగుచు బ్రహ్మాండాంత సంవర్ధియై.

ఈ పద్యమందు అనుక్షణ వర్ధమానమైన వామనుని స్వరూపము వర్ణితమైయున్నది. ఈ విషయమును స్ఫురింపఁ జేయుటకుఁ జిత్రకారుని కన్నను కవికి ఆనుకూల్య మెక్కువ. ఏ నిమిషమున జరుగుచున్న కార్యము (విజృంభణము) చిత్రించినయెడల ముందుజరిగిన విషయమును ఇఁకముందు జరుగఁ బోవు విషయమును సూచితమగునో అట్టి చర్యను మాత్రము చిత్రకారుఁడు చిత్రింపవలయును. చిత్రమును మ్యూజికు లాందరు బొమ్మకును, కవిత్వమును బయస్కోపు బొమ్మలకును బోల్చవచ్చును.

చిత్రకారుఁ డొకరమణీయ రూపమును లిఖించి మనలను నానంద పరవశులను జేయును. మనకానంద మెట్లు కలిగినది? ఆరూపముయొక్క సర్వావయవములు సమష్టి యాకారమున కనురూపముగను, రమ్యముగను చిత్రింపఁ బడియుండును. అవి యెల్లను సమష్టిగా నొకేసమయమున గోచరించును. అప్పుడా రూపసౌందర్యమును మెచ్చుకొనుట వలన ఆనందము మనకుఁ గలుగును. కవియు నొక సౌందర్యవతిని వర్ణింపవలయునన్న నేమి చేయవలయును? చిత్రకారునివలెఁ బ్రత్యంగముఁ దాను వివరముగ వర్ణించి అట్టి యానందమును మనకుఁ గలిగింపఁ గలఁడా? ఎన్నటికిఁ గలిగింపలేఁడు. ఎందువలన? కవి యొక్కొక్కయవయవమును

ప్రత్యేకముగ వర్ణించును. శరీరవర్ణనము వివరముగఁ బూర్తి యగువఱకు నిరువది ముప్పది పద్యములు పట్టును. ఆ పద్యములన్నిటియందు నిమిడియున్న అవయవ వర్ణనమంతయు నొక్కచోటికి చేర్చి యొక యాకారముగ నిర్మించి సమష్టి సౌందర్యమును గ్రహించుట యసాధ్యమైన యుద్యోగము. అంగములను విడివిడిగ కత్తిరించి వేఱుపఱచి వాని యంద చందముల మనము కనుగొనఁజాలము. కావున, కవి యెల్ల ప్పుడును సమష్టివర్ణనము చేయుట యుపయోగకరము. చిత్రకారుఁడు ఆనందకార్యమును చిత్రింపక తత్కారణభూత మగు రూపమును ప్రత్యక్షము చేయును. కవి కారణమును వర్ణింపక కార్యమును (కారణమైన రూపమును జూచుట వలనఁ గలుగు ఆనందమును) వర్ణించును. అట్లయిన అవ యవ బర్ణనము కవికి నవసరము లేదా? కొంతవఱకు అవ సరము గలదు. అటువంటి వర్ణనములు సమష్టి వర్ణనమును సార్థక పఱచు నట్లుండిన నదియొక విశేషము.

> అలరుం దండలఁ దమ్మి దుద్దులను గ్రీవాలంకృతుల్ చేసి కా
> మలతోఁ దెచ్చిన కల్వలం జెవులఁ గ్రమ్మన్మాటి, వాసంత పు
> ష్ప లతాతమ్మతఁ గేరుచుక్ నయన నిర్వాణమ్ముఁ గావించు నా
> కలకంఠింగని గౌతముం డెదను జిక్కెంబట్టు యత్నంబునన్.
> గోరంటాకురసానఁ బాణితలముల్ గోళుల్ పదాబ్జంబులుక్
> సారాశోక కిసాల రోచి రుదయ స్థానమ్ములై తక్తిమల్
> వాఱం, గాఁటుక చీఁకటిం గనుల క్రేవంజేర మోహంబు శో
> భారాజ్యంబును నేలు రాణియయి దైవాఱుం గురంగాక్షియుక్.
>
> (కడపటి వీడుకోలు)

మొదటి పద్యమున 'నయననిర్వాణమ్ము గావించుట' అనువాక్యమునందుఁ గార్యమువర్ణితమైనది. ఎంత సౌందర్యవతియైన కాంతను జూడనిదే గౌతమునికి అంతటి యానందము గలిగియుండునా! అని మన మూహించుచుందుము. కవి సూక్ష్మముగ స్ఫురింపఁజేసిన భావములను అవలంబముగఁ గొని మనము మఱికొంత భావింప మొదలిడుదుము. అనంతర మా భావములే ఘనీభవించి మనకొక సుందర స్వరూపము పొడగట్టును. రెండవ పద్యమున 'శోభారాజ్యంబును నేలు రాణి' అనువాక్యమున సమష్టివర్ణనము చేయఁబడియున్నది.

చెలువుగ వ్రాసి దిద్ది విధి చిత్తము రంజిల జీవమిచ్చెనో?
పొలుపులఁగూర్చి మానస విభూతిని గౌతుకియై రచించెనో?
మెలఁతుక మేనిఁజూడఁ బరమేష్ఠి ప్రభావము నెంచిచూడ నా
నెలఁతుక దోఁచు నొండు తరుణీమణి సృష్టియటంచు నామదిన్.

*(శాకుంతలము)

పై పద్యమునం దంతయు సమష్టివర్ణనమే. దుష్యంతుని యీమాటలవలన శకుంతల అసదృశ లావణ్యవతి యనియు లోకమోహన సౌందర్యవతియనియు మన మూహింపగలము.

పై చర్చయంతయుఁ జిత్రకారుఁడును కవియు రూపగత సౌందర్యము నెట్లు స్ఫురింపఁజేయవలయునను విషయమునకు సంబంధించినది. కాని, చర్యను వర్ణింపవలసి వచ్చి

*మహామహోపాధ్యాయ వేదము వెంకటరాయశాస్త్రిగారి తరుమా.

నప్పుడు కవి కేవలము సమష్టివర్ణనముతో సంతుష్టిపడి యుండరాదు,

ఏవిహంగముగన్న నెలుఁగించుచును సారెకుమసైకతంబులఁ గూడఁదారుఁ దారి కన్గొని యది తనజోడుగాకున్న మెడయెత్తి కలయంగ మింటినరయు నరసి కన్నీటితో మరలి తామరయొక్క వదన మెండగ సరోవారి నద్దు నద్ది త్రావఁగసైఁప కట్టిట్టు కన్గొని ప్రతిబింబ మీక్షించి భ్రమసియుఱుకు

> నుఱికి యెఱకలు దడియ వేఱొక్కతమ్మి
> కరుగు నరిగి రవంబుతోఁ దిరుతేంట్లఁ
> బొడుచు ముక్కున మఱియును బోవువెదక
> నంజఁ బ్రియుఁబాసి వగ నొక్కచక్రవాకి.

(మనుచరిత్ర)

పై పద్యమున విరహాచంచలయైన యొక చక్రవాకి చర్యలు వర్ణింపబడినవి. కవి యెచ్చోటనైనను 'ఆ చర్యలు మనోహరములుగ నున్నవి' అని చెప్పలేదు. ఎందువలన ? అనసరము లేదు. ఆ చక్రవాకి చర్యలు మన భావమునకుఁ దట్టిన వెంటనే అవి హృద్యములుగ నున్నవని మనమే యెఱుంగుదుము కార్యకారణములను రెంటినిఁ జెప్పుట రచనా కౌశలమునకు లోపము. ఒకటి తెలిసిన మఱియొకటి తప్పక తెలియఁగలదు. కళానియమబద్ధుఁడై కవి వదలి పెట్టిన వివరములను పాఠకుఁడు తన సొంతభావముతోఁ బూరించు కొనవలయును. కావుననె పాఠకులు సహృదయులుగ నుండ వలయుననుట.

౮. కవిత్వ ప్రయోజనము

కావ్య ప్రయోజనములను గుఱించిన మన యాలంకారికుల మతము ఈ క్రింది శ్లోకము వ్యక్తపఱచుచున్నది.

శ్లో॥ కావ్యం,యశసేఽర్థకృతే,వ్యవహారవిదే శివేతరక్షతయే
సద్యఃపరనిర్వృతయే కాన్తాసమ్మితతయోపదేశయుజే.

ఇందు ''సద్యఃపరనిర్వృతయే'' అనునది ముఖ్య ప్రయోజనము. ఆనందాస్పదమయిన రసోత్పాదకత్వమె లలిత కళల గంతవ్యము. శాస్త్రముయొక్క కార్యము వస్తుతత్త్వ పరిశోధనము, శిల్పముయొక్క పని వస్తువు నావరించిన మనోహరత్వమును మూర్తీభవింపఁ జేయుట. మొదటి దాని ఫలితము విజ్ఞానము. రెండవ దాని ఫలితము ఆహ్లాదము.

కవి యేమనోవస్థలోఁ దన కావ్యమును రచియించెనో ఆ యవస్థనే సహృదయుఁడా కావ్యమును జదివినప్పుడు పొందును, సంకుచితములైన ప్రపంచసీమలను భేదించుకొని మనస్సు విశాలమయిన భావప్రపంచమున అనిర్వచనీయమైన యానందము ననుభవించును, కావ్య జగత్తునందుఁ జిత్తము లగ్నమైనపుడు అదియు బాహ్యప్రపంచము వలె యదార్థముగ దోఁచును. ఒకనాడు నే నభిజ్ఞాన శాకుంతలముఁ జదువుచుండ, మనోహరారణ్యముల సంచరించినట్లును శకుంతల పూఁదీవలకు నీరుపోయుచుండ నేను ప్రత్యక్షముగ జూచినట్లును, ఆమె నత్తవారింటికి వీడ్కొలుపుటకు నీటి కాలువవఱకు వచ్చిన కణ్వమహర్షియు ననసూయా ప్రియం

వదలు మున్నగు సఖులలో నేను గూడ నొకఁడనియు దలపోసి వారి సుఖ దుఃఖములను నేనును బంచుకొనుచుంటిని. కణ్వుని యాక్రోశము నాకర్ణపుటముల గింగురుమని మాఱుమ్రోయు చుండెను. కాని నేను చదువుచుండినది నాటకమనియుఁ గాళి దాసుని యసదృశమైన రచనా చమత్కృతియుఁ బ్రతిభయు నన్నటుల ముగ్ధుని గావించినదనియుఁ దెలిసికొనుటకు నాకుఁ జాలసేపు పట్టెను. మనసు సామాన్య శ్రుతిలోఁ బడిన వెనుక, కల గని నిదుర లేచిన యనంతరము స్మృతిలేశములు స్ఫురిం చునటులఁ గణ్వుని సంసారము నా భావమునకుఁ బొడకట్టు చుండెను. హెస్రీవుడ్ అనునామె రచించిన 'ఈస్టిను' అను నవలలోని కడపటి యధ్యాయమును, 'ఒథెలో' నాటక ములోని 'హత్యారంగమును' జదువుచుండినపుడు నాకుఁ దెలి యకయే నేను గన్నీరు నించుచుంటిని. ఈయవస్థ నాకెంత సేపుండెనో తెలియదు. తెలిసినప్పుడు, నేలపై జారిపడిన వాఁడు తన్నెవరైనఁ జూచుచున్నారాయని యటు నిటు పరికించునటుల లజ్జాకరమైన నాస్థితిని ఎవరైనఁ గాంచు చున్నారాయని పాఱఁజూచి అచ్చట నెవరును లేకుంట నెఱింగి తృప్తిపడితిని. కావ్యలోకము ఆ సమయమునకు సత్యమని తోఁపనిదే మనకు సహానుభూతి యెట్లు గలుగును?

జర్మను కవిశేఖరుఁడగు గెతె కావ్య ప్రయోజనము లను గొంచె మించుమించుగ మన యాలంకారికుల వలెనే నుడివియున్నాఁడు.

"Each age has sung of beauty,
He who perceives is from himself set free"

మానవసంఘమున యథార్థమగు నాగరకత హెచ్చు కొలఁది ప్రజలయందు సౌందర్య పిపాసయు నభివృద్ధి నందుచుండును. అట్టికాలమున సామాన్యజనులుగూడ లలిత కళ నభిమానించుచుందురు. ఇది యెంతయు సహజము. కాళిదాసుని కాలమున హైందవ సంఘము చాల నాగరక స్థితియందున్నదనుటకు ఆనాఁటి యాచార వ్యవహారములును, కళాకౌశలమును, సాక్ష్యములుగ నున్నవి. అందుకు కాళిదాస మహాకవియె మొదటి దార్కాణము! కవులకావ్యములందు సమకాలీనమయిన సాంఘిక పరిస్థితులు, తదభ్యుదయ పరిణామములు ప్రతిబింబించుచుండును. సారస్వతము సంఘముయొక్క యుచ్చ నీచస్థితులను దెలియఁ జేయు 'భారమితి' యని చెప్పవచ్చును.

కాళిదాసుని కాలమునఁ జిత్రలేఖనము, నృత్యము, సంగీతము, నాటకము మున్నగు లలితకళలు చాలవ్యాప్తిలో నుండినవి. మాళవికాగ్నిమిత్రమునం గల యంతర్నాటికయందు కాళిదాసు ఆకాలపు రాజకుటుంబముల నృత్యవినోదములను చూపించినాఁడు. శకుంతలను అత్తవారింటికిఁ బంపు సమయమున వనస్పతు లొసఁగిన యాభరణములచేతఁ దమ సకియ నలంకరింపఁబోవుచు ననసూయ 'మే మింతవఱకు భూషణముల నుపయోగించి యెఱుఁగము. అయినను జిత్తరువు వ్రాఁత యలవాటునుబట్టి నీ యంగములయం దాభరణ వినియోగము చేసెదము అని పలికెను. వనమున నివసించు ఋషి కుమారికలె చిత్రలేఖనమునం దంత నిపుణులై యుండ, నిఁక నాగరక యువతులమాట వేఱె చెప్పవలయునా? ఆద

ర్శక కవుల కావ్యములందైనను దేశ కాలములు తమ పదచిహ్నముల ముద్రింపకపోవు, రామాయణ మహాభారతములు ఆయాకాలమునాఁటికి హైందవ సంఘముయొక్క ఆదర్శక ప్రతికృతులని తలంపవచ్చును.

మనో వికారములను, భావములను శిక్షించి, సంస్కరింపఁగల యనుభవములు మాటిమాటికి లోకమునఁ దటస్థింపవు. ఒకవేళ తటస్థించినను, అవి పరిపూర్ణముగను, ఆదర్శక ప్రాయముగను నుండవు. కాని, అట్టి యనుభూతులను కావ్యములందు మనము యథేచ్ఛముగఁ బొందవచ్చును. కవిత్వ సంపర్కమువలన సంకుచితభావము తొలఁగి యఖండ జీవముయొక్క పరతటము నంటఁగలము. క్రమముగ మన స్వభావము సున్నితముగ మాఱి తిలకించు ప్రతివస్తువునందు సౌందర్యమును గుర్తించి యానందింపగల యభిరుచి హెచ్చును. కావున కావ్యము మానవప్రకృతి నుద్ధరింపఁగల యొక మనోహర సాధనము.

సంఘముయొక్క సంయోగతను బోషించుటకుఁగూడ గావ్యము లమోఘ సాధనములు. అట్టి ప్రబంధముల యందలి సర్వజనీన భావములు ప్రజనందఱిని నేక సంప్రదాయ బద్ధులను గావించి, సంఘముయొక్క యైక్యమును బలపఱచును. రామాయణ, మహాభారతములు లేకుండిన హైందవ సంఘ మేమై యుండునో! హిమవత్పర్వతము మొదలు కన్యాకుమారి వఱకుఁ గల యీ విశాల భారతదేశమున నీ రెండు జాతీయ కావ్యములను జదువని, విననని హైందవుఁడుండునా? ఎన్ని శతాబ్దములనుండి యీ కావ్యద్వయము మన సంఘమును

బాలించుచున్నది! కాలము మాఱినది, చక్రవర్తులు గతించిరి. రాజ్యములు బంతులవలె నొకరిచేతినుండి మరియొకరి చేతికి దుమికినవి, మతములు పుట్టి చచ్చినవి, చచ్చిపుట్టినవి, అన్యదేశ నాగరకతా సంఘర్షణము గలిగినది. ఆచార వ్యవహారములు మాఱినవి. పూర్వార్యావర్తమేఁ రూపము మార్చుకొని క్రొత్తదేశమైనది కాని, మన జాతీయకావ్యములు ప్రాతపడలేదు, వాని యధికారమింకను మొక్కవోలేదు. హైందవ జీవన ప్రవాహమునకు ఆ కావ్యములు తటములవలె నున్నవి. కాలమా, తీవు చచ్చితివి! రామాయణ మహాభారతములు చావలేదు; అవి చిరంజీవములు!

---

౯. కావ్యము : నీతి

మతము, శాస్త్రము, ధర్మము, లలితకళలు మున్నగునవి వానివాని కుచితమైన రీతుల మానవ శిక్షణమునకుఁ దోడ్పడు సాధనములు. కొన్ని బుద్ధిని ఉత్తేజనమొనరించునవి. మఱికొన్ని హృదయమును పరిపక్వపఱచునవి.

ప్రతియుగమునందును ప్రతిసంఘమునందును కాలమునకంటె ముందు నడచు ప్రతిభావంతులు, విప్లవకారులు దూరదృష్టి గలవారు కొందఱుదయించుచుందురు. అట్టి మహనీయుల భావములు, సృష్టులు ఆ యుగమునకు, ఆ సంఘమునకు ఆదర్శకములుగ నుండును. ఆపురుష పుంగవులు మార్గదర్శకులు; అస్ఫుటముగను, అవ్యక్తముగనున్న భావికాలమును మన కన్నులకుఁ బొడకట్టునట్లు చేయఁగల మహిమా

వంతులు. వారి పలుకుబడివలన మానవసంఘము క్రొత్త క్రొత్తదారులు ద్రొక్కుచుండును. జాతీయత అట్టి యుదార హృదయుల భావసంపర్కముచేత నంతర్జాతీయతగఁ బరిణ మించుచుండును. బుద్ధుడు, వాల్మీకి, ఏసుక్రీస్తు, మహమ్మదు మున్నగు మహాపురుషు లీతరగతికి సంబంధించినవారు. వారి జీవితమే యొక యుత్కృష్టమైన కావ్యము. వారి ప్రవర్తనమే నీతికి ఆదర్శకము.

ప్రతియుగమునం దొక్కొక్కభావము ప్రముఖమై యుండును. అది యాధ్యాత్మికమైనను, సాంఘికమైనను, రాజకీయమైనను, లేక మఱి యింకేవిధమైన మానవచర్యకు సంబంధించినదియైనను గావచ్చును. ఆ భావములందుఁ బ్రజల యాంతరంగిక దృష్టి లగ్నమై యుండును. ఇట్టి భావము సార్వజనీనముగ నుండక తప్పదు. దానిని కవియో, చిత్ర కారుఁడో, ప్రవక్తయో, తన సృష్టిమూలమున బయలుపఱ చును. మన మెల్లర మానాయకుని ననుసరింతుము. ఎందు వలన? మనయందు అస్పష్టములుగను నిగూఢములుగను నున్న భావములను ఆయన వెలిబుచ్చును. ప్రజాబాహుళ్యము యొక్క భావములు ఆతని సృష్టియందు ఆదిశేషావతారము దాల్చి రెండువేలనాలుకలతో మాటలాడుచుండును. ఆయన కును మనకును సహానుభూతి గలదు. కావుననే మా నాయ కుఁడు మనలనాకర్షించును. అట్టి మహనీయుల యుద్దేశములు, సంభాషణములు, ప్రవర్తనములు విశ్వశ్రేయమును జేకూర్చు చుండును. ఏది విశ్వశ్రేయమును సంపాదింపఁగలదో యది నీతిబాహ్యముగ నుండనేరదు.

లలితకళలు జాతీయ జీవితమునందు అంతర్వాహినులై ప్రవహించు భావముల రమణీయాభివ్యక్తులే. కావున, వాని యందు ముఖ్యములును, సర్వజనాదరణీయములును అగు భావములను ఆకర్షించి, శిల్పులు తమ రచనాచమత్కృతి వలన వానిని ఆదర్శకములుగ నొనరింతురు. ఇట్లనుట వలన మానవసమాజమును కళలును పరస్పర సాపేక్షకము లని మన మూహింపవలయును. తాత్కాలికములైన భావములు కొన్ని ప్రజలను శిల్పులను ఆకర్షింపవచ్చును. అట్టివి క్షణికములు. కాని, కాలపారంపర్యముగ నొకజాతి యందు అస్థిగతమై మజ్జలో నాటుకొనియున్న భావములను మూర్తీభవింపఁజేయుట జాతీయశిల్ప మనఁబడును. అదియే లోకాదరణపాత్రము. తన వ్యక్తిత్వమును బోఁగొట్టుకొనక చిరంజీవముగ నుండును. తాత్కాలికములైన విజాతీయానుకరణములు మన స్వభావమునకుఁ గూడ విజాతీయములే కావున సత్యపటుత్వము కొఱఁతపడి కళాప్రపంచమునందు నిరాదరింపఁబడును.

ప్రాచ్యపాశ్చాత్యశిక్షణ మార్గములందుఁ బరస్పర వైరుధ్యము గోచరించుచున్నది. ఒకరికి శాంతియు నిరాడంబరమైన జీవనము ప్రధానము. మఱియొకరికి, తృష్ణ, చిత్త సంక్షోభము, ఆటోపము ముఖ్యము. నేతిచేఁ దడుపఁబడిన అగ్నిహోత్రమువలె భోగము లనుభవింపఁబడుకొలఁది వృద్ధిచెందుచుండుననియు, కావున భోగముల నియమితముగ గ్రహింపవలయుననియు నొకరిమతము. భోగముల వీలైనంతవఱకు వృద్ధిపొందించి వాని ననుభవింపనిదే నాగరకత

గాదని మఱియొకరి యభిప్రాయము. ప్రాచ్యులకు జీవితము పరమార్థమును సాధించుటకై యేర్పడిన యొక యుపకరణము. పాశ్చాత్యులకు, జీవితమే యొక పరమార్థము. కావున యిట్టి మార్గభేదములు రెండు ఖండములయొక్క లలితకళల యందు నస్థిగతముగ నంకితమైయున్నవి. ప్రాచ్యశిల్పము నందు రూపయాథార్థ్య మంతముఖ్యముగాదు ఏలయన, వారిశిల్పము చాలవఱకు సాంకేతికము. సాంకేతికశిల్ప మెప్పటికి కొన్ని శిల్పసమయములకుఁ గట్టువడియుండును. అజంతాగుహాలయందలి రేఖాచిత్రములు ఈతరగతి శిల్పము నకుఁ బ్రబలమైననిదర్శనములు. మనశిల్పము ధ్యానమూలకము; వారిశిల్పము ప్రకృత్యనుకరణము.

'కళలయందు రసరామణీయకములె ప్రధానములు కాని, నీతికిని ఆధ్యాత్మికభావములకును నేమిసంబంధము గలదు! అని కొందఱు విమర్శకులు ప్రశ్నించుచున్నారు. ఇది మనకు నవీనమును విజాతీయమునునైన సందేహము. ఆస్కార్ వైల్డు (Oscar Wilde) అను నొక ఆంగ్లేయ విమర్శకుఁడు*కళలన్నియు నీతిబాహ్యములనియు. నీతియనునది యేదోకొద్దిపాటి తెలివితేటలు గలవారికేగాని, ప్రతిభావంతులకు నీతి యనవసరమనియు చెప్పియున్నాఁడు. ధర్మశాస్త్రములయందు వలె కావ్యములందు నీతిబోధ యనవసరమనుటయే ఆయన యుద్దేశమైనయెడల మే మిరువురము ఏకాభిప్రాయులమే. కాని నీతికిని కావ్యమునకును ఏలాటి సంబంధములేదని

---

*All the arts are immoral. To morals belong the lower and less intellectual spheres. — *Intentions*.

వాదించువారికిని నాకును భిన్నాభిప్రాయము గలదు. ఈ విషయమును గొంచెము చర్చింతము.

కావ్యమందు రామణీయకము ముఖ్యము; తక్కిన గుణములు అందుకు పోషకములుగ నుండవలయును. రామణీయకమనునది ప్రతిభావంతుఁడైన కవియొక్క రచనా నైపుణ్యమునకు సంబంధించినది. గుణమెప్పుడు తనకాలంబనమైన వస్తువును ఆశ్రయించియుండునుగాన, వస్తుగుణములు రెంటికిని ప్రాధాన్యము గలదు. ఒకవేళ నీతిబాహ్యమైన వస్తువు రమణీయమై యుండినయెడల షేక్స్పియరు (Shakespeare) మహాకవి సృజించిన క్లియోపాత్రా (Cleopatra) కన్యవలె మానవలోకమున కుపద్రవము గలుగఁజేయును. శకుంతలవలె అనుభోగ్యము గాదు.

మఱియొక పూర్వపక్షము గలదు: శిల్పముకొఱకే శిల్పము' (Art for art) అనఁగా శిల్పమున కేలాటి బాధ్యతలు లేవు. కవి భావోద్రేకమువలనఁ దనకిష్టమైనరీతిని గానము చేయును. అట్లుచేయుట యితరులకొఱకుఁగాదు; తన సంతోషమునకు. కోకిలకూయుట యెవరిని ఆనంద పెట్టుటకొఱకు? ఈ వాదము మొట్టమొదట వినుటకు ఇంపుగానే యుండును; కాని విమర్శించుకొలఁది యందలి లోపములు బయలువడును. కోయిలకూఁతను విని మన మానందించుచున్నాము; నిజమే, దానికూఁత మధురముగ నుండుటవలనను ఆ కూఁత మనకు సమ్మతమగుటవలనను మనము సంతోషించుచున్నాము. అది తన కిష్టము వచ్చినట్లు కూయుటవలనఁ గాదు. కాకిగూడ తనకిష్టమువచ్చినట్లే కూయును. దానిని మన మేమాత్ర మాద

రించుచున్నాము? అటులనే కవి చేయు గానము మానవ సమాజము నుద్ధరించుటకు యోగ్యమైనదిగ నుండుటవలననే గౌరవింపఁబడుచున్నది 'నాకు నోరున్నది. తిట్టుటకు చాల మాటలు తెలియును. కావున నేను తిట్టుకొనుచుందును' అని చెప్పి వీథులవెంబడి తప్పుదారి కూఁతలు కూయుచుఁ దిరుగు చుండిన 'ఆతనికి పిచ్చి పట్టిన' దని పిచ్చివారి ఆసుపత్రికి పంపుదుము. సమాజ మెట్లు తనయందలి వ్యక్తికి బాధ్యమో, వ్యక్తికూడ సమాజమునకు బాధ్యుఁడు.

కవి యొకమూలఁ గూర్చుండి తన సంతోషముకొఱకు నొక కావ్యము రచియించుకొని దానిని బదిలముగ నింట దాఁచుకొని యుండినయెడల నేలాటి యిబ్బంది లేదు. అట్లు గాక కవిరచనలు వ్యాప్తిలోనికివచ్చి, లోకజీవనము పై నధి కారము చేయుచుండును. కావున నందఱికంటెను కవికి బాధ్యత యెక్కువ. ఉత్తమకవి సృష్టియందా కాలపు మానవ సంఘమునందలి సముంచిత భావములు మూర్తీభ వించి యుండును. ఆతని రచనలందు భవిష్యద్వాణి రహస్య మర్మర రవములతో సంభాషించుచుండును.

మానవ జీవితమునకును శిల్పమునకును సహజమైన సంబంధము గలదు. జీవిత ప్రయోజనము ననుసరించి శిల్ప ప్రయోజనము కూడ నిర్ణయింపఁబడుచుండును. మన జీవిత మును గుఱించి ఉమ్రఖయ్యాం (Omar Khayam) అను పారసీక కవి యిట్లు నుడివియున్నాఁడు:

One thing is certain and the rest is lies :
The flower that once has blown for ever dies.

* * *

Many knots unravelled by the road.
But not the knot of human death and fate ;
There was a door to which I found no key,
There was a veil past which I could not see.

* * *

While you live, drink ;
for once dead, you never shall return.

ఉమ్రఖయ్యాము కొంచె మించుమించుగా చార్వాక మతస్థుఁడు. 'వికసించిన పూవు మరల వికసింపఁబోదు. మరణించిన మానవుఁడు మరల తిరిగి రాఁబోఁడు. ప్రాణముండఁగనే భోగము లనుభవించెదము. చచ్చిన వెనుక యేమగునో ఆ విషయము నాకు తెలియదు. ఆ ముడిని నేను విప్పఁజాలక పోతి' నని చెప్పెను. అట్టివారికి జీవితము భోగమాత్ర ప్రయోజనము. జీవితము ననుసరించి శిల్పము గూడ విషయభోగముల ప్రతిబింబముగ నుండును.

కాని, మన విశ్వాసములు వేఱు. ధర్మార్థ కామ మోక్షములను నాలుగు పురుషార్థములను మానవజీవితము సాధింపవలయునని మన పెద్దలు నిర్ణయించిరి. వారు ఇహ పరముల రెంటికిని సమాన గౌరవమును చూపియున్నారు. సన్న్యాస మనునది అతీత ధర్మము. లోకసామాన్యము గాదు. ధర్మార్థ కామమోక్షములు పరస్పర సాపేక్షములు కావున, మన కవిత్వ ప్రయోజనము, జీవితాదర్శకము నను

సరించి బ్రహ్మానంద సోదరమైన పరనిర్వృతిగ నిర్ణయింపఁ బడినది. కావ్యము లనఁగాఁ బసిబిడ్డ లాడుకొనుటకై మన మిచ్చు రంగుల బొమ్మలుగావు; అనాగరకతా దోషము పాపుకొనుటకు మేజా బల్లలపైఁ బ్రదర్శింపఁబడు భూషణ గ్రంథములనుగా కావ్యములను మన మెప్పుడు తలంపలేదు. మన జీవితమునందు కావ్యములు మిళితమై పోయినవి. ఆర్య సాంఘిక జీవన ప్రవాహమునకు రెండు తటములుగ నున్న రామాయణ మహాభారతములే యిందులకు దృష్టాంతము. సీత, దమయంతి, సావిత్రి, ద్రౌపది మున్నగు పౌరాణిక సతీ రత్నములు భారతదేశమునం దెందఱు పతివ్రతల సృజింప లేదు? సంసారమందు నిర్భర దారిద్ర్యమును, కష్టపరంపర లను ననుభవించుచున్న సతీమణులకు దమయంతి, ద్రౌపది, చంద్రమతి మున్నగు నిల్లాండ్ర చరిత్రము లెంత యూఱట నొడగూర్చియుండలేదు. ఈ నారీవతంసము లందఱు వ్యాస, వాల్మీకి మహాకవుల భావప్రపంచమునఁబుట్టి పెంపొందిన ఆదర్శక సృష్టులేకదా! అట్టి కవులెన్నఁటికైన నిర్భాగ్యు లగుదురా? వారి రచనలు నీతి బాహ్యములగునా?

కీట్సు (Keats) అను ఆంగ్లేయకవి Beauty is truth, truth beauty అని చెప్పియున్నాఁడు. మన పూర్వికులు సత్య సౌందర్యములకు శ్రేయమునుగూడఁ జేర్చిరి. కావ్యము విశ్వశ్రేయము చేకూర్చునదిగ నుండవలయును. అనీతి దాయకమైన దేదియు లోకకల్యాణము నాపాదంపలేదు.

ఇఁక నీతియననేమి? దాని నెవరు కల్పించిరి? దాని వలనఁ బ్రయోజనమేమి? అను నీ విషయములు మనసున

కెక్కనిదే కావ్యములందు నీతి యావశ్యకమా? లేదా? యను సందేహమును మనము తీర్చుకొనలేము. నీతి యను పదమును విశాల భావముగల దానిగా నూహించి నేనిచట ప్రయోగించుచున్నాను. దేశకాల పాత్రములకు లోఁబడి నీతులు భిన్నములుగ నుండవచ్చును. ఒక సంఘమువారికి నొక దేశమువారికి ననుకూలమయిన నీతులు మఱియొకరికి విరుద్ధముగఁ దోఁపవచ్చును. కాని, యిట్టి పరస్పర విరుద్ధములైన నీతులందు నంతర్వ్యాపియగు నుద్దేశ మొక్కటియే. అది యేదన: మానవ జీవితోద్ధరణము, లోకయాత్రా సౌకర్యము. నేనిచటఁ బ్రయోగించిన నీతి అను పదమును దేశకాల పాత్రాచార వ్యవహారములకు వశవర్తియయి సంకుచితమయిన నీతినిగ నర్థము చేసికొనఁ గూడదు. అన్ని నీతులకు జన్మకారణమయిన యావశ్యకతనుగఁ దలంపవలయును. ఇది జగదేకము.

సంఘ సమష్టికిని దదంశమైన వ్యక్తికిని భిన్నభిన్న వ్యక్తులకును గల ప్రవర్తన సామరస్యము, ఆనుగుణ్యము నీతి యనఁబడును. ఈనీతి మానవుల యావశ్యకతనుబట్టియు ననుభవము ననుసరించియు, క్రమక్రమముగ రూపము దాల్చి సంఘయంత్రమును నడుపుచుండును. ఈ నీతులు సకల విధములైన మానవచర్యలకు సంబంధించియున్నవి. ఇట్లనుట వలన, విశేష సంఖ్యాకులగు ప్రజల యభిప్రాయము ఘనీభవించి నీతిగను శాసనముగను మాఱును. కాని, నీతిశాసనములకుఁ గొంత భేదముగలదు. రాజాధికార ముద్రగలది శాసనము, సంప్రదాయ సిద్ధమయి మానవుల భావములను

బరిపాలించునది నీతి. నాగరకత హెచ్చుకొలఁది అధికార ముద్రాంకితములగు శాసనములకంటె స్వయమారోపితము లగు నీతులే మనుష్యసంఘమును బాలించుచుండును. విరుద్ధ శాసనమునకు లొంగియుండుట దాస్యమైనను స్వయంకృత నియమమునకు వశవర్తియై యుండుట స్వాతంత్ర్య మనఁ బడును.

నీతులును శాసనములును (స్వయంకృతములైనను, పరకృతములైనను) సంఘమును శాసింపనియెడల వ్యక్తి స్వాతంత్ర్యము నశించి మానవజాతికిఁ బ్రళయము సంభ వించును. కావున నీతి మానవులయం దన్యోన్య ప్రవర్త నానుగుణ్యమును బోషించును.

కళలు సాంఘిక జీవితముయొక్క యుచ్ఛ్వాస నిశ్శ్వాసముల యాదర్శక లేఖనములని యిదివఱకే తెలిసి కొని యుంటిమి. కావున జీవిత మొక వంకను, కళలు వేఱొక వంకనుఁ బ్రవహింప నేరవు. సాధారణ జీవితము నందు నేవేవి నీతిబాహ్యములుగను, నేవము పుట్టించునవిగ నుండునో అట్టివి కళలయందును నింపుగొలుపవు. అట్లగుట కావ్యమునకును నీతికని సంబంధ మెట్లు తెగిపోవును?

ధర్మశాస్త్రములు వేఱు; కావ్యములు వేఱు, వాని వాని ప్రయోజనములును భిన్నములు, పాలనాదండము చేత బట్టుకొని 'సత్యంవద' 'ధర్మంచర' అని వేదములు శాసించును. కవి 'సత్యంవద' అని శాసింపక హరిశ్చంద్రుని సృజించెను. 'సత్యమేవజయతి' అను ధర్మవాక్యమునకు హరిశ్చంద్రోపాఖ్యానము లక్ష్యము. ఆకథను జదివినవారికి

హరిశ్చంద్రునిపై భక్తి గౌరవములు గలుగకపోవు. మన
మెవరిని ఉత్తములని మెచ్చుకొందుమో వారి ననుకరింప
వలయుననియో, వారివలెఁ బ్రవర్తింపవలెననియో మన
మభిలషింతుము. ఈకోరిక మనయందు సహజముగఁ బుట్టును.
సత్కావ్యములయందు ఇట్టి యున్నతాశయములను, ఆసలను
బ్రేరించు శక్తిగలదు. *బలాత్కార నీతిబోధనమునకు
కావ్యము లెన్నఁడును బూనుకొనఁగూడదు. అట్టివి కావ్య
ములుగాక మనుధర్మశాస్త్రములవంటి స్మృతులుగ
మాఱును. కళలయందలి నీతి యంతర్లీనమై యలక్షితముగ
మన హృదయముఁ బ్రవేశించును. దాని పదచిహ్నము
లదృశ్యములు. ఇట్లు రచించుట కళానైపుణ్యము.

కావ్య మర్థింపవలసినది రససౌందర్యము లేకదా! అంతర్లీనమైన నీతియైనను వానికెటుల నుపకరించును? అను సంశయము కొందఱకుఁ గలుగవచ్చును. నీతిస్పర్శ లేనిదే సౌందర్యము పరిపూర్ణముగాదని నాయుద్దేశము. ఈ దృష్టితో మనము విమర్శింపఁబూనినయెడల ఏ దేశము యొక్క యుత్తమశిల్పమునందుఁగాని యనీతిపరత్వము గోచరింపదు. ఒకచిత్రకారుఁడు రమణీయవతియగు కాంతను విగతవస్త్రనుగఁ జిత్రించి మనకుఁజూపినయెడల ఆ సౌందర్యమునంతయు మ్రింగివేయఁగల యసహ్యముపుట్టి మొగము చిట్లించుకొందుము. ఎందువలన? ఆ చిత్రపటమునకును జీవితము

***The office of poetry is not normal instruction, but moral emulation; not doctrine, but inspiration**

G. H. Lewes,
'The Inner Life of Art'

నందు మన కలవాటుపడియున్న యౌచిత్యమునకును వైరుధ్యము సంభవించినది. అందలి రమ్యత సర్వజనోపభోగ్యమగు నంత లేదు. సభ్యముగ ఇట్టి చిత్రములు ఆహ్లాదమును గలిగించి మనసు నుద్ధరించుటకు మాఱు, ఇంద్రియచాపల్యమును, అసభ్యములగు మనోవికారములను బ్రేరేపించుచుండును. అట్లు చేయుట యుత్తమకళయొక్క ధర్మము కాదు.

అట్లయినయెడల మానవచర్యలకు సంబంధింపని వనములు, కొండలు, మేఘములు, ఉషస్సులు, సూర్యాస్తమయములు మున్నగు దృశ్యముల ప్రతిలేఖనములు కాంచువారలకు ఆనందము గలగించునుగదా! అట్టి చిత్రమునందుం గూడ నీతి అంతర్లీనమై యున్నదా? అని కొందఱడుగవచ్చును. అట్టి చిత్రములు అనీతిస్ఫోరకములు గాకుండుటచేతనే వానియందలి రామణీయకమును బ్రతిబంధకము లేక మన మనుభవింతుము. నీతి సౌందర్యమునకు హేతువుగాదు; పరిపూర్ణతకు ఆవశ్యకమైన యొక ఔచిత్యము.

కావ్యమునందు శిల్పనైపుణ్యము హెచ్చుకొలంది యందలి కథాభాగమునకుం జదువరుల హృదయము నాకర్షించు శక్తియు హెచ్చుచుండును. గుణ మెప్పుడు వస్తువునాశ్రయించియుండును. గావున నితరకళలయందు వలెనే కావ్యమునందును వస్తుగుణములు రెంటికిని వానివానికిం దగిన ప్రాధాన్యము గలదు.

మానవుని ప్రతికోరికకును రెండుదిక్కులు గలవు. మొదటిది వాంఛాపరిపూర్తి; రెండవది తజ్జనితమైన యుపయుక్తి. ఒక యుదాహరణము: మిఠాయినిం జూచినపుడు తినం

గోరిక పుట్టును. ఇది జిహ్వాచాపల్యము. మనదృష్టి కోరిక తీర్చుకొనుట యందే లగ్నమయి యుండునుగాని, దాని యుపయోగమును గుఱించిన తలంపె సాధారణముగఁ గలుగదు. కాని, మనము తలంచినను, తలంపకపోయినను మిఠాయి తినుటవలన రెండులాభములు చేకూఱినవి. ఒకటి: కోరిక తీరుటవలన గలుగు తృప్తి; రెండు: దేహాపుష్టి. ఇచ్చట మిఠాయిలోని మాధుర్యము రుచిచూచుటవలనఁ గోరిక తీరినది. ఆమాధుర్యము, ఆహారవస్తువు నాశ్రయించి యుండుటవలన దేహమునకు బలము కలిగించినది. కాని, మాధుర్యము మాత్రము కోరిక తీర్చునదిగా నుండి తదాశ్రయవస్తువు అనారోగ్యకరమై యుండినయెడల దాని ప్రతిఫలమును మనము తప్పక యనుభవింతుము. ఈ సాదృశ్యమును కావ్యములో రససౌందర్యములకును, కథాభాగమునకును వాని ననుభవించు మానవసమాజమునకును నన్వయించి చూడుఁడు; అంత్యఫలితము మీరే యూహింపఁగలరు;

మానవస్వభావ నిర్మాణమునందుఁ బరిస్థితులు చాల ముఖ్యములని మన తత్త్వశాస్త్రజ్ఞులెల్లరు నొప్పుకొన్నవిషయమే! కావ్యములం దట్టి పరిస్థితులు గలవు. ఇంద్రియ గోచరములగు విషయములు మనల నెట్లు లోఁగొనునో, కావ్యాంతర్గత విషయవర్ణనముకూడ నట్లే మనల వశవర్తులఁ జేసికొనును. కావున కావ్యములతోఁ గవికిఁ గల సంబంధము కన్నను దానిని జదివి యానందించు లోకుల కెక్కుడుసంబంధము గలదు.

మతమును శిల్పమును ఒక పూవులోఁబుట్టిన రెండు రేకులని చెప్పవచ్చును. వాని రెంటికి మిక్కిలి సమీప బాంధవ్యము గలదు. ఒక దానినొకటి యపేక్షించి యవియన్యోన్య సహాకారము వలన నభివృద్ధి చెందినవి.

వైదిక ఋషుల భావమును, కవిత్వ కల్పనాశక్తియు సమ్మిళితమయి, యందుండి యపూర్వ సృష్టులు బయలుదేరినవి. పౌరాణిక ప్రపంచమంతయు నిట్టి మతకవిత్వ సాంకర్యముయొక్క యద్భుత సృష్టియేకదా! ఇట్టి కల్పనలు లేకున్న మానవజీవిత మెంత సంకుచితముగ నుండియుండెడిదో!

మతమును, శిల్పమును ఆనంద సాక్షాత్కారమునకై పాటుపడుచున్నవి. గంతవ్య మొకటి; మార్గములు భిన్నములు.

'ఆనందా దేవ ఖల్విమాని భూతాని జాయంతి,
ఆనందా దేవ జాతాని జీవంతి.
ఆనందం ప్రయా న్త్యభి సంవిశంతి.'

ఈ భూతసృష్టియంతయు నానందమునుండి యుత్పన్నమగుచున్నది. ఆనందమున వర్ధిల్లుచున్నది. ఆనందము దిక్కునకే ప్రవహించుచున్నది. తుదకాయానందమును బ్రవేశించుచున్నది. శిల్పిసృష్టియు నిట్టిదే. భక్తుఁడును శిల్పియు నేది 'సత్యం శివం సుందర'మో దానిని దర్శించుచున్నారు. ఈ యంతస్తునందు నిద్దఱికిఁగల భేదము నశించినది. కవి భక్తుఁడు, భక్తుఁడు కవి; శిల్పము మతము నొక్కటియే యైనవి.

మొదటి యనాగరక దశయందు మానవుఁడు పశుప్రాయుఁడై కామ్యసౌఖ్యములతో సంతృప్తిపడియుండును

అంతకు మించిన సంతోషము నతఁ డెఱుఁగడు. రెండవ దశ యందుఁ బ్రాపంచిక జ్ఞానము కొంత యుదయించి, మనో వికృతులు శిక్షితములయి శాస్త్రములు, శిల్పములు మున్నగు వాని మూలమున నానందముఁ బొందును. మూఁడవ దశ యందు రానురాను ఆతనిజ్ఞానము విశేషముగ నభివృద్ధినొంది పూర్వమున కన్న శాశ్వతమైన యానందము నన్వేషింప మొదలిడును. అదియే యమృతానందము.

'ఏకం రూపం బహుధా యః కరోతి......
తమ్ ఆత్మస్థం యేఽను పశ్యంతి ధీరా,
తేషాం సుఖం శాశ్వతం నేత రేషామ్.

ఒక రూపమును బహురూపములుగ నెవ్వఁడొనరించు చున్నాఁడో, ఆత్మస్థుఁడైన ఆపరమాత్మను ఏ ధీరులు దర్శించుచున్నారో వారు శాశ్వత సుఖమును బొందుదురు. అన్యులు పొందరు. *శిల్పము తన యాదర్శకమును క్రమక్రమముగ మార్చుకొని, యెట్టకేల కీ శాశ్వత సుఖమును మానవుల కందింపఁగల యంతటి యున్నతపదవి నారోహించినం గాని, కృతకృత్యము కానేరదు.

సంపూర్ణం

*Fine art is not real art till it is in this sense free, and only achieves its highest task, when it has taken its place in the same sphere with religion and philosophy.

—*Hegel*

'Philosophy of Fine Art'

మర్మ కవిత్వము

పాశ్చాత్యదేశములందు శాస్త్రవిజ్ఞానము పెచ్చు పెరిఁగి లలితకళలస్థానమును సైతము నాక్రమింపఁజొచ్చెను. కావ్యములందు మనోమోహనమయిన దివ్యానుభూతికి మాఱు మేధోవ్యాపారము అధికారస్థాపనము గావించెను. ఆతరుణమున ఫ్రాంసుదేశమునందు నిందుకుఁ బ్రతీకారముగ నొక కవితోద్యమము బయలుదేఱెను. ఆయుద్యమకారకులు సమకాలీన కవిత్వముతోఁ దృప్తిపడియుండక, యింద్రియముల నంతర్ముఖములఁ గావించి, యగాధమును విశాలమునైన సూక్ష్మ ప్రపంచమును జొచ్చి, యందలి యనిర్వచనీయమయిన సత్యమును సౌందర్యమును గానముచేసిరి. ఈ తెగకు సంబంధించిన కవులను పాశ్చాత్యులు మర్మ (Mystic) కవు లనియు, సాంకేతిక (Symbolist) కవు లనియు నామకరణము గావించిరి. బాడిలేర్ అను ఫ్రెంచి కవి ఇటువంటి కవిత్వమునకు మొదటమార్గము సిద్ధపఱచెను. అనంతరము వెర్లైన్, మ్యాలర్మీ అనుకవులు సుప్రసిద్ధులైరి. ఈ మర్మకవిత్వము యూరపుఖండమునందుఁ దన ప్రకృతి కనుకూలించిన దేశములందెల్ల వేరు నాఁటుకొనెను. జర్మనీదేశమందు డెమ్మెల్ అను యువక కవియు ఆతని యనుచరులును, అయిర్లాండునందు ఈట్సు, యే. యి.

ఆర్థరె సిమ్మన్సు. *జేమ్సు హెచ్. కజిన్సు మున్నగు కవులును ఈ మర్మకవిత్వసంప్రదాయమునకు సంబంధించినవారు.

మర్మకవిత్వము సామాన్యముగ గీతి (Lyric) రూపమున నుండును. ఆ గీతములందు గానమునకును భావమునకును సమానగౌరవము గలదు; ఒకవేళ గానమే ప్రాధాన్యము వహించినదనిగూడఁ జెప్పుటకు వీలున్నది. కావ్యరూపములలో గీతమే యుత్తమోత్తమ మని కొందఱి యాధునికుల యభిప్రాయము. మర్మకవులు తక్కువపదములలో నెక్కువగానమును, సూచనలను గర్భీకరింతురు. పాల్ వెర్లెన్ ఈ తెగ కవిత్వమునకు లక్షణముగఁ గ్రింది గీతముల రచించెను.

Music, Music before all things
The eccentric still prefer,
Vague in air, and nothing weighty,
Soluble, yet do not err,
Choosing words, still do it lightly,
Do it too with some contempt.

* * *

Music always, now and ever
Be they verse the thing that flies
From a soul that's gone escaping,
Gone to other loves and skies.

ఈ కవిత్వమునకు మర్మకవిత్వ మని యేల పేరు రావలయును? ఈ కావ్యములందు సామాన్యప్రజల కగమ్య

---

* వీరిప్పుడు మదనపల్లి థియొసాఫికల్ జాతీయకళాశాల ప్రిన్స్పాల్గా నున్నారు.

గోచరములైన విషయము లుండును. సాధారణముగ నీ తరగతి గీతముల వస్తువు ఆధ్యాత్మికవిషయముగ నుండును. కవియొక్క యాంతరంగికానుభవమును విశ్వజనీనతయు గీతములయం దంకితమై యుండును. కవులయం దాధ్యాత్మిక స్వభావము నిర్నిద్రము. కావున వారు బహిరింద్రియ నిర్ణీతములైన సీమలనుదాటి సూక్ష్మప్రకృతినిఁ బ్రవేశించి యందుఁ గలిగిన యనుభూతిని ధ్వనిమూలకముగనో, సూచనగనో, సాంకేతికముగనో వెలిపుత్తురు. ఈ మర్మకవిత్వము కేవలము ఆత్మానుభవజనితముగను, ఆత్మోపభోగమునై యున్నది. జీవనముయొక్క యవ్వలిగట్టు ఈ గీతములందుఁ జూడకట్టుచుండును. యూరపుదేశపు సామాన్యజనులకు ఆధ్యాత్మికగంధము శూన్యము. కావున వారి కీకవిత్వము మర్మముగఁ దోఁచినది. బాడిలేర్ కవిత్వము ఆధునిక పాశ్చాత్యమర్మకవిత్వమునకు మార్గదర్శకమైనదని యిదివఱకుఁ దెలిపియుంటిని ఆతని రచనలోఁ జాలప్రసిద్ధమైన ఈక్రింది పద్యములలోని యగాధాశయములను గమనింపుడు:

Earth is a temple, from whose pillared mazes
Murmurs confused of living utterences rise;
Therein man thro' a forest of symbols paces,
That contemplate him with familiar eyes.
As prolonged echos, wandering on and on,
At last in one far tenebrous depth unite,
Impalpable as darkness, and as light,
Scents, sounds, and colours meet in unison.

ఈ తెగ కవులలో మఱల ఫ్రెంచివారికిని ఐరిషువా

కినిఁ గొంత భేదము గలదు. అయ్యది దేశకాలపరిస్థితులకు సంబంధించినది. ఐరిషుకవుల కుండినంత ప్రకృతిసాంగత్యము ప్రెంచికవులకు లేదు. అందువలన వారి కావ్యములందుఁ గొంత కృత్రిమత పొడకట్టుచున్నది. మనకు సమకాలీనుఁడైన ప్రసిద్ధ ఐరిషుకవి, *ఈట్సు రచియించిన ఈ పేరిన తేనెగడ్డను చవిచూడుఁడు:

In all poor foolish things that live a day
Eternal beauty wandering on her way,

ఈకవి తన యాత్మానుభూతిని పై రెండు పాదములలో నిమిడ్చియున్నాఁడు; అనంతసౌందర్యమును ప్రతివస్తువునందు సందర్శించినాఁడు.

'..............................సత్క వీశ,
భావలోచన మెరవుగాఁ బడయకున్నఁ
గాంచనేర వంతర్లీన కాంతిసరణి.'

—కృషీవలుఁడు

సత్యము! సత్కవీశుని భావలోచనము గాక, అంతర్లీన కాంతిని సౌందర్యమును తక్కిన కన్నులు చూడఁగలుగునా?

మర్మకవిత్వమునం దొకవిధమున యస్పష్టతయు ననూహ్యమైన భావనేంద్రజాలమును గోచరించుచున్నది. ఆ గీతములందు భావములు అంటీయంటక—చిక్కీ—చిక్కక—దక్కీ—దక్కక—మనతో దాఁగుడుమూత లాడుచుండును. 'ఆకావ్యము నుండి నీవేమి గ్రహించితివి?' అని యితరులు ప్రశ్నించినపుడు

*వీరికి నోబెల్ వాఙ్మయ బహుమానము వచ్చినది.

'ఏమో నేను జెప్పజాలనుగాని, యొక విధమైన యవ్యక్త మాధుర్యమును, ఆనందమును అనుభవించితిని' అని చెప్పుటకు మాత్రము సాధ్యమగును. కళయొక్క పరమావధియు నిట్టి యనిర్వాచనీయమైన రసానుభూతిని గలిగించుటయే యని యన్ని సంప్రదాయములకు సంబంధించిన రసజ్ఞులును, శిల్పులును నిర్ణయించిన విషయమే. 'When one art can fully be explained by another then, it is a failure' అని రవీంద్రుఁడు కళయొక్క యనిర్వాచనీయతను బోధించెను. 'It (art) is to be felt, not to be explained.' శిల్పము అనుభవింపఁదగినదిగాని, వివరింపవలసినదిగాదని డాక్టరు అవనీంద్రనాథ టాగూరు నుడివియున్నాఁడు. ఇట్లనుటవలన ఉత్తమశిల్పమునందు వివరించి చెప్పనలవిగాని యొకవిధమైన రసస్ఫురణము గలదని మనము తెలిసికొనవచ్చును.

అడయారునందు జేమ్సు హెచ్. కజిన్సుగారి యింట నేను మూఁడు చిత్రపటములను జూచితిని. ఒకటి నందలాలు వసువు రచియించిన 'శివనాట్యము'. మఱిరెండు కజిన్సుగారు జపానునుండి తెచ్చినవి. వానిలో నొకదానియందు జపాను స్త్రీలు మంచుకాలమునఁ గాగితపు గొడుగులు వేసికొని సంచరించుట చిత్రింపబడియున్నది. మఱియొకదానియందు కేవలము సన్ననిగీతలతో—నవియు నేడెనిమిదింటితో, నొక జపాను దేశపు స్త్రీముఖము అత్యద్భుతముగ లిఖింపఁబడియున్నది. ఈ మూఁడుచిత్రములు నాహృదయమును హరించినవి. మర్మకవిత్వము (Mystic poetry) యొక్క రహస్యము

ఆ చిత్రపటముల మూలమున నేరుగ నామనమున సంకిత మైనది. అంతవఱకు ఆకవిత్వములోని యస్పష్టత (Vagueness) యొక్క గుణమును నేను పూర్ణముగ గ్రహింప లేకుంటిని. శివ నాట్యమును, మంచుకాలమున జపానుస్త్రీల సంచారమును చిత్రింపఁబడిన పటమును సాధారణమైన బొమ్మలపటముల వలె పరిస్ఫుటముగ రంగులు పూయఁబడినవి కావు. వాని లోని యాకృతులు మనకు అస్పష్టముగఁ బొడకట్టును. ఆ యస్పష్టత శిల్పకళానైపుణ్యముయొక్క పరసీమయని తలఁప వలయునేగాని, అల్పకౌశలముగల చిత్రకారుల వచ్చీరాని బీరకాయపీచుఁదనముగాదు. అట్లు చిత్రించుటకు శిల్పి చాల కళాభిరుచి గలవాఁడుగను, చేయితిరిగినవాఁడుగను, వర్ణ సమ్మేళనాదివిషయములందుఁ బరిపూర్ణజ్ఞానము గలవాఁడుగను నుండవలయును. ఆ పటములయందలి రూపములనుఁ దిలకించి నపుడు మన మనస్సు గాలిలోఁ దేలిపోవునటులఁ దేలికమై చిత్రసారూప్యమును బొందినట్లుండును. ఆ రూపము ఏదో యొక యగాధ రహస్య వాతావరణమున, వెన్నెలరాత్రి యందుఁ దేలియాడు మేఘశకలములవలెఁ బొడకట్టును. చూడఁజూడ నవి గాలిలోఁ గరగిపోవుచున్నవా యేమి? యను సంశయముగూడ పొడమును. ఇట్టి యస్పష్టతామాధుర్యమే నాకు మర్మకవిత్వమునఁ దోఁచుచున్నది. రేఖలతో లిఖింపఁ బడిన పటమును గాంచినపుడు 'ఎన్ని కొద్ది గీరలతో నెంత సుందరమైన యాకృతిని నేర్పరియైన చిత్రకారుఁడు సృజింపఁ

గలదు? అను నాశ్చర్యము దోఁపకమానదు. జపానుకవుల *'హొక్కు' కవిత్వమునందువలె ఈ చిత్రపటమునందును అనవసర కళాప్రదర్శనము నాకగపడలేదు. అయినను అందు సౌందర్యమును నిరాడంబరతయుఁ దొలకాడుచున్నవి. అట్టి యస్పష్టతయు సంక్షిప్తతయుఁ కేవలము అనల్పకళానైపుణ్య సాధ్యములని నేనుగ్రహించితిని.

మర్మకవిత్వమునందలి యస్పష్టతనుగుఱించిన కొందఱి యభిప్రాయముల నిట సంకలించితిని:

1. And the very perfection of such poetry often appears to depend, in part, on a certain suppression or vagueness of mere subjects, so that the meaning reaches us through ways not distinctly traceable by the understanding —*Yone Noguchi.*

---

*జపాను కవిత్వ పద్య భేదములందు 'హొక్కు' అనునది చాల చిన్న పద్యము. అది పదునేడు నేకాచ్చ శబ్దముల పరిమితిగలది. ఈ పద్యముల లోని విషయము జపాను దేశస్థులకుఁదప్ప, ఇతరులకు సాధారణముగ బోధ పడనంతటి సంక్షిప్తముగ నుండును. అందువలననే జపానువాఙ్మయ విమర్శ కులు 'కవి యెట్టివాఁడో పాఠకుఁడును నట్టివాఁడుగ నుండవలయును' అని చెప్పుట. 'హొక్కు' పద్యముల రచించుట చాల కష్టమనియు, బాషో అను సుప్రసిద్ధ 'హొక్కు' కవి తన జీవితమునందు మూఁడు నూర్ల పద్యములను మాత్రమె రచింపఁగలిగెననియు, యోన్‌నొగూచి తెలిపియున్నాఁడు. విషయముఁ దెలుపుట కొక ఉదాహరణము ననువదించితిని:

కాలిపోయెను శాల; రాలెడుపూవు
లెంత నిశ్చలశాంతి నెనగెడు నిపుడు!

తనయిల్లు కాలిపోవు సమయమున రాలెడుపూవుల నిశ్చలశాంతిని ఉమనింపఁగల కవి మనోవస్థయే యీ పద్యమునందలి విశేషము.

2. Vagueness is often a virtue; a god lives in a cloud, truth cannot be put on one's finger tip —*Walter pater*

3 I think there should be nothing but allusions. The contemplation of objects, the flying image of reveries evoked by them are sunk.........To name an object is to take the three quarters from the enjoyment of the poem, which consists in the happiness of guessing little by little, to suggest that is the dream. —*Jues Huret*,

ఈ లక్షణములు ముఖ్యముగ గీతకవిత్వమున కన్వ యించును.

మర్మకవిత్వమును టాల్‌స్టాయి 'శిల్పమన నేమి?' అను తన గ్రంథమందుఁ జాలతీవ్రముగ ఖండించియున్నాఁడు. అందు కా కవిత్వమునఁ గల యగమ్యగోచరత్వము కార ణము. అయినను టాల్‌స్టాయి తర్కమంత సహేతుకముగఁ దోఁపదు. ఆయన ప్రజాపక్షవాది. కావున సామాన్యజనుల కర్థముగాని శిల్పము వ్యర్థమనియు నింద్యమనియు ఆయన యభిప్రాయము. ఈ యపూర్వమైన మానదండమును గల్పించి టాల్‌స్టాయి రషియాదేశమునందలి వేగాక యూర ప్పుఖండమునందలి యన్ని దేశముల లలితకళలను దానితోఁ గొలిచి, సరిపడనివానిని తన విపరీతపు విమర్శనమునకు గుఱి గావించెను. ఒక పెద్దసౌధమునుగాని, క్రైస్తవుల ప్రార్థనాలయ మునుగాని దిలకించినప్పుడు వానిసౌందర్యముఁ దోఁచుటకుఁ బూర్వమే 'ఈ కట్టడము లెందరి పాటకపుజనులనిట్టూర్పుల తోడను, గన్నీటితోడను, కడుపుమంటలతోడను రూపొందిన వో' యను కారుణ్యమూ దయాశాలి మెత్తనిమనసును

తడిసేయును. కావున టాల్‌స్టాయి నిర్వచనములందుఁ గళా
న్యాయనిర్ణయమునకంటె గరుణారసమె యెక్కుడుగా
నుండును, ఒక కళయొక్క శ్రేష్ఠత్వము దాని నర్థముచేసి
కొనఁగల ప్రజలసంఖ్య ననుసరించియుండుననియు, నట్లుగాక
యెవరో కొందఱిభాగ్యవంతులకును, కేవలము శిల్పాభిరుచి
గలవారికిని మాత్రమే పనికివచ్చు కళ యొకకళ గాదనియు
ఆయన సిద్ధాంతీకరించెను. ఇది చాల యన్యాయ్యమును,
శిల్పతత్త్వమునకు పరమవిరుద్ధమైన తీర్మానముగను నున్నది.

మన మొక కావ్యమును జదువునపుడు హృదయము
రసాతిరేకమైనదా? లేదా? యనుదాని ననుసరించియు, ఐన
యెడల దానితీవ్రతనుబట్టియు ఆ కావ్యముయొక్క గుణా
గుణములను నిర్ణయింతుము, ఒకప్పుడు కావ్యము రమ్య
మైన దయ్యుఁ జదువరి హృదయము సంస్కారపక్వము
గానియెడల రసోత్పాదనము గాకపోవచ్చును. ఈ రెండు
సందర్భములందును కృతికిని చదువరి స్వభావమునకుం గల
సంబంధము ముఖ్యము. కాని, 'ఇతరు లెందఱీకావ్యమును
జదివి యానందించిరి?' అను ప్రశ్నపై అతని యనుభూతి
ఆధారపడి యుండవలసిన యక్కఱ లేదు. చిత్రముల
విషయముగూడ నిట్లే యూహింపవలయును.

టాల్‌స్టాయి సిద్ధాంత మంగీకరింపఁబడినయెడల లోక
మునందలి చాల యుత్తమోత్తములగు చిత్రములు, కావ్య
ములు, శిల్పములు, కట్టడములు ధ్వంసముకావలసి యుండును.
ఒకరచనయొక్క రసవత్తతయు, కళానైపుణ్యమును, సూక్ష్మ

బుద్ధిగ్రాహ్యము లగు గుణ విషయములును హెచ్చుకొలఁది వానిని గ్రహించి తదనురూపానందమును బొందు రసికుల సంఖ్యయు తగ్గుచుండును. కావుననే కాళిదాసుని అభిజ్ఞాన శాకుంతలము జంగమ కథలవలె సామాన్యప్రజానురంజకము కాకుండుట. రసజ్ఞత కుశాగ్రముగ నుండనిదే యుత్తమమైన కళాసృష్టిని మెచ్చుకొనుటకు సాధ్యముకాదు. అట్లు మెచ్చుకొనుటకు శిక్షితమైన అభిరుచియు అవసరము. అట్టి రసజ్ఞత ప్రజాసామాన్యమునందు నభివృద్ధి చెందియుండదు. వారికిఁ దగిన శిల్పము లుండనేయున్నవి. ఇంకను గావలసిన యెడల అట్టివి వేనవేలుగఁ గల్పించి క్రమక్రమముగఁ బ్రజల యభిరుచిని శిక్షించి యుత్తమశిల్పముల మెచ్చుకొనునట్లొనరింపవచ్చును గాని, యాదర్శమును మాత్రము జనబాహుళ్యము నకుఁ దెలియఁగల క్రిందిమెట్టులోనికి దింపరాదు. మేఘసందేశములోని రామణీయకము ఒక పల్లెటూరికాఁపునకు గోచరింపని కారణముచేత దానిని సరస్వతిదేవి యంకపీఠమునుండి క్రిందికిఁ ద్రోయవలసినదేనా?

కాళిదాస భవభూతులు సమకాలీనప్రజల యభిరుచి ననుసరించి వారి నాటకములను రచియింపలేదు. అట్లే వారు రచియించి యుండినయెడల అవి యెల్లకాలమునకు నాదర్శప్రాయములుగ నుండనోపవు, ప్రజల యభిరుచిమాఱిన వెనుక వాని మొగము చూచువారుండరు, కాని శకుంతలనాటకము కాళిదాసుని యభిరుచి ననుసరించి సృష్టింపఁబడిన దగుటచేతనే చిరంజీవమైనది. ఈ విషయము కవులకుఁ దెలియనిది గాదు. తన నాటకములోని సారమును భవభూతిమహాకవి

తెలిసికొని, సమకాలీనుల యజ్ఞాన జనితమైన నిరాదరణము నిట్లు తూలనాడెను.

> యేనామ కేచి దిహ నః ప్రథయం త్యవజ్ఞాం
> జానంతి తే కిమపి తా న్ప్రతినైష యత్నః
> ఉత్పత్స్యతేఽ స్తిమమ కోఽపి సమానధర్మా
> కాలో హ్యయం నిరవధి ర్విపులాచ పృథ్వీ

ఈ విశాల ప్రపంచమునందు ననంతకాలమునఁ దన తోడి సమాన ధర్మముగలవాఁ డెవ్వడైన జన్మించి, తన నాటకమును చదివి యానందింపఁడా! యను తలంపు భవభూతిని నూరడించినది. ఎంతసహనము! ఎంత స్వార్థ త్యాగము! నేఁటి కవులు అప్రయాస లభ్య జనరంజకత్వ మునకయి తమ శక్తిని వ్యర్థపుచ్చుచున్నారు.

మాలర్మి ప్రభృతుల కావ్యములలోని సూచనలను, అస్పష్టతను దోషములుగఁ బరిగణించి టాల్‌స్టాయి ఖండించుటయందుఁ దప్పులేదు. ఏలయనఁగా: ఆయనకుఁ దోఁచినట్లును, ఆయన భావించినట్లును దాపఱికము లేక విమర్శించెను. ఇది చాల గొప్పతనము. కాని, సామాన్య ప్రజల మనస్తత్త్వమును బ్రమాణముగఁ గొని, ఆ కావ్యములలోని విషయములు వారి కగ్రాహ్యములు గాన దోషము లని తీర్మానించుట సాహసము.

మన దేశమునందు 'మర్మకవిత్వ' మనాదియైనది. దానిని మర్మకవిత్వమని పేరొ్కనక ఆధ్యాత్మిక కవిత్వమని వ్యవహరించెదను. ఏలయన, ఆలాటి రచనలను మర్మకవిత్వముగ మన మెన్నడును భావించినది లేదు. హైందవజనసా

మాహాత్మ్యమునకు అవి మర్మములు గావు. పంచేంద్రియగోచర మగు స్థూలప్రపంచమునకన్న భిన్న మగు మఱియొక యంతః ప్రకృతి గలదనియు, నశించునది పాంచభౌతిక శరీర మేగాని యాత్మ గాదనియు, జన్మాంతరము గలదనియు, నేమియుం దెలియని కూలివాని మొదలు సకలశాస్త్ర పారంగతుఁ డగు పండితుని వఱకు హిందూదేశమున నందఱును విశ్వసింతురు. ప్రతిదినము మనయింటికి బిచ్చమునకు వచ్చు దాసరిగూడ—

"మనది తనది యనుచు నరుడా, మాయలో బడబోకురా
మరణ మొందిన మనది తనది మంటలో యే పౌనురా!
బంకమట్టి యిల్లురా యిది బుగ్గిబుగ్గీ యౌనురా
ఆత్మ యొక్కటె బ్రహ్మరూప మ్మంతటా తానుండురా."

అని పాడుచుండును. కావున మనవారు ఆధ్యాత్మిక గీతములను, కీర్తనలను మర్మకవిత్వమని పేర్కొన లేదు.

మొట్టమొదట ఆర్యావర్తమున వేదములయం దీయాధ్యాత్మిక కవిత్వము జన్మించి, యుపనిషత్తులయందుఁ బరిపూర్ణత నొందినది. అనుక్షణము విస్తరించుచుండిన వైదికకవి యాత్మ బహిఃప్రపంచమునఁ దనివినొందక, అంతర్ముఖేంద్రియమై యగాధమైన యమృతానందమున నోలలాడి ఆ యనుభూతిని వెలికి నిట్టూర్చినది.

"శృణ్వంతు విశ్వే అమృతస్య పుత్రా, ఆయేధామాని దివ్యాని తస్థుః
వేదాహ మేతం పురుషం మహాన్త మాదిత్యవర్ణం తమసః పరస్తాత్."

అని వైదికఋషి ఘోషించినాడు. ఇంతటి మహానందము వెలికుఱుకక కవిహృదయమున నెట్లుదాఁగియుండగలదు? పిపీలికాది బ్రహ్మపర్యంతముగల ప్రాణికోటులను 'అమృత

సంతానములారా' యని సంబోధించినాఁడు. ఎంత ప్రేమ! ఎంతయానందము! ఎంతసత్యము! తాను దర్శించిన తేజస్సు అప్రాకృతము. కావున నది వర్ణింపనలవిగానిది. సామ్యముచే మాత్రము నూహింపసాధ్యమైనది. అదియు విలోమమార్గమున—

"నతత్ర సూర్యోభాతి న చంద్రతారకం
నేమా విద్యుతో భాంతి కుతోఽయ మగ్నిః
తమేవ భాంత మనుభాతి సర్వం తస్య భాసా
సర్వ మిదం విభాతి."

ఆత్మానుభవజన్యమైన యిట్టి యపూర్వసత్యములను వైదిక ఋషులు వర్ణించిరి. వారు ఆధ్యాత్మిక కవిగురువులు, ప్రథములు.

వివిధమత సంప్రదాయములయందును ఇట్టి కవిత్వమంకురించి శాఖోపశాఖలుగ నభివృద్ధినొందినది. వైష్ణవ కవుల కీర్తనలయందు రసమాధుర్యములు పొంగిపారలినవి. ఇందుకుఁ గొన్ని కారణములు గలవు. వైష్ణవులకు భక్తి ప్రధానము. ప్రేమ యాలంబము. ఆత్మకును బరమాత్మకును గల సంబంధమును రాధాకృష్ణుల ప్రేమలీలలుగ సంకేతించి వారు సంకీర్తనము చేసిరి.

విరహిణియైన నాయిక యెన్ని యవస్థలకుఁ బాల్పడునో, తన్ను రాధనుగను సర్వేశ్వరుని కృష్ణునిగను సంకేతించుకొన్న భక్తుఁడును అన్ని యవస్థల ననుభవించును. నాయకుని నెడఁబాసిన నాయిక పునః సమాగముకొఱ కెట్లు త్వరపడుచుండునో, అటులనే పరమాత్మ విశ్లేషమును సహిం

పఁజాలని భక్తుఁడును వేదనఁ బొందుచుండును. ఇట్టి పార వశ్యము సాధారణముగ నందఱిభక్తులకుఁ గలుగునది గాదు. ఇది భవముయొక్క పరపారము నంటు కడపటియవస్థ. పన్నిద్దరాళ్వారులలో నమ్మాళ్వారులకే యీదశ కలిగెను. చైతన్యుఁడును నట్టియవస్థ ననుభవించెను. రామకృష్ణ పరమ హంసయు నట్టి విశ్లేషవేదన నొందెనని వివేకానందస్వామి నుడివియున్నారు. నమ్మాళ్వారులు రచించిన "తిరువాయి మొజ్ఞి" అంతయుఁ గొంచె మించుమించుగ విరహిణీగీతము లని చెప్పవచ్చును. మీరాబాయియు, మహారాష్ట్ర దేశపు భక్తులును అట్టి కీర్తనలను రచియించిరి.

తెలుఁగు దేశమున మఱియొక విధమైన యాధ్యాత్మిక కవిత్వము ప్రచారములోనికి వచ్చినది. పోతులూరి వీరబ్రహ్మము, అతని శిష్యుఁడగు సిద్దయ్య, వేమన్న మొదలగు తత్త్వజ్ఞాను లీ సంప్రదాయమున ముఖ్యులు. బ్రహ్మంగారి కాలజ్ఞాన కీర్తనలను వేదాంత కీర్తనలను తరుణాయి దాసరులు పాడుచుండగ మనము చాలమాఱులు వినియుందుము. భక్తిగీతములందువలె వానియం దంతరసము చిప్పిల్లుటకు వీలు లేదు. అయినను అవి నీరసములుగ నుండవు. ఇచ్చట నొకటి రెండు ఉదాహరణములు అప్రస్తుతములు గావని తలంచెదను.

1. తెలుసుకొండి యన్నలార, తేట తెరువు బట్టాబయలు
   నట్టనడుమా పుట్టాలో గురునాథూ డున్నాడు.
   మూడుచుట్లా కోటలోన ముప్పయిముగ్గూ రున్నారన్నా
   ధ్యానాము కోటాకు ఎక్కూ పెడితే తలుపూలు దీసేమన్నారు.

ఇంపుకాదూ మెప్పూగాదు ఎన్నరాని యీ బ్రహ్మపదవి
చప్పరించి చూడండన్న సారా మున్నాది.

2. తనకు బొందెకు ఎపుడొ తగులాట మాయెను
వీరెవ్వరో గురుడ! వా రెవ్వరో!
పుట్టి బూరగమాను పూసి లెస్సా కాసి
గట్టిగ కొమ్మలు కదిలాడగా
సుడిగాలి దెబ్బకు తొడిమజాఱిన పండు
తొడిమాతో యేమైన సుడివిపోయిందా;

తనకు బొందెకు..............................
వీ రెవ్వరో గురుడ..............................

3. చిత్తాస్వాతులు రెండు సంధింప ముత్తెపు
చిప్పాలో పడ్డాది చిను కొక్కటి,
ముత్యమై నీళ్ళల్లొ మునిగీ పొయ్యేనాఁడు
చిప్పతో యేమైన చెప్పిపోయిందా?

తనకు బొందెకు...!........
వీ రెవ్వరో గురుడ

వేమనపద్యములలోని భావములను గ్రహించి కొందరు, వానినిఁ గీర్తనలలో నిమిడ్చిరి. అట్టికీర్తనలె యిప్పుడు తెలుఁగుదేశమునందుఁ జాలవఱకు వ్యాపించియున్నవి.

సమకాలీనమైన ఆధ్యాత్మిక కవిత్వమునుగుఱించి కొంత విచారించి యీ వ్యాసమును ముగించెదను. బెంగాలు దేశమున రవీంద్రనాథ టాగూరును, ఆయన కవిత్వమార్గమును మెచ్చుకొని దాని నవలంబించు సత్యేంద్రనాథదత్తు మున్నగు నితర యువక కవులును ఆధునికకవిత్వసంప్రదాయమునకు సంబంధించినవారు. ఈ తెగకు రవీంద్రుఁడు మార్గ

దర్శకుఁడు. కావున మొట్టమొదట ఆయన కవిత్వమునుగుఱించి తెలిసికొందము. రామమోహనరాయలు కలకత్తా నగరమున బ్రహ్మసమాజమును స్థాపించిన వెనుక బెంగాలీ సారస్వతమున నూతన జీవసంచలనము ప్రారంభమయి, దినదినాభివృద్ధి గాంచినది. బ్రహ్మసమాజపు ప్రార్థన మందిరములందుఁ జదువుటకును, మతప్రచారము గావించుటకును క్రైస్తవుల పాటలు (Psalms) వంటి గీతములు రచియింపఁబడినవి. ఈ గీతారచనమే బెంగాలుదేశపు ఆధుని కాధ్యాత్మిక కవిత్వమునకు బీజము. రవీంద్రుఁడు బాల్యమునందే ఇంగ్లీషు కావ్యములను జదివెను. అందు ముఖ్యముగ కీట్సు, షెల్లీ, బ్రౌనింగు అను ఇంగ్లీషుకవుల కవిత్వములలోని సారమును దనివి దీఱ నాస్వాదించెను. కాళిదాసుని శాకుంతలము, కుమారసంభవము, మేఘసందేశము రవీంద్రుని హృదయమును ప్రబలముగ నాకర్షించిన వనుటకు ఆయన 'ప్రాచీన సాహిత్యము' అను గ్రంథమునఁ గావించిన తత్సంబంధములైన విమర్శనములే సాక్ష్యములుగ నున్నవి.

చైతన్యుఁడు, జయదేవుఁడు మున్నగు వైష్ణవభక్తుల కీర్తనలను టాగూరు గానము చేసిచేసి, యానందించెను. ఆ కీర్తనల యధికారము ఆయన రచించిన 'భానుసింహపదావళి' యను గీతములందు సుస్పష్టముగ నంకితమై యున్నది.

కీట్సు సౌందర్యమును బోషించిన కవి. షెల్లి యింద్రియాతీతములైన ఆధ్యాత్మిక విషయములను గానము చేసిన తపసి. రవీంద్రుని కవిత్వమందు కీట్సు రచనలలోని రామణీయకము, షెల్లీ కావ్యములలోని యాధ్యాత్మిక తృష్ణయు,

వైష్ణవ గీతములలోని భక్తిపారవశ్యమును—వీని మూటిని ఆత్మసాక్షాత్కరించుకొని మించిన స్వకీయ ప్రతిభావ్యక్తిత్వములును సామరస్యము నొందినవి. కావున రవీంద్రుని యాధ్యాత్మిక కవిత్వము ప్రాచ్యపాశ్చాత్య మనస్తత్వముల కనుగుణమైన సంధిస్థానమై యున్నది.

‘తుమి యేన్ ఒయ్ ఆకాశ్ ఉదార్
అమి యేన్ ఎయ్ అసీమ్ పాథార్
అకుల్ కొరేచె మాఝు కానే తా’ర్
ఆనందపూర్ణిమా’

(మానసి - ధ్యానము)

[నీవు విశాలమైన ఆ యాకాశమవు ;
నేను సీమారహితమైన యీ సముద్రమును
వాని రెంటిమధ్య ఆనందపూర్ణిమ
తాండవించుచున్నది.]

ఆంగ్లేయ సారస్వత సంబంధమువలన బెంగాలునందువలె తెలుఁగు దేశమున నైతముఁ గొంత యాందోళనము గలిగినది. యువక కవులు సంప్రదాయసిద్ధములైన పురాతన పద్ధతులను ద్యజించి స్వతంత్రముగఁ గ్రొత్తదారులు త్రొక్కసాగిరి. ఇప్పుడు తెలుగుదేశమున నాంగ్లేయ వాఙ్మయ పరిచితి గల యువక కవులందఱు కొద్దిగనో గొప్పగనో **Romantic** కవు లనుటకు యోగ్యులు. రవీంద్రుఁడు ‘నోబెల్’ బహుమానమునుచే సత్కరింపఁబడి యాతని కావ్యములు హిందూదేశమంతటను వ్యాప్తిచెందిన యనంతరమున తెలుఁగు రొమాన్టిక్ కవిత్వము ఆధ్యాత్మిక కవిత్వ

ముగఁ బరిణమింప మొదలుపెట్టెను. తత్పరిణామ చిహ్న
ములు ఇప్పుడిప్పుడు తెలుఁగు కవుల రచనలయందు బొడ
కట్టుచున్నవి. కాని, యిది ప్రథమదశ యగుటవలనఁ
గొందఱి రచనలయందు అనవసర పదాడంబరత్వమును,
కళా కౌశలమువలనఁ బ్రాప్తమైన భావసేంద్రజాలముగాక,
భావ ప్రకటనము గావింపఁజాలని గజిబిజితనమును గోచ
రించుచున్నది. ఈ లోపము మొట్టమొదట అనివార్యమైనది.
కావున సహింపఁదగినది. ఇందుకు లక్ష్యములుగ సమ
కాలీనుల కావ్యములనుండి కొన్ని యుదాహరణములను
సంకలింపవచ్చును గాని, అనవసర వివాద హేతువుగఁ
బరిణమించు నని మానితిని.

సంపూర్ణము.

నాటక కళా సంస్కరణము

ఉపోద్ఘాతము

సంఘసమష్టి తనయందలి వ్యక్తిని నైతిక బంధములఁ జిక్కించుకొని యెట్లు అధికారము చేయునో, ఒక్కొక్కప్పుడు వ్యక్తియుఁ దన సంకల్ప బలము చేత సంఘసమష్టిని తన యభిప్రాయమువంకకుఁ ద్రిప్పుకొనుచుండును. ఇందుకు మన సాంఘిక జీవితమునందు లెక్కలేని నిదర్శనములను జూచుచున్నాము. సంఘమునకును, అందలియంశమైన వ్యక్తికిని బరస్పర సంబంధము గలదు. కావున నొక జాతి నాగరకమైనదని చెప్పుటలో నూటికి తొంబదిమంది మనుష్యులైనను నాగరకులుగ నుందురని మన మూహింతుము.

జాతీయ జీవితమార్గము కొండదారివలె నిమ్నోన్నతముగ నుండును. వాతావరణములోని మార్పులను భారమితి (Barometer) సూచించునటుల శిల్పము జాతీయ జీవితమునందలి నీచోచ్చదశలను దెలియఁజేయుచుండును. కవులు స్వతంత్రముగ వస్తుకల్పనము చేయుచున్నను, సమకాలీన భావములును, ఆచార వ్యవహారములును వారి రచనలయందుఁ బ్రవేశించియుండును. కాళిదాసుని నాటకములను మనము చదివినయెడల ఆ కాలపు నాగరకతను మనము కొంచె మించు మించుగ నూహింపఁగలము. వాల్మీకిమహాకవి

లోకోత్తర వీరుఁడైన శ్రీరాముని చరిత్రమును సృజించి నప్పటికిని, సమకాలీనమైన హైందవ సంఘముయొక్క నాగర కతయు ఆచార వ్యవహారములును అందు నంకితమైయుండక తప్పవు.

ప్రస్తుతవిషయమునకు వత్తము : మన తెలుఁగుజాతి చాల మంది కవులకును, శిల్పులకును, నటకులకును ఆకరమై యున్నది. వారి రచనలు, సృష్టులు, అభిప్రాయములు భావి సంతతికి మన కళాభిరుచిని, కల్పనానైపుణ్యమును, ఔచిత్య గౌరవమును, మీఁదుమిక్కిలి మన శిక్షణమును, దెలియఁ బఱచును కావున ఇప్పటి కవులును, తక్కుంగల శిల్పులును సమకాలీన ప్రజా బాహుళ్యముయొక్క యశిక్షితమైన యభి రుచి యడుగులకు మడుఁగులొత్తి సునాయాస లభ్యమయినఁ గీర్తికొఱకు పాటుపడుటయే వారి బాధ్యతయని తలంచు కొనక, భావిసంతతులకుఁగూడ మన శిల్పసిద్ధిపైని గౌరవ ముండునటులు, తమ యభిరుచిని మఱికొంత సభ్యముగను, ఔచిత్యదృష్టిని మఱికొంత నిశితముగను అలవఱచుకొనుట యావశ్యకము.

సుమారొక సంవత్సరముక్రిందట ఒంగోలునందుం డిన నామిత్రులు రావుసాహెబ్ డాక్టరు శేషాద్రిరెడ్డిగారికి (ఇప్పుడు స్వర్గస్థులు) అతిథినై యచ్చట రెండు మూఁడు దిన ములు గడపితిని. ఆయూరియందు స్థాపింపఁబడియున్న యొక నాటక సమాజమువారిచేఁ బ్రయోగింపఁబడిన * "సుమతి"

* ఆ నాటకము పేరునుగుఱించి నాకు సంశయము గలదు. సుమతి యని జ్ఞప్తి, కవిపేరును మఱచిపోతిని.

అను నాటకమును చూచుట మా కిరువురకుఁ దటస్థించినది. రెండు మూఁడు గంటల వినోదము కొఱకును, ఆ వినోదమున అలక్షితముగ మిళితమైన రీతిని సమకూరుచుండు భావశిక్షణము కొఱకును మనము సాధారణముగ నాటకశాలకుఁ బోవుచుందుము. చేతిడబ్బు వదలించుకొని, నిద్ర లేమి మున్నగు శ్రమలకుఁ బాల్పడియు మనము నాటకము చూచుట కవిచేతను నటకులచేతను "మీరు సభ్యతాశూన్యులు! మీరు మృగప్రాయులు" అని చెప్పక చెప్పించుకొనుటకుఁ గాదు. సహృదయుల భావములు దూషింపఁబడుటకు గాదు! కాని, దురదృష్టవశమున మా కానాఁ డట్టి యసభ్యవినోదము ప్రాప్తించినది. ఆ నాటకమునందలి యనౌచిత్యముల నుదహరించి సభ్యలోకమునకు విసుగుపుట్టించి నా యభిరుచినిగూడ దూష్యముగ నొనరించుకొనుటకు నా కిష్టము లేనప్పటికిని 'శిల్పము' కొఱకు అట్లు చేయక తప్పినది కాదు. మేము నాటకశాలయం దున్నంతవఱకు జఱిగిన కథ యీ క్రిందివిధముగ నున్నది: భాగ్యవంతుఁడైన బ్రాహ్మణయువకుఁ డొకఁడు ఒక భోగముసాని నుంచుకొని తన యాస్తినంతయుఁ గొల్లగొట్టుకొనును. కొంతకాలమునకుఁ దన భార్యనుగూడ ఆ సానికిఁ బరిచారికనుగ నియమించును. అటుపైన కొల్లఁగొట్టుటకు విటునియొద్ద నొక గవ్వయైనను లేదని తోఁచినవెంటనే ఆసాని యాతనిని విడనాడి, మఱియొకనిని దగుల్కొనును. రెండవ విటుఁడును ఆ భోగముదియు నేక శయ్యాగతులయి యుండునప్పుడు పరిత్యక్తుఁడైన మొదటి విటుఁడు వచ్చి చూచి "బ్రతికి చెడిన వాని

వైరాగ్యావేశముతో'' ఆసానిని దిట్టుటకుఁ బ్రారంభించును. భోగమువారిని దిట్టుటయే సంఘ సంస్కరణము యొక్క ప్రధానసూత్రమని తలంచువారును కొందఱు గలరని, అట్టి కోటిలో మన నాటకరచయితనుగూడ చేర్చుకొని నాటకము నందలి ఆ సంవిధానమును సహించినను, సహింప నలవిగానివి మఱికొన్ని బయలుదేరినవి. ఆ నాటకశాలయందు స్త్రీలు చాలమంది యుండిరి. అటిట్లు భోగమువారికి సంబంధించినవే కాక సామాన్యముగ స్త్రీజాతికంతటికి సిగ్గును రోఁతను బుట్టించునట్లు తోఁచినవి. * ''సాని వాకిటిలో నొకనిని, ముందువాకిటిలో మఱియొకనిని పెట్టుకొని చిత్తకార్తిలో కుక్కలవలె .... వారి .... సొరకాయలవలె నుండును; అవి......కావు. రోగములబొందలు''. మొదటి మాటతో నిప్పుఅంటింపఁబడి రెండవమాటతో కిరసనాయిలు పోయఁబడి, మూఁడవమాటతో భగ్గని మండిన నా హృదయము సంయమన సాధ్యముకాక పోయినది. ఏవో రెండు మాటలని నాటకశాల వీడివచ్చితిని. రెడ్డిగారును నా వెను వెంట వచ్చిరి. బయటికివచ్చి మనము స్థిమితపఱచుకొను నప్పటికి నా యొడలంతయుఁ గంపించుచుండెను. నాటకము ముగిసినవెనుక మా దుర్నయమును గుఱించి ఆ సమాజము యొక్క కార్యదర్శి యుపన్యసించెనని వింటిమి.

మఱునాఁటి యుదయమున ఆ సమాజములోని యొక సభ్యుఁడు, తాము రాత్రి ప్రదర్శించిన నాటకమును, చింతామణియను నాటకమును దీసికొనివచ్చి, ఆ నాటకము చింతా

---

* నాటకము నాయొద్దలేదు. జ్ఞప్తియున్నటులు వ్రాయుచున్నాను.

మణివలె నున్నదనియు; అందులో లేనిబూతులు ఇందులోఁ
గూడ లేవనియు, మేము నాటకశాలనుండి వెడలివచ్చిన
యనంతరము చాల నీతిప్రదమైన కథ జరిగినదనియుఁ జెప్పెను.
మొదటి విషగుళికతోడనే మా జీర్ణశక్తి నాశనమైనది?
ఆపైని విరివిగాఁ బంచిపెట్టబడిన నీతిఖాద్యములు మే మొక
వేళ గైకొన్నను నిరుపయుక్తములై యుండును.

తరువాత ఆ రెండు నాటకములలోని సంవిధాన
ములను నేను జూచితిని. సుమతి నాటకము చింతామణికిఁ
బ్రతిబింబముగ వ్రాయఁబడి యున్నదనుటకు సందియము లేదు.
నే నిప్పుడు చింతామణిని సమర్థించుటకుఁ బూనుకొనలేదు.
కాని, ఆ రెండు నాటకములను సరిపోల్చినప్పుడు మాత్రము,
సభ్యతయందు చింతామణియే మెఱుఁగుగనున్నది. చింతా
మణికారుడు రచనా నైపుణ్యముతో వెల్లడించిన బూతు
లను సుమతి నాటక రచయిత జట్కాబండివారి సభ్యతలోనికి
దింపి, శృంగార రసమును సిరాబుడ్డిలో ఊరవేసినాఁడు.
ప్రకరణమున కిట్టి వస్తువు ఆవశ్యకమని అలంకార శాస్త్రము
యొక్క మఱుఁగు సొచ్చినను, అభిరుచి విషయకమైన చర్చ
వచ్చినప్పుడు, దానిని కవియొక్క చిత్తసంస్కార పరిపాక
ములకు సంబంధించినదిగ మన మెఱుంగుదుము. మృచ్ఛ
కటికము ప్రకరణమయ్యు సహృదయులకు ఏవపుట్టించు
బూతుకూఁతల మట్టునకు దిగలేదు. అట్లనుటవలన సంస్కృ
తమునందు, అధమములైన ప్రహసనములు లేవని నేను
నుడువుటలేదు. కాని, అవి సహజముగ నిరాదరింపబడినవి.
నింద్యవిషయ మేభాషయందున్నను నింద్యమే. భావమువలన

భాషకు గౌరవము కలుగుచున్నది గాని, భాషవలన నింద్య భావమునకుఁ గూడఁ బ్రశస్తి కలుగదు.

నేను సుమతి నాటక ప్రదర్శనమును చూచినప్పటి నుండియు, నాటక రచయితలయందును, నటకులయెడను, ప్రేక్షకులయందును నా కొకవిధమైన శ్రద్ధపుట్టినది. అప్పటి నుండియుఁ గొందఱి యాధునిక కవుల నాటకములను జనరంజకములని ప్రజలచేఁ దలంపఁబడు మఱికొన్ని నాటకములను సుప్రసిద్ధులని తలంపఁబడు నటకులచే ప్రదర్శింపబడుచుండి నపుడు చూచుచుంటిని. జనరంజకత్వమునకుఁ గారణములను, అందుకై కవులును నటకులును జేయుచున్న వ్యాపారరహస్య ములను, మోసములనుగూడ గ్రహించి నా యభిప్రాయ ములను ఈ వ్యాసమూలమునఁ బ్రకటింపఁ దలంచితిని. ఇట్లు చేయుటవలన, నే నెందఱెందఱి యనుమానములకు, విమర్శన ములకుఁ బాత్రుఁడను కానున్నానో నే నెఱుంగుదును. ఈ వ్యాసమునందు నే నెచ్చటనైనను నిదర్శనపూర్వకముగ నాయభిప్రాయములను వెలిపుచ్చవలసివచ్చినప్పుడు, ఎవరి నైన నాటక రచయితలను నటకులను సమాజములను విమ ర్శించి దృష్టాంతములుగఁ గైకొనుట నాకు వారిపై గల ద్వేష ముచేఁ గాదు. కాని, శిల్పముపైఁగల గౌరవముచేత, నేను కొన్ని నాటకములలో ననౌచిత్యములకు నుదాహరణములను గైకొంటినిగావున, ఆ నాటకములెల్ల ననౌచిత్యభూయిష్టము లనియు, ఆయానాటక రచయితలు కల్పనా నిపుణులు కార నియుఁ బాఠకమహాశయులు తలంపరాదు. ఆ గ్రంథములపై నను ఆ కవులపైనను నా కత్యంతగౌరవము కలదు. నటకుల

విషయమైనఁగూడ నేనిట్లే మనవిచేసికొనుచున్నాను. కావున నేను నిర్మలహృదయముతోడను శిల్పదృష్టితోడను రచియించిన యీవ్యాసమును నాటక కళాభిమానులెల్లరును అన్యథా తలంపక నా సదుద్దేశమును గ్రహింతురని నాప్రార్థనము.

నాటక కవి

ఇప్పుడు వెలువడుచున్న నాటకములలో 100 కి 90 నాటకములు 'నాటక'మని పేర్కొనుటకుఁ దగినవి కావు. ఒకకథలోని కొన్నిసీనులను ఒకటిగా జోడించినంతనె అది యొకనాటక మగునని కొందఱు నాటకరచయితల యుద్దేశమైయుండును. నాటకమునకు ఆదిమధ్యాంతములు కలవనియు, సంధిబంధమును, సంయోగతయు సడలినయెడల నాటక శరీరము విచ్ఛిన్నావయవ సమూహమువలె నుండుననియు వీరెఱుఁగరు. ఒకవేళ నెఱింగియు ఆచరణమున నసమర్థులై యున్నారు. ఇప్పటి కొన్ని నాటకములలో 'మేకపోతుమెడ చన్నులు, ఆఱవ వ్రేలు' మున్నగు రచనా విశేషము లగపడుచున్నవి. ప్రజలకన్నులలోఁ దేలికగా దుమ్ముకొట్టుట కలవాటుపడి రంగ సంప్రదాయములను చక్కఁగాఁ దెలిసినకవులు అట్టి రచనావిశేషముల నాశ్రయింతురు. వానితో నాటకసమష్టికి నవసరమైన సంబంధమేమియుండదు. నిరుపయోగములును, విపరీతములును నైన అట్టియవయవములను గత్తిరించినను లోప మేర్పడదు. ఇది రచనాన్యూనతయైనను, లేక ప్రేక్షకులను సులభముగ వలలో వేసికొనుటకు కవి ప్రయత్నపూర్వకముగ నొనరించిన

వంచనమైనను గావలయును. ఒక ఉదాహరణము: రామదాసు నాటకములో 'అహమక్కు-సీను' లవకుశలో 'చాకలివానియింటిసీను' వానిని వేఱుపఱచి, అట్టిసీనులు ప్రత్యేకముగఁ బ్రదర్శింపఁ బడినపుడు హాస్యరసోత్పాదకములయి వినోదము కలిగింప వచ్చును. కాని ఆనాటకములందు ఆయాకథాభాగమున వాని కంత ప్రాముఖ్యము లేదు. మొగమునకు ముక్కు అందమని యొకశిల్పి మూరెడు ముక్కును జేసి యొక మానవ విగ్రహమున కంటించి నట్లున్నది. నాటక శరీరమందు అంగాను గుణ్యము చాల ముఖ్యము. కేవలము లోభముచేత అనుచితమైన కల్పనలకుఁ బూనుకొనుట నింద్యము.

ధర్మవరము రామకృష్ణాచార్యులవారి నాటకరచనతోడఁ గ్రొత్తనాటకలక్షణము లేర్పడినవి. సంక్షేపముగ భావమునుఁ బ్రకటించుటయన్న ఆకవి యెఱుంగని పరమ రహస్యము. రెండుమూఁడు మాటలలోఁ జెప్పఁదగిన భావమును అచ్చులో నర పేజికిఁ దక్కువగాఁ జెప్పఁడు. దుఃఖము యొక్క పరిమాణము వాక్యముల దీర్ఘత్వము ననుసరించియు సంఖ్య ననుసరించియు నుండునని తలఁచికాఁబోలు బాహుకునికిఁ గొండవీటి చేంతాడువంటి స్వగతమును గల్పించి ప్రేక్షకులపై ఆయనకుఁగల కసియంతయుఁ దీర్చుకొన్నాఁడు. వ్రాసిపెట్టిన పద్యములు గ్రంథస్థములు కాకపోయిన యెడల విస్మృతములగు నను తలంపుతో బాహుకుఁడు చంద్రుని దూషించు కథా భాగమున నిక్షేపించినాఁడు. వీనినన్నిటిని తలదన్ను చాపల్యము మఱియొకటి గలదు. ప్రహ్లాదనాటకమున లీలావతి పాడునట్టి 'రారా—ధీలోలా—నాబాల' అను

పాటయందు, 'సుకుమారా-గుణశాలి' అను పాటయందును 'రామకృష్ణకవిరత్నముఁ బ్రోవ' అనియు 'కవి రామకృష్ణ' అనియు, కవిగారు తన పేరును ఇముడ్చుకొన్నారు. అచ్చట ఒక చుక్క-గుర్తును బెట్టి జ్ఞాపికలో 'లీలావతి యీ పాట చదువునప్పుడు అంకితము పేరును తీసివేయవలయును' అని యైన హెచ్చరించలేదు. నటకులును ఆ యంకితముయొక్క యనౌచిత్యమును గ్రహింపలేదు. లీలావతి పాత్రము ధరించిన యొక నటకుఁడు 'రామకృష్ణకవిరత్నము'అని పాడుచుండగా విని నేను ఆశ్చర్యపడితిని. లీలావతిని ఇంద్రునివలె చెంగు పట్టుకొని రామకృష్ణకవి కాలమునకు లాగవలయునో, లేక కవినే లీలావతి కాలమునకు నెట్టవలయునో, తోఁపకున్నది. అట్లు చేసినను లీలావతి రామకృష్ణకవిపేరు నేల స్మరింప వలయునో నా కసూహ్యముగ నున్నది. నాటకములో కవి దాఁగియుండవలయునే కాని ముక్కు-వెళ్ళఁబెట్టవలసిన యావశ్యకత లేదు. అట్టినాటకములనాదరించు నభిరుచిగల మనము కాళిదాసాదుల నాటకముల నెట్లు మెచ్చుకొనగలము?

'నాటకము చాల బాగుగానున్నది' అని యనిపించు కొనుటకు మఱియొకయుపాయము గలదు. స్థానికమైనను అస్థానికమైనను దేశభక్తి దేశానుసారము మున్నగుభావములను వెంద్రుకపట్టు మాత్రమైనను సందు కల్పించుకొని బారెడుపొడుగు ఉపన్యాసములోఁ బొదిపి ప్రవేశపెట్టుట; హిందువులు మహమ్మదీయులు కలిసియున్న నాటకకథయైన యెడల [ఆ కథ జరుగు కాలమందు అట్టిభావములు ప్రజలలో లేకున్నను] హిందూ మహమ్మదీయ మైత్రిని గుఱించిన

యుపన్యాసము నొక పాత్రమునోటఁ జెప్పించి నాట్యశాలను రాజకీయోపన్యాస మందిరముగ మార్చుట; పుట్టినదాది అడవులలోఁ గాలము పుచ్చుచు, గ్రంథములలో వర్ణింపఁ బడిన లక్షణములచేత గుఱ్ఱమును గుర్తించిన కుశలవులు మాతృదేశాభిమానమును గుఱించి నేఁటికాలపు భావముల వెడలఁగ్రక్కు ఉపన్యాసముల బలాత్కారముగ ప్రేక్షకులపైఁ గురిపించుటచూడ, "ఆంధ్రపత్రిక" వాల్మీకి ఆశ్రమమునకుఁ గూడఁ బంపబడుచున్నదా యను భ్రాంతి పొడముచున్నది. దేశకాలపాత్ర విరుద్ధమైనను పురాతన వస్తువునకు ఆధునిక వాసన దగిలించుట చాలమంది నాటక రచయితల కభ్యాసమైయున్నది. ఇది యొక వ్యాపార రహస్యము.

చాలమంది నాటకకవుల రచనాలోపములను, పాటలును బద్యములును గప్పిపుచ్చుచున్నవి. నాటకములోని కల్పనను బృథక్కరించినయెడల ఆ లోపములు బయలుపడును. ఎట్టినాటకమునైనను జక్కఁగా బాడఁగలిగిన యొకరిద్దఱు నటకుల నాశ్రయించి ప్రసిద్ధికి రావచ్చును. అల్లూరు నాటక సమాజమువారు రామదాసు నాటకమును బ్రదర్శించుచుందురు. పర్వతరెడ్డి రామచంద్రారెడ్డిగారు (ఆ సమాజమునఁ బ్రధాన నాయకపాత్రము ధరించు నటకుఁడు) కబీరు పాత్రమును ధరింతురు. ఆ ప్రదర్శనములను జాలమంది కొనియాడుచుందురు. రెడ్డిగారు నాట్య ప్రపంచమున ఆర్జించిన పేరు ప్రతిష్ఠలకు ఆ నాటకము పట్టుఁగొమ్మ. ప్రజల ప్రశంసకు నాస్పదమైన విషయము నెఱుంగవలయునని చాలమంది యభిప్రాయములను గనుగొంటిని. కొంచె మించుమించుగ

అందఱును ఈ క్రింది విధమున జవాబిచ్చుచుందురు: 'రామచంద్రారెడ్డి హిందూస్థాని పాటలను జక్కఁగా పాడఁగలడు. నాటకము ప్రారంభమునుండి తుదివఱకు పాడుచున్నను, కొంచెముగూడ ఆయనగొంతు రాఁపుపుట్టదు. ఆయన పాడుచున్నప్పుడు మఱికొంతసేపు పాడుచుండిన బాగుగానుండునని తోఁచును. నా మట్టుకు నేను రెండుమారులు Once more, అన్నాను.' రామచంద్రారెడ్డిగారిని గుఱించి చెప్పఁబడున దంతయు యథార్థమె. కాని నాటకము ఏ విధముగ మెచ్చుకొనబడవలయును? షేక్స్పియరు మహాకవియొక్క ప్రతిభ, గ్యారిక్కు ననుసరించి యుజ్జీవింపవలయునా? లేక యాతని రచనలకు స్వతంత్రమైన యంతస్సారముగలదా? చదువరు లూహింపఁగలరు. బూటకపు టాడంబరముల నాశ్రయించి ప్రసిద్ధికెక్కిన నాటకములు ఆశ్రయచ్యుతి గలిగిన వెంటనే విస్మృతములగును. ప్రేక్షకుల యభిరుచి ననుసరించి వ్రాయఁబడు నాటకములు వారియభిరుచి మాఱువఱకే గౌరవింపఁబడును. తర్వాత నధఃపతనము.

పాత్రోచితమైన భాషనుపయోగించు టావశ్యకము. మహోపాధ్యాయ, కళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రిలవారు బొబ్బిలినాటకమున బుస్సీ దొరపాత్రమునకు వ్యాకృత భాషనే యుపయోగించిరి. కోలాచలము శ్రీనివాసరావుగారు రామరాజు నాటకమున పఠానునకు ఉత్తమ భాషనే యుపయోగించిరి. వారిని ఉత్తమ పాత్రలనుగఁ జిత్రించి అట్టిభాష నుపయోగించి యుందురు. కాని, ప్రదర్శనమునందు వారి వేషములకును వారిభాషలకును జాల

వైరుధ్యము గోచరించుచుండును. దాని నొప్పుకొన్నను, ఆ పాత్రముల హైందవపురాణ పరిచితి చూడ చిత్రముగ నున్నది. బుస్సీదొర 'స్తంభమునుండి పైకురికి' అను పద్యము చదువును. పటాను సంస్కృతపద భూయిష్టమైన పొడవగు సమాసములతో సప్తమారుతములను జిల్లర దేవుళ్ళను తన్నుఁ జంపుటకుగా ఆహ్వానించును. హైందవేతరజాతులకు సంబంధించిన యుత్తమ పాత్రములచే నుత్తమభాషను మాట్లాడించుట యొకవిషయము. కాని, వారికి మన శాస్త్ర పురాణములయందుఁ బరిచయము గలిగినట్లు వ్రాయుట వేఱొకవిషయము మహమ్మదీయుల యుత్తమ పాత్రత్వమునకు హైందవ పురాణ పరిచయము ఆవశ్యకముగాదు. దుఃఖము కలిగినప్పుడు తమ తమ మనస్సులలో నెలకొని యున్న దైవమునో దేవతలనో స్మరించుట స్వాభావికముగ నుండునుగాని, అట్టిసమయమున మహమ్మదీయుఁడు పౌరాణిక దేవతలను తలంచుట విరుద్ధముగఁ గనుపట్టును. బుస్సీదొర బైబిలునుండి యుపమానమును గ్రహించినయెడల నుచితముగ నుండెడిది. పటాను ఖొరానునందో లేక మఱియేవిధమైన మహమ్మదీయ పురాణమునందో పరిచితమైన దేవతలను ప్రవక్తలను ఆహ్వానించియుండిన మెఱుఁగుగ నుండెడిది.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు రచియించిన గయోపాఖ్యానమున కృష్ణార్జునుల దెప్పిపొడుపులు, ఆత్మగౌరవముపై దృష్టిగల యే పెద్దమనుష్యుఁడును మాట్లాడి యుండఁడు. ఇక కృష్ణార్జునుల మాట యేల? సంవాదములలో

అంతమాత్రము గాటులేనిదే ప్రజలకు రుచింపదు. పాపము! కవియేమిచేయును? శతావధానులు పిశుపాటి చిదంబర శాస్త్రిలుగారు, గయోపాఖ్యానమును జూచి దానిని మించ వలయునను కోరికతో శ్రీరామాంజనేయమను నాటకమును వ్రాసి శ్రీరామునికిని ఆంజనేయునకును వైరము గల్పించి యిరువురిసంవాదమును ముదిరిన కొండమిరపకాయ పాకము లోనికి దింపినారు. రామకృష్ణాచార్యులవారు ప్రమీలార్జునీయనాటకమును రచించి, నాగరక విద్వాంసులచే వ్రాయఁబడు నాటకములలో బూతు ఎంతవరకు నొప్పుకొనఁదగ్గది యనువిషయమును దృష్టాంతపూర్వకముగ దృఢపఱచినారు. వ్రాయుకొలఁది యిట్టి యుదాహరణములకు లెక్కయుండదు. రెండుమూఁడు ఊరక మచ్చుచూపితిని.

నటకులు

కొంచె మించుమించు ఇరువది యిరువదియైదు సంవత్సరములకుఁ బూర్వము తెలుఁగుదేశమున, నాటకవృత్తి నవలంబించినవారే నాటకము లాడుచుండిరి. (మరల నిప్పుడు కూడ) ఆకాలమున నాటకములన్నను, నటకులన్నను ఒక విధమైన యనుమానము, హైన్యమును దోఁచుచుండెడిది. ఇందుకుఁ గారణము లేకపోలేదు. ఆనటకులలోఁ జాలవఱకు దేశద్రిమ్మరులు, తల్లిదండ్రులను, దారపుత్రాదులను వదలినవారుగనో లేక యితరుల సంసారములను జెడఁగొట్టిన వారుగనో యుండిరి. వారు ప్రదర్శించుచుండిన నాటకము లెల్లను వారి సొంతసృష్టులు. ఈకాలమున పాపట్లకాంతయ్య

గారు రచియించిన నాటకగీతావిశ్వకోశమువంటిది వారికిఁ గూడ నొకటి యుండినది ఇదివరకు రచియింపఁబడినవి, యిపుడు రచియింపఁబడునవి, యిఁకమీఁద రచియింపఁబడఁ బోవు సర్వనాటకములకును అందు పాటలు గలవు. రేపటి రాత్రి నాటకము వేయవలయునని యనుకొన్నయెడల, ఈ నాఁటిప్రొద్దున నాటకపాత్రములును, సీనులను వారే తీర్మా నించుకొని సందర్భానుసారముగ పాటలు చొప్పించి స్వంత కవిత్వముతో నాటకమును తుదముట్ట ఆడివేయుదురు. ఇట్టి దురవస్థనుండి నాటకములను రక్షించినందులకు నేఁటికాలపు శిక్షిత నాటకసమాజములవారు ప్రశంసాపాత్రులు!

పూర్వపునటకులకన్న నేఁటికాలపునటకులకు బాధ్యత యెక్కువ ; ఏలయన — ఇప్పటినటకులు విద్యావంతులు, నాగరకులు. ప్రేక్షకులుకూడ నట్టివారే. కావున నటకులు నిర్బాధ్యముగఁ బ్రవర్తించుటకు వీలు లేదు. వారు గమ నింపవలసిన విషయములు చాల గలవు. కాని, వ్యాసవిస్తర భీతిచే నిచ్చట కొన్నిటినిమాత్రము వ్రాయుచున్నాను.

తాను ధరింపఁబోవు పాత్రమును, కవి పోషించినవిధ మును, ఆపాత్రయొక్క గుణగణములను, మనస్తత్వమును నాటకబంధమునందు ఆపాత్రమునకుఁగల స్థానమును ప్రయో జనమును, తన కార్యప్రవృత్తికి హేతువైన భావమును నట కుఁడు మొట్టమొదట గుర్తెఱుఁగవలయును. వారు మాటాడు ప్రతిమాటకును అర్థము చక్కఁగఁ దెలిసియుండవలయును. అర్థము తెలియనిదే భావోదయముగాదు; భావోదయము కానిదే తాను అభినయించు పాత్రముయొక్క యవస్థయందు

సహానుభూతి యుండదు. నటకుఁ డెప్పుడును పాఠ మందిచ్చు వానిపై (Prompter) ఆధారపడియుండఁగూడదు.

నాటకమునకు అభినయము (చేష్ట) ప్రధానము. కార్య ప్రచలనము లేనియెడల నాటక మనిపించుకొనక యొక యుపన్యాసమగును. *కార్యప్రచలనమును, అభినయమును అడ్డగించుపాటలను పద్యములను నటకు లంగీకరింపరాదు. కాని పాట పద్యములపైని చాపల్యముచేత కవి యుద్దేశింపని చోటులలోఁగూడఁ గ్రొత్తక్రొత్త పద్యములను బాటలను జేర్చి కార్యగతికి భంగము గలిగించుకొందురు. ఏల? అభి నయలోపమును సంగీతముచేఁ బూరించుకొనుటకు ఒకదాని యందలి లోపమును భిన్నమగుమఱియొక దానితో బ్రయత్నించుట ♦చింతకాయ బహుమానమువలె నున్నది.

* ఇది నాటకరచనకు సంబంధించిన విషయము, "ఇందుకు నటకులు బాధ్యులుకారు. నాటకలక్షణమునకు సరిపోవునదియు తమ ప్రతిభను జక్కగఁ బ్రకటించుకొనుటకు అనువైన పాత్రపోషణము కలదియు నగు నాటకమును నటకులు ప్రదర్శనమున కేర్పఱచుకొనవలయును. కాని యిప్పటినటకులపద్ధతి వేఱుగ నున్నది. ఏ నాటకములోఁ బాటలు పద్యములు మెండుగనుండునో అదియే యుత్తమనాటకమని వారి యభిప్రాయము; అట్టినాటకములవలన నటకులకు వచ్చుకీర్తి నాట్యపరమైనది కాదు, గానపరమైనది.

♦ ఒకరాజునకు ఒకరైతు నిమ్మపండును దెచ్చి బహుమతిచేసెను. దానిని జూచుచుండిన మఱియొకఁడు పాడవాటి చింతాకాయను దెచ్చి రాజునకు సమర్పించెను, రాజు చిఱునవ్వుతో "ఇదియేమి బహుమాన?" మని ప్రశ్నించెను. అందున కాతఁ డిట్లు జవాబు చెప్పెను, "లావువాసి పొడుగులో నున్నది. పులుసునకు దానమ్మా మొగుడు."

నాకు సంగీతముపై ద్వేషబుద్ధికలదని నా మానవత్వ
మును సంశయింపఁబోకుఁడు. తగవుకానిచోట మంచిదియై
నను చెడ్డదిగఁ దోఁచును. ఒకవేళఁ బౌరాణిక నాటకము
లలోని నాయికానాయకులు పాటలు పాడినప్పుడు అనిష్టము
గనైన మన్నింపవచ్చును. పౌరాణికనాయకులు అమానుష
శక్తి సంపన్నులగుటవలన వారిజీవితము మనజీవితముకన్న
భిన్నము గను, ఊహ్యముగను, గొన్నియెడల నలౌకికము
గను గనుపట్టుచుండును. మానవసహజములగు సుఖదుఃఖ
ములను వా రనుభవించునప్పుడే మనము వారితో నేకీభ
వింతుము. కాని, చారిత్రక సాంఘిక నాటకములలోని
నాయకు లట్లుగాదు. వారు మనుష్యులు, అమానుషశక్తి
వారియొద్ద నించుకేనియు లేదు. కావున వారి సుఖదుఃఖము
లతో మనకు సమీప బాంధవ్యము గలదు. అందులో
ముఖ్యముగ సాంఘిక నాటకముల నాయకుల ప్రవర్తనము
ప్రస్తుతపు సాంఘికజీవితముయొక్క ఆదర్శక ప్రతిబింబముగ
నుండును. అంగడివీధిలో గుడ్డల వ్యాపారముచేయుచుండ
మనము ప్రతిదినమునుజూచుచుండిన సుబ్బిశెట్టియు జిల్లా
కోర్టులో మనము చూచుచున్న ప్లీడరు వెంకోజీరావుగారును
మనము ప్రతిదినమును ఇంటిలో సంభాషించుచున్న తల్లి
దండ్రులు, ఆలుబిడ్డలు స్నేహితులు మున్నగు వారు స్టేజి
మీఁదకువచ్చి "తులువా పలువా" యనియు "ఛీఛీ, పోపో"
యనియు ఫార్సీమెట్లకు అనువుగ విఱిగెడి అర్థములేని
పాటలతో సంవాదములు సలుపుకొనుచుండఁ జూచి
నప్పుడు వారిని బిచ్చివారి ఆసుపత్రికిఁ బంపింప బుద్ధి
పుట్టునుగాని అందలి యానందము ననుభవింపఁజాలము.

గొంతు లేని నటకులకు, పాటను సైతము మ్రింగివేయగల హార్మోనియము శ్రుతి మేలుచేసి పుణ్యము గట్టుకొనునట్లు, అభినయ చాతుర్యము కొఱతఁపడిన నటకులకు పాటలు ఉభయప్రధానము చేయుచున్నవి. ఇట్లనుటవలన నటకుఁడు బొంగురుగొంతువడి సంగీతజ్ఞాన శూన్యుఁడై యుండవలయు నని నా సిద్ధాంతముకాదు. నాటకమున సంగీతము అభినయమునకుఁ గేవలము ఔపచారికముగ నుండవలయును; కార్యగతికి నేలాటి యభ్యంతరముఁ గల్పింపరాదు.

నేడు కొందఱు నటకులు పద్యములు చదువుటలో నొక యపూర్వపద్ధతిని గనిపెట్టినారు. ఒక పద్యమును రెండు మాఱులు చదువుట. సీసపద్యమైనయెడలఁ బ్రతిచరణమును రెండు రెండు మాఱులు చదువుట. మొదటి తూరి రాగముకొఱకుఁ జదువుట! రెండవతూరి అర్థముకొఱకుఁ జదువుట! తా నొక సభయెదుట నటించుచున్నాఁడనియు తానుజేయు అభినయము, తాను పలుకు మాటలు సభాస్తారులు గ్రహించిరో లేదో యను విచారము, తర్కము, నటకుని కెప్పటికి నుండగూడఁదు. అట్లుండినయెడలఁ దాను నటకుఁడు కాక, విద్యార్థులకు ఉక్తలేఖనము చెప్పు బడి పంతులవంటివాఁ డగును. రామకృష్ణమాచార్యుల నాటకములలో భూమికలు ధరించు నటకులందు పునరుక్తిదోష మొక గుణముగ వెలసినది. ఇందులకు మార్గదర్శకుఁడు కవియె. పద్యములోని భావమునే గద్యములోను పాటలోను గూడఁ జెప్పును. పాపము, ప్రేక్షకుల గ్రహణశక్తి ననుమానించి కాఁబోలు రెండుమూఁడు విధముల నయ భయముల

తోడ,. కవిగారు తనభావములను వారి మనస్సులోనికిఁ బిచి కారి చేయును.

"భామవేషగాడికి మఱింత నెయ్యి పొయ్యండి. తిత్తి వూదేవాఁడికి పప్పుకూడా కావాల్నా" అను ప్రాఁత భాగవతుల పాత్రగౌరవములు ఇప్పటి నాటకసమాజములలోఁ గూఁడఁ బొడకట్టుచున్నవి. ఏ నాటకమందైనను, ఆయాస్థలముల ఆయాపాత్రము ప్రముఖమనియు, ఎంతనీచపాత్రమైనను తన నియోగమును జక్కఁగాఁ నిర్వర్తించినయెడలఁ బ్రశంసార్హమనియు, నటకునికివచ్చు పేరుప్రతిష్ఠలు తానుపోషించుపాత్రయొక్క యుదాత్తగుణముల ననుసరించికాక, పాత్రోచితాభినయ చాతుర్యమువలన ననియు, నటకు లెఱుంగరు. ఒకవేళ యెఱింగియుఁ జాపల్యమును జిక్కఁబట్ట లేకున్నారు. ప్రతినటకునకును దాను నాయకపాత్రమును ధరించిననేగాని సుప్రసిద్ధుఁడు గానేరఁడను అపోహ గలదు. ఇట్టి దురభిప్రాయముచేతనే చిల్లరపాత్రములను అభినయించిన కొందఱు తయ పాఠములను జదువక ఉదాసీనులయి నాటకముయొక్క సమష్టిరంజకత్వమునకు లోపమువాటిల్లఁ జేయుదురు. ఒక్కొక్కప్పుడు చెడగొట్టుదురు.

తాను ధరింపబోవు పాత్రముయొక్క గుణపోషణమునకు, స్వభావమునకు తన మనస్తత్వము సరిపోవునా లేదా యను విచారము నటకుని కుండవలయును. మొట్టమొదట తాను తన మనస్సును స్వభావమును పృథక్కరించుకొనుట యావశ్యకము. తన స్వభావమునందు గాంభీర్యమును

Tragic element ను లేని నటకుఁడు పాత్రమును స్వభావ
సిద్ధముగ అభినయింపలేఁడు.

భూమికా ధారణమును గురించి యించుక వ్రాయ
వలసియున్నది పాత్రోచితగౌరవమును బోధించునది
వేషము. వేషమునుబట్టి సాధారణముగ మన మొక మను
ష్యుని స్వభావశీలాదులను, అభిరుచిని, శిక్షణము మున్నగు
వానిని గురించి కొంచె మెచ్చుతక్కువగఁ దెలిసికొనఁగలము
కాని చాలమంది నటకులు పాత్రోచిత వేషములు ధరించుట
లేదు. సావిత్రి, సీత, దమయంతి మున్నగు పౌరాణిక
నాయకులు మోచేతుల క్రిందికి జాఱుచుండు జాకెట్టులు,
ఎఱ్ఱని పట్టుతోఁ జేయబడిన "బో" అమర్పబడియున్న
టోపా, ఉల్లిపొరలవంటి సిల్కులు ధరించుచుందురు. వారి
వేషములను జూచినప్పుడు గౌరవమునకు మాఱు లాఘవము
మన మనస్సులలో నుత్పత్తియగును. వారి కులుకు
బెళుకులు మూతి త్రిప్పుటలు మున్నగు పోకు లక్షణములు
బజారీజంతలకుఁగూడ సిగ్గు పుట్టించును. చేటికలు నాయికల
తల దన్నునట్లు అలంకరించుకొందురు. వారిలో నాయిక
యెవతయో చేటిక యెవతయో గుర్తించుటకుఁ గొంత
సంభాషణము జరిగినఁగాని సాధ్యముగాదు. హిరణ్యకశి
పుఁడు మున్నగు రాక్షసనాయకులు పదియాఱవశతాబ్దమున
రోమను వీరులు ధరించు ఉడుపులను వేసికొందురు.
ఆ యుడుపులలోని చీలికలకు, కత్తిరింపులకు ఏలాటి యర్థ
ముండదు. ఇతర రాజపాత్రలు పదునెనిమిదవ శతాబ్దము

నాఁటి ఫ్రెంచి విగ్గులను ధరించుకొని సర్వకాల సర్వావస్థల యందుఁ దలలు విరియఁబోసికొని తిరుగుచుందురు.

కవికల్పనమును దమయిష్టమువచ్చిన రీతిని కత్తిరించు అలవాటు నటకులకు మిక్కుటముగ నున్నది. కవి నటకుల కన్నఁ దక్కువప్రతిభ గలవాఁడయినప్పుడును, కథ కొంచెము దీర్ఘమైనప్పుడును నాటకమిట్టి శస్త్రచికిత్సకుఁ బాల్పడుచున్నది. కాని యిట్టి కత్తిరింపు జరిగిన వెనుక నాటక మెట్లు స్వరూపలోపమును బొందకయుండునో, సంయోగత చెడిన ఆ నాటకమును సహృదయరంజకముగ నటకు లెట్లు ప్రదర్శింపగలరో తోఁపకున్నది. వీనినన్నిటిని దృణప్రాయ మొనరించు సాహసము మఱియొకటి కలదు. తెలుఁగు నాటకము అలో భిన్నమగు మరియొక భాషను జొప్పించుట! ఇది కవి యొనరించిన పాపము కాదు. నటకులు Stage effect కొఱకు (అందేమి Stage effect ఉన్నదో గోచరించుట లేదు. Effect కు మాఱు defect కనబడుచున్నది.) స్వచ్ఛమైన యుర్దూ భాషను ఎవరిచేతనైన వ్రాయించుకొని గుడ్డిపాఠము జేసి సభాస్తారులపైఁ గసిదీర్చుకొందురు. సుప్రసిద్ధనటకులని పేరు వహించినవారు కూడ సామాన్య ప్రజల కన్నులలో దుమ్ము కొట్టుటకు వీలయిన యీ యధమమార్గము నవలంబించుచుండిరన్న, ఇఁక ఈ రంగసంప్రదాయముల పయిని మమతపోవని నటకు లుండుట యరుదు. పఠాను వేషము దరించిన రాఘవాచార్యులవారి పద్ధతి నవలంబించియే కాబోలు పర్వతరెడ్డి రామచంద్రా రెడ్డిగారు కబీరుపాత్రమును ధరించి రామదాసుతో ఉర్దూభాషలో మాటలాడు

నరు, పాపము! రామదాసునకు ఉర్దూభాష శ్రుతపాండి
త్యమే కావున చెప్పినమాటల నెటులో అర్థము చేసుకొనునే
కాని, ఉర్దూభాషలో తిరిగి జవాబు చెప్ప భాషాజ్ఞానము లేక
తెలుఁగుతో మాటలాడును. తెలుఁగువారు ఉర్దూభాష
చక్కగా నేర్చుకొనునంతవఱకైన నటకులిట్టి చాపల్యము
వంకకుఁ బోకుందురని నా ప్రార్థనము.

మహమ్మదీయ పాత్రోచితమైన భాష నుపయోగింప
నిష్టమైనయెడల మహామహోపాధ్యాయ వేదము వేంకట
రాయ శాస్త్రిలవారు ప్రతాపరుద్రీయమున వలీఖాను ప్రభృ
తులకును బొబ్బిలియుద్ధనాటకమున హైదరుజంగు మున్నగు
వారికి నుపయోగించిన మిశ్రభాష రమ్యముగ నుండును;
కాని, పఠాను మొట్టమొదటి ప్రవేశమున స్వచ్ఛమైన
యుర్దూభాషయును కడపటిసీనులలో అందుకు విరుద్ధముగ
సంస్కృతపద భూయిష్ఠమైన సమాసములను మాటలాడుట
విపరీతముగ దోఁచును.

ఒక్కొక్కప్పుడు నటకులు సామాన్య ప్రేక్షకులను
నవ్వించి చప్పటలు కొట్టించుటకు, అవసరమైన యభినయము
చూపి కవి యుద్దేశించిన రసమునకు విరుద్ధమైన రసము నుప్ప
తిల్లఁ జేయుదురు ఒక్క యుదాహరణము: హిరణ్యకశిపుని
యొద్దకు చండామార్కులు విద్యాపారంగతుఁడైన ప్రహ్లాదుని
దీసికొనివచ్చి పరీక్ష చేయుఁడని చెప్పుదురు. రాజు పరీక్ష చే
యును. ప్రహ్లాదుఁడు విష్ణువునేస్మరించును. హిరణ్యకశిపుఁడు
కోపగించుకొని గురుపుత్రులతట్టు చూచును. అంతట వారికి

వడఁకురోగముపుట్టి కాలుసేతు లతితీవ్రముగ వడఁకింతురు. ఈయసామాన్యమైన యభినయ కౌశలము చూచినంతనె కొందఱు ప్రేక్షకులు పొట్టలుపిసుకుకొని నవ్వుదురు ఈ మెచ్చుకోలుచేఁ బ్రోత్సహింపబడి చండామార్కులు మఱికొంత తీవ్రముగ వడఁకుదురు పాపము! వారి నిస్సహాయతకుఁ బ్రేక్షకుల మనస్సులో కవి కరుణారస ముప్పతిల్ల జేయ వలయునని తలంచెనుగాని, నటకుఁడందుకు భిన్నమైన హాస్యరసమును బుట్టించెను, ఇతరులను నివ్వించుటకు నాట్యకళా కౌశలము అవసరములేదు. చీలమండలవఱకు గుడ్డ కట్టుకొని యుండినయొకఁడు స్టేజిపైకివచ్చి మోకాళ్ళవఱకు గుడ్డ నెగఁదీసికొన్నయెడల ఆవైచిత్ర్యమునకుఁ జాలమంది నవ్వుదురు.

నటకులు కవులవలెనె వారి వారి శిల్పనైపుణ్యముచేత లోకము నుద్ధరింపఁ దగినవారు. వారిబాధ్యతయుఁ గొంచెముకాదు. కావున ప్రజాసామాన్యము యొక్కయభిరుచికి వారు తమ శిల్పమును దింపుటకంటెఁ బ్రజల యభిరుచిని గ్రమక్రమముగ సంస్కరించుటకుఁ బ్రయత్నము సల్పవలయును.

నాటకశాల

నాట్యరంగ మెప్పటికిని యాదార్థ్యభ్రమను గొల్పవలయును కాని, మన ముపయోగించు పర్దాలకును, మనము ప్రదర్శించు నాటకములకును దేశకాలపరిస్థితి వైరుధ్యము కనుపట్టుచున్నది. సారంగధరునో లేక కృష్ణార్జునులనో మద్రాసు మౌంటురోడ్డులో తిరుగుచున్నటుల ప్రదర్శింతుము.

కన్యాశుల్కములోని గిరీశమును రాజాంతఃపురములో సంచ రించు చున్నటుల చూపింతుము. పిడుగునకు బియ్యమునకు ఒకే మంత్రము వేయుటవలన అట్టివైరుధ్యము సంభవించు చున్నది. పౌరాణిక నాటకములాడినను లేక చారిత్రక సాంఘిక నాటకము లాడినను మొదటిపర్దా, వీథి, అంతః పురము, దర్బారు, అడవి అను నీ అయిదు పర్దాలనే యుప యోగింతురు; ఒక నాటకములోని నాయకుఁడును ప్రతినాయ కుఁడును ఒకే యంతఃపురములోనో, లేక యొకేదర్బారు లోనో మార్చిమార్చి కనఁబడుచుందురు. నేఁడు నాటక శాలలో అగపడుచున్న పర్దాలు సీనులును ఇరువదియవశతా బ్దపు సంకర శిల్పముయొక్క ప్రతికృతులు.

ఇట్టివైరుధ్యము సంభవింపకుండుటకుఁ గొన్ని ప్రయ త్నములు చేయవచ్చును. నాటకములను పౌరాణికముల నియుఁ జారిత్రికములనియు సాంఘికములనియు విభజించి ఒక్కొక నాటక సమాజమువారు ఒక్కొక వర్గమునకు సంబంధించిన నాటకములకుఁదగిన యుపకరణముల నేర్పఱచు కొని నాట్యకళయందుత్తమ సిద్ధిని పొందవచ్చును. అట్లుగాక సమాజము భాగ్యవంతమైనయెడల ఆమూఁడువిధములైన నాటకములకు ఆయా దేశ కాలపరిస్థితులకు సంబంధించిన పర్దాలును ఇతరోపకరణములను సేకరించి తరువాత అట్టి నాటకములఁ బ్రదర్శింపవలయును. కాని, యిట్టిప్రయత్న ములు జమీందారుల పోషణమున నభివృద్ధియగుచుండు మైలవరం సమాజము, ఏలూరు సమాజము మున్నగువానికే యొకవేళ సాధ్యము.

పౌరాణిక నాటకముల పర్దాలకు సీనులకు రామా
యణ మహాభారతములందుఁ గానవచ్చు రాజప్రాసాదాది
శిల్ప వర్ణనముల నాదర్శకముగఁ గొనవచ్చును. చారి
త్రక నాటకములకు బౌద్ధ మొగలాయి శిల్పములను గ్రహింప
వచ్చును. వర్తమాన స్థితిగతులఁ దెలుపు సాంఘిక నాటకము
లకు నేఁటి కాలపు సంకర శిల్పముపయోగపడును. ఏది యెట్లు
న్నను, ప్రస్తుతము నాట్యరంగము ఆపాదమస్తకము మార్పు
నొందవలయును.

ఏ నాటకి సమాజమువారైనను పదునైదు నాట
కములను అవకతవకగ నాడుటకంటె నొకటిరెండు నాటక
ములనైనను సరియైన యుపకరణములతో యోగ్యముగఁ
బ్రదర్శించినయెడల అదియే యశస్కరము. సంఖ్యకన్నను
రాశికన్నను, గుణమే ప్రధానము. ఇంగ్లండులో అయిదారు
సంవత్సరములు విద్యనభ్యసించి మరల హిందూ దేశము చేరిన
నామిత్రుని అచ్చటి నాటకవిషయములను గురించి ప్రశ్నిం
పఁగా ఆయన యిట్లు చెప్పెను: ''నేనొక నాటకము ఆరు నెల
లకుఁ బూర్వమునుండియు ప్రదర్శింపఁబడుచున్నదని విని
యొకనాఁటిరాత్రి చూడఁబోయితిని. అప్పటికిని ప్రేక్షకులు
క్రిక్కిరిసియుండిరి. నాప్రక్కను గూర్చుండియున్న యొక
పెద్దమనిషిని విచారింపఁగా ఆయన ఇట్లు చెప్పెను—'ఇంక
ఆరు నెలలవఱకు నాడినఁగాని చూడదలఁచుకొన్నవా రంద
ఱును చూడలేరు, ప్రతిదినమును క్రొత్తప్రజలే వచ్చుచుం
దురు,' కంపెనీవారు ఈనాటకమును సంవత్సరముపాటు ఆడ
నిదే పర్దాలు మున్నగువానికై వారు వెచ్చించిన పెట్టుబడి

ద్రవ్యముపోను లాభము మిగులదు.” నాటకరంగమున యాదార్థ్యభ్రమకల్పించుట కెంత ద్రవ్యమైనను యూరపి యను నాటకసమాజములవారు ఖర్చు పెట్టుదురఁట! అంత ద్రవ్యమును మనము వెచ్చింపలేకపోయినను వెచ్చించు ద్రవ్యమైనను ఉచితముగ వినియోగించు టావశ్యకము.

ప్రేక్షక మండలి

ప్రేక్షకమండలిలో అన్నివిధములైన శిక్షణముగల మనుష్యులుందురు. బహిర్వేషములను చూచి “వీరు నిక్కువ మైన కళాభిరుచిగలవా”రని యూహించుట యసాధ్యము. నేనట్లూహించి చాలసారులు పొరపడితిని. ప్రేక్షకునికొక దురభ్యాసముగలదు. అది దురభ్యాసమే కాదు, దురభి రుచియు. ఒక నటకుఁడు శ్రావ్యముగఁ బద్యమునో పాటనో పాడినవెంటనే (Once more, Once more) అని కేకలువేసి చప్పటులు తట్టును. హల్వా తీపుగానున్నదని అజీర్ణవ్యాధి పుట్టువఱకుఁ దినవలయునని వీరిమతము కాబోలు! ముక్కు ఒకవేళ అందముగానున్నదని మఱిరెండుముక్కులు చేయించు కొని చెంపలకతికించుకొనుటకు వీరిష్టపడుదురా? పునరుక్తి యితరశిల్పములం దెంతదోషమో అంతకన్న నాటకకళ యందును మహాపాతకము. శ్రుతిచాపల్యముచేత నొకపద్య మునకుఁ జెప్పఁబడిన Once more ను మన్నించెదమను కొన్నను సీనునకంతయు Once more చెప్పు ప్రేక్షకుల యభి రుచి మన్నించుటకు వీలుకానిది. అల్లూరు నాటకసమాజము వారు రామదాసు నాటకమును నాగరకులకు ఆకరమైన

యొకపురమునఁ బ్రదర్శించినపుడు అచ్చటి ప్రేక్షకులు అహామక్కా-సీను పునరభినీతము గావలయునని ప్రార్థించిరఁట!!

నటకుని సద్యః ప్రేరితమైన యభినయములోని యౌచిత్యమును సౌకుమార్యమును సూక్ష్మతను గ్రహించుటకంటె పాటలోని మాధుర్యమును జవిసూచి యానందించుట తేలిక. కావునఁ జాలమంది మెచ్చుకోలు పాటపద్యములకు సంబంధించియుండును. నేను జూచినంతవఱకు మెచ్చుకోఁదగిన అభినయమునకు Once more చెప్పిన ప్రేక్షకులు చాల అరుదు. చేయికదలింపనేరని నటకుఁడుగూడ రాగయుక్తముగ పాడె నేని ప్రేక్షకమండలి యాతని నద్భుతమైన నటకునిగ శంకించి బంగారు పతకముల దానము చేయుచుండును.

ఇఁకమీఁద నెన్నటికైనను కవి నటక ప్రేక్షకుల సహాకార సాహాయ్యముల చేతనే నాటకశిల్పము సంస్కరింపఁ బడవలయును; అభ్యున్నతి నొందవలయును. ఈ ముప్వురును వారి వారి బాధ్యతను జక్కఁగఁ గుర్తెఱిఁగి ప్రవర్తింతురేని నాటక కళకు మంచిదినములు రానున్నవని నా తలంపు.

ఈ వ్యాసమునందలి నా యభిప్రాయములు నాట్యశిల్పమును నిబద్ధీకరించు బిరుసు సిద్ధాంతములుగావు. స్నేహపూర్వకమైన సలహాలు; కావుననే దిద్దుకొనుట కనుకూలములు.

అల్లసాని పెద్దన :
సమకాలీన భావ ప్రతినిధి

సమకాలీన భావములు సాంఘిక పరిస్థితులు కావ్య దర్పణమునందుఁ ప్రతిఫలించుచుండును. కవి స్వతంత్రుఁడయి పూర్వాచార బద్ధుఁడు కాకపోయినయెడల రచనాపద్ధతి యందును కావ్యవస్తు నిర్ణయమునందును భావ ప్రకటనము నందును దన కాలమునందు వ్యాప్తిలోనుండు పద్ధతులను గ్రహించును, లేక క్రొత్తభంగుల నావిష్కరించును. లక్షణములు ప్రతిభావంతులైన కవులరచనల పరిశీలనము వలనఁ దేలిన సామాన్యధర్మములే కావున, అట్టి కవులను అన్యలక్షణములు బంధింపలేవు. ఒక్కొక్కప్పుడు వారిరచనలు పూర్వ సంప్రదాయములకన్న బిన్నములుగనుండి మార్గదర్శకము లగును. ఒక్కొక్క కాలమునకు ఒక్కొక్క సంప్రదాయము రూఢియై యుండును. ఒక కాలముయొక్క సృజనశక్తి తగ్గిన యనంతరము సంప్రదాయము కరుడుకట్టును.

శాస్త్రముకాని శిల్పముకాని ఏకాలమందైనను అప్పటి కన్న నభివృద్ధిచెందుటకు వీలులేనంత పరిపూర్ణత చెంది యుండదు. నిర్దోషతయును బరిపూర్ణతయును ఈ లోకము నకు సంబంధించిన గుణములు గావు. కవి కేవలము క్రొత్త పద్ధతులను గనిపెట్టవలయునను దీక్షతో పద్మాసనము వేసి కొని కూర్చుండఁడు. ప్రాచీన సంప్రదాయములు నిస్సారము

లయి పండిన పండ్లవలె కాలక్రమమున వృంతచ్యుతములగును. కాలూరఁ దిరుగ నేర్చిన బిడ్డ రక్షకత్వగర్వము వహించిన ముసలి దాది పట్టియుంచినను పెనఁగులాడి పట్టు వదలించుకొనునటుల స్వతంత్రమైన కవిహృదయము సంకుచిత నియమ బద్ధముగాక యెదురుతిరుగును. అసంతృప్తి కలిగినప్పుడు అజ్ఞాతముగనే కవిప్రతిభ అనుకూలమైన ప్రచలనావరణము నేర్పఱచుకొనును. ఈ కార్య మాతనియందు అప్రయత్నముగనే జరిగిపోవుచుండుట వలన స్వాభావికముగ నుండును: కవి నిరంతరము నేక సంప్రదాయ బద్ధుఁడే యైన యెడల రచనలయందు వివిధత్వముండదు. ఇట్లనుటచేత కవి నియమరహితుఁడని చెప్పుటగాదు. స్వయంకల్పిత నియమములు కలవు. నియమబద్ధముగాని శిల్పమునందు ఔచిత్యముండదు. అరాజకత్వముండును. స్వాతంత్ర్యముకూడ నియమబద్ధమె.

జాతీయ జీవితప్రవాహమును ఆనకట్టలుకట్టి నూతన మార్గముల మరలింపఁగల నాయకులు, కవులు, చారిత్రక మహాపురుషులు ప్రతిదినమును పుట్టుచుండరు. అట్టివారిని సృజించుటకుఁ బ్రకృతికూడ కొంతకాలము వేచియుండి శక్తిని సంపాదించుకొనవలయును. అట్టి ప్రతిభావంతులు పుట్టినపుడు ఆ కాలమునకు వారివాక్కు ప్రాతినిధ్యము వహించును.

ఆంధ్రదేశ రాజకీయ చరిత్రమునందు కృష్ణదేవరాయల రాజ్యకాలమొక సువర్ణఘట్టము. హరిహరరాయలచేఁ బ్రారంభింపఁబడిన విజయనగరసామ్రాజ్యము కృష్ణదేవరాయలనాఁటికి బరిపూర్ణతనొంది, భోగభాగ్యములఁ దులఁ

దూగుచు నడిమింటి సూర్యునివలెఁ బ్రకాశింపఁజొచ్చెను. తెలుఁగు శౌర్యము, తెలుఁగుకీర్తి నల్గడలఁ బ్రసరించెను. ఆకాలమునందు ఆంధ్రసారస్వతమును కళలును విశేషముగ వృద్ధిచెందినవి. "గులాబిపూవు లంతటను అమ్మబడుచున్నవి. ఆప్రజలు గులాబిపూలను ఆహారముకంటె ఆవశ్యకములయినవిగా భావించుచుండిరి." ఇఁక విజయనగర ప్రజల నాగరకతయు సౌందర్య ప్రీతియు భోగలాలసత్వమును వేఱుగఁ జెప్పవలయునా?

పరస్పర భిన్న ప్రకృతులుగల రెండు నాగరకతలకు సంబంధము గలిగినప్పుడు రెంటి యందును గొంత మార్పు గలుగును. బలిష్టమగు నాగరకత దుర్బలమగుదానిని మింగివైచి, తనయందు జీర్ణించుకొనును. అట్లుకాక రెండును తుల్యబలయుతము లయ్యేని ఇచ్చిపుచ్చుకొనుటలు, అనుకరణములు, ఆత్మీకరణములు జరుగుచుండును. భిన్న నాగరకతల సంఘర్షణము అభివృద్ధికి అత్యంతావశ్యకము. ఈకాలమున ఆంధ్రదేశమునందు హిందూ మహమ్మదీయ నాగరకతలకుఁ గొంత సంబంధమును స్పర్ధయుఁ గలిగినది, "ప్రాతయొక రోత, క్రొత్తయొక వింత" యనునట్లు మొగలాయీల భోగప్రియత్వము విజయనగర ప్రజలకు వచ్చినది. మహమ్మదీయ స్త్రీల రవికెలు పావడలు ఆంధ్రకాంతల మనముల నాకర్షించినవి.

విజయనగరము సుమారు నూటనలుబది చదరపు మయిళ్ళ వైశాల్యముగల గొప్ప పట్టణము. ఆంధ్రసామ్రాజ్యమునకు రాజధాని. సింహాళమునుండికూడ సామంత నృపా

లురు రాయలకు కప్పములను చెల్లించుచు రాయబారులను పంపుచుండిరి. పోర్చుగీసు సిపాయిలుకూడ కృష్ణదేవరాయల దండయాత్రలందు పాల్గొనుచుండిరి. వ్యాపారము నిమిత్తము వివిధ దేశముల ప్రజలు ఆపట్టణమున నివాసమేర్పఱచుకొని సుఖజీవనము సల్పుచుండిరి. చక్కని నీటివసతి యేర్పడుట వలన ఎచ్చట చూచినను పైరుపచ్చలు చెట్టుచేమలు ద్రాక్ష తోఁటలు బలిసియుండినవి. విజయనగరమను మూసయందు వివిధసంప్రదాయములు, ఆచారములు, నాగరకతలు కరఁగి నూతన నాగరకతగ కరుడు కట్టుచుండినది. కృష్ణదేవరాయల దండయాత్రిలలో పాల్గొనని కుటుంబము విజయనగరమున నుండియుండదు. విజయగర్వ మొకవంకయు, విరోధి పట్టణములు కొల్లగొట్టుటవలన ప్రాప్తించిన ద్రవ్య మొక వంకయుఁ బ్రజల ఆత్మగౌరవమునకు సుఖజీవనమునకు సాయపడుచుండినవి. దేశానురాగము స్వభాషానురాగము పొటమరించినది. తెలుఁగు మాటకుఁ జెల్లుఁబడి హెచ్చినది. "దేశభాషలందుఁ దెలుఁగులెస్స" యను నానుడి పుట్టినది.

ఇట్టి సందర్భములలో సంఘమునందు స్వాతంత్ర్య ప్రీతియుఁ బూర్వాచార వైముఖ్యమును హెచ్చినదనుట యతిశయోక్తిగాదు. ఈమార్పు ఆనాఁటి సారస్వతమునందును గోచరించవలయును. రాయల యాస్థానమునందు అల్లసాని పెద్దన, నంది తిమ్మన, అయ్యలరాజు రామభద్రుఁడు, పింగళి సూరన, ధూర్జటి, మాదన, రామరాజ భూషణుఁడు, తెనాలి రామలింగన్న అను అష్టదిగ్గజము

లుండిరని ప్రతీతి కలదు. వీరి సమకాలీనతలోఁ గొంత కాలవిపర్యాసదోష మున్నది. ఒకవేళ ఉండిరనుకొన్నను. వీరిలో నెవ్వరి రచనయందు ఆనాఁటి పరస్పర భిన్నాదర్శక సంఘర్షణమును నూతన దృక్పథమును గనఁబడుచున్నది? పెద్దన మనుచరిత్రమునందు. కృష్ణదేవరాయలకు పెద్దనపైఁ బ్రీతిగౌరవములు మిక్కుటము. కావుననే—

సీ. "ఎదురైనచోఁ దన మదకరీంద్రము డిగ్గి
కేలూఁతయొసఁగి యెక్కించుకొనియె;
మనుచరిత్రం బందుకొనువేళఁ బురమేఁగఁ
బల్లకిఁ దన కేలఁ బట్టి యెత్తె;
బిరుదైన కవిగండపెండేరమున కీవె
తగుదని నాదు పాదమునఁదొడిగెఁ
గోకట గ్రామాద్య నేకాగ్రహారము
లడిగిన సీమల యందునిచ్చె;

గీ. ఆంధ్రకవితా పితామహ యల్లసాని
పెద్దనకవీంద్ర! యని నన్నుఁబిలిచె...."

ఇట్టి సత్కారమును గౌరవమును కృష్ణదేవరాయలు మఱే కవికినిఁ జేసియుండలేదు. పెద్దన రాయలకుఁ బ్రియస్నేహితుఁడు కూడ. రాజు వేఁటకు వెడలునప్పుడు కవీంద్రుని వెంటఁబెట్టుకొని పోవుచుండెనఁట * కడపజిల్లా

* గూడూరులో సబ్‌రిజిస్ట్రారుగా నుండిన నీలం గోవిందరాజులు నాయుడుగారు, బి. ఎ., బద్వేలియందున్నప్పుడు ఆసరస్సును దర్శించితని నాతోఁజెప్పిరి. వారియొద్ద పెద్దన వంశవృక్షముకూడ కలదు. ఈ నాయుడుగా రిప్పుడు స్వర్గస్థులైరి.

బద్వేలియందొక సరస్సుగలదు. పెద్దన వేఁటకువచ్చినప్పుడా సరస్సులో స్నానము చేయుచుండెనని యచ్చట ప్రజలు చెప్పుకొనుచుందురఁట.

"ఆంధ్రకవితా పితామహుఁడ"ని కృష్ణదేవ రాయలు పెద్దనను సంబోధించుట కేవలము ప్రీతి మూలక మనియుఁ. దక్కినవారి రచనలకన్న అందు ముఖ్యముగా నందితిమ్మన కవిత్వమునకన్న పెద్దన కవిత్వమేమంత రస వంత మనియుఁ గొందఱు వితర్కింతురు. అది కేవలము ప్రీతిమూలక సంబోధనముగాదు. పెద్దన కవిత్వమునందు సౌకుమార్యము, తెనుఁగుమాటల తియ్యందనము, తేలిక మాటలలో నియమింపఁబడిన భావగాంభీర్యము, ప్రకృతి రామణీయక ప్రీతియు, నవ్యతయుఁ గలవు. పెద్దన ప్రబంధపు నమూనాను సృజించినవాఁడు కాకపోయినను, ఆంధ్రీకరణము గాక స్వతంత్ర కథావస్తువును గ్రహించి కావ్యము రచించి నూతన సంప్రదాయ మేర్పఱచెను. శ్రీనాథుని నైషధము ఆంధ్రీకరణమయ్యును స్వతంత్ర ప్రబంధమువలె నొప్పారుచు పెద్దనకు మార్గము సిద్ధపఱచెను.

ఇతివృత్తము మార్కండేయ పురాణము నుండి గ్రహింపఁబడినది. తన మనమును ఆందోళనపఱచుచున్న భావయుద్ధమును ద్వైధీభావమును ప్రతిఫలింపఁజేయుట కనువైన కథనే కవి యేర్పఱచుకొనెను. మూర్తీభవించిన రెండు ఆదర్శకములు మన కన్నులయెదుటఁ బొడకట్టు చున్నవి. ఒకటి: హృదయములేని నైతిక కర్కశత్వము, రెండు: భోగలాలసత్వము. మొదటిదానియందు ఆచార

పరాయణత్వమును రెండవ దానియందు మానవత్వమును
గలవు. కవి యీ రెండు ప్రకృతులను సృజించి శీలపోషణ
మునందుఁ దారతమ్యము జూపించి యొకదాని కొకటి
భిత్తిగ నొనరించెను.

ఆంధ్ర దేశమునందు భిన్నమతములు ప్రబలుటవలన
వైదిక మతమునందును వర్ణాశ్రమధర్మములందును ప్రజ
లకుఁ గొంత అశ్రద్ధ జనించినది. మాధవ శాయణులు వేద
భాష్యమును రచించియు రాజకీయ విషయములందుఁ
బాల్గొనియు వైదికమతమును గొంతవఱకుఁ బునరుద్ధరించిరి.
కాని, కాలక్రమమున ఆ యుద్యమముగూడ సన్నగిల్లినది.
దేశపరిస్థితులు సౌమ్యముగ లేవు; మాటిమాటికి యుద్ధ
ములు, కొల్లలు. సర్వజన సామాన్య కష్టములు కలుగు
చున్న సమయములందు నీతులు ఆచారములు వర్ణాశ్రమ
ధర్మములు నిర్వర్తింపఁబడుటకు వీలులేదు. యుద్ధకాలము
లందు వర్ణసాంకర్యము సామాన్యము.

ఒక జాతిగాని సంఘముగాని బలశౌర్యములు గలిగి
పరాక్రమవంతమై యితర జాతులపై దండయాత్రలు వెడలి
జయముగాంచినప్పుడు ఆవిజయఫలము ననుభవించుచు వారు
భోగపరాయణులయ్యెదరు. వైరాగ్యము మందునకైన లభిం
పదు. గృహస్థ జీవితమె ఆదరణీయమగును మతము అభ్యాస
వశమున అర్థములేని యాచారముగ మాఱియుండునేగాని,
దైనందిన జీవితమునందు దాని యావశ్యకత అంతముఖ్యముగ
దోఁపదు. కృష్ణదేవరాయల రాజ్యకాలమునందొకప్పు డిట్టి
పరిస్థితులు సమకూడినవి. పెద్దన హృదయమును వంశపారం

పర్యాయముగ వచ్చు ఆచారప్రీతి యొకవంకకు, నూతన గతులు మఱొక వంకకు ఆకర్షింపఁజొచ్చినవి. ఈ గుంజులాటయె వరూథినీ ప్రవరుల వ్యవహారమునందు మనకు గోచరించును.

కవికి ఎవరిపై ప్రీతియెక్కువ? వరూథినియందా లేక ప్రవరునియందా? ఈ విషయము గనుగొనుటకు సాధ్యమగునా? ఈ రెండు పాత్రలను కవి చిత్రించిన విధమును విమర్శించితి మేని. ఈరహస్యము బయలు పడును. కవుల కిట్టి పక్షపాతముండునా? ఏల యుండకూడదు? వారును మానవులే! వారికిని రాగ ద్వేషములు కలవు. ఇష్టానిష్టములు కలవు. మానవుని లోపత్వమునందును అసంపూర్ణతయందును కవికి సానుభూతికలదు. అపుడే యాతఁడు మానవ స్వభావమును గుర్తించినవాఁడగును. పీడించుటయు వేధించుటయు నీతియుతమైనను నీతిబాహ్యమైనను రసార్ద్రహృదయుని చిత్తమును గాయముసేయును. "ధర్మమునిర్వర్తింపవలయును· పరధర్మముకంటె స్వధర్మము శ్రేయము" అని చెప్పఁబడినది. ఎఱుకలవాని ధర్మము పక్షులను జంపి జీవించుట. అయినను, వాని కలకుటమ్మునకు గుఱియైన క్రౌంచముయొక్క దుస్థితిని జంట పక్షియొక్క శోకావేగమును గాంచినప్పుడు నవనీత సదృశమైన వాల్మీకిచిత్తము కరఁగి ధారలుధారలుగ స్రవించినది. యజ్ఞముసేయుట అధర్మముగాదు; బలిపీఠముయొద్దకుఁ దీసికొని పోఁబడుచుండిన గొఱ్ఱెపిల్లను బుద్ధభగవానుఁడు చూచినప్పుడు ఆ మహాపురుషుని హృదయము కరుణారస తరంగితమై దానిని కాపాడుట కుద్యుక్తుఁడాయెను. ధర్మము హృదయములేని యంత్రము, మానవుడు హృదయముగల

యంత్రము. రాముఁడు స్వప్రయోజనమును సాధించుట కొఱకు అక్రమముగ వాలిని సంహరించెను, వాల్మీకి యీ విషయము నెఱుంగును; ఆక్రోశ నినాదముచే దిక్కులు మాఱుమ్రోగించుచున్న తారపై ఆ మహాకవికి మిక్కుటమైన సహానుభూతికలిగి, రాముఁడు జవాబు చెప్పుటకువీలు లేని ప్రశ్నలను ఆమెచేతను వాలిచేతను నడిగించెను. తరువాత రాముని ధర్మైకపరత్వమునకు హానికలుగునని శంకించి తాను వత్తాసివచ్చి రాముఁడు దేవుఁడు గావున ఆయనచేసినదంతయు ధర్మమనిచెప్పి పైపెచ్చు వాలిచేత గూడ నొప్పించెను? వ్యాసుఁడు పాండవ పక్షపాతి; వారు ఇడుమలు పడిరన్న కనికరముచే వారి తప్పులకు సున్నపుపూఁతలుకొట్టి మాలిన్యమును మాయించెను. తమ సృష్టులను తామె మోహించిన వారు కూడ కలరు? వీరిలో పైగ్మాలియన్ అను గ్రీకు శిల్పి ముఖ్యుఁడు. ఆతఁడొకరమణీయవతియగు స్త్రీ విగ్రహమును చలువఱాతితో నిర్మించి ఆ సౌందర్యమునకు ముగ్ధుడయి మోహించి తన పడకటింటఁ బెట్టుకొనెనఁట!

ప్రవరుఁడు నీతిశాస్త్రమునందు నిర్ణయింపఁబడిన కొలతలకు సరిపోవునట్లు కత్తిరింపఁబడిన తోలుబొమ్మ. వరూథిని విద్యుల్లతవలె మనకన్నుల యెదుట సంచరించు జీవమూర్తి! బయాస్కోప్ చిత్రము. వరూథిని చైతన్యము పరిస్ఫుటముగ గోచరించుటకు ప్రవరుఁడు సృజింపఁబడెను. కవికి ఆతనిపై సానుభూతిలేదు. "బుద్ధి జాడ్య జనితోన్మాదుల్ గదా శ్రోత్రియుల్!" అని ప్రవరుఁడు తన లోకజ్ఞాన

శూన్యతను అత్యద్భుతప్రాయముగ ఒప్పుకొనెను. ఈ వాక్యము వేఱుసందర్భమునఁ జెప్పఁబడినప్పటికిని ఆతని శీలమును ఆ వాక్యార్థము నిరంతర మాపాదించియే యుండును. పాదలేపము కరఁగిపోయిన యనంతరము తన నిస్సహాయతను గుఱించి దుఃఖించుచున్నప్పుడు మన కథానాయకుని సంగతులు మఱికొన్ని బయలుపడును. తల్లిదండ్రులకుఁ దానొక్కఁడె యల్లారు ముద్దుబిడ్డ. పెండ్లియయి శిష్యులకుఁ బాఠము చెప్పు వయస్సు వచ్చినప్పటికిని, తన్నుఁజూడని దె తండ్రి యొక నిమిషమైన నోర్చుకొని యుండలేఁడు. అసర సందెవేళ ఈ బిడ్డ బయట కాలుపెట్టిన యెడల బూచులు పట్టుకొనునను శంకచే వాకిలి దాటనీయక తల్లి యెల్లప్పుడు రక్షించుచుండును. ప్రవరుఁడు తల్లిదండ్రుల ప్రేమాతిశయముచేతను అనావశ్యకమగునంత జాగ్రత్త చేతను, నిస్సహాయుఁడుగను లోకజ్ఞాన రహితుఁడుగను జేయఁబడిన అమాయకుఁడు. వరూధిని చెలికత్తె యాతఁడు "గోలయుగా బాలుఁడు" అని కనిపెట్టినది.

ప్రవరుఁడు మృగమదసౌరభము మోసికొనివచ్చు మందమారుతము వలన అచ్చోటు జనాన్వితమని తెలిసికొని చేరఁబోయి యొక దేవకన్యను గాంచెను. ఆమెయె వరూథిని. ఆ యువతి యసమాన రూపలావణ్యవతి; సౌందర్యమునుగాంచి యానందించుటయు దానిని మెచ్చుకొనుటయు అనీతికరము గాదు కాని, మన నీతిమంతుని చిత్తము సౌందర్య ప్రతిరోధకమైన కవచమునందు మగ్గిపోయినది; పాపా

జాత్యమో ధీరత్వమైన యెడలఁ బ్రతిమంటప స్తంభమును ధీరుఁడే!

నిరుపమాన సౌందర్యవతులైన కామినులయెదుట లోకమే యెఱుఁగని ఋష్యశృంగునివంటి ఆజన్మ మునీశ్వరులును. అపారసంకల్పశక్తిసంపన్నులైన విశ్వామిత్రులవంటి యోగీశ్వరులును చలించిరి. ఇంతయేల? "బమ్మకైనఁబుట్టు రిమ్మ తెవులు" ఇట్లు చిత్రించినవారు మానవ స్వభావము యొక్క లోతుపాతుల నెఱింగిన మహాకవులు. నీతిశాస్త్రమునకు వెఱచి శిల్పమును త్యజించినవారు గారు. ఆ కాలమునందు ఆర్యసంఘ మింతటి యాచారబద్ధము కాదు కాఁబోలు!

ప్రవరుఁడెట్లు చిత్రింపఁబడియుండినఁ బ్రాణవంతుడుగ నుండెడివాఁడు? ఆయన యింతకుముం దెన్నఁడును వరూధినివంటి యందకత్తెను జూచియెఱుఁగడు, చూచినప్పుడు ఆశ్చర్యపడి యుండవచ్చును. అనంతరము మానవప్రకృతికి సహజమగు కోరిక పుట్టియుండవచ్చును. మఱుక్షణమునందే—ఆలి మగనికి అన్యకాంతలపై మనసు తగులుట యోగ్యముకాదు. తుచ్ఛసుఖములు "మీసాలపై తేనియ" లని విరక్తిపుట్టియుండవచ్చును. మఱల ఆ లతాంగి రామణీయకమునకు వశుఁడయి, "అప్సరస, అందును నేను వలపింపలేదు, నన్ను వలచినది, అనన్యగృహీత, నేనేల భోగింపరాదు?" అని తన మనమును సమాధాన పెట్టుకొని యుండవచ్చును. మఱునిముసమునందె "ఇంతకాలము అవిచ్ఛిన్నముగ నెఱవేర్పఁబడిన నావ్రతమునేల నేఁడు భంగముచేసికొనవలయును?" అని నిరతము తనమనములో వర్తించి అను

సూలవతియైన యిల్లాలిని అన్యాయము సేయుటగాఁ దలంచి, ప్రయత్నపూర్వకముగఁ దనకోరికలఁ జిక్కఁబట్టవచ్చును. ఇట్టి పరస్పర భావసంఘర్షణమునుండి ధీరుని సంకల్పము నిర్మలమయి దృఢమయి యెట్టకేలకు జయము నొందును ప్రవరుని యీ మనోనాటకము మనకుఁ జూపట్టినచే యాతనిపై మనకు సానుభూతి కలుగును; లేకయున్న అతఁడుపాషాణహృదయుఁడని దూషింతుము.

పెద్దన కీ శిల్పనైపుణ్యము కొఱవడి యుండినదా? కొఱవడియుండిన అంతటి మానుషత్వముగల వరూథిని నెట్లు సృజింపఁగలడు? అట్లయినఁ బ్రవరుని ఏల యిట్లు యంత్రవిగ్రహముగఁ దీరిచెను? ఒకటిరెండు కారణములు కలవు. పెద్దన రాజసము కలవాఁడు. "రమణీ ప్రియదూతిక తెచ్చి యిచ్చు కప్పురవిడె మాత్మకింపయిన భోజన ముయ్యెలమంచము" కావలసిన భోగప్రియుఁడు. పోతనవలె "హాలికులైన నేమి!" యని స్వశ్రమార్జితము పట్టెఁడన్నము తినుటకు వలయు త్యాగశక్తికలవాఁడు కాఁడు. కావుననే రాజాశ్రితుఁడు. పూర్వాచార ప్రియమైన పండితాభిప్రాయమును బొత్తిగ నిరశించుటకు వీలులేనివాఁడు. అందువలన, పండితలోకమును సంతృప్తిపరచుటకై ప్రవరుని ఆవిధముగఁ జిత్రించెను. జీవితయాత్ర సునాయాసముగ జరిగిపోవుట కిట్టి రాజీయే అవసర మేమో!

పెద్దన ప్రవరుని అంతటి కర్కశహృదయునిగ సవరింపక పోయినయెడల మనుచరిత్ర అధమకావ్యమని దూషింపఁ

బడియుండెడిది. వరూథినిపైఁ గనికరము చూపెనని ఇప్పటి కిని పెద్దనపైఁ గత్తినూఱు నీతిమంతులు గలరు!

"కలంచునే సతుల మాయల్ ధీరచిత్తంబులన్" అని పెద్దన వ్రాసెను. మన యాలంకారిక సంప్రదాయము ప్రకారము ఒకవేళ ప్రవరుఁడు ధీరుఁడైనఁ గావచ్చునేమొ కాని, పాపము! వరూథిని మాయలాఁడి యెట్లయినది! మాయలాఁడియయ్యేను సతియయ్యేనేని దోషము లేదుగదా, తెలుఁగు కవులు సంస్కృతి కవులవలె పదప్రయోజనము పాటించువారు కారనియు, పెద్దన 'సతి'ని కేవలము స్త్రీ పర్యాయపదముగ వాడెననియు సమాధానము చెప్పుకొన్నను వరూథిని పన్నిన మాయ లేవి? ఆమె వలచినది; వలచుట మాయలాఁడితన మైనయెడల ఆమెయు మాయలాఁడియె. పెద్దన గారాబపు తిట్లు తిట్టుచున్నాఁడు కాఁబోలు! లేక మొగమాటపు తిట్లో!

వరూథిని కన్యక – అనన్యగృహీత – నిష్కల్మషమైన ప్రేమగలది; మొట్టమొదట ఎవనిని ప్రేమించెనో అతనినే వివాహమాడినది (గంధర్వుని మోసము తెలియదుగావున) ధనమార్జించుటకొఱకుఁ బ్రవరుని ప్రేమించుట లేదు. లేని ప్రేమ నటించుట లేదు. జారిణికి ఇంతటి గాఢానురాగ మెక్కడిది? "ఇందుని భాస్వవాఁ డనఁగ నింద్రుఁడో చంద్రుఁడో యా యుపేంద్రుఁడో" అని చెలికత్తెలు ఆతనిపై లాఘవము పుట్టించుటకు యత్నించినను "ప్రాఁతపసిండివంటి వలపుంబచరించుకులంబునీతికిన్, లేఁతగదమ్మ" అని దుర్నీతులు బోధించినను చెవినిబెట్టక ప్రవరునే వరించినది. ఆమె

యచ్చర కోలమున నుద్భవించినను ప్రవర్తనము భిన్నము. తుదకు పేశల హృదయ. ఆత్మహత్యకూడ చేసికొన ప్రయత్నించినది. వరూధిని ప్రవరుని వరించునప్పటికిఁ గన్యాత్వము చెడినది కాదు "ఆవధూటి ప్రథమసురతంబు గంధర్వపతిఁ గరంచె" అని చెప్పఁబడియున్నది.

వరూధిని ప్రవరుల సంగమము తన కిష్టమయ్యును కవి వదలివేసెను. అందుకు పరిహారముగ మాయాప్రవరుని మూలమునఁ గొంత రహస్య సంతృప్తిగాంచెను. కవి చంద్ర వర్ణనమునందు (సందేశమునకుఁ దావుండదు గదాయని) తన యభిప్రాయమును వెల్లడించెను. "ప్రకృతి నచ్చుండైన సన్మార్గి యెన్నటికిం గూటమివంక వచ్చు వికృతిఁగా మగ్నుండుగానేర్చునే" అని వెల్లడించెను. ప్రవరుఁడు శుద్ధప్రకృతికిఁ గలిగిన వాఁడేయైనయెడల వరూధినీ సంగమమువలన వచ్చు వికృతికి భయపడవలసిన యవసరముండదు, అది క్షణికము. ప్రవరుఁడు అసంతృప్త హృదయమును సంతోషపెట్టి యోదార్చి పోయి యుండవచ్చును.

రావణుఁడు సీత నెత్తుకొని పోయినప్పుడు రాముఁడు పలవించెను. ఆ శోక వేదనకుఁ జెట్లుకూడ తలలువాంచి యల్లాడెను. ప్రకృతియంతయుఁ గన్నీరునించెను. పెద్దనకూడదుఃఖిత యగు వరూధినిపైఁ బ్రకృతి కనికరించినదని వర్ణించెను. కర్మసాక్షియగు సూర్యభగవానుఁడు ప్రవరుని పాషాణహృదయత్వమునకు వెక్కసమంది రోషభీషణ స్ఫురణావహించెను:

> తరుణి ననన్యకాంత, నతిదారుణ పుష్ప శిలీముఖ వ్యథా
> భరవివశాంగి నంగభవు బారికి నగ్గము సేసి క్రూరుఁడై

యరిగె మహీసురాధముఁ డహంకృతితో నని రోషభీషణ
స్ఫురణ వహించెనో యన నభోమణి దాల్చెఁ గషాయదీధితిన్ !

ప్రవరుఁడు క్రూరుఁడు – మహీసురాధముఁడు – అహంకార యుతుఁడు—శేబాష్! పెద్దనా, ముసుఁగులో దాఁగుకొని నీ అక్కసు వెళ్ళబుచ్చినావు! కసిదీర్చుకొన్నావు! ఈ సహానుభూతియె, యీ హృదయ వైశాల్యమె నిన్ను మహాకవి పట్టమునకు అర్హుని జేయుచున్నది.

వరూధిని ప్రశ్నలలో వాద నైపుణ్యము తెలియుచున్నది, ప్రవరునివి చప్పిడిజవాబులు, 'యజ్ఞకోటులం బావను లౌటకున్ ఫలము మా కౌఁగిళ్ళ సుఖించుటేగదా! క్రతువు లొనరిఁచుట స్వర్గభోగములకొఱకు, స్వర్గమునందు అవశ్యానుభోక్తవ్యమును ధర్మమును యోగ్యమునైన రంభాది భోగములు ఇచ్చుటయేల నిషిద్ధములయ్యెను? ఆశ్రమముగ సశరీర స్వర్గసుఖము సమకొనియుండ వ్రతోపవాసములఁ గృశుఁడవయి ఆత్మ నలఁచుట యెందుకు?' అని వరూధిని ప్రశ్నించుచున్నది.

పెద్దన కళానైపుణ్యమును గుఱించి యొకటి రెండు విషయములు సూచించి యీ వ్యాసము ముగించెదను. ఈ కవికిఁ బ్రకృతి రామణీయక ప్రీతి విశేషముగనున్నది. పద లాలిత్యము—అందు ముఖ్యముగఁ దెలుఁగుమాటల తియ్యని పోకడలు ఈతనియొద్ద నేర్చుకొనవలయును. 'అల్లసానివాని యల్లిక జిగిబిగి' అను పూర్వ విమర్శకాభిప్రాయము నానుడియై యున్నది. పెద్దన కవిత్వము లలితముగఁ దీర్చి దిద్దఁబడి యున్నదనుటకు సందియము లేదు. "నిలుకడ

వలయుఁగృతికి'' అను అప్పకవి వచనమునందుఁ గళారహాస్య మున్నది. ఒక మనుచరిత్రమే కాదు—కొంచెమించుమించు పూర్వకావ్యములలో చాలవఱకు నిలుకడగా రచింపఁబడినవే. ''ఏకైక దినప్రబంధఘుటికా సద్యశ్శత గ్రంథకల్పను'' అని రామరాజభూషణుఁడు తన్ను గుఱించి చెప్పుకొనియున్నను వసుచరిత్రము ఒక్క దినములో వ్రాయఁబడిన ప్రబంధము కాదు కడపటి సవరణయయి పూర్తియయిన దనుటకు కొన్ని సంవత్సరములు పట్టియుండును; అనఁగా తన జీవిత కాలమునందు రెండుమూడు కావ్యములకన్న నెక్కుడుగ రచించియుండఁడు. (నెఱవడి కుదురుటకై వ్రాయఁబడు కాపీ పుస్తకములవంటివి యెన్నియేని ఉండవచ్చును, అవి లెక్క లేదు.) ఆ కాలమున రాజాస్థానములె కవులకు శరణ్య ములు. ఆస్థానపండితులు స్థనశల్య పరీక్షచేయు బిరుసు విమర్శకులు. ఇట్టి అగ్నిపరీక్షలో తేరి తెప్పరిల్లిన కావ్యములె గౌరవ యోగ్యము లగుచుండెడివి. ఇట్లనుట వలనఁ బూర్వ కావ్యములన్నియు సీతరగతికిఁ జెందినవని కాదు.

ఇప్పటి పరిస్థితులు వేఱు: వార్తాపత్రికలు|మాసపత్రి కలు ప్రబలినవి. ఆపత్రికల పుటలు నిండుటకు విషయములు కావలయును. కవులును, వ్యాసకర్తలును ఏదో యొక మొగమోటమిచేత ఏదియైన కొంత (కాగితములు నిండు టకు) వ్రాసిపంపవలసి యుండును. కాగితముపైని సిరాతడి యారకముందె ఖండకావ్యము పోస్టులోఁబడును. ప్రూఫులు సరిచూడక పూర్వమె (అవకతవకగా చూచి యని యర్థము)

పత్రికలలో ముద్రింపఁబడును. పత్రికాధిపతులు మంచి సెబ్బరలు పరిశీలించి ముద్రించుటకు వీలులేదు. అట్లయిన వారిపుటల నియమమునకు హాని గలుగును. ఇట్టి పరిస్థితులలో నిలుకడ నియమ మెట్లు కొనసాఁగును? తన గ్రంథము తొందరగ బ్రకటింపఁబడవలయునను అక్కఱ పెద్దన కుండి యుండదు.

> Take time for thinking; never work in haste
> And value not yourself for writing fast ;
> A rapid poem with such fury writ ;
> Shows want of judgment not abounding wit
>
> *　　　*　　　*
>
> A hundred times consider what you have said ;
> Polish, repolish, every colour lay,
> And sometimes add, but often take away.
>
> —*John Dryden.*

అను ఇటువంటి రచనా నియమమును పెద్దన చాల జాగరూకతతోఁ బాటించినట్లున్నది.

ద్రౌపది, కైకేయి, చిత్రాంగి మున్నగువారివంటి నాయికలు మన సారస్వతమునందు అరుదు. కొంచె మించు మించు నాయికలందరు ముగ్ధలు. మౌగ్ధ్యము రమణీయముగ నుండవచ్చును; కన్యకలందరు ముగ్ధలుగ నుందురను ప్రకృతి నియమము లేదు. వరూథిని ప్రాగల్భ్యముగల కన్యక. తానే వలచినది. ఎట్టకేలకు "నిక్కము దాపనేల ధరణీసురనందన యింక నీపయిం, జిక్కె మనంబు" అని తన భావమును బహిరంగముగ వెల్లడించెను. ఇట్లు చెప్పుట స్త్రీసహజమా?

కాంతలు తమ ప్రేమాతిశయము హావభావములచే సూచింతురు. పాపము! వరూధిని సైతమట్లె చేసినది కాని, ప్రవరుని మనస్సు ఒత్తిడిపడునది గాదు. ఆలసించిన యాతఁడు మోరకించుకొని పోవచ్చునను అనుమానముచే ప్రేమను వచించినది.

వరూధిని ప్రవరునివలె కర్కశహృదయ గాదు. భావోద్రేకము కలది. పేశలమైన మనస్సు——సౌందర్యపిపాస మిక్కుటము–ప్రవరుని సౌందర్యమునకచ్చెరువందినది–వర్ణించినది–ఇంకను తనివి సనక యాతని ప్రేమించినది. వరూధినీ ప్రవరుల సందర్శనమును కవి అద్భుతముగ వర్ణించెను. వరూధిని "అబ్బురపాటుతోడ నయనాంబుజముల్ వికసింప కాంతి పెల్లుబ్బి కనీనికల్ వికసితోత్పల పంక్తులఁ గ్రుమ్మరింపఁగా, గుబ్బ మెఱుంగుఁ జన్గవ నగుర్వొదవన్" బ్రవరుని గాంచినది. మరియు "ఝళంఝళత్కటక సూచిత వేగపదారవిందయై లేచి కుచంబులుం దుఱుము, లేనడు మల్లలనాడ నయ్యెడం బూచిన యొక్కపోఁక నునుబోదియ జేరి విలోకన ప్రభాసీచికలం దదీయ పదపీ కలశాంబుధి వెల్లిగొల్పి" నది. ఇంకను "మునుముట్ బుట్టెడు కొంకు తాల్మియు నిడన్ మోహంబువిస్తీర్ణతం, జొనుపం గోర్కులు కేళ్ళు ద్రిప్ప మదిమెచ్చుల్ చెప్పలల్లార్ప నత్యనుషంగస్థితి తెచ్చు పాటొసఁగ నొయ్యారంబునం జంద్రికల్, దనుకం జూచి" నది. ఈపద్యములందుఁ బ్రతిక్షణ వ్యాప్తమైన కార్యసంచలనము జీవకళావిలసనము నిబిడీకృతమై యున్నది. ఇట్టి పద్యములు ఆంధ్రసారస్వత మకుటమునందుఁ బ్రకాశించు

జీవమణులు. ఈ చాకచక్యమునందు పెద్దన తిక్కనకు
మాత్రమె రెండవవాఁడు.

నిర్జన ప్రదేశమందుఁ బ్రవరునిఁ గాంచినపుడు వరూ
థినికి మొట్టమొదట కన్యాసహజమైన సిగ్గుపుట్టినది; పుట్టి
పూచిన పోఁకచెట్టు చాటునకు పోయినది! ఇంక నే చెట్టు
చాటునకు బోయినను ఆమె సౌందర్యము ప్రవరుని కగ
పడదు. కావుననే సిద్ధహస్తుఁడగు కవి సందర్భానుసారముగఁ
బోఁక చెట్టును దెచ్చి పెట్టినాఁడు.

"ఇంతలు కన్నులుండ" అను పద్యమునందు లోకో
క్తియుఁ జమత్కారమును ధ్వనితముగఁ బ్రవరుని నేత్రసౌం
దర్యమును వర్ణింపఁబడినది. పద్యములోని మాటలు తేట
తెలుఁగైనను భావము గంభీరముగను బ్రౌఢముగ నున్నది.

పొంగిపొరలివచ్చు ప్రేమప్రవాహమును ఆపుకొన
లేక వరూధిని ఆ ఛాందసుని "పాలిండ్లు పొంగారఁ బైయుం
చుల్ మోవఁగఁ" గౌగిలించుకొనినది. ఆ బ్రాహ్మణుఁడు
ఓరమోమిడి హా శ్రీహరీ! యని అంసద్వయమంటి పొమ్మని
త్రోసిపుచ్చెను. వీరైనయెడల అంసద్వయమంటి యుండఁడు!
సమయమునకుఁ జేతికఱ్ఱ మఱచివచ్చెను. పాప మా వనజ
గంధి మేని జవ్వాజిపసఁ! గందంబించు నొడలుగడిగికొని పాప
పరిహారముగ సంధ్యవార్చినాఁడు. వరూధిని యొక్క
యీ యస్త్రముకూడ నిరుపయోగమైనది. తన సౌందర్యము
నిరాకరింపఁబడినందుకుఁ గోపమును. కోరికతీఱనందుల కస
హనమును. స్త్రీజన సహజమైన అలీకనిందారోపణ నైపుణ్య
మును, కొంచెము లేతపాకములోఁబడిన గయ్యాళితనమును,

కసిదీర్చుకొను నిచ్చయు వరూధిని మనమునందుఁ జెలరేఁగి ముప్పిరిగొన్నవి; దుఃఖము పొంగిపొరలి వచ్చినది.

> “పాటున కింతులోర్తురె? కృపారహితాత్మక, నీవు త్రోవ ని,
> చ్చోట భవన్ముఖాంకురము సోఁకెఁ గనుంగొను....”

తన యమ్ములపొదిలోని మన్మథాస్త్రములన్నియు వ్యయమైనవి. తుట్టతుదకీ యస్త్రమొక్కటి నిలిచి యుండినది. ఇది యమోఘము కావచ్చును. అయ్యో! దేవుఁడా, యీ యస్త్రముకూడ ఆజాతిపైఁ దగిలి మొక్కవోయినది.

నాటకము : చరిత్రము

నెలదినములకు పూర్వము * కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారు కళాప్రపూర్ణ వేదము వేంకటరాయశాస్త్రిగారి “ప్రతాపరుద్రీయము”లోని కథ చారిత్రకము కాదని ఒక విమర్శనము గేయముగ వ్రాసి “ప్రజామిత్ర”లోఁ బ్రకటించిరి ఆ విమర్శనము ప్రతాపరుద్రీయ నాటకమును గుఱించి వ్రాయఁబడినప్పటికిని, అందలి విషయము నాటక రచయితల కందఱకు సంబంధించి యున్నది. కావున ప్రస్తుతము చర్చనీయముగా ఏర్పడినది.

వాఙ్మయ వివాదములలోఁ ప్రవేశించుట నాప్రకృతికి విజాతీయమైన పని. అందులో ఇప్పుడు నాకు ఓపికగాని,

* ౧౯౩౫ మేనెల ౫ తేదికి ముందు నెలనాఁడు.

తీఱిక గాని యసలే లేదు. అయినను ఈ విషయము చాల ముఖ్యమని నాకు తోఁచినందువలన, సారస్వత ప్రపంచమున పలుకుబడి కలవారు ఒకప్పుడు పొరపడుదు రేని (పొరపడుట మానవ సహజమేగద!) ఆ పొరపాటు తత్త్వదర్శనమునకును, సారస్వత పురోభివృద్ధికిని ఆటంకముగ ఏర్పడవచ్చునను భయముతో ఈవ్యాసమును వ్రాయఁదలపెట్టితిని.

దృశ్య శ్రవ్య కావ్యములకు రచనా విధానమునతప్ప అంత్య ప్రయోజనమునందు ఏవిధమైన భేదము లేదు. లలిత కళల ప్రయోజన మేదో దృశ్యకావ్యప్రయోజనముకూడ నదియె—సద్యఃపరనిర్వృతి

నాటకము సామాజికుల రసానుభూతికి హేతువయి, హృదయాహ్లాదము, వినోదము కలిగించిన చాలునా? లేక, యింక నేదియైన సాంఘిక ప్రయోజనమును, ఉపదేశమును ఆశింపవచ్చునా? ఇట్టి ప్రశ్నలకు ప్రాచ్యపాశ్చాత్య విమర్శకులు భిన్నభిన్నముగ ప్రత్యుత్తరము లిచ్చియున్నారు అయినను నాటకమును సాంఘికోద్ధరణము కొఱకు ఉపయోగింపవచ్చునని తీర్మానించిన విమర్శకుల సంఖ్యయే హెచ్చు. నాటకములయందు ఉపదేశముండవచ్చునుకాని, ఆ యుపదేశము రసాత్మకమయి, ప్రత్యేకముగ ఒక యుపదేశమని యనిపించుకొనక, అలక్ష్యముగ సామాజికుల హృదయమ్ములోనికి ప్రవేసింపవలయును. ఇట్లు నిర్మించుట కళానైపుణ్యము. కవివాక్కును హ్లాదైకమయమని వర్ణించుచు ప్రయోజనములను లెక్కించునపుడు "కాంతాసమ్మితతయోపదేశ యుజే" అని మమ్మటుఁడు చెప్పెను. దీనినే పాశ్చాత్య విమర్శకులు

"Delightful instruction" అని నుడివియున్నారు. "ఆనంద మున ఉపదేశమును మెదిపి మానవసంఘోద్ధరణమునకు కావ్యము తోడ్పడవలయు" నని హారేస్ కవి చెప్పెను. విక్టరు హ్యూగో, ఇబ్సన్, మొదలు బెర్నార్డుషా వఱకుఁ గల పాశ్చాత్య నాటక రచయితలు నాటకమును మానవ సంఘశ్రేయమునకుగా వినియోగించిరి.

"Art for art's sake", అనగా, కళ ప్రయోజన నిర పేక్షకముగ నుండవలయునను వాద మొకటి కలదు. ఇది మన దేశమునకు క్రొత్త. కావ్యము ఆనందమాత్ర ప్రయోజన మయ్యును, విశ్వశ్రేయమును చేకూర్చునదిగ కూడ నుండ వలయును అని మన లాక్షణికుల మతము. విశ్వశ్రేయ మను మాటయందు సాంఘిక ప్రయోజనత్వము ధ్వనించుచున్నది. ప్రయోజన నిరపేక్షకవాదుల సిద్ధాంతప్రకారము కవి నిర్బా ధ్యుఁడు. తన యానందమును పట్టలేక పాడుకొనుచుండును. సంఘమునందు తన రచనల మూలమున కలుగు అనుకూల ప్రతికూల ప్రవర్తనములతో కవి కేలాంటి సంబంధము లేదు. కోకిల ఏమి ప్రయోజనము నాశించి గానము చేయుచున్నది? సెలయేరు ఎవరిని సంతృప్తిపఱచుటకు బిలబిల ధ్వనులతో ప్రవహించుచున్నది? అని వీరు ప్రశ్నించెదరు.

చింతా దీక్షితులుగారు ఈకోయిల, సెలయేటివాదము లను ఇముడ్చి సొగసుగా వ్రాసిన గేయములను నేనెప్పుడో చదివినట్లు జ్ఞప్తియున్నది. ఇట్టి ప్రశ్నలడుగువారు కోయి లకు, సెలయేటికి ప్రయోజనము నాశించు జ్ఞానమున్నదా? లేదా? యని విచారించినట్లు కనఁబడదు. కోకిలపాట మనకు

రుచించుట అది ఆనందముతో పాడుచుండుట వలనగాదు; దాని కంఠస్వరమున మాధుర్య ముండుటవలన. కాకికూడ అట్టి ఆనందముతో నేగదా పాడును! దాని గానము మన కేల రుచింపదు?

కవినిర్జరారణ్య ప్రదేశమున కూర్చుండి తన యిచ్చ వచ్చినట్లు పాడుకొనిన చిక్కేమియు లేదు. ఏ నీతియు, నియమము అవసరము లేదు. తానే తుమ్మి తానే దీవించుకొన వచ్చును. కాని, కవి మానవ సంఘములో నొక వ్యక్తిగ నుండి, తన కావ్యవస్తువు మానవసంఘము నాశ్రయించి యుండు నెడల, తానెట్లు నిర్బాధ్యముగ పాడుకొనఁగలడు?

ఈ వాదమునందు అనుభవ వ్యతిరేకమైన అసత్యము ఒకటి కలదు. కవి ఆనందముపట్టలేక పాడుకొనునా? కవి రచించునప్పుడు తన మనస్సులోనుండు ఒత్తిడిని ఆనంద మన వచ్చునా? లేక వేదన యనవచ్చునా? మనస్సు ఱెక్కలు విప్పుకొననిదే (Mental relaxation కలుగనిదే) ఆనందము జనింపదు. రచనా సమయమున కవి మనస్సు చక్కగ శ్రుతి చేయఁబడిన వీణాతంత్రివలె బిఱ్ఱబిగిసికొని యుండును; ఏ మాత్రము తగిలినను తెగును; ఆ సమయమున నెవ్వఁడైన పిలిచినయెడల అమాంతమ్ముగ వానిపైఁబడి గొంతు నులిమి వేయవలయునను కోపము పుట్టును. ఒకప్పుడు మంచముపై కూర్చుండి వ్రాయుచున్నామా? లేక క్రిందకూర్చుండి మంచముపై నోటుబుక్కు పెట్టుకొని వ్రాయుచున్నామా? యను జ్ఞానముకూడ నుండదు. కలలో పద్యములు, నిదుర మేలుకొనునపుడు పెదవులపై పద్యములు, రేయుంబవళ్ళు నాలు

గైదు దినములవఱకు ఏకధారగా ఆవరించియుండు ఇటువంటి యున్మాదావస్థను, సూక్ష్మ మానసిక ప్రళయమును ఆనంద మందుదుమా? బాధచెందుదుమా? ప్రసవ వేదనపడుచుండు తల్లిని చూచి, "ఈమె యెంత ఆనంద మనుభవించుచున్నది!" అని తలంచువారుందురా? ప్రసవించిన తదుపరి తల్లి బిడ్డను చూచుకొన్నపుడు ఆనందమనుభవించును ప్రాసెస్ ఎప్పటికి ఆనందకరముగ నుండదు. ప్రాసెస్‌ను రిజల్టును కలగుమ్మటం చేయుటవలన ఈ భ్రాంతి కలుగుచున్నది.

మానవావస్థానుకృతి అభినయము. అభినయము ప్రధానముగాఁ గలది నాట్యము. నాటక రచయిత ప్రకృతిని యథాతథముగ అనుకరింపఁడు. సామాన్యముగ మానవ జీవితమునందు సంభవించు ప్రతిసంఘటనము, ప్రతివిషయము కళయందు మూర్తీభవింపఁజేయుటకు తగినంత ముఖ్యమైనది గను, ఆవశ్యకమైనదిగ నుండదు. ప్రకృతిపరిపాలనమునందు శక్తి అనవసరముగ వ్యయింపఁబడుచుండును. కవి కళా దృష్టితో అనావశ్యకములైన వివరములు వదలిపెట్టి, ఏర్చి కూర్చి, చేర్చి తీర్చి, కొన్ని సంవత్సరముల కాలపరిమితిగల కథను మూడు నాలుగు గంటలలో ముగియు నాటకముగ నిర్మించును. ప్రకృతి అంతగ పాటింపని పొదుపును కవి జాగరూకతతో అభ్యసించును. కొంచె మించుమించు నాటకము ప్రకృతియొక్క యుత్తమ పునర్నిర్మాణమని చెప్పవచ్చును.

"అద్దములోవలె ప్రకృతిని (నాటకములందు) ప్రతిఫలింపఁజేయుట" అను షేక్స్పియరు సూక్తికి మెఱుఁగుపెట్టి

వట్లుగను, వాఖ్యాన ప్రాయముగను పరాసు మహాకవి అద్భుత నవలా రచయిత విక్టరు హ్యూగో ఇట్లు వ్రాసెను:

"It seems to us that someone has already said that the drama is a mirror where in nature is reflected. But if it be an ordinary mirror, a smooth and polished surface, it will give only a dull image of objects with no relief, faithful but colourless; everyone knows that colour and light are lost in a simple reflection. The drma, therefore, must be a concentrating mirror, which, instead of weakening, concentrates and condenses the coloured rays, which makes a mere gleam a light, and of a light a flame. Then only is the drama acknowledged by art"

నాటకవస్తువు పౌరాణికమైనను, చారిత్రకమైనను, సాంఘికమైనను కవి తన భావనాగ్ని చేత కరగించి పరిశుద్ధము చేసి, కల్పనాశక్తియను అచ్చులో అసామాన్యమూర్తిని తయారుచేయును. ఈమూర్తి ప్రకృతికంటె భిన్నముగ నున్నను, దానికి వ్యతిరేకముగ నుండదు. ఇట్లనుటచేత కథను తమ కల్పనకు అనుకూలముగ మార్చవలసిన ఆవశ్యకము కవికి కలదు కార్యకారణ సంబంధము నాటకమున పరిస్ఫుటముగనో, వ్యంగ్యముగనో గోచరింపవలయును; ఏదియును కారణరహితముగ సంభవింపఁగూడదు. కావున, కవి ఆదిమధ్యాంతములుగల నాటకమును సృజించునప్పుడు, కథలో నెన్నియో మార్పులు చేయవలసియుండును. కవిచేతి కావ్యవస్తువు ప్రతిమాకారుని చేతి బంకమట్టి వంటిది.

ఈవిషయమును ఎడ్గార్ యాలన్‌పో అను అమెరికా కవీంద్రుఁడు ఇట్లు చెప్పియున్నాఁడు :

"In the hands of the true artist the theme is but a mass of which anything may be fashioned at will or according to the skill of the workman. The clay is, in fact, the slave of the artist. It belongs to him"

రామాయణము, మహాభారతము ప్రసిద్ధములైన కావ్యేతిహాస గ్రంథములు. ఇవి చారిత్రకములని విశ్వసించువారు అప్పటికిని ఇప్పటికిని గలరు. అట్టికథల తీసికొనినాటకములు రచించిన భాసుఁడు, కాళిదాసు, భవభూతి, భట్టనారాయణుఁడు మున్నగు కవులు మూలకథలను ఎట్లుమార్చినదియు మన మెఱుంగుదుము. షేక్స్పియరు తాను రచించిన చారిత్రక నాటకములోని పాత్రలను యథార్థచారిత్రక పురుషులకంటె భిన్నమైన స్వభావశీలములు గలవారినిగ చిత్రించెను. ఇది ఆవశ్యకమైన యొక శిల్పలక్షణము. తెల్లని కాగితముపై నల్లనిగీఁతయు నల్లని కాగితముపై తెల్లని గీఁతయు గీచిన స్ఫుటముగ నగపడును. ఏకవర్ణమయ్యెనేని రెండిటికింగల భేదము గోచరింపదు. అందువలననే కవియు చారిత్రక నాటకములందు సైతము వివిధప్రకృతులు గలవారిని ఒకచోట ప్రవర్తింపఁజేసి, స్వభావ తారతమ్యమును స్ఫురింపఁజేయును.

నాటకమునందు కథకంటెను మానవస్వభావ చిత్రణమె ముఖ్యము. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాది చిత్తవికారములు సర్వజనీనములై, సర్వ కాలీన

ములై, మానవసంఘముపై నధికారము నల్పుచుండును. అట్టి మానవ స్వభావ శీలములను, మానసిక రహస్యములను కవి నాటకరంగమున మూర్తీభవింపఁజేసి సామాజికులను ఆనందపరవశులఁ గావింపవచ్చును.

"Poetical works belong to the domain of our permanent passions; let them interest these, the voice of all subordinate claims is at once silenced."

అని శాశ్వతములగు మనోవికారముల ప్రాముఖ్యమును మ్యాథ్యూ ఆర్నాల్డు కవి వివరించెను.

ఒకప్పుడు ఫ్రెంచినాటక రచయితయగు మోలియర్ కవిని విమర్శకులు, "నీ నాటకములు లక్షణవిరుద్ధములని" తూలనాడిరఁట. అందుకు "సామాజికులను సంతోషపెట్టుటకు ఏ నాటకలక్షణము లావశ్యకములో అంతకన్న భిన్నములైన లక్షణములతో నాకేమిపని?" అని ఆయన జవాబు చెప్పెనఁట! నాట్యకళా ప్రపూర్ణుఁడగు బళ్ళారి టి. రాఘవాచార్యులవారు ఒకయుత్తరమున, "నేను నాటకమును సామాజికుల దృష్టితో చదివెదను." అని వ్రాసియుండిరి. నాటక యోగ్యతను ఒరయుటకు ఇంతకన్న శ్రేష్ఠమైన నికషోపలము మఱియొకటి యుండదని నా యుద్దేశము.

చరిత్రయొక్కయు, నాటకము యొక్కయు ఉద్దేశములు ప్రయోజనములు వేఱు; చరిత్ర జరిగినది జరిగినట్లుగ చెప్పును. జరిగిన దన్నంతమాత్రముననే సకల సబ్బండును చరిత్రకారుఁడు గ్రంథస్థము చేయును. మంచిచెడ్డల ననుసరించి అతఁడు విషయములను ఏర్పఱచకూడదు. ఎంతవఱకు

జరిగియుండవచ్చునో, ఎట్లు జరిగియుండిన చిత్తాకర్షకముగ నుండునో దాని నూహించి కవి కావ్యమును వ్రాయును. చారిత్రకవిషయము సైతము కవితాస్పర్శచేత రూపాంతరము పొందును. ఇట్లు వారిరువురి మార్గములు భిన్నమైయుండగా కవి చరిత్రకారుఁడు కానందుకు మన మేల యాతనిని ఎత్తి పొడువవలయును?

మనము నాటకశాలకు పోవునది పురాణములు, చరిత్రములు నేర్చుకొనుటకు కాదు రెండుమూడు గంటలకాలము నిరపాయకరమగు నానందము ననుభవించుటకు. చారిత్రక విషయములు తెలిసికొనవలయునన్న అందుకు తగిన గ్రంథములు గలవు. ప్రతాపరుద్రీయములోని కథ చారిత్రకము కానందువలన అది ప్రదర్శింపఁబడినప్పుడు సామాజికుల ఆనందమున కేమైన కొఱతయుండునా? పేరిగాఁడు, యుగంధరుఁడు చారిత్రిక పురుషులు కాకపోయినను వారిచేష్టలు, మాటలు మనకు సంతోషము గల్గించును.

చౌదరిగారు ఢిల్లి యెక్కడ, గంగ యెక్కడ? అని ప్రశ్నించినారు. నాటక ప్రపంచమును యథార్థ ప్రపంచ దృష్టితో చూడఁజనదు. నాటకము కొన్ని కవి సమయములకును కళానియమములకును లోఁబడియున్న అనన్య పరతంత్రమైన సృష్టి. చిత్రకారుఁడు గోడపై తెలుపు, నలుపు రంగులతో లిఖించినచిత్రము చదునుగా (Flat surface) నుండినను, వెలుఁగు నీడలవలన మిట్టపల్లములను స్ఫురింపఁజేయును. నల్లగానుండుచోటు పల్లము, తెల్లగానుండుచోటు మిట్ట అను చిత్రసమయమును మన మంగీకరించి యున్నాము.

ఏలయన, చదునుగానుండు తలమున మిట్ట పల్లములు చూపుట అసంభవముగాన, విధిలేక కొన్ని సంకేతములను అంగీకరించితిమి.

అట్లే నాటకములందుఁగూడ కొన్ని సంకేతములు, సమయములు రూఢియైనవి. నాటకప్రపంచమున కాలము స్థలము సంకుచితమై యుండును. అచ్చట మన భావము సంచరించువఱకు అందలి పరిస్థితులు స్వాభావికముగను, యథార్థముగను ఉండునట్లు తోఁచును. బహిఃప్రకాశము యొక్క వృద్ధిక్షీణతల ననుసరించి కంటిలోని పాప (రంధ్రము) సరియొత్తుకొనునట్లు, ప్రకరణము ననుసరించి సరియొత్తుకొను శక్తి మన భావమునకు కలదు. అందువలననే నాటక ప్రదర్శనము మనకు ఉపభోగ్య మగుచున్నది.

సునిశితమైన విమర్శకదృష్టితో నాటకము చదువునపుడు అసంభవములుగా కనఁబడునవి నాటక ప్రయోగమును చూచునప్పుడు అట్లు తోఁపవు. అప్పటి మన భావస్థితి వేఱు

చరిత్రమును నాటకకర్త ఎంతవఱకు మార్చవచ్చును? అను విషయమును గుఱించి ఫ్రెంచి, జర్మను కవులయు, విమర్శకులయు అభిప్రాయములను ఈ క్రింద నుదాహరించుచున్నాను:—

"It is besides most commonly asked how far the poet may venture in the alterations of the true story, in order to the fitting of it for the stage. Upon which we find different opinions among both the ancient and modern critics; but my opinion is that we may do it, not only in the circumstances, but in the principal

action itself, provided he makes a very good play of it. For, as the dramatic poet does not much mind the time, because he is no chronologist, no more does he, nor the epic poet, much mind the true story because they are no historians. They take out the story so much as serves their turn and change the rest not expecting that anybody should be so ridiculous as to come to the theatre to be instructed in the truth of history".

—*Francois Hedlin's*
"The whole art of the Stage"

"In short, tragedy is not history in dialogue. History is for tragedy nothing but a storehouse of names wherewith we are used to associate certain characters. If the poet finds in history circumstances that are convenient for the adornment or individualising of his subject, well, let him use them. Only this should be counted as little a merit as the contrary is a crime... .."

"The dramatic poet is no historian, he does not relate to us what was once believed to have happened, but he really produces it again, not on account of mere historical truth, but for a totally different and nobler aim. Historical accuracy is not his aim, but only the means by which he hopes to attain his aim; he wishes to delude us and touch our hearts through the delusion."

— *G. E. Lessing's*
"Dramaturgy".

ఈ యభిప్రాయములు ముఖ్యములు కావున కొంచెము దీర్ఘములైనను పూర్ణముగ నుదాహరించితిని. పఠితలు వ్యాసగత విషయములను ఆలోచించి వారివారి బుద్ధికి సూటియగు పర్యవసానము తేల్చుకొందురుగాక !

అలంకార తత్త్వము

కావ్య లక్షణములను విధించు గ్రంథములకు అలంకార గ్రంథములని యేల పేరువచ్చినది ? ముఖ్యములైన రసధ్వనులుండగా అలంకారముల కేల యింత ప్రాముఖ్య మీయబడినది ? "తదదోషౌ శబ్దార్థౌ సగుణా వనలంకృతీ పునః క్వాపి" అను నిర్వచనము ప్రకారము అనలంకృతములైన శబ్దార్థములకును కావ్యత్వము సిద్ధించును గదా.

లక్షణ గ్రంథములు అలంకార గ్రంథములని పేరు పడునప్పటికి అలంకారమను పదము కటకాంగదముల వంటి దను సంకుచితార్థమున రూఢికా లేదు. ఈయర్థము వామనుని కాలమున ప్రారంభమయి మమ్మటుని కాలమునకు బాగుగ రూఢమైనది. అయినను తరువాతి వారుకూడ అలవాటువలన లక్షణ గ్రంథములను అలంకార గ్రంథములని వ్యవహరించు చుండిరి. కావ్య శోభాకరములైన హేతుగుణములన్నింటికిని అలంకారనామము సార్థకమగును.

భామహుని కాలమున, మాధుర్యము, ప్రసాదము. ఓజస్సు అను కావ్యశోభా హేతువులకు గుణములను పేర రాలేదు. కావ్యమునకు శరీరసామ్యము తెచ్చిపెట్టిన యనంతరము సాదృశ్య పరిపూర్ణతకొఱకు, శరీరము, ఆత్మ గుణములు, అలంకారములు మున్నగునవి పృథక్కరింపబడినవి.

కావ్యశోభాకరధర్మములు అలంకారములని దండి మతము. వామనుడు దండి యభిప్రాయము ననుసరించి యించుక మార్పుతో "కావ్యం గ్రాహ్యమలంకారాత్" అనియు "సౌందర్యమలంకారః" అనియు నిర్వచించెను. సౌందర్యము సౌందర్యాపాదక హేతువుల సమష్టి ఫలము. హార కటకాంగదములవలననే సౌందర్యము చేకూరదు.

వామనుని కాలమున గుణములకు ప్రాముఖ్యము కలిగినది. అలంకారములకు ప్రత్యేకత పొడచూపినది. కావ్యమునకు శోభ నాపాదించు ధర్మములు గుణములనియు తదతిశయ హేతువులు అలంకారములనియు గుణశూన్యమైన కావ్యము అలంకారయుతమయ్యు శోభావహము కాదనియు వామనుని యభిప్రాయము.

సంస్కృతలక్షణ గ్రంథములు క్రీస్తువెనుక నాలుగైదు శతాబ్దుల మధ్య ప్రభవించి క్రమక్రమముగ వ్యాపింప వచ్చినవి. లక్షణ గ్రంథముల అధికారము హెచ్చినవెనుక రచింపబడిన కావ్యములు చాలవరకు స్వతంత్ర రచనా విధానమును గోల్పోయి అలంకార గ్రంథములలోని లక్షణములకు ఉదాహరణ ప్రాయములైనవి.

లాక్షణికులు తార్కికులుగావున అలంకారములు వారి పృథఃకరణశక్తి ననుసరించియు, సూక్ష్మాతి సూక్ష్మ భేదగ్రహణ బుద్ధిననుసరించియు కాలక్రమమున పెచ్చు పెరిగినవి. మనము ఏ మాట మాటాడినను అది యేదో యొక యలంకారమగును. అలంకారములు శరీరముకంటె

భిన్నములని వానిని తీసివేసిన అసలు కవితా శరీరమె అదృశ్యమగును.

భరతముని కాలమున "ఉపమా రూపకం చైవ దీపకం యమకం తథా, కావ్య స్యైతేహ్యాలంకారాశ్చత్వారః పరికీర్తితాః" అను ప్రమాణము ననుసరించి ఉపమ, రూపకము, దీపకము అను మూడు అర్థాలంకారములును యమకమను శబ్దాలంకారమును గుర్తింపబడినవి. రుద్రటుని కాలమున "వాస్తవ మౌపమ్య మతిశయః శ్లేషః" అను నాలుగు అలంకారములు గుర్తింపబడినవి. తర్వాత ఉపమాలంకారము బహువికారములను పొందినది

"ఉపమైకా శైలూషీ సంప్రాప్తా చిత్రభూమికా భేదాన్. రంజయతి కావ్యరంగే నృత్యంతీ తద్విధాం చేతః"

అలంకారములు పరిమితపదజాలముతో అపరిమిత భావచ్ఛాయలను ప్రకటించుట కేర్పడిన భావ ప్రకటన సాధనములు. వాని రమణీయతకు కారణము భావగాఢత్వము, శబలత్వము; తన్మూలమున రసత్వమును

వాల్మీకి కాళిదాసాది మహాకవులు ఉపమాలంకారమునే విశేషముగ వాడిరి "ఉపమా కాళిదాసస్య" అను నానుడి లోకమున గలదు. ఉపమయె అన్ని యలంకారములకు మూలకందము అలంకారములు కావ్యశరీరమునకు భూషణములను శాస్త్రీయ సాంప్రదాయానుసారముగ వచ్చు మాటలటుండనిచ్చి, భావ ప్రకటనమునకు సంబంధించినంత వఱకు అలంకార ప్రయోజనము నారయుదము. కవి చెప్ప దలచుకొన్న భావము స్ఫుటముగ సూటిగ పఠిత హృదయ

మున ప్రవేశపెట్టుటకు ఉపమాద్యలంకారములు తోడ్పడును. కొంతసేపు తర్కించి విమర్శించి వివరించినగాని మనసునకు పట్టని విషయములు సైతము అలంకారద్వారమున సునాయాసముగ మనమున హత్తుకొనును.

> " ఉప్పుకప్పురంబు నొక్కపోలికనుండు
> చూడఁజూడ రుచుల జాడవేఱు;
> పురుషులందు బుణ్య పురుషులు వేఱయా "

అరగంటసేపు ఉపన్యసించి వివరింపవలసిన విషయమును సాదృశ్యబలమున కవియొక వాక్యమున సాధించినాడు. భాషపొదుపునకు అలంకార మొక సాధనము.

భాషస్థూలము. భావములు సున్నితములు. ఏ భాషయందైనను పదజాలము పరిమితము. భావచ్ఛాయ లపరిమితములు. కావున పరిమితపదజాలముతో అపరిమిత భావములను ప్రకటింపవలసియున్న యెడల ఏవో కొన్ని సంకేతములు. సమయములు, శబ్దశక్తులు అక్కఱనుబట్టి సహజముగ ఉద్భవించును.

కవిత్వము భాషకు అలంకారము. కావ్యము భాషాలత పూచిన నెత్తావిపూలగుత్తి; భాషాపయోనిధి మథింపగా పైకిదేలిన అమృతకలశము. కావ్యమునందు భాషయు భావప్రకటనము ఉత్తమస్థితి నందియుండును. కావ్యమున కవికి లోకోత్తర భావచ్ఛాయలు ప్రకటింపవలసిన యవసరము కలదు. కాని పదజాలము పరిమితము. ఈ భాషాలోపమును పూరించుటకై కవిపడిన బాధకు ప్రతిఫలముగ ఉపమాలంకారము పుట్టినది.

ఒకడు చలినీటిని తాకె ననుకొనుడు. ఆ నీటి చల్ల దనమును గుఱించి ఆతడిట్లు చెప్పును: చల్లగా నున్నవి. ఎక్కువ చల్లగా నుండెనేని ఎక్కువ – మిక్కిలి – చాలా – యెంతో అను విశేషణముల నుపయోగించును.

ఈ విశేషణములన్నియు సమానార్థకములె. తారతమ్యమంతగా స్ఫురింపదు. అయినను వాడనుభవించిన చల్లదనమును వర్ణించుటకు ఈ విశేషణములలో నొకటియు చాలదు. అంతట వాడు లోకానుభవజ్ఞానము వలన మిక్కిలి చల్లగానుండు వస్తువు మంచుగడ్డ యొకటి యున్నదని తెలిసి కొని "ఈ నీళ్ళు మంచుగడ్డవలె చల్లగా నున్నవి" అని చెప్పును. అంతకంటెను చల్లగా నుండునెడల, మంచుగడ్డ కన్న చల్లని వస్తువు నాతడెఱుగని యెడల. ఇక "చల్లని" యను పదమును సాగదీసి యుచ్చరించుచు ఆ పదార్థమును తాకినప్పుడు కలుగు ముఖవికారము నభినయించుచు "అబ్బ! యీనీళ్ళు చల్‌ల్‌ల్‌ల్‌ల్‌లగా ఉన్నవి" అని నొక్కి చెప్పును. ఇంతటి శీతలత్వమును ప్రకటింపగల పదము భాషలో రూఢియై యున్నయెడల అతడు సాదృశ్యసహాయము పొంద వలసిన యవసరముండదు. కాని యే భాషయు ఎప్పటికిని అట్టి పరిపూర్ణత పొందజాలదు.

"అరవిందాలు గదోయి కన్నులు" అని కవియొక రమణీయవతి కన్నులను వర్ణించును. కవులు భావోద్రిక్త మానసులు. వారి దృష్టి భావరంజితము; శబలితము. అందు వలన సామాన్యులు చూడజాలని అంతర్లీనగుణసౌభాగ్యమును కవి దర్శించును. కవి ప్రకటింప దలచుకొన్న భావము

లివి:- ఆమె కన్నులు విశాలముగ నున్నవి. కనుగ్రుడ్డుకొనల నాజూకైన యెఱ్ఱరంగు కలదు. కన్నులలో జీవకాంతి తొలికాడు చున్నది. తెల్ల వెలుగు పొడచూపు చున్నది. మెత్తదనము ఆర్ద్రిత్వము గలదు. ఈ భావములన్నియు కవి వర్ణింపవలయునన్న ఒక సీసపద్యము వ్రాయవలసి యుండును. ఈ భావములన్నియు స్ఫురింపజేయు ఒక్కపదము ఏ భాష లోను ఉండదు. కావున కవి తాను వర్ణింపదలచుకొన్న గుణములన్నియు అరవిందమున నున్నవని తెలిసికొని యుండుట చేతను అరవిందముయొక్క అనుభవజ్ఞానము సామాన్యముగావునను "అరవిందాలు గదోయి కన్నులు" అని సంక్షిప్త లేఖనమున (Short hand) లిఖించినట్లు ముక్తసరిగ వర్ణించెను.

ఇట్టి సంకేతముల వలన భావముల యిమిడికయు భాష పొదుపును సిద్ధించును. పసుపు ఎఱుపు నీలము అను మూడు రంగులే ప్రధానములు. చిత్రకారుడు ఈ మూడు రంగులను మిశ్రమము చేయుటవలన వేలకొలది వర్ణచ్ఛాయలను సృజించును. కవియునట్లే పరస్పర భిన్న వస్తువులలోని గుణములను మేళవించి నూత్న సృష్టిని చేయును.

కావ్య కళకు చిత్ర లేఖనమునకు దగ్గర సంబంధముండి నను వాహక భేదముల (Difference of medium) ననుసరించి వారి మార్గములు భిన్నములు. చిత్రకారుడు ఉపమానోప మేయములను మేళవించి లిఖించును. అనగా అరవిందముల లోని వైశాల్యము నిగనిగ మొదలగు రమణీయగుణములను కన్నులలో మూర్తీభవించునట్లు చిత్రించును వేఱుగా అర

వింద పత్రములను కంటి ప్రక్కన వ్రేలాడ గట్టవలసిన యవసర ముండదు. చిత్రకారుడు రంగులు కలుపునట్లే కవి భావములను కలుపును; అట్టి భావసమ్మేళనము స్ఫురింప జేయుటకు ఉపమాద్యలంకారములను ఆశ్రయించును.

విరటుని గృహమునందు సైరంధ్రి వాలకముతో నున్న ద్రౌపదిపై కీచకుని మనసు లగ్నమైనది.

క॥ నా యున్నబాము దలపవ
యీ యొడలి చీర యిట్టి యేవపుజందం
బో యన్న, మదన వికృతిం
జేయుననుట యెంతయు నిషిద్ధముగాదే.

అని ఆమె యెంత వారించినను కీచకుడు వినడు. వినజాలడు. కామోద్రిక్తమానసుడైన కీచకునకు ప్రకృతిలోని రామణీయకమంతయు సైరంధ్రిగా మూర్తీభవించినట్లుకనుపట్టినది. ఈభావగాఢత్వము. తన్మూలమున గలిగిన రసతన్మయత్వము ప్రస్ఫుటము చేయుటకు తగిన భాష కావలయును. కీచకుడు ఆమె యడుగులను చూచెను. సామాన్య భాషలో వానిని వర్ణింపవలయునన్న, అవి మెత్తగను, యెఱ్ఱగను ఉన్నవని చెప్పవచ్చును. అట్లుగాక ఒకవేళ వర్ణించువాడు సహృదయుడైన యెడల అవి ''శిరీషకుసుమపేశలములు''అని వర్ణించును. ఈ మాటలేవియు కీచకుని హృదయమును ఉఱ్ఱూతలూచుచున్న ప్రగాఢ భావోద్రేకమును శతాంశమైనను ప్రకటింపలేవు. కావున కీచకుడే తన భాషతో ఆమెను వర్ణింపవలయును:

సీ॥ నెత్తమ్మిరేకుల మెత్తఁదనము దెచ్చి
యచ్చున బెట్టినట్లంద మొంది;
చక్రవాకంబుల చందంబు కొనివచ్చి
కుప్పలుచేసిన ట్లొప్పుమెరసి;
చందురునను గాంతికందేర్చికూర్చి బా
గునకు దెచ్చిన యట్లు కొమరు మిగిలి
అళికులంబుల కప్పుగలయంతయును దెచ్చి
నారువోసిన భంగి నవక మెక్కి
అంఘ్రితలములు కుచములు నాననంబు
కచభరంబును నిట్లున్న రుచిరమూర్తి
అనుపమానభోగములకు నాస్పదంబు
గాదె.....................

ఒక నెత్తమ్మిరేకుల మెత్తందనము చాలదు. లోకములోని నెత్తమ్మిరేకుల మెత్తందనము తెచ్చి కరువుపోసినగాని అతడు భావించిన మెత్తదనమునకు సరిపోదు. ఈ భావ ప్రగాఢత్వము ఇంతకన్న తక్కువగా చెప్పుటెట్లు! సామాన్యమైన మాటలు చాలనప్పుడు కవికి అలంకారమే శరణ్యమని Newman వచించెను.

(Poetry) from living thus in a world of its own, it speaks the language of dignity, emotion, and refinement. Figure is its necessary medium of communication with man; for in the feebleness of ordinary words to express its ideas, and in the absence of terms of abstract perfection the adoption of metaphorical language is the only poor means allowed it for imparting to others its intense feelings (Newman).

దుష్యంతుడు కణ్వాశ్రమ ప్రాంతమున వేటాడుచు ఆశ్రమ కురంగముపై విల్లెక్కుపెట్టు సమయమున వైఖానసు లిట్లనిరి:

నఖలు నఖలు బాణాః సన్నిపాత్యోయ మస్మిన్
మృదుని మృగశరీరే పుష్కరాశా వివాగ్నిః॥

రాజులు మృగయా ప్రియులు, వేట యందు కరుణా రహితులు కూడ. అట్టివారిని మృగమును చంపవద్దనిన ప్రయోజన మేమి? రాజు హృదయమున కారుణ్యము పుట్టింప వలయును. ఈ మృగము మృదువైన శరీరముగలది బాధ కోర్వ జాలదు. బాణప్రయోగము చేయకుడు అని వైఖానసు లందురేని రాజు సరకు చేసియుండడు. కాని మృదువైన మృగశరీరము పుష్పరాశికిని బాణము అగ్నికిని పోల్చబడినది. రాజా, నీవు జింకపై బాణము వేసిన పూల రాశిలో నిప్పు పెట్టినట్లేసుమా అని వైఖానసులు చెప్పినట్లైనది. రాజునకు తన క్రూర కార్యముయొక్క ఘోరత్వము హృదయమున సూటిగా నాటినది. జింక బ్రతికినది. కవి మృదు అను విశేషణములోని సామాన్యభావముతో పుష్ప రాశిలోని సుగుణము లన్నియు మేళవించి అపూర్వమును హృదయంగమము నైన మార్దవమును మృగశరీరమున కాపాదింప జేసెను.

కంటికగుపడని ఉపమేయమును అగుపడు ఉపమాన ముతో పోల్చుదుమేని భావమున కాలంబము దొరికి బోధ సులభమగును, "వాని మనస్సు కాసార జలమువలె స్వచ్ఛ ముగ నున్నది". మనస్సు అదృష్టము, జలము దృష్టము. ఉపమాన సహాయముచేత ఉపమేయము నూహింపగలము. ఇట్లుగాక విపరీతమయ్యేనేని ప్రయోజనముండదు ఉపమా నము ఆత్మ గుణసంయోగము వలన ఉపమేయమును శోభింపఁ జేయునదిగ నుండవలయును.

తారకాభరిత గగనము, సముద్రము, మహోన్నత పర్వతపంక్తులు మున్నగు ప్రకృతి విశాల గభీర రమణీయ సృష్టులకు ఉపమానములు లేవు. అయినను కవులు వానిని అంతకంటెను తక్కువ రమణీయములైన వస్తువులతో సరి పోల్చియున్నారు. విశాలమైన దృశ్యమును మనస్సు ఆకళించు కొని అనుభవించలేదు. ఆ దృశ్యమునే చిత్రకారుఁడు పరిమితమైన భిత్తిపై చిత్రించినప్పుడు చూచి ఆనందింతుము. ఎందువలన? ప్రకృతి దృశ్యముయొక్క వైశాల్యము అనా వశ్యకములైన వివరములు ఇందుండవు. ఆవరణము సంకుచిత మగును. చిత్రము అన్ని మూలలు ఏకకాలమున చూచి ఆనందింపగలయంత పరిమితమైయుండును. కవులుకూడ కొంచె మించుమించు ఈమార్గమునే యవలబించిరి.

"సపది ముకులితాక్షీం రుద్రసంరంభభీత్యా
దుహితర మనుకంప్యా మద్రిరాదాయ దోర్భ్యాం
సురగజ ఇవ బిభ్రత్ పద్మినీం దంతలగ్నాం
ప్రతిపథగతి రాసీద్వేగ దీర్ఘీకృతాంగః"

రుద్రసరంభ భీతిచే కన్నుమోడ్చిన పార్వతిని హిమ వంతుడు మోసికొనిపోవుటను కాళిదాస మహాకవి అద్భుత ముగ వర్ణించెను. అద్రి పార్వతిని మోసికొని పోవుట ఊహించుట కష్టము. అద్రిని సురగజమునకును మూర్ఛపోవు చున్న పార్వతిని, వెళ్ళగించుటవలన యించుకవాడి దంత లగ్నమైన తామర తీవకును పోల్చి, పరిమిత దృశ్యముగ మార్చి అనుభవింపదగిన రమణీయతను, కవి సృజించినాడు.

"అస్త్యుత్తరస్యాం దిశి దేవతాత్మా హిమాలయో
నామ నగాధిరాజః
పూర్వాపరౌ వారినిధీ విగాహ్య స్థితః పృథివ్యా
ఇవ మానదండః."

ఇందు హిమవత్పర్వతమును కొలగజ్జకు పోల్చుటలో కవి ఏ విధమైన సౌందర్యమును వర్ణించెనో నాకు గోచరించుట లేదు——

కొన్ని సమాసములు అలంకారములు నిత్యపరిచితములయి యొకవిధమైన తిరస్కారభావము కొల్పుచుండును. పద్మనేత్ర, లతాంగి, శంపాలతాంగి అను సమాసములు కేవలము స్త్రీ పర్యాయపదములైనవి, పద్మనేత్ర యన్నంతనే యేదోయొక స్త్రీ యని దాటిపోదుము. కాని ఒక్క క్షణమైన ఆగి ఆ నేత్రపద్మముల సౌందర్యమును మన హృదయమున చిత్రించుకొనము. కావున కవిత్వములోని సౌందర్యమును మన మనుభవింపవలసినంత యనుభవించుట లేదు.

అలంకార తత్త్వమును వాని ప్రయోజనమును గుర్తెఱిగినచో అలంకారము లావశ్యకములా కావా యను చర్చలకు దిగ నవసరము లేదు. ప్రతిభావంతులగు కవుల రచనలందు అలంకారములు ఆవశ్యకములగు చోటుల అప్రయత్నపూర్వకముగనే దొరలును.

వాల్మీకి మహాకవికి పూర్వము అలంకార గ్రంథములుండి యుండవు. క్రౌంచపక్షిశోకము హేతువుగా కవిత్వము శ్లోకరూపమున ప్రవహించినది. ఆయన యుపయోగించిన యలంకారములన్నియు భావ ప్రకటనావశ్యకతా సంభవ

ములు. అలంకారశాస్త్రములు వ్యాప్తిలోనికి వచ్చినతర్వాత కొందఱు కవులు కేవలము అలంకారముల వాడిరి. నీరసము లైన వింత వింత యలంకారములు పుట్టినవి ఉపమయొక్క ప్రయోజనము విస్మృతమైనది. పిరుదులు ఇసుకతిప్పలైనవి. వక్షోజములు కొండలైనవి. కేవలము ఆకృతిని సూచించు ఉపమానము లధమములు. రానురాను ఇట్టి వర్ణనములు కవితా సంప్రదాయము లైనవి.

అలంకారములు కుయుక్తులతో నిండిన మేదో వ్యాపారములుకావు. భావ ప్రకటనా వశ్యకతయే అలంకారములకు ప్రభవము. ఇవి కటగాంగదములవలె శరీర బాహ్యాములైన భూషణములు కావు.

తెలుగుకవితలో క్రొత్తతెన్నులు

తెలుగు కవితలో క్రొత్తతెన్నులు

[ఈ వ్యాసము రెడ్డిగారి అసంపూర్ణ రచన. సాహిత్యాభిలాషులకు వుపకరించునను వుద్దేశ్యముతో ఈ సంపుటిలో చేర్చినాము. —సం.]

పూర్వకాలమున మానవ సంఘమునందు మార్పులు చాల ఆలస్యముగ జరుగుచుండినవి. దేశములకు అన్యోన్య సంబంధము పరిమితముగా నుండుటయే దీనికి కారణమై ఉండవచ్చును. సంఘమున కలుగు మార్పులు వాఙ్మయమున కూడ కలుగుట సహజము. ఈ కాలమున పరదేశ గ్రంథ బాహుళ్యమువల్లను వార్తాపత్రికల మూలముననును మార్పులు అనతికాలమున జరుగుచున్నవి. ఈ మార్పులు అనుకూలములా? ప్రతికూలములా? అనిగాని ఆవశ్యకములా? కావా? అనిగాని యోచించుటకుకూడ తడవు లేదు. సుడిగాలిలో తగులుకొన్న యెండుటాకువలె మన సంఘము గింగిరీలు కొట్టుచున్నది. పరదేశమున మ్రోగు ప్రతిధ్వనికిని ఇచ్చట ప్రతిధ్వనులు పుట్టుచున్నవి.

జీవవిలసనము ఉన్నప్పుడు కదలిక ఉండుట స్వాభావికము. ఈ కదలిక రెండు విధములు. సోపానములను ఎక్కు కదలిక యొకటి; దిగు కదలిక మఱొకటి. మన వాఙ్మయ ప్రపంచమున నేడు జరుగుచున్న మార్పులు ఏ కదలికకు సంబంధించినవా అని నిర్ణయించుట అంత తేలికగా కనిపించుట లేదు. అయితే, కాలము మాత్రము అన్నిటిని తూర్పార పట్టును. పొల్లుగింజలు చెత్తా చెదారము గాలికి

ఎగిరిపోవును. గట్టిగింజలు మాత్రము నిలిచి ఉండును, ఇది మానవులకు కొంత సంతృప్తి.

ప్రాణములేని యంత్రమునందు ఆజ్ఞాతృణీకరణము శాసనోల్లంఘనము లేదు. ఒక్కసారి తాళము త్రిప్పిన గడియారము ఏమీ మార్పులేక 24 గంటలు నడచును. ప్రాణముకలిగిన జంతువులో ఇటువంటి యాంత్రిక ప్రవృత్తి లేదు.

నిర్బంధ విమోచనము భావదాస్య విముక్తి కలిగిన ప్రథమ దశలో, స్వాతంత్ర్యము విశృంఖలత్వముగ భావింపబడును. విశృంఖలత్వము నాగరిక స్వాతంత్ర్యము కాదు. అది నయాగరా ప్రవాహ పాతమువంటి అసంయమిత శక్తి. దానిని నియమబద్ధము కావించినప్పుడే జనోపకారి యగును.

స్వాతంత్ర్యము నియమరహితమైనది కాదు. ప్రజాప్రభుత్వము (Democracy) శాసనబాహ్యమైనది కాదు. రెంటికిని నీతులు నియమములు బాధ్యతలు కలవు.

మానవుడు బహువిధములైన భోజన పదార్థములను జీర్ణించుకొని వానికంటె భిన్నమైన తన శరీరమును పోషించుకొనునట్లే ఒక జాతికూడ ఇతర దేశ నాగరకతలలోని ఉత్తమ ధర్మములను తనలో జీర్ణింపజేసుకొని సాంఘిక శరీరమును పెంపుచేసుకొనుచున్నది. తన దేహతత్త్వమునకు వికటించిన పదార్థములను వెడలగ్రక్కుచున్నది. ఒకప్పుడు ఇతర దేశములకు జాతులకు వాని పరిస్థితులకు అనువైనవెన్నో మనకు సరిపడకపోవచ్చును. ప్రతి జాతికి ఒక జాతీయ

వ్యక్తిత్వమున్నది. జాతీయ సంప్రదాయములలో వేరు నాటు కొననిదే ఏదైనను చిరకాలముండదు.

1914 వ సంవత్సరమున ప్రారంభమైన ప్రపంచ యుద్ధము ముగిసిన తర్వాత యుద్ధ విచ్ఛిన్నమైన యూరపు దేశమునందు ఎన్నో వాఙ్మయోద్యమములు, పుట్టగొడుగుల వలె పుట్టి పరిస్థితులు కొంచెము మారునప్పటికి, నశించినవి. వాని ప్రతిధ్వనులు మన దేశమునకూడ వినబడినవి

చిత్రలేఖనమున 'క్యూబిజం' (Cubism) అను పద్ధతి ఫ్రాన్సుదేశమున పుట్టి ఇంగ్లాండు జర్మనీలకు వ్యాపించినది. 'క్యూబిజం' అనగా మనము చూచు ప్రతివస్తువు Cubes గా అగపడునట్లు చిత్రించుట. ఇది మన యింద్రియజ్ఞానమునకు అనుభూతికి అతీతమైనది. జగదేకమైన భావమును, సార్వజనీనానుభూతిని కవిగాని చిత్రకారుడుగాని వ్యక్తిగతమైన భావ సౌందర్యముతో మేళవించి అందరకు రుచించునట్లు ఆకృతి బద్ధము చేయగలడు. కాని తనకు మాత్రమే అనుభూతమైన దానిని ఏ కవికూడ జగదేకము చేయలేడు. ఈ క్యూబిజము గతి కూడ అట్లే అయినది.

అస్టిగ్మాటిజం (Astigmatism) అను కంటిరోగము అందరకు లేదు. ఆ జబ్బు ఉండువారికి రస్తా హెచ్చు తగ్గులుగా కనబడును. అది రోగమని తెలియక, స్పర్శేంద్రియ జ్ఞానము కూడ లేనియెడల అట్టివానికి ప్రపంచము మిట్టపల్లములుగా కనబడును. అట్టివాడు చిత్రలేఖకుడయ్యేనేని తన చిత్రములలో సమతలముండదు. అట్టి చిత్రములను మనము మెచ్చు

కొన జాలము. అది క్రొత్త ఉద్యమము కావచ్చు. కాని ఆ చిత్రములను మెచ్చుకొనుటకు మనకు కూడ అస్టిగ్మాటిజం అను కంటిజబ్బు రావలయును. కొన్ని ఉద్యమములు ఇటు వంటి అసామాన్య ప్రకృతులకును కాలమునకును సంబంధించినవి. Cubism, Dadaism, Futurism, Impressionism అను చిత్రలేఖన పద్ధతులు కూడ abnormal psychology కి సంబంధించినవే. యుద్ధమందు చూచిన రక్తపాతము, ఘోరత్వము మృత్యువు ఈలాటి మార్పులకు కారణమై యుండును. True, it is a ghostly Company: Expressionistic cubistic shapes, the forms of Futurism, moving and caught in movement; Pictures of horror and protest which have arisen out of the great Death of war.

జర్మనీలో ఈ చిత్రముల సంత పెట్టినప్పుడు దానిని బహిరంగపఱచుచు అధ్యక్షుడు ఇట్లు చెప్పినాడు:

Cubism, Dadism, Futurism, Impressionism and the rest have nothing in common with our German people. For all these notions are neither old nor are they modern. They are simply the artificial stammering of people whom God has denied the boon of genuine artistic talent and given instead the gift of prating and deception ఈలాటి విపరీత కళాచాపల్యము వారికే నచ్చలేదు. ఇక అటువంటి పరిస్థితులు లేని మనకెట్లు సంతోషము కూర్చును.

ప్రస్తుతపు మహాసంగ్రామము ముగిసిన తర్వాత కూడ శ్మశానవాటికయైన యూరపునందు విపరీతోద్యమములు పుట్టవచ్చును. ఈ యుద్ధమునందు ఇండ్లు ఆస్తులు ప్రాణములు జాతుల స్వాతంత్ర్యము నాశనమైనవి. వాఙ్మయము భగ్నము

కాలేదు. అది మాత్రము ఎందుకు భగ్నము కాకూడదు అను భావములుగల ఒక వాఙ్మయ హిట్లరు పుట్టి యూరపున ఒక విపరీతోద్యమము లేవదీయునేని దాని క్రొత్తందనము వలన మన దేశమునందుకూడ ప్రతిధ్వనులు పుట్టును. ఎద్దు ఈనినదనిన గాటకట్టివేయుమని చెప్పుటయేగదా యిప్పటి మన పరిస్థితి. జాతీయగౌరవము జాతీయ వ్యక్తిత్వము పరిస్ఫుటము కానంతవఱకు మనకీ యనుకరణ దురవస్థ తప్పదు.

అయినను, కాలప్రవాహమున మార్పులు అనివార్యములు. ఆంధ్రుల సాంఘిక జీవనమునందు వాఙ్మయమునందు కొన్ని మార్పులు కలిగినవి. వీరేశలింగంపంతులుగారు ఇంగ్లీషు రచనా మర్యాదలను తెలుగులో ప్రవేశపెట్టిరి. గురిజాడ అప్పారావుగారు గిడుగు రామమూర్తి పంతులుగారు వ్యావహారిక భాషోద్యమమునకు మూలపురుషులైరి. ఇట్టి మార్పులు నేటికాలపు తెలుగు కవితలో పొడచూపినవి. విస్మృతమైన పల్లెపదాలు మరల చెలామణియైనవి. ద్విపదకు గౌరవము కలిగినది. క్రొత్తఛందస్సులు పుట్టినవి. ఆంగ్లేయుల కావ్య మర్యాదలు ఆకృతులు మన కావ్య పద్ధతులందు కొన్ని మార్పులు కలిగించినవి. ఖండకావ్యములు ప్రముఖములైనవి. కవితావస్తువునందు మార్పు కలిగినది. నవలలు ఉపకథలు పుట్టినవి.

ఆఫీసుకు పోవునప్పుడు కోటు బూటు హ్యాటు తగిలించుకొని యింటికి వచ్చినతర్వాత ఎప్పటివలె ధోవతి తుండుగుడ్డతో ఉండినట్లే ఈ మార్పులన్నియు బాహిరములే. కవితాంత రంగమున, కవితా మూల సూత్రములలో

మార్పులు కలుగలేదు. ఏలయనగా అవి సార్వకాలీనములు. సార్వ లౌకికములు.

ఈ మూల సూత్రము లెట్టివి?

యథార్థమైన కవిత్వమునకు అనివార్యముగా ఛందస్సు అనుగతమౌను.

కవి ప్రతిభయే కవితకు ప్రాణము.

కవితా ప్రయోజనము సద్యఃపర నిర్వృతి. తక్కిన ప్రయోజనములు ఆనుషంగికములు.

కవితయందు, రసరామణీయకములు ప్రధానములు. తక్కినవి పోషకములు.

రసప్రతిబంధకములైన హేతువులు కావ్యదోషములు.

కవితాకళ జగదేకమైనది కావున దాని నిర్మాణ సూత్రములుకూడ జగదేకములుగ నుండును. ఈమూల సూత్రములకుకూడ ఈనాడు చేటుమూడు అవస్థ వచ్చినట్లు సూచనలగపడు చున్నవి.

రాజకీయ విషయములలో Democracy ప్రవేశించి జనసామాన్యమునకు మేలుచేసినది. అట్లే వాఙ్మయములోని కినీ ప్రవేశించినది. ఉపకారమునకంటే అపకారమే చేసినది. ఎందుచేత? రాజకీయమైన Democracy నియమబద్ధము. వాఙ్మయములోని Democracy విశృంఖలము. ఆ డెమొక్రసి తప్పుత్రోవ త్రొక్కినప్పుడు అధికారముగల ప్రజా ప్రతినిధుల చేతిలో కళ్ళెమున్నది. సరియైనదారికి త్రిప్పగలరు. వాఙ్మయములోని డెమొక్రసి తప్పుదారి పట్టినప్పుడు దానిని

మరలించు కళ్ళెము చేతపట్టుకొన్న ప్రతినిధులు లేరు. అందు వలన ఈ డెమొక్రసీ యింతవరకు విశృంఖలముగానే ప్రవర్తించుచున్నది.

తెలుగు కవితలో నేడు జరుగు మార్పులలో ఛందోబద్ధముకాని వచనపు తుంటలను వ్రాసి దానిని కవిత్వమని నామకరణము చేయుట ఒక పెద్దమార్పు. ఈ నావెల్లి తెలుగులో క్రొత్తగా ప్రవేశించినది. ఈ కవిత్వము వ్రాయువారు, ఏ డెనిమిదిమంది నవకవులు. మన దేశములో ఈకవిత్వము కూడ ఒక ప్రతిధ్వని. ప్రతిధ్వనులు ప్రతిఫలించిన కాంతులు సారభూతములు కావు. అనుభూతి జన్యములును కావు.

అమెరికా దేశమున Walt Whitman అను నతడు Leaves of grass అను గ్రంథమును రంచిచెను దానికి Verse libre అని పేరుపెట్టినారు. అనగా Free ver›e—ఛందోబద్ధముకాని పద్యము. ఈ పద్యములు అమెరికాలోకంటె ఇంగ్లాండులో ప్రజల మనస్సుల నాకర్షించినవి. కారణమేమనగా, వానిలో ఛందస్సు లేనందువలన కాదు, అమెరికా దేశస్థుల Democratic భావములు సర్వమానవ సౌభ్రాత్రము విశాలమైన Cosmopolıtanısm ఆపద్యములలో అద్దమునందు ప్రతిబింబమట్లు ఇంగ్లీషువారికి గోచరించినది. ఆ భావములు అందర హృదయములను ఉద్ధరింపగల సమర్థములు. నేనా గ్రంథమును మొట్టమొదట చదివినప్పుడు ఇటువంటి మహోన్నత భావములు ఛందోబద్ధమైయుండిన మరెంత రమణీయముగా నుండెడివో యని తలంచితిని.

Walt Whitman రచించిన కొన్ని పద్యములు లయాన్వితమై ఛందోబద్ధ పద్యములకు దాపునకువచ్చుచున్నవి. హృదయములోని లయను మొదలంట యెవరు కోయగలరు? ఛందస్సునందు లయపుట్టును. లేక మనసులోని లయవలన ఛందస్సు పుట్టును. లయ కృత్రిమముగా కల్పించుకొన్న కవితోపకరణముగాదు. అది సహజము. కావుననే జగదేకము ప్రపంచములోని అన్ని జాతుల భాషలలోను అక్షరబద్ధము కాని అనాగరిక భాషలందును కవిత్వము ఛందోబద్ధముగానే ఉన్నది. ఈనియమము స్వాభావికము కానియెడల జగదేకత్వము సిద్ధింపదు

ఇప్పటి పదార్థ విజ్ఞాన శాస్త్రజ్ఞులు కూడ Radiation, matter అనియు స్థూలముగా మన కంటికి కనబడు వస్తువులు కూడా bottled up radiations అనియు చెప్పుచున్నారు. ఈ radiation కాలావకాశ బద్ధములైన తరంగములుగ ప్రసరించును. ఈ అలలు లయాబద్ధములు. ఈ ప్రకృతియే లయాబద్ధము—లయసహజము. లయయొక్క శ్రుతిసుభగత్వమే ఛందస్సు.

కవితా విషయములందు మనలాక్షణికులకును యూరపియన్ విమర్శకులకును గమనింపదగిన భేదములు లేవు. Poetry is the rythmic creation of beauty అని ఆలన్ పో అన్నాడు. Musical thought అని కార్లయిలు చెప్పినాడు. There is something magical in rythm. It even makes us believe that the sublime lies within our reach అని జర్మను కవి గెతే లయా సౌందర్యముల సాహచర్యమును వివరించి

నాడు. ఛందస్సు యథార్థమైన కవికి ఆటంకము కాదు. సహాయకరమె. హృదయములో నేమూలనో దాగియున్న భావములు ఉద్రిక్తములయి ఉత్తేజితములయి లయాశక్తి మూలమున ఉత్పతన క్షమములు కాగలవు. 'A metrical garb has in all languages been appropria-ted to poetry. It is but the outward development of the music and hormony within The verse far from being a restraint on the true poet, is the suitable index of his sense and is adopted by his free and delibarate choice' అని ఛందస్సునకు కవి మనసులోని లయాశబ్ద సారస్యములకును గలఅవినాభావ సంబంధమును Newman గారు వచించినారు.

ఛందస్సులేని పద్యము విన్నప్పుడు ఉప్పులేని చప్పిడి కూరతో అన్నము తిన్నటులుండును. శ్రుతిరంజకత్వము అభావమగును. ఆనందదాయక హేతువులలో ఒకటి లుప్తమయి మన ఆనందము పరిపూర్ణముకాదు. ఇంకను వీలైన యెడల ఆనందహేతువులను చేర్చుట న్యాయముగాని ఉన్న వానిని ఊడబెరుకుట సమంజసముకాదు. ఆపని చేయుటకు కవులే అవసరములేదు. ఏ అసమర్థుడు కూడ చేయవచ్చును.

రాయప్రోలు సుబ్బారావుగారు నవ్యకవులకు ప్రతినిధిగ రమ్యాలోకమను కావ్యనియమ గ్రంథమును రచించిరి. దానిలో

> ప్రాతవైనంతనే త్యజింపరుః నవీన
> మైనమాత్ర వరింపరు; ప్రియములై న
> హృదయ సేవ్యమానము లైనవెల్ల స్వీక
> రించి భావాంబరమలంకరింతు రర్థి.

చిర యశః స్థాయిగొనిన ప్రాచీన సుకవి
వాఙ్మయమునను ఆకర్షవంతమయిన
రమ్యభావకలాపముల్, శ్రావ్యమైన
శబ్దరీతి విధానముల్ సంగ్రహింత్రు.

శీలమట్టుల నౌచితి చెదరనీక
అహివిధాన అశ్లీల మనాదరించి
ప్రేమమంత్ర మహోపాసనామయులగు
నవ్యుల కుపాదియయ్యె సౌందర్యమొకటె.

ఈ రమ్యాలోకము సుబ్బారావుగారు ఉద్దేశించిన నవ్యకవుల Manifesto గా కనబడుచున్నది. శ్రీశ్రీగారు కూడ వారు ఉద్దేశించ కనకవుల పక్షమున మరొక Manifesto ప్రకటించినారు. ఇది 'ఫిడేలు రాగాలడజన్'కు Intro గా ఉన్నది. Intro అంటే Introduction; ఈ రాగాలడజన్ అనునది ఛందోబద్ధముకాని పద్యముల సంపుటి. దీనిని రచించిన కవి మావాడె. Intro లో సారాంశ మేమనగా :

ఒక మాటకు ఒక అర్థం అదీ న్యాయం. కాని యీ ప్రపంచంలో చూడండి. ఒక మాటకు పది అర్థాలు. ఒక అక్షరానికే లక్ష అర్థాలు. ఇక రెండో కొసను ఒక అర్థానికే కోటి పదాలు. ఈ అర్థాల నిరంకుశత్వం భరించ లేడు నవకవి. వ్యాకరణం మాత్రం? వాక్యానికి కర్త కర్మ క్రియలు విధిస్తారుకాదూ. వీటికి నవకవి విడాకులిస్తున్నాడు. కర్త లేకుండా ఒక క్రియమాత్రం నిరంకుశంగా విహరిస్తుంటే కొందరు కళ్లు పొడుచుకొంటున్నారు. కాని కవి సర్వతో ముఖ స్వాతంత్ర్యదాత, స్వేచ్ఛాదాత. విభక్తి విశృంఖ

లంగా షికారు పోవచ్చు. ప్రతిఫలం విచిత్ర సౌందర్యం. విచిత్రమే సౌందర్యం – సౌందర్యమే విచిత్రం.

ఛందస్సుల చండ శాసనానికికూడా కాలం వెళ్ళి పోయింది. కవి హృదయంలో రాగాలపస ఎట్టి తీగలు సాగితే అదే గీతానికి ఆకారం నిర్ణయించాల. నవకవికి అనుకరణ అసహ్యం. ఇవన్నీ ఋజుపతూన నవకవుల తిరుగుబాటు. వారు సాధించిన ధనం ఏమైనా ఉన్నదా అని ప్రశ్నిస్తారా చదవండి ఫిడేలు రాగాలడజన్.

శ్రీశ్రీగారు ఉద్దేశించిన నవకవులు ఒకరిద్దరు తప్ప శ్రీశ్రీగారితో సహా నాకు మిత్రులు. వారి సౌజన్యముపైన నాకు నమ్మకము కలదు. ఒకవేళ వారు "వచన పద్యాలనే దుడ్డుకర్రలతో పద్యాల నడుములు విరుగ దంతాము" అని నిరాఘాటముగా చాటినప్పటికిని వారిలో ఎవ్వరిలోను ఇటు వంటి గడుసుదనము నాకు కనిపించలేదు. అందుచేత అభి ప్రాయ భేదములు నాగరకుల స్నేహమునకు భంగము కలి గించవని నానమ్మకము.

రాయప్రోలు సుబ్బారావుగారి Manifesto లో సిద్ధాం తీకరింపబడిన కొన్ని విషయములను గురించి నాకు అభి ప్రాయ భేదము లున్నప్పటికిని కవితావిషయమై వారు కావిం చిన నిర్ణయములను గురించి నాకు భిన్నాభిప్రాయము లేదు. అవి సర్వాంగీకార పాత్రములయి సాంప్రదాయికముగ అల వాటులోనున్న నియమములె. కవిత్వమున రస రామణీయక ములు ఔచిత్యము ఉండ నక్కర లేదని యెవరు చెప్పరు.

శ్రీశ్రీగారి నవకవులకంటె సుబ్బారావుగారి నవ్యకవులె తెలుగు దేశమున ఎక్కువగ నున్నారు. అందుకు వారి రచనలే సాక్షులు.

శ్రీశ్రీగారి Intro లో ప్రతి వాక్యము విమర్శకు పాత్ర మగునంతటి బలహీనముగా నాకు గోచరించినది. ఒక అక్షర మునకు లక్ష అర్థములుండిన కవులకు ఏమీ యిబ్బంది లేదు. ఒక మాటకు పది పర్యాయపదములుండిన ఏమీ చిక్కు లేదు. అవి అన్నియు వాడుకలో రూఢియైనవి కావు. నానార్థ రత్నమాలను ముందు పెట్టుకొని ఏకవి కవిత్వము వ్రాయడు. పూర్వము శ్లేషకావ్యములు వ్రాయుదినములలో అట్టి నిఘం టువులు ఉపయోగపడి యుండవచ్చును. ఇప్పుడెవ్వరు శ్లేష కావ్యములు ద్వ్యర్థి కావ్యములు వ్రాయుటలేదు. ఆ ప్రస్తావ నయే అనవసరము.

నిఘంటువులో ఉన్నదన్న మాత్రమున కవి ఆ పద మును గ్రహింపడు. కవి గ్రహించుపదము శ్రవణ సుభగము గను తన భావము ప్రకటించునదిగను ఉండును. కావుననే తిక్కన "కావ్యంబు సరసులైన కవుల చెవులకు నెక్కనగాని నమ్మ డెందు పరిణతిగల్గు కవీశ్వరుండు" అని చెప్పెను. దీనిలో శబ్దసారళ్యము సౌకుమార్యము ధ్వనించుచున్నది. చెవికికూడ ప్రాధాన్యము. పింగళి సూరన "పొసగ ముత్తెపు సరుల్ పోహళించినలీల దమలోన దొరయు శబ్దములు గూర్చి" అని word harmony సూచించినాడు. నానార్థ నిఘంటువు లుండినందువలన, ఆంధ్ర మహాభారతము భాగ వతము మున్నగు గొప్ప గ్రంథములను రచించిన పూర్వకవు

లకుగాని నేటి కవులకుగాని ఏలాటి యిబ్బంది కలుగుట లేదు. నవకవులకు మాత్రము ఈ బాధ యెందుకు కలుగవలయును?

ఒక వేళ నవకవులు నానార్థ రత్నమాలాది నిఘంటువులు మునిసిపాలిటీవారి చెత్తదిబ్బల స్టోరు అని అనుకొను పక్షమున ఆచెత్తదిబ్బలు మనము నడచు రాజమార్గమున లేవు. వానిని వెదకుకొని పోవువారికే కనబడును. ఆ చెత్త దిబ్బల భారము ఏకవియు మోయుట లేదు. అందులో నవ కవులు తాము మోయుచున్నామనియు భరింపలేమనియు అనుకొందురేని అది వారి భ్రాంతి.

వాక్యమున కర్త కర్మ క్రియల అనుబంధానికి నవకవి విడాకు లిస్తున్నాడు. ఒక క్రియమాత్రం నిరంకుశంగా విహరిస్తే కొందరు కళ్ళు పొడుచుకోవడం ఎందుకని శ్రీశ్రీగారి ప్రశ్న. చిన్నయసూరిగారి బాలవ్యాకణాన్ని దండిస్తామని నవకవుల ప్రతిజ్ఞ. చిన్నయసూరిగారిని విమర్శింపవలసిన భాగములు వేరేవున్నవి. అవి కర్త కర్మ క్రియలలో కాదు. ఆ పని దక్షులైన పండితులు పూర్వమే చేసియున్నారు.

మనుష్యులు అన్యోన్యము మాటలాడుకొనుటకు తమ భావములను వెల్లడి చేయుటకు భాష పుట్టినది. మనము వాక్యములతో మాటలాడుకొందుము. ఒక వాక్యమునకు కనీసము ఒక కర్త ఒక క్రియ వుండుట అవసరము. ఈ నియమము అనుభవ జన్యమైన అక్కరవలన పుట్టినది.

ఒకప్పుడు ఇద్దరు మనుష్యులు మాటలాడు కొనునప్పుడు ఒక క్రియనే ఉపయోగించవచ్చును. "ఏంరా వస్తావా?" అంటే "వస్తున్నారా" అనవచ్చు. అప్పుడు

కర్త తేలికగా ఊహించుకొనబడును. మూడవ వానిని గురించి చెప్పునప్పుడు "వస్తాడురా" అని అంటే "ఎవడురా" అని రెండవవాడు ప్రశ్నింపవలసి యుండును. "రాముడురా" అని మరల వీడు జవాబు చెప్పవలసియుండును. ఇట్టి సంశయము, కాలహరణము, ఇబ్బంది తొలగించుటకే ఒక వాక్యమున ఒక కర్త ఒక క్రియ అవసరమని చెప్పిరి. ఈ నియమము మన భాషకే కాదు. అన్ని భాషలలో నున్నది. ఈ నియమము ప్రాచీనము కాబట్టి నవకవులకు గ్రాహ్యముకాదని చెప్పుటకు వీలులేదు. కొన్ని నియమములు మనము వదలదలచుకొన్నను అవి వదలవు. ఈ నియమమును బహిష్కరించి శ్రీశ్రీగారి కోరిక ప్రకారము ఒక్కక్రియకే యేకచ్ఛత్రాధిపత్యము కట్టిపెట్టిన యెడల మన భాష మూగ చెవిటివారి భాషయగును. ఇది క్రొత్త ఆవిష్కరణముకాదు. ఒక గొప్ప సిద్ధియుకాదు.

కవులకు భాషను పొదుపుచేయు గుణమున్నది. కవి ఎన్ని తక్కువ మాటలతో క్లిష్టాన్వయ దోషములేకుండ చెప్పగలడో అన్ని తక్కువ మాటలతో తన భావమును వెల్లడించును. అట్లు చేయలేనియెడల కవిదే దోషము. ప్రకరణమునుబట్టి కర్తనుగాని కర్మనుగాని ఊహించుకొనుట సులువైనయెడల వానిని పరిత్యజించును. "వచ్చెడువాఁడు ఫల్గుణుఁడవశ్యము గెల్తుమనంగరాదు" అని తిక్కనవ్రాసెను. గెల్తుము అను క్రియ కర్మను అపేక్షించుచున్నది. ఎవరిని గెల్తుము? పాండవులను. తిక్కన పాండవులను అని వ్రాయ లేదు. ప్రకరణమునుబట్టి ఊహించుకొనవచ్చును.

పూర్వము సిద్ధమైయుండినవి చక్కగ తెలుసుకొనక పోవుటచేత నవకవులకు ఇట్టివి అపూర్వసిద్ధులుగ తోచును. ఇంతయేల? శ్రీశ్రీగారు ఎంతవరకు తమ వాదమును ఆచరణలో పెట్టగలిగిరో తెలుసుకొనుటకు వారు రచించిన intro ను ఉదాహరణముగ తీసుకొనవచ్చును. వారు తమ వాదము ప్రకారము పీఠిక యంతయు క్రియలతో నింపియుండిన ఇతరులు విమర్శింపవలసిన యవసరము ఉండియుండదు. ఏలయన ఆ భాష మనుష్యులకు అర్థము కాదు. శ్రీశ్రీగారుకూడ విభక్తి విశృంఖలముగా షికారు పోజాలనందుకు సంతోషము. విభక్తులు లేని వాక్యము అన్యోన్యసంబంధము లేని పదసమూహముగ తోచునేగాని భావము తెలుసుకొనుట దుర్లభము. తామే అనుసరింపలేని థియరీలను ఇతరులపై పారవేసి వారిని చీకాకుపెట్టుట యెందుకా అని నాచింత. అయితే దీనికొక సమర్థనమున్నది. నవకవులు, తమ కవిత్వమునకు తమకు ఏలాటి సంబంధము లేదను నమ్మకముకలవారు కావున వారి థియరీలు ఒకవంక వారిరచనలు మరొకవంక నడువవచ్చును.

"కవులు స్వాతంత్ర్య దూతలు—స్వేచ్ఛా దాతలు". నిజమే. నిరంకుశాః కవయః అనే పలుకుబడి పూర్వమునుండి వ్యాప్తిలోనున్నది. అయితే ఒక్క భేదము మాత్రము కనబడుచున్నది. పూర్వులది నియమబద్ధమైన స్వాతంత్ర్యము. మనవారిది అరాజకమైన విశృంఖలత్వము. కాళిదాసువంటి ప్రతిభాసంపన్నుడైన మహాకవికికూడ "ప్రాంశు లభ్యే ఫలే లోభా దుద్బాహురివవామనః" అని అడకువచేత తన గొప్పతనమును తెలుపుకొనగా, ఒకటిన్నరపేజి చక్కగా వ్రాయ

లేని మాబోటివారము దుడ్డుకఱ్ఱ లెత్తుకొని బయలుదేరి నడుములు విరుగదన్నామనడము, అహంభావ కవులమని కంచుగంట మ్రోగించడము — ఇదీ ఒక నావల్టీగానే కనపడు చున్నది. వారి సిద్ధులను విమర్శింతుమేని మిగులునది అహంభావమే. తక్కినది అభావమే.

నవకవికి అనుకరణ అసహ్యమని వారన్నారు. అనుకరణము నిస్సారమని అందరు ఒప్పుకొనతగిన విషయము. కాని వీరికి మనదేశపు కవులను అనుసరించడము అనుకరించడము అసహ్యము. పరదేశ కవుల ననుకరించడము పరమార్గము. ఈ వచన పద్యములు Walt Whitman పద్యముల కనుకరణము కాదని యెవరు చెప్పగలరు.

ఛందస్సుల చండశాసనానికికూడా కాలం వెళ్లిపోయిందని శ్రీశ్రీగారు వ్రాసినారు. ఇది కేవలం భ్రాంతి. పది సంవత్సరములకు పూర్వము భావకవి అని అనిపించుకొనుట ఒక గౌరవము. నాడు భావకవులమని యనుకొన్నవారుకూడ నేడు ఆపేరువహించుటకు సిగ్గుపడు చున్నారు. ఇప్పుడు ఆ నావెల్టి పోయినది. అంతే యీ నవకుల వచనపద్యాల నావెల్టికూడ. తెలుగుజాతి పరాయిది కానంతవరకు, తెలుగు వారి హృదయమున రసజ్ఞత నశించనంతవరకు, తెలుగువారి సాంఘిక జీవన ప్రవాహమునకు గట్లుగా ఆంధ్ర మహాభారతము భాగవతము రామాయణము జీవించి ఉండునంత వరకు తెలుగు కవిత్వమునకు ఛందస్సునకు విరహముకలుగదు. ఎన్ని రాజ్యములు పుట్టిచచ్చినవి ? ఎందరు రాజులు గతించినారు ? ఎన్ని నాగరకతలతో మనకు సంబంధము కలిగినది?

అయినప్పటికిని ఇప్పటివఱకు తెలుగువారము తెలుగువారము గానే ఉన్నాము. భాగవతము చదివినప్పుడు ఒడలు పులకరింపని ఆంధ్రు డుండడు. భారతము విని తలయూపని తెలుగువా డుండడు ఇవి మన జాతీయసిద్ధులు. వీనిముందు తక్కిన నావెల్టీలు హనుమంతుని యెదుట కుప్పిగంతులు.

నారాయణబాబుగారు తాము రచించిన వచన పద్యములను ఒకతూరి వినిపించిరి. వానియందు ఈ ఫిడేలరాగాల డజనులో వలెకాక, ఉన్నతములైన భావములుండినవి. ఆయనకు ఏపద్యమైనను చక్కగా చదువగల శక్తి కలదు. ఆ పద్యములందు ఒకదానితో నొకటి పొందిపొసగని లయాఖండములు (Mosaic of rythm) వినిపించినవి. ఛందస్సును త్యజించితిమంటి రే వీనిలో లయాఖండములు గోచరించుటకు కారణ మేమని యంటిని. (వానిలో ద్విపద పాదములు, గీత పద్యముల తుంటలు కనబడినవి). ఇవి ఆకాంక్షితముగ పడినవని వారనిరి.

గుడిపాటి వెంకటచలంగారు రాగాలడజనుపై అభిప్రాయము ఒక వచన పద్యమున వ్రాసిరి. ఆ పద్యము చదివినప్పుడు, వీరు చందోబద్ధముగ వచ్చు కవిత్వమును కేవలము నవత్వముకొఱకు అవయవ విచ్ఛేదము చేసియుందురని నా యూహకు తట్టినది. నా యూహ యదార్థము కాకపోవచ్చును. ఈ నిదర్శనములు గమనింపుడు.

వేయి కన్నీటిచుక్కల వేడిగాను.
చెవుల ఘోషించి కలవరపరచగలవు,

ఇవి రెండును పరిపూర్ణముగ తేటగీతి పాదములు.

వాడిఅయినట్టి కొనగోళ్ళతోడ (నొక్క)
చురుకుమనునట్లు పెట్టిన (పోకులాడి)

మొదటి పాదమున 'నొక్కి' అనియు రెండవ పాదమున 'పోకులాడి' అని చేర్చిన తేటగీతి పాదములగును.

నూరువెక్కరింపులనాలికల్ (గవెలికి)
దిక్కుదిక్కుల పకపకల్ (తేజరిల్ల)

ఈ పాదములలో మొదటిదానికి 'గవెలికి' అనియు రెండవ దానికి 'తేజరిల్ల' అని చేర్చిన తేటగీతి పాదములగును.

వీరి హృదయములలో దేవుడు ప్రసాదించిన లయాశక్తి ఉన్నది. నవత్వముకొరకు సహజశక్తిని అడగద్రొక్కి పరిపూర్ణమైన ఆకారమునందు అవయవములు ఛేదించి వీరు సాధించిన ఆ మహాప్రయోజనమేది? ఈ అపకారము వారికే కాదు, లోకమునకు కూడ. ఒక చిత్రమును యిరువయి తుంటలుగ కత్తిరించి చీట్లప్యాకీ కలిపినట్లు కలిపి మరల మేజాపై నెరిపిన ఒక అసంబద్ధమైన (Dis - harmonious) చిత్రము కనబడును. ఈ విచిత్రసౌందర్యమేనా ఛందో వైకల్యమునందు వీరు ఆశించునది?

ఈ నవకవులు రచించు వచనపు తుంటలకు పద్యము లని ఎట్లు పేరువచ్చినది? జామెట్రివలన, ప్రోసు పేరాను లయిను ప్రకారము కత్తిరించి వివిధ పరిమితులుగా తుంటలు చేసి, ఒకదాని క్రింద నొకటి అతికించిన ప్రోసు, పోయిట్రీగా మారును. ఇది జామెట్రీ కవిత్వము. ఈ కవిత్వమున, తిక్కన చెప్పినట్లు చెవి ప్రధానముకాదు, కన్ను ప్రధానము. ఇది తను భంగమువలన గద్యమూకాదు. ఛందోవిరహితమై

దున పద్యమూ కాదు ; త్రిశంకునివలె నడుమంతరమున వ్రేలాడుచు రెంటికిం జెడిన రేవడ యైనది.

ఎంతకాలమైనను తెలుగు కవిత్వమునకు ఆ వృత్తాలు ఆ సీస గీత పద్యములేనా వేరేమీ గతిలేదా యని యందు రేని, కలదని నేను మనవిచేయుచున్నాను. క్రొత్త ఛందస్సులు ఆవిష్కరించుకొని కవిత్వము వ్రాయవచ్చును. అవి శ్రవణ సుఖముగా నున్నయెడల నిలిచియుండును. ప్రస్తారము వలన ఎన్ని వృత్తములు పుట్టలేదు? అవి అన్నీ మన చెవికి రుచించుట లేదు. రుచించినవి మాత్రము నిలిచియున్నవి.

ఆడినదల్లా ఆటకాదు. పాడినదల్లా పాటకాదు. శిల్పమునకు సంయమనము (restraint) అవసరము. వీనియందు అటువంటిది కన్పించదు.

శ్రీశ్రీగారు నవకవులు సాధించిన మహాసిద్ధి యని తెలుగుదేశమునకు శిఫారసుచేసిన ఈ ఫిడేలరాగాల డజను గురించి రెండు మాటలు. ఆ పుస్తకము చదివినప్పుడు నాకు కలిగిన భావమిది : యౌవన ప్రాదుర్భావ సమయమున కామోద్రిక్తుడయి "కామార్తాహి ప్రకృతికృపణా చేతనా చేతనేషు" అను కాళిదాసు సూక్తికి ఉదాహరణప్రాయుడయి వలపుపస్తులతో నవసి మతిచెడిన యువకుని ఉన్మత్త ప్రలాపములు (Mad ravings)గా నాకు స్ఫురించినది. బుర్రా వేంకట సుబ్రహ్మణ్యంగారు చెప్పినట్లు ఒక్క Cleverness ఉన్నంతనే కవిత్వము కాదు.

అభినవాంధ్ర సాహిత్యము

[శ్రీ కొంపెల్ల జనార్దనరావుగారి సంపాదకత్వమున వెలువడుచుండిన "ఉదయిని" పత్రికలో ఈ వ్యాసము ప్రకటింపబడినది. —సం.]

సంఘమునందును వాఙ్మయమునందును మార్పులు అనివార్యములు. అన్యనాగరకతా సంసర్గమను బాహ్య నిమిత్తమువలన మార్పులు అలక్షితముగ తలసూపుచుండును. ఒక వాఙ్మయము యొక్క బాగోగులు, మంచి సెబ్బరలు తెలిసికొనవలయునన్న దానికన్న భిన్న సంప్రదాయము ననుసరించు మఱియొక వాఙ్మయముతోడి పరిచయము మన కుండవలయును. అద్వైతావస్థయందు తరతమజ్ఞానముండదు. మన దేశీయ వాఙ్మయములన్నియు ఏకసాంప్రదాయ బద్ధములయి సంస్కృత వాఙ్మయమునకు ప్రతిబింబములుగ నుండినవి.

ఆంగ్లేయుల సంబంధమువలన పాశ్చాత్యనాగరకతతో మనకు పరిచయము కలిగినది. వారి వాఙ్మయము, వారి ప్రకృతి విజ్ఞానము మనదృష్టి నాకర్షించినవి. వారి పరిపాలనా పద్ధతి మనయందు స్వాతంత్ర్యేచ్ఛ పురికొల్పి జాతీయైక్యమును పెంపొందించినది. సంఘమునం దవతరించిన ఈ నూతన స్వాతంత్ర్య ప్రియత్వము రాజకీయ విషయములందే కాక వివిధ సాంఘిక చర్యలయందును తలసూపినది. కట్టుబాట్లకు లోనయి బహిర్వ్యాప్తిని కోల్పోయిన సర్జనశక్తులు నేడు సంకుచితావరణమునుండి వెలి కురికి ఆలోచిత కార్య కల్పనకు సిద్ధములైనవి. వాఙ్మయము సాంఘిక జీవనముయొక్క

ప్రతిబింబమే కావున సంఘమున చెలరేగిన ఈ సంచలనము, ఈ ఆందోళనము, ఈ స్వాతంత్ర్యేచ్ఛ దానియందు మాత్ర మెట్లు ప్రకటితము కాకుండును?

ప్రబంధములలోని పచ్చి శృంగారము నేఁటి యభిరుచులబట్టి మొరటుగ తోచినది అందలి శబ్దాలంకారములు, భావప్రేరకములుగాక కేవలము బుద్ధిపరిశ్రమకు వినియోగపడు తెచ్చికోలు అర్థాలంకారములు "intellectual gymnastics" అని నిరసింపబడినవి. ఈ యసంతృప్తి ప్రతికూల విమర్శనముతోనే వ్యాయామైపోక వాఙ్మయ నిర్మాణమునకు తోడ్పడినది. కందుకూరి వీరేశలింగం పంతులుగారు Vicar of Wakefield, Gulliver's Travels అను ఆంగ్లేయ నవలలను మానాగా పెట్టుకొని తెలుగు నవల రచనకు మార్గదర్శకులైరి. వారు షేక్స్పియరు నాటకములను తెనిగించిరి. నాటకములు, ప్రహసనములు, వ్యాసములు, ఖండకావ్యములు, కవిజీవితములు వ్రాసి పంతులుగారు ఆంగ్లేయ వాఙ్మయములోని కొన్ని రచనావిధానములను, సంప్రదాయములను తెలుగులో వెలయించిరి.

వాఙ్మయ రచనలలో కలిగిన మార్పులతోపాటు భాషావిషయములందుకూడ కొంత సంచలనము ప్రారంభమైనది. గ్రాంథిక భాష కృత్రిమమనియు సహజమైన వ్యావహారిక భాషలో వ్రాయుట ఆవశ్యకమనియు గురిజాడ అప్పారావుగారు, గిడుగు రామమూర్తి పంతులుగారు తలంచి అందుకు కావలసిన మందుగుండు సామగ్రితో గ్రాంథికభాషావాదులను ముట్టడించిరి. ఈ యుద్యమమునకు ఫలితముగ

వ్యావహారిక భాషావాదములోని సహేతుకత్వమును ఇప్పుడు అందరును అంగీకరింపక తప్పినదికాదు.

ప్రపంచ వాఙ్మయముల నెల్ల జీర్ణించుకొని తన శరీరమునకు కావలసిన నెత్తురు కండలుగ మార్చుకొనుటచేతనే ఆంగ్లేయ వాఙ్మయము నేడు అపరిమితముగ వృద్ధి చెందుచున్నది. విదేశ వాఙ్మయ సంబంధము నూత్న సృష్టికి ప్రతిబంధకము కాదు. ఒకవేళ అపూర్వసృష్టి ప్రేరకము కావచ్చును. ఇందుకు ఆంధ్ర దేశమున సుమారు ముప్పది సంవత్సరములనుండి ప్రబలుచున్న అభినవ కవితోద్యమమె తగిన తార్కాణ. ఆంధ్ర కవుల ప్రతిభానర్తకికి నూత్న నాట్యరంగముల నేర్పఱచిన తప్పేమి?

అప్పారావుగారి ముత్యాలసరములతో అభినవ కవితోద్యమము ప్రారంభమయినది. సంక్షుబ్ధసాగర కల్లోలములలో గాలివీచినట్లెల్ల కొట్టుకొనిపోవుచున్న అభినవ కవితా నావకు కట్టమంచి రామలింగారెడ్డిగారు కర్ణధారులై నిలిచిరి. వారు రచించిన కవిత్వ తత్త్వవిచారమను విమర్శన గ్రంథము ఈ నవీనోద్యమమునకు మార్గదర్శకమైనది. ఈ నవయుగ కవితా ప్రభాతముయొక్క ప్రథమ రోచులు రాయప్రోలు సుబ్బారావుగారి కుటీర గవాక్షములలో ప్రసరించి ఆయనను ప్రబోధించినవి. సుబ్బారావుగారు అంతకు పూర్వమే కవిత్వమల్లుచుండిరి. ఆయన రచించిన 'లలిత' యను ప్రథమ కావ్యము శబ్దాలంకారయుతమై పూర్వ ప్రబంధ శైలిని తలపించుచున్నను, అందే భావికవితా పరిణామముయొక్క సూచనలు పొడకట్టుచుండినవి. ఆకాలమున నెల్లరకు పూర్వ

ప్రబంధములే పాఠ్యగ్రంథములు. అభినవ కవితకు మానా లేదు. ప్రతి కవియు సొంతమానాలు సృజించుకొనవలసి యుండెను. ఒక సంప్రదాయము కరుడుకట్టిన వెనుక వ్రాయు వారి కంతకష్టముండదు. పిఠాపురమున సుబ్బారావుగారు స్థాపించిన అభినవ కవితా గ్రంథమండలిని (లేక గ్రంథ మాలయో నాకు జ్ఞప్తిలేదు.) గుఱించిన యొక కరపత్రమును పూర్వమొకప్పుడు సి. వి. కృష్ణయ్యగారి యొద్ద నేను చూచితిని. అంగ్లేయ సాహిత్యములోని పేరిన తేనెగడ్డలను అభినవాంధ్ర కావ్యములలోనికి తెచ్చుట ఆ గ్రంథమండలి యుద్దేశములలో నొకటియని అందు వ్రాయబడి యుండినది. ప్రథమమున సుబ్బారావుగారి యుద్దేశ మెట్లుండినను తరు వాత వారు రచించిన కావ్యములు స్వతంత్ర సృష్టులనియే చెప్పవలయును. ఆయన వెనువెంటనే యీమార్గ మవలం బించినవారు అబ్బూరి రామకృష్ణారావుగారు. 1915, 1916 మొదలు పింగళి లక్ష్మీకాంతం, వెంకటేశ్వరరావుగార్లు, విశ్వనాథ సత్యనారాయణగారు, వేంకటపార్వతీశ్వర కవులు, శివశంకరశాస్త్రిగారు, కృష్ణశాస్త్రిగారు మఱి యింక కొందఱు ఈ నవీనమార్గము నవలంబించిరి. తరువాత క్రమ క్రమంగా ఇప్పుడు వ్రాయుచున్న కవులందఱు కొద్ది గనో గొప్పగనో స్వతంత్రముగనే రచించుచున్నారు. వీరందఱు ఏక మార్గావలంబికులయ్యును వ్యక్తిగత శిల్ప పరిపాకము ననుసరించి రచనలలో తారతమ్యము గోచ రించును.

ఈ అభినవ కవితోద్యమ ఫలితముగ కొంత పునరుద్ధరణము, కొంత నూతన సృష్టి కొనసాగినది. "ద్విపద కావ్యంబు ముదిలంజ..." అని తిరస్కరింపబడిన ద్విపదలు, పల్లెపదములు, పునర్గ్రహణ యోగ్యములైనవి. ఖండకావ్యములు, గేయములు, నవలలు, నాటకములు, ఏకాంక నాటికలు, ఉపకథలు. వ్యాసములు పుట్టినవి ఇవి యన్నియు తెలుగువాణికి నూత్నాలంకారములె. ఈ యిరువదియైదు సంవత్సరములనుండి పుట్టిన వాఙ్మయము విమర్శించుటకు తగినంత విరివిగా నున్నది. ఏసమర్థుడైనను నిష్పక్షపాత బుద్ధితో ఈ వాఙ్మయమును విమర్శించినయెడల చాల ఉపయోగకరముగ నుండును.

అభినవ కవిత్వమును గురించి యిప్పుడిప్పుడే కొన్ని యాక్షేపములు, ప్రత్యుత్తరములు బయలుదేరు చున్నవి. కాని, ఆక్షేపములవలెనే ప్రత్యుత్తరములుకూడ మూక ఉమ్మడిగ నున్నవి. ఈకాలమున వ్రాయబడునదంతయు చెత్తయని తృణీకరించుట యెంత అసమంజసమో ఈ నాటి రచనలన్నియు మహోత్కృష్టములని ప్రశంసించుటకూడ నంత యవిచారమూలకమె. బాగోగులు ఒక వర్తమాన కాలమునకే సంబంధించినవి కావు. చెత్త వ్రాసినవారు పూర్వముకూడ కలరు. అయితే ఆ చెత్తకును మనకును నూరులకొలది సంవత్సరముల అంతరమున్నది కావున, ఆ చెత్త యంతయు క్రుళ్ళి కాలప్రవాహమున కొట్టుకొని పోయి అంతస్సారముగల యేకొన్ని కావ్యములో నిలిచినవి. ఎచ్చటనో దాగియుండిన చెత్తలు పురాతనములన్నంత

మాత్రముననే అచ్చొత్తింపబడినవి యిప్పటికిని మనకు దొరకుచునే యున్నవి. ఈకాలమున వ్రాయబడున దంతయు బ్రతికియుండునని యెవరు చెప్పగలరు? ఈసంశయము కాలమే తీర్పగలదు. ప్రతిభావంతులగు కవులు ఏకాలమందైన నుందురు. అయితే వారిమార్గములు భిన్నములుగ నుండవచ్చును.

పోలవరపు రామబ్రహ్మముగారు 'ప్రజామిత్రలో' ఆధునిక కవిత్వమును విమర్శించిరి. వారి విమర్శలో కొంత సత్యమున్నది. కొంత తొందరపాటు, కొంత పొరపాటుకూడ ఉన్నది. వీరికి వడ్డాది సుబ్బరాయుడుగారు మున్నగు పెద్ద కవులతో ఏలాటి తగాయిదా లేదు. రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణరావుగార్ల కావ్యములతో గూడ వీరికేలాటి యిబ్బంది లేదు. కాని యితర కవులు రచించిన కావ్యములన్నియు చెత్తలని వీరభిప్రాయపడిరి. సుబ్బారావు రామకృష్ణారావుగార్ల కావ్యములను మెచ్చుకోగలవారు తదితరులు వ్రాసినదంతయు చెత్తయని యెట్లుతలంచిరో నాకు బోధపడుట లేదు. వారి కావ్యములలో నున్న గుణములును దోషములును తక్కినవారి కావ్యములలోకూడ నున్నవి. పింగళి లక్ష్మీకాంతం వెంకటేశ్వరరావుగార్ల 'సౌందర నందనము,' విశ్వనాథ సత్యనారాయణగారి 'ఆంధ్రప్రశస్తి' శివశంకరశాస్త్రిగారి 'హృదయేశ్వరి,' కృష్ణశాస్త్రిగారి గీతములు, వేదుల సత్యనారాయణశాస్త్రిగారి ఖండకావ్యములు, జాషువాగారి 'ఫిర్దౌసి', నాయని సుబ్బారావుగారి మాతృగీతములు, సుబ్బారావుగారి 'హంపీక్షేత్రము', బసవరాజు అప్పారావుగారి గేయములు, నండూరి సుబ్బారావుగారి

యెంకిపాటలు, కుందుర్తి నరసింహారావుగారి 'పంపాసరస్సు' (ఇదియొక ఖండకావ్యము), బొడ్డు బాపిరాజుగారి 'విపంచి' యేవాఙ్మయమునకైన అలంకారప్రాయములుగ నుండగలవు మచ్చునకుగా కొందఱి కవులను, వారికావ్యములను పేర్కొంటిని చక్కగా కవిత్వము వ్రాయగల కవులు ఇక నెందఱో నేడు ఆంధ్రదేశమున నున్నారు. ఈ రచనలన్నియు చెత్తని చెప్పుటకు, రామబ్రహ్మముగారు సాహసింతురా? అట్లు సాహసింతురేని వారి యభినవ కవితాపరిచయము 1916–న సంవత్సర పర్యంత మనియే మన మూహింపవలయును. అట్లు గానిచో వారి సహృదయత్వమును మనము శంకింప వలసి యుండును.

రామబ్రహ్మముగారు చూపించిన కావ్యదోషములు నేటి కవిత్వమున కానవచ్చుచున్నవి. దురాన్వయము, క్లిష్టాన్వయము, అర్థము బోధపడని పదములకూర్పు, నిరర్థక పదాడంబరత్వము, భావప్రకటనము చక్కగా చేయలేని గజిబిజితనము, మున్నగు కావ్యదోషములు ప్రత్యేకముగ ఆయాకవికి సంబంధించిన రచనాలోపములే కాని అవియెల్ల అభినవకవితకు లక్షణములు కావు. కవి మనస్సులోని భావము స్ఫుటముగా ప్రకటించుటకు తగినంత తీవ్రము కాకపోవుట చేతను, భాషపై కావలసినంత ప్రభుత్వము లేకపోవుట చేతను, భావోచితమైన పదమును వెదికికొన లేకపోవుట చేతను ఇట్టిదోషములు కలుగుచుండును. స్వాతంత్ర్యము చేకూరిన వెంటనే సంప్రదాయములమీఁది ప్రమాణగౌరవము నశించును. అట్లు నశింపనిదే నూత్న సృష్టిని పురికొల్పు

సాహసములవడదు. ఒకొక్కప్పుడు మనము స్వాతంత్ర్యమును దుర్వినియోగ పఱచుచుండుటయు కలదు. స్వాతంత్ర్యము దుర్వినియోగపడునను భయముతో పారతంత్ర్య మనుభవించుట భావ్యముకాదు. తప్పులుచేయనిదే యొప్పులు నేర్చుకొనము. ఒక నూత్న సంప్రదాయము కరుడుగట్టు ప్రథమదశయందు యిట్టి దోషము లుప్పతిల్లుచుండును. రవీంద్రనాథ టాగూరుగారు కవిత్వము వ్రాయ ప్రారంభించిన కాలముననే నూత్న సంప్రదాయముకూడ అంకురించుచుండినది. దానికి టాగూరుగారుకూడ కొంతవఱకు బాధ్యులు. ప్రథమమున వీరు వ్రాయుచుండిన బంగాళీ కవిత్వము అర్థమగుటలేదని అందఱు గోలపెట్టిరి. ఇప్పుడు మన కవిత్వమున గోచరించు దోషములు అప్పుడు ఆయన కవిత్వములో కూడ దొరలినవి. దీనిని గుఱించి తన "జీవనస్మృతి" యందు కొంత సమర్థించిరి.

ఈ సందర్భమున అభినవకవుల కష్టములను గూడ మనము గుర్తింపవలయును. వార్తాపత్రికల మూలముననను, వివిధ గ్రంథబాహుళ్యము వలనను నేడు ప్రపంచమంతటితో మనకు సంబంధమున్నది. కావున మన భావములుకూడ విరివియైనవి. మనభాష మన భావములతోపాటు వృద్ధిపొందలేదు. "New phraseology to express new ideology" అన్నట్లు, క్రొత్తభావములను, అందలి తరతమ చ్ఛాయలను వెలిపుచ్చుటకు క్రొత్తరకపు పదముల కూర్పు ఆవశ్యకమగును. కవి యొక్క భాషాప్రభుత్వము, పదములు కూర్చు నేర్పు ఇట్టియెడ నుపకరించును.

భాష యెప్పటికిని భావములకంటె వెనుకపడి యుండును. భావములు మాఱినంత సులువుగా భాష మాఱదు. అయినను కార్యకుశలుడు కొఱముట్లులేని లోపమును ఎట్లో పూర్తి చేసికొనును. ప్రతిభావంతులగు కవులు, గ్రంథకర్తలు జన్మించి సమకాలీన భాషను తమ కూర్పు నేర్పుచేత వివిధ భావ ప్రకటనార్హముగ నొనరింతురు. పదజాలము సంకుచితమయ్యున్నను కవి ఆవశ్యకమునుబట్టి ఒక యింద్రజాలముపన్ని భాషా దారిద్ర్యమును అతిక్రమించును. పూర్వమునుండియు కవులు కావ్యములలో ఉపమాద్యలంకారములను వాడుచున్నారు. భామహుని కాలమున నాలుగు అలంకారములె గుర్తింపబడినవి. కాని క్రమ క్రమముగ విమర్శకుల పృథక్కరణ శక్తివలన అలంకారములు పెక్కులయి మనము వ్రాయు ప్రతి వాక్యము, సమాసము, ఏదో యొక యలంకారము క్రిందికి వచ్చునట్లైనది. కాని మొట్ట మొదట యలంకారముల నుపయోగించిన కవి, అవి యలంకారములని, కవితకు మెఱుగుపెట్టుటకుగా వాని నుపయోగించుచున్నానను జ్ఞానముతోకాక, తాను ప్రకటింపదలచిన భావ తీవ్రతను మొక్కవోక స్ఫురింపజేయుటకు పడిన కడగండ్లే యీ యలంకారములని నా యుద్దేశము. తాను చెప్పదలచుకొన్న భావమునకు ఉచితమైన పదము భాషలోనుండిన ఈ యుపమాద్యలంకారములకు అవసరముండదు. భాషకు సహజమైన లోపమె యీ యలంకారములకు మూలము. ఒక యుదాహరణము చూడుడు:

నఖలు నఖలు బాణః సన్నిపాత్యోఽయ మస్మిన్
మృదుని మృగశరీరే పుష్పరాశా వివాగ్నిః.

దుష్యంతుడు ఆశ్రమ మృగమును తరుముకొని వచ్చు చుండగా కణ్వశిష్యులు చూచి దానిని రక్షింపనెంచి, "ఓ రాజా, యిది యాశ్రమ మృగము, దీనిని చంపదగ" దని చెప్పిరి. ఆశ్రమ కురంగమని బెదరు పెట్టినంతనే సార్వభౌముడు భీతిల్లి దానిని వదలునా? దుష్యంతుడు మృగయా ప్రియుడు. వేటాడుటకొఱకే వచ్చెను. జీవహింస క్షత్రియులకు క్రొత్తది కాదు. కావున వైఖానసులు ఎట్లయిన రాజు హృదయమును కరుణార్ద్రము కావించి మృగమును రక్షింపవలయును. అట్టియెడ "మృదువైన మృగశరీరమునందు బాణము ప్రయోగింపవలదు" అని బ్రతిమాలిరి. మృదువు అను విశేషణము బాధ నోర్చుకొనలేని కోమలత్వమును స్ఫురింప జేయునుగాని, ఎంత సుకుమారమని వైఖానసుడు చెప్పిన రాజు హృదయము ఆర్ద్రమగునో అంత సౌకుమార్యమును స్ఫురింపజేయుటకీ విశేషణము చాలదు. కావున వైఖానసుడు ఆ భావ తీవ్రతను, సాంద్రతను ఇట్లు ప్రకటించెను : 'రాజా, నీవు మృగముపై బాణము వేయుదువేని పూలరాశిలో అగ్ని పెట్టినట్లే!' పూవులు చాల పేశలములైనవి. తాకిన కందిపోవునవి. తల నిడికోదగినవి. తన ప్రేయసి ధరియించునవి. తాను ప్రణయ బహుమానముగ గొన్నవి. దేవుని పూజించుట కర్హమైనవి. ప్రకృతిదేవి దరహాసముల వంటివి. మనోహరములైనవి. ఇట్టి పూలకు నగ్ని రగల్చినట్లగునా! ఈ కార్యము క్రూరము ఘోరము. ఎంత కర్కశాత్ముడైనను

ఈ కార్య మొనరింపదు. ఇక సరసుడైన దుష్యంతుని మాట వేఱ చెప్పవలయునా ? ఈ సాదృశ్య ప్రభావము "మృదువు" అను విశేషణము అంతకు పూర్వము స్ఫురింప జేయలేని యెన్నో భావములు ఇప్పుడు దానికి సంక్రమించినవి.

కవి గాఢతరమైన తన రసానుభూతిని చెక్కుచెదరనీయక పఠితల హృదయముల స్ఫురింపజేయును. భావమునకు భాష కేవలము సంజ్ఞామాత్రమె. ఒక్కొక్కప్పుడు మనము భావించిన దొకటి, ప్రకటించిన దొకటిగా ఏర్పడును. ఏలయన, భావము సున్నితమైనది. భాష స్థూలమైనది. కావున దీనికొక Momentum కలదు. ఇందుకు ప్రతీకారముగ భావము తీవ్రతరము కానిదే భాష భావమునకు లొంగదు. కవి యుపయోగించు సంజ్ఞలు పఠితలకుగూడ తెలిసినవిగనో తెలిసికొన తగినవిగనో యుండవలయును. పదమునకు నిఘంటువు ప్రసాదించు అర్థమునకంటె వేఱు శక్తులుకూడ కలవు. ఆ శక్తుల యన్నిటిపైనను కవి యాధారపడి తన భావమును స్ఫురింప జేయును. తన భావము ఇతరుల కెఱుకపడనియంత క్లిష్టసంజ్ఞలతో ప్రకటింపబడియున్న ఆ పద్యము మూగ చెవిటి వారల సంభాషణమువలె వ్యర్థమగును. కావ్య ప్రయోజనమందు శూన్యమగుటవలన దానికి కావ్యత్వ హానికూడ సిద్ధించును. F. T. Palgrave గారు "Golden Treasury" అను ఖండకావ్య సంపుటమునకు తాను రచించిన యుపోద్ఘాతమున నిట్లు వ్రాసియున్నారు.—

'......that passion, colour, and originality can not atone for serious imperfections in clearness, unity or truth.'
కావ్యమునకు ముఖ్యమైన గుణములలో భావ స్ఫుటత్వ మొకటి యని ఈ విమర్శకుని యభిప్రాయము.

భావములు వాచ్యములుగనె యుండవలయునా? వ్యంగ్యముగ నుండకూడదా? అని కొందఱు ప్రశ్నింప వచ్చును. భావస్ఫుటత్వము వ్యంగ్య మర్యాదకు విరోధి కాదు. ప్రకరణార్థము గోచరించుచునే తదతిరిక్తమైన వేఱొక భావము స్ఫురించవచ్చును. క్లిష్టార్థ సమన్వితములైన పద్యములను దీసికొని యవి వ్యంగ్యప్రధానములని సమర్థించుట ఇప్పుడొక యాచారమైనది. ధ్వని ప్రధానములని యెన్నబడు సంస్కృత శ్లోకములలో ప్రకరణమునకు సంబంధించిన యర్థము సులభగ్రాహ్యముగనే యుండును.

రామబ్రహ్మముగారు బూతుకథల విమర్శించిరి. వీరికి బూతుకథలపై గలిగిన ఆగ్రహము అభినవసాహిత్యము నంతటిపై ప్రసరించి వారి విమర్శనమునకున్న విలువను తగ్గించినది. బూతుకథలు వెలువడుచుండుట యదార్థమేగాని అభినవ సారస్వతమంతయు ఈ బూతులుతప్ప మఱి యింకేమి లేదని చెప్పుట ఆ సాహిత్యముతోడి వీరి పరిచయ మెంత పాటిదో మనకు గోచరించుచున్నది. మున్నటివైనను నేటివైనను బూతులు బూతులే. నాగరకాభిరుచిగలవారికి అట్టి కథలు ఏవము పుట్టించును. అట్టి కథకులు ఏ స్త్రీలను సంస్కరించుటకు (గిరీశమువలె) ప్రయత్నించుచున్నారో ఆ స్త్రీల ఆత్మగౌరవమునకే అట్టి కథలు భంగకారులుగ నున్నవి

కథలు వ్రాయువారందరు ఇట్టి బూతుకథలే వ్రాయుటలేదు. ఇట్టి కథలు ప్రచురించుటకు రెండు, మూడు మాసపత్రికలె కంకణము కట్టుకొన్నవి.

"సుబోధిని" పత్రికయందు "నవకవులు — బూతు కవనము" అని రామబ్రహ్మముగారు రచించిన వ్యాసము, "ప్రజామిత్ర" లోని వ్యాసమునకన్న మఱింత తీవ్రమై బూతుకథలతో వారికిగల పరిచయమును సార్థకపఱచు చున్నది. నవకవులెవ్వరును బూతుకవనము వ్రాయుటలేదు. వారి కవిత్వములోని శృంగారము సభ్యముగను నాజూకైన యభిరుచిగలదిగ నుండును. కవిత్వము వ్రాయువారి సంఖ్య చాల తక్కువ. వారి కథలలోగూడ బూతులేదు. అందులో ఒక్కరు మాత్రము అట్టి కథలను వ్రాయుచుందురు. ఇక మీదనైన రామబ్రహ్మముగారు విషయ పృథక్కరణము నందు కొంత పరిశ్రమ చేయుదురుగాక యనియు, అభినవ కావ్య సాహిత్య పరిచయము కలిగించుకొందురుగాక యనియు నా మనవి.

చిత్రలక్షణము *

(శ్రీ పి. వి. రాజమన్నారుగారి సంపాదకత్వమున వెలువడుచుండిన 'కళ' అను మాసపత్రికయందు, ఈ వ్యాసము ప్రకటింపబడినది. —సం.)

తొమ్మిది సంవత్సరములకుఁ బూర్వము బెర్తోల్డు లౌఫర్ (Berthold Laufer) అను నొక జర్మను పండితుఁడు టిబెట్ దేశపు "తాంజుర్" గ్రంథమాల నుండి "రెమొ ఈశాన్య" లేక "చిత్రలక్షణము" అను నొక శిల్పశాస్త్రమును జర్మను అనువాదముతోడఁ బ్రకటించెను. ఆ గ్రంథమునందలి విషయమును సంక్షేపముగఁ గ్రింద వివరించుచున్నాను.

టిబెటు దేశమున బౌద్ధధర్మము ప్రతిష్ఠింపఁబడిన యనంతరము, ఆదేశపు భాషలోనికిఁ జాల సంస్కృత గ్రంథములు తర్జుమా చేయఁబడినవి; ఇట్టి పుస్తకములతోడ "కాఃజుర్", "తాంజుర్" అను రెండు గొప్ప గ్రంథమాలలు సమకూర్పఁబడినవి. ప్రస్తుతము మేము పర్యాలోచించు గ్రంథము "తాంజుర్" గ్రంథమాలలోనిది.

---

* చిత్రలక్షణమను శీర్షికతో, వంగసాహిత్యపరిషత్ పత్రికయందు రవీంద్రనారాయణ ఘోషగారొక వ్యాసమును బ్రకటించిరి. అందలి ముఖ్య భాగమును సంకలించి రామానంద చట్టోపాధ్యాయగారు "ప్రభాసి" చైత్రసంచికయందుఁ బ్రకటించిరి. దానిని "కళ" కొఱకు నేను తెనిగించితిని. —దు. రామిరెడ్డి.

పై గ్రంథమాలయొక్క సూత్రవిభాగము 123-వ ఖండమందు నాలుగు శిల్ప శాస్త్రములు గలవు. అవి యేవన :—

(1) దశతలన్యగ్రోధపరిమండల బుద్ధ ప్రతిమాలక్షణము.

(2) సంబుద్ధభాషిత ప్రతిమాలక్షణ వివరణము.

(3) చిత్రలక్షణము.

(4) ప్రతిమా మానలక్షణము.

మరల చిత్రలక్షణము మూడధ్యాయములుగ విభజింపఁబడి యున్నది. కడపటి యధ్యాయమునఁ బలు తెఱఁగులైన కొలతలను గుఱించియు గ్రంథకారుఁడు వివరించియున్నాడు. ముప్పదియారు విధముల నయనభంగుల వర్ణనమందుఁ గలదు. ఆ యధ్యాయమందే చిత్రశిల్ప పద్ధతిని గుఱించియుఁ జెప్పఁబడియున్నది. ప్రథమాధ్యాయమందుఁ జిత్రవిద్యయొక్కయుఁ జిత్రలక్షణమను గ్రంథముయొక్కయు నుత్పత్తి వర్ణింపఁబడినది. ద్వితీయాధ్యాయమునందుఁ జిత్రవిద్యయొక్క దైవిక సంబంధపుగాథ వ్రాయఁబడినది. మొదటి రెండధ్యాయముల చివర "నగ్నజిత్ కృత చిత్రలక్షణము" అని గ్రంథ రచయితపేరు తెల్పఁబడియున్నది.

మొట్టమొదట భూలోకమునఁ జిత్రవిద్యను సృజించినది నగ్నజిత్తు అను నొక రాజు. పూర్వకాలమున, యశస్వియు, ధార్మికుఁడునయి భయజిత్తు అను రాజొకడుండెను. ఒకప్పుడొక బ్రాహ్మణుఁ డాతని యొద్దకువచ్చి "నాపుత్రకుఁ

డీవేళ నకాలమరణము నొందెను; నా ప్రియపుత్రకుని యమాలయమునుండి మరలఁ దెచ్చి యియ్యవలయు'' నని యడిగెను. రాజు తత్‌క్షణమె తన యమోఘ తపఃప్రభావము చేత యముని సమ్ముఖమునకు రప్పించి ''బ్రాహ్మణ పుత్రకుని పునర్జీవునిగ నొనరింపు'' మని కోరెను. యముఁడందులకు సమ్మతింపక పోవుటవలన నిరువురికి ఘోర యుద్ధముజరిగెను. తుదకు యముఁడు పరాజిత ప్రాయుఁడౌ కాఁగా, బ్రహ్మ యరుదెంచి వారిరువురిని సమాధానపఱచి, ''నీవు బ్రాహ్మణ పుత్రకుని రూపము ననుసరించి రంగులతో నొక చిత్రపటమును లిఖింపుము''. అని రాజుతోఁ జెప్పెను. అందుకు సమ్మతించి రాజు చిత్రమును లిఖించెను, అంతట బ్రహ్మ యా చిత్రమును ప్రాణవంతముఁ గావించి బ్రాహ్మణున కొసఁగెను.

''నీవు నేఁడేవిధముగ నగ్నప్రేతముల జయించితివో, యదే విధముగఁ జిరకాలము నగ్నజిత్తుడవగుదువుగాక'' అని బ్రహ్మ రాజును దీవించెను. చిత్రకారుఁడు దేవదానవుల రూపములను జిత్రించి వారిని వశ్యము చేసికొనఁగలఁడు అను ఉద్దేశమె చీనా, టిబెట్ దేశముల చిత్రవిద్యల మూల తత్త్వము.

నగ్నజిత్తు రచించినదె భూలోకమునఁ బ్రథమ చిత్రము. ప్రాచీన భారతీయ గ్రంథములందుఁ గొన్ని స్థలములలో నగ్నజిత్తు సమాచారము గోచరించుచున్నది. శకుని గాంధారుల తండ్రియగు గాంధార రాజునకు సబలుడనియు, నగ్నజిత్తనియుఁ బేరులుగలవు. ఆయన ''ప్రహ్లాద శిష్యుఁ

డని'' యుఁ బేర్కొనఁబడియెను. ''ప్రథమమున వేదమును యజ్ఞమును ఆవిర్భవించినవి. చైత్యనిర్మాణ మొనరించుటకుఁ జిత్రవిద్య యావశ్యకము. అందుకొఱకు చిత్రవిద్య వేద స్వరూపముగఁ బరిగణింపఁబడినది. నేనె మొట్టమొదట మానవరూపమును లిఖించితిని; నేనె మానవునికి మొట్ట మొదట నీ చిత్రలేఖనవిద్య నేర్పించితిని.'' అని బ్రహ్మ చెప్పెను. నగ్నజిత్తు అను శబ్దము చిత్రశిల్పి అను నర్థమున వ్యవహరింపఁబడినది. నగ్నజిత్తు విశ్వకర్మకు శిష్యుఁడు. నగ్నజిత్తు రచియించిన చిత్రలక్షణము ఆరవ శతాబ్దము నాఁటికె వ్యాప్తిచెంది యుండవలయును. ఏలనన వరాహ మిహిరుఁడు తన బృహత్సంహితయందు నగ్నజిత్తు శిల్ప మతమును రెండుచోట్ల నుదహరించెను.

చిత్రలక్షణ గ్రంథమున ముఖమండలము మూఁడు భాగములుగ విభాగింపఁబడి యున్నది. చిబుకము నాలు గంగుళులు; నాసిక నాలుగంగుళులు; నుదురు నాలుగంగు ళులు, ఇదిగాక చక్రవర్తులు ధరించుకొను ఉష్ణీషము అను కేశగుచ్ఛము నాలుగంగుళులు. చిత్రలక్షణము సంపూర్ణ ముగ బ్రాహ్మణ్య గ్రంథము. మహాదేవుని పలుమాఱు నుతించుటవలన, ఆ గ్రంథమును సంకలించిన యతఁడు శైవుఁడని యనుమానింపవలసియున్నది. కాని గ్రంథ మధ్య భాగమందు బ్రహ్మకే ప్రాధాన్య మొసఁగబడి యున్నది. వైదిక యజ్ఞమందు విగ్రహములకు స్థానము లేదు. బ్రాహ్మణ్య ధర్మమునందు విగ్రహారాధన మెప్పుడు ఏ రీతిని ప్రవేశపెట్టఁ బడినది తెలిసికొనుటకు వీలుపడదు. బౌద్ధమతవ్యాప్తికిఁ

బూర్వమె విగ్రహారాధనము అలవాటులో నుండినట్లు జాతక కథలు, లలితవిస్తారము మున్నగు బౌద్ధగ్రంథములందుఁ బ్రమాణములు దొరకుచున్నవి. వైదిక మంత్రములందు ఋషులు వ్యక్తపఱచిన కవిత్వశక్తినిఁజూడ వారి కల్పనా నైపుణ్యము అసామాన్యమని తెలియవచ్చుచున్నది. కాని వాస్తవ జగత్తునందు అట్టి కల్పనలను మూర్తీభవింపఁజేయుటకు వారు ప్రయత్నింపరైరి. .అయినను, యజ్ఞవేదికా యూపస్తంభ నిర్మాణములందు దమ శిల్పకల్పనము, నేదో యొక రీతిగఁ గనఁబఱచిరి. చిత్రలక్షణకర్త వైదిక యజ్ఞములను గుఱించి చెప్పు సందర్భమునఁ జైత్యములను వర్ణించియున్నాఁడు. వైదిక సాహిత్యమునందుఁ జైత్యశబ్దము చాల నరుదు. మనకు బౌద్ధచైత్యములను గుఱించియె విశేషముగఁ దెలియును. అయినను వైదిక యజ్ఞవర్ణనా సందర్భమున నొక విధమైన చైత్యచిత్ర లక్షణము మహాభారతమునందలి యాదిపర్వము యొక్క తొంబదినాల్గవ యధ్యాయమున మనము చూడవచ్చును.

చిత్రలక్షణముతీ యొక్క ద్వియాధ్యాయమునందు, దేవలోకమునఁ జిత్రవిద్య యుత్పత్తియైన విషయము వర్ణింపఁబడినది. విశ్వసృష్టియైన యనంతరము దేవతలు తమ మూర్తులను దామె చిత్రించుకొనిరి. ఈ విధముగఁ బూజయు బలి విధులును ఉత్పన్నములైనవి. ప్రథమాధ్యాయమునందు, మనుష్యుఁడు స్వాభావిక స్నేహప్రీతులకు వశవర్తియయి మనుష్య చిత్రముల రచియించుట కెట్లు ప్రవృత్తుఁడాయెనో, ఆ కథ వివరింపఁబడియున్నది. విశ్వకళ్యాణము కొఱకు,

మనుష్యసమాజమునకు దేవోపాసనమార్గము సుగమ మొన
రించుటకు బ్రహ్మచేఁ బ్రేరితులైన దేవతలు తమతమ
మూర్తులను గల్పించుకొన్న విధానము ద్వితీయాధ్యాయమున
వివరింపఁబడియున్నది.

చక్రవర్తి చిత్రలక్షణములను ఈ గ్రంథము ముఖ్య
ముగ బోధించుచున్నది. శిల్పరచనా పద్ధతియందును, శిల్ప
నియమములందును ప్రాచీన హైందవ, బౌద్ధ, జైన సంప్రదా
యములకు విశేష భేదము లేవియుఁ గానరావు. గాంధార
దేశమునందలి యనేక భాస్కర్య నిదర్శనములవలన అందొక
ప్రాచీన చిత్రకళా సంప్రదాయముండె నని యూహింపఁ దగి
యున్నది. టిబెట్ దేశముయొక్క మతసంబంధమైన చిత్ర
రచన గాంధార చిత్రకళకు సంబంధించిన యొక శాఖగఁ
దలంపవచ్చును.

బాజ్నాయును ఒయాంయ్-చి-ఇ-సోంగ్ అను నిరువురు
చిత్రకారులు భారతీయ చిత్రశిలాదర్శనములను కొరియా,
చీనా దేశములఁ బ్రవేశపెట్టిరని చీనాదేశమందొక నానుడి
కలదు.

ప్రతిమలు కొలతవేయుటయందు అంగుళియె ప్రమా
ణముగఁ గైకొనఁబడినది ఎవని (యే దేవత) చిత్రము
లిఖింపబడునో యాతని (ఆ దేవత) అంగుళియె ప్రమాణ
ముగఁ దీసికొనవలయును. భిన్న భిన్న పరిమాణములు
గలవిగ నున్నను ఆయా చిత్రములందు అంగప్రత్యంగ
పరస్పరానుగణ్యము కొఱకు నిట్టి నియమము ఉద్దేశింపఁ
బడినది.

చక్రవర్తి పురుషుని రూపవర్ణనము :–చక్రవర్తియైన భూపతి మేఘ ముక్తాకాశమునందలి చంద్రునితోడఁ దులతూగును. ఆతని శరీరము చుట్టును ప్రభామండలము చిత్రింపఁబడవలయును. ఆతని ముఖమండలము చంద్రప్రభవలె శుభ్రమైయుండును. ఆతని భ్రూయుగళమును, గ్రీవమును, ఫాలమును అత్యంతసుందరములు. ఆతని కేశముల వర్ణము ఉజ్జ్వలముగను గోమలముగ నుండును; నాసిక యున్నతముగను చక్కఁగ నుండును; అధరోష్ఠములు రక్తవర్ణభూషితములు. అతని దంతములు ముక్తాఫల ధవళములు; నేత్రద్వయము ఆకాశమురీతి నీలమును, సుదీర్ఘ విశ్రాంతమును. ఆతని భ్రూయుగళ మధ్యప్రదేశమునఁ దేజఃపుంజము శోభించుచుండును. ఆతని శుభ్రకాయ మతిసుందరరూపముగఁ జిత్రింపఁబడును. కర్ణద్వయము సమభావముగఁ జిత్రింపఁబడును. ఆతని కంఠము శంఖసదృశము; స్కందద్వయ మధ్యవర్తిస్థానము పరిస్ఫుటము; పదములు హస్తములు పుష్కలములు; శరీరము మాంసలము, నాభిదక్షిణావర్తనమును గంభీరమును; ఆతని శరీరము సకలప్రదేశములందు గుండ్రముగ నుండును. మఱియు సంధిస్థలములు (కీళ్ళయుబ్బులు) దృష్టిగోచరములు కావు. ఆతని యూరుద్వయము ఏనుగతొండమువలె గుండ్రముగ నుండును; గోళ్లు అర్థచంద్రాకారములు; పదతలము ఛత్రచిహ్నితము; అంగుళి పొడవుగను గుండ్రముగ నుండును. ఆతని వర్ణము చంపక పుష్పమువలె గౌరవముగ నుండును.

ఆదర్శ పురుషుల శరీరము మాంసలముగ నుండును; కాని, నరములు, కండలు, మున్నగునవి కానరావు. వక్షము సుపుష్టముగను విశాలముగను, సమతలముగను జిత్రింపఁబడును. చక్రవర్తులకును, లేక దేవమూర్తులకును కోర మీసము లుండవు. వారిని షోడశవర్ష యువకులనుగఁ జిత్రింపవలయును. వారి శరీరము సింహోదరమువలె పొడవుగను, విరివిగనుండును. ఈ సకల లక్షణములు టిబెట్ భారతీయ చిత్రములందు సామాన్యముగ గోచరించును.

చిత్రలక్షణకారుఁడు నయనములను జిత్రించుటను గుఱించి యెంత విరివిగ నుపదేశించియున్నాఁడో, అంత యెక్కుడుగ మఱియే యంగమును గుఱించియుఁ జెప్పియుండ లేదు. ఏలనన నేత్రమె భావవ్యంజనమునకుఁ బ్రధాన సహాయకారి. గ్రంథకర్త యాకారభేదముల ననుసరించి క్రింది విధమున నైదు విధములైన కన్నులను వర్ణించి యున్నాఁడు.

(1) ధనురాకృతి (2) ఉత్పల పత్రాకృతి (3) మత్స్యోదరాకృతి (4) పద్మపత్రాకృతి (5) *కపర్దాకృతి. ఈ నయనాకృతుల పరిమాణములు నిర్ణయింపఁబడినవి. ధనురాకృతి గల నేత్రము నిమీలితప్రాయము, దాని విస్తృతి మూడు ♦యవలప్రమాణము. ధనురాకృతి మొదలు క్రమముగ నొకదానికన్న నొకటి విరివియైనది. ధనురాకృతికన్న నుత్పలాకృతి పెద్దది. అన్నిటికన్నను కపర్దాకృతి పెద్దది. అది బదియవల ప్రమాణముగలది. ధ్యానముద్రాకలితులైన

* గవ్వయాకారము

♦ ఒకయవ యంగుళిలో మూడవభాగము

యోగుల నేత్రములు ధనురాకృతిగలవి. సాధారణుల కన్నులు ఉత్పల పత్రాకృతి నొందియుండును. భయమును క్రందనమును సూచించు కన్నులు ♦పద్మపత్రాకృతిగఁ జిత్రింపఁబడవలయును. యాతనా క్రోధవ్యంజకములగు నేత్రములు కపర్దాకృతిగ లిఖింపవలయును. దేవతల కన్నులు చక్కగఁ జిత్రింపఁబడిన యెడల రాజులకును ప్రజలకును మంగళము గలుగును. దేవతల నేత్రములు పాలవలె శుభ్రములుగ నుండును. స్నిగ్ధములైన నయన పల్లవములందు నేలాటి కర్కశత్వమును గోచరింపదు. నయనశోభ, పద్మపత్ర సదృశముగను, నింద్రనీలమణి మధ్యమునఁ దరళించు చంచలకాంతిపుంజమువలె నుండును. తారకలు నల్లవిగను పెద్దవిగను నుండవలయును.

కన్నులకువలెఁ గనుబొమ్మలకుఁ గూడఁ బ్రకార భేదములు వివరింపఁబడియున్నవి. ప్రశాంతవ్యక్తియొక్క కనుబొమలు అర్ధచంద్రాకారముగ నుండును. క్రోధావిష్టుని కనుబొమలు ధనురాకృతి గలిగియుండును. భీతునియొక్కయు విలపించు వానియొక్కయుఁ గనుబొమలు నాసికాసంధియొద్ద నుండి ఫాలమునందు సగమువఱకు వ్యాపించియుండును.

వర్ణవిన్యాసమును గుఱించిన కొన్ని నియమములు క్రింద వివరింపఁబడుచున్నవి.

(1) రక్తవర్ణము:—ఉత్పలాకృతి నయనముల యంచులకును, అధరోష్ఠములకును (బింబఫల సదృశముగ) గోళ్ళకును, గోళ్ళ మధ్య ప్రదేశములందును (ఉత్పల నాగఫణ

♦ ఇచ్చట పత్రముల యాకృతియె కేవలము గ్రాహ్యము

ములవలె) హస్తమునందును (యెఱ్ఱతామరవలె)నాలుకకును (నెత్తురువలె) పదతలమునందలి లత్తుక పూఁతకును నిర్ణయింపఁబడినది.

(2) శుక్ల వర్ణము:— దేవతల కన్నులకు (పాలవలె) దంతములకు (ముత్యములు, పద్మబీజములు, తుషారము, మల్లెపువ్వులవలె) చక్రవర్తి పరిచ్ఛదమునకు, నిర్ణయింపఁబడినది.

(3) నీలవర్ణము :— తారకలకు (ఆకాశమువలె) కేశములకు, (ఇంద్రనీలములు, భ్రమరములు, అంజనము, మయూరకంఠము, ఆకాశములవలె)

(4) కృష్ణవర్ణము:—తారకలకు నిర్ణయింపఁబడినది.

(5) జాబురాయి (పసుపు) వర్ణము:— కరనఖర ప్రసాదనములకు నిర్ణయింపఁబడినది.

(6) సువర్ణము:—చక్రవర్తుల శరీరమునకు (జాంబూనద సువర్ణము, ప్రస్ఫుటిత పద్మబీజము, చంపకములవలె).

ఈ యాఱువర్ణములందు ఎఱుపు, తెలుపు, నీలము, సువర్ణములకే ప్రాధాన్య మొసఁగఁబడినది.

(రుధిరోద్గారి : వైశాఖము.)

సాహిత్యములో రమ్యత

ఏ కావ్యము సహృదయుల రంజింపజేయునో ఆ కావ్యమునందు రామణీయకము తప్పనిసరిగా ఉండును. అట్లు లేనియెడల రంజకత్వమునకు హేతువుండదు. మన ఆలంకారికులలో అర్వాచీనుడైన పండితరాయలు 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దము కావ్యమ''ని చెప్పినట్లుగనే అమెరికా దేశపుకవి, కథకుడు ఆలన్‌పో కూడ ''లయాబద్ధమైన సౌందర్యసృష్టియే కవిత్వమ''ని నిర్ణయించినాడు. కావ్యమునందు రామణీయక ముండవలెనన్న అభిప్రాయము ప్రాచ్య పాశ్చాత్య లాక్షణికులకు కవులకు సమ్మతమైయున్నది.

కావ్యసమర్పితమైన రామణీయకము ఎట్టిది? ఇదమిద్ధమని నిర్ణయించుటకు తగిన జగదేకమైన మానదండము లేదు. రామణీయకము బాహిరమే కాక ఆంతరిక మనఃస్థితికి కూడ సంబంధించినది. ప్రతివ్యక్తికి అనుభవైకవేద్యముగా నుండు సౌందర్యము ఆవ్యక్తియొక్క సంస్కారము, హృదయ పరిపాకమును అనుసరించి వృద్ధిక్షీణతలను పొందును. అయినప్పటికిని స్థూలముగను, మార్గసూచకముగను కొన్ని సామాన్య లక్షణములు గోచరించకపోవు.

కవిత్వములోని రామణీయకము ఏకవస్తువుగాదు, ఏకగుణమును గాదు. వస్తుగుణములు ఉచితమైనరీతిగా సమ్మేళింపబడి, కవిప్రతిభ చేత సచేతనమై ఆకృతిబద్ధమైన భావముయొక్క సమిష్టి మోహనత్వమె సౌందర్యము.

ప్రతిభావంతుడైన కవికి అపూర్వ వస్తునిర్మాణక్షమమైన ప్రజ్ఞ ఉండును. అద్దములో బింబము ప్రతిఫలించినట్లుగా సహృదయుల హృదయములందు భావచిత్రములను ప్రతిఫలింపజేయు వర్ణనాశక్తి కవికి స్వభావసిద్ధముగ ఉండును. ఈ శక్తి యేకవికి పరిపూర్ణముగ నుండునో అతడు అమర కవి. వానిది సార్వకాలీనమైన అమరకవిత.

కవి కులగురువైన కాళిదాసునందు ఇట్టి భావ చిత్ర రచనా కౌశలము పరమావధి నొందినది, మేఘసందేశ మంతయు ఇట్టి రమణీయ చిత్రముల పరంపరయేగదా! రమణీయ వస్తువు నిరంతరము సంతోషమును చేకూర్చునని కీట్సు కవి చెప్పినట్లుగా మనోహర భావచిత్రములు, దృశ్యములు, జరా మరణావస్థలు పొందక మనభావలోకముపై అధికారము చెలాయించు చుండును.

చూడండి, కాళిదాసు చిత్రించిన జింక ఎంత రమణీయముగను ప్రాణవంతముగను మనకు భావగోచరమగుచున్నదో.

గ్రీవాభంగాభిరామం ముహు రనుపతతి స్యందనే బద్ధదృష్టిః
పశ్చార్ధేన ప్రవిష్ట శ్శరపతనభియా భూయసా పూర్వకాయం
దర్భైరర్ధావలీడై శ్శ్రమవివృతముఖభ్రంశిభిః కీర్ణవర్త్మా
ప శ్యోదగ్రప్లుతత్వా ద్వియతి బహుతరం స్తోక ముర్వ్యాం ప్రయాతి.

దుష్యంతుడు మృగయావినోదలాసుడయి రథమెక్కి విల్లెక్కుపెట్టి జింకను వెన్నంటి తరుము కొనుచున్నాడు. జింక శరవేగముతో పరుగెత్తుచున్నది. అది చెంగలించి పరుగెత్తుటచేత కొంత భూమిపైన కాళ్ళానుచున్నవి.

ఎక్కువగా ఆకాశములో పోవుచున్నది. రథం కనబడినప్పుడెల్లా మెడతిప్పి చూచుచున్నది. శరపతన భయముచేత వెనకటి భాగము పూర్వకాయములోనికి చొచ్చుకొన్నట్లుగా కనబడుచున్నది. పరుగెత్తు అలసటచేత నోరు తెరచుకొనడమువల్ల సగం సగం కొరకిన దర్భలు అక్కడక్కడ దారిలో పడి అది పోయిన జాడ తెలుపుచున్నవి. కవులు సౌందర్య ప్రియులు కాబట్టి దుఃఖావస్థలోకూడ కాళిదాసును ఆ జింక రమణీయ భంగిమమే ఆకర్షించినది. ఈ చిత్రము చాలా అభిరామముగా ఉన్నదని కవియే సర్టిఫికేటు ఇచ్చుకొన్నాడు.

శకుంతల సఖీసహితముగ పూలతీవలకు నీళ్ళుపోయుచు "ప్రియంవద నిర్దయముగ నాకంచెలవల్కలమును బిగించి ముడివేసినది. కొంచెము సడలించు" మని అనసూయను అడుగుచున్నది. "అనుక్షణ విజృంభమాణమైన నీ యౌవనాన్ని అడగవమ్మా" అని అనసూయ చలోక్తులాడుచున్నది. ఈ మాటలకు సిగ్గుతో తలవంచుకొన్న ముద్దరాలు, శకుంతల, దుష్యంతుని కన్నులకు నిర్వాణ సామ్రాజ్యమై కనుపట్టిన శకుంతల నేటికికూడా మన కన్నులకు ఆ విధముగానే పొడకట్టుచున్నది.

క్షణే క్షణే య న్నవతాముపైతి,
తదేవ రూపం రమణీయతాయాః

అను సూక్తికి ఉదాహరణ ప్రాయములయి ఈ దృశ్యములు మనలను మంత్రముగ్ధులను చేయుచున్నవి.

కాళిదాసుని కవితా సమ్మోహన ప్రభావమునకు చిక్కి సహానుభూతివలన తామె దుష్యంతుల మనుకొని శకుంతల వనవిహార శృంగారము ననుభవించి, పుస్తకము మూసిన వెనుక, కలగని మేల్కొన్నవారివలె లోకము తెలిసి, దుష్యంతుడు తుమ్మెదనుగురించి అనుకొన్నట్లుగనె తామున్ను దుష్యంతుని ఉద్దేశించి "కృతార్థుడవు నీవే నోయ్" అని దీర్ఘనిశ్వాసము విడిచిన పఠితలు ఎంద రుండరు?

నలకూబరసన్నిభుడైన ప్రవరాఖ్యుడు వరూధినికంట బడినాడు. ఆమె అబ్బురమొంది నయనాంబుజములు వికసించునట్లు చూచినది.

చూచి, ఝుళం ఝుళత్కటకసూచితవేగపదారవింద యై
లేచి కుచంబులుఁ దురుము·లేనడు మల్లలనాడ నయ్యెడఁ
బూచినయొక్క పోకనునుబోదియఁ జేరి విలోకనప్రభా
వీచికలం దదీయపదవీకలశాంబుధి వెల్లిగొల్పుచుఁ.

పెద్దన వరూధినిని ప్రతిక్షణవ్యగ్రమైన కార్య సంచలనముతో జీవత్ప్రతిమవలె మన కన్నులకు కట్టునట్లు చిత్రించినాడు. ఆమె తత్తరము ఆశ్చర్యము ఈ పద్యములోని ప్రత్యక్షరములో అంకితమై ఉన్నది. తాను కన్యాత్వసహజమైన సిగ్గు గల వినయవతి యని ప్రవరాఖ్యునికి తోపవలయును. ఆయన వరూధిని సౌందర్యమును చూచి ముగ్ధుడు కావలయును. ఈ రెండుకార్యములు ఒక్కసారిగా సాధించవలయును. ఆమె ప్రక్కనున్న పోకచెట్టువెనుక నిలుచున్నది. ఏచింత చెట్టుచాటుననో నిలుచున్నయెడల ఆమె సౌందర్యము ప్రవరా

ఖ్యానికి గోచరించదు. ఈ చిత్రముకూడ మన హృదయము చొచ్చుకొని వదలిపోదు. ఒక్కొక్క కావ్యము చదువుకొలదీ మన భావప్రపంచము వృద్ధిపొందుచుండును. సుందరమూర్తులైన స్త్రీ పురుషుల జనాభాకూడ విరివి చెందుతూ ఉండును. భూమిపైన స్వర్గము స్థాపించినట్లగును.

సర్. సి. ఆర్ రెడ్డిగారు ఒక కావ్యమునకు వ్రాసిన ఉపోద్ఘాతమునందు "ప్రతిపద్యము చిత్తరువున కనుకూలించినదిగా ఉన్నది" అని "కావ్యములో మనము చూడవలసినది రామణీయకమే" నని వ్రాసియున్నారు. వారు కవి యొక్క భావ చిత్రరచనాకౌశలమునకు ప్రాముఖ్యమొసగియున్నారు. ఇట్టి నైపుణ్యము ప్రతి కవికిని వాని వాని సంస్కారపరిపాకము ననుసరించి నిర్మాణశీలమైన భావ బంధురత ననుసరించి కొద్దిగనో గొప్పగనో అలవడియుండును.

కవి కావ్యమునందు సౌందర్యము సంపాదించుటకు హేతుభూతములైన వానిలో భావప్రకటనా విధానము ముఖ్యమైనది.

"A perfect expression is beauty. An imperfect expression is ugliness."

"నిర్దుష్టమైన భావప్రకటనము సౌందర్యమనియు, దోషయుక్తమైన భావప్రకటనము అందవికారమనియు" ఒక ఆంగ్లేయ విమర్శకుడు చెప్పియున్నాడు. పార్ గ్రేవు మహాశయుడు తాను చేకూర్చిన పద్యసంపుటమునకు వ్రాసిన ఉపోద్ఘాతమునందు "భావప్రకటనము తేటతెల్లముగ నుండ

వలయును. అట్లులేనియెడల అపూర్వకల్పనాశక్తి యున్నను ఆలోపమును పూరించలేదు,'' అని వ్రాసియున్నాడు.

భావమునకు ప్రకటనకు బింబ ప్రతిబింబ భావసంబంధము గలదు. కవి మనస్సులో ప్రస్ఫుటముగ ఏర్పడిన భావము అట్లు ప్రకటితమగును. అట్లుకాదేని అపూర్ణముగను క్లిష్టముగను ప్రకటింపబడును. మన భావములు వాచ్యముగను వ్యంగ్యముగను ప్రకటింపవచ్చును. వాచ్యమునకన్న వ్యంగ్యమే రమణీయమని అందరును ఒప్పుకొనియున్నారు. అయినను ఏ మహాకవి రచించిన కావ్యమునందు కూడ ప్రతి పద్యము ప్రతివాక్యము ధ్వని ప్రధానముగ ఉండదు. గుణము హెచ్చుకొలది రాశి తగ్గుచుండును. ప్రయత్న పూర్వకముగ శ్రమపడి వ్రాయుదుమేని శ్లేష కావ్యములవలె సహజ సౌందర్యమును కోలుపోయి హృదయాకర్షకముగ నుండదు. కొందరు ఆధునికులు భావశబ్ద క్లిష్టత్వమును ధ్వనియని పొరపడినట్లు కనుపించును. ధ్వని ప్రధానముగా నున్న పద్యమునందు, శ్లోకమునందు ప్రకృతార్థము చక్కగా బోధపడుచూ వ్యాఖ్యాతిశయమయిన వేరొక భావము స్ఫురించును. ధ్వని యెప్పుడు నేల విడిచి సాముచేయదు. ధ్వనికి బీజము పద్యములోనే ఉండును.

కావ్యమునందు సౌందర్యాపాదక హేతుసామగ్రిని స్వీకరించుటయేగాక తద్భంగ హేతువులను వర్జించుటకూడ అవసరమె. దూరాన్వయము, దురన్వయము, అన్వయ కాఠిన్యము, భావక్లిష్టత్వము, అర్థముపొసగని పదముల కూర్పు, భావదారిద్ర్యమును ఆచ్ఛాదించు అనుచిత నిరర్థక

శబ్దాడంబరత మున్నగు కావ్యదోషములు భావమును అవగతము చేసికొనుటకు ప్రతిబంధకములు గావున అవి పరిహరింపదగినవి.

అనౌచిత్యము రసభంగహేతువుగాన అది ముఖ్యముగ పరిహరింప తగినది. ఔచిత్యమనగా Commonsense, లోకజ్ఞానము జీవితమునందెంత అవసరమో కావ్యమునందు కూడ ముఖ్యమె. ఆది మధ్యాంతములుగల కావ్యాకృతి యందు అంగాంగ సంయోగిత, అవయవాను రూపత్వము పరిపూర్ణతను చేకూర్చి రామణీయకమునకు సహాయకారి యగును.

కవి తన కావ్యమునందు ఇట్టి సౌందర్యాపాదక సామగ్రిని చేకూర్చి, శబ్దార్థములకు సమాన గౌరవముచూపి శ్రోత్రపేయత్వము సంతరించి రమణీయసృష్టి చేయుచున్నాడు. గావున సాహిత్యములో సౌందర్యము ఘనీభవించి యుండును.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)

-- -- - -

నేటికవిత - ప్రకృతిపూజ

ప్రకృతిని అర్చించుటలోను ప్రకృతి సౌందర్యమును అభివర్ణించుటలోను, పూర్వకవులకును, నేటి కవులకును కొంత మార్గభేదము కనుపడుచున్నది. ప్రబంధకవులు కృత్రిమాలంకార ప్రియులు. నేటి కవులు సహజ సౌందర్య ప్రియులు. కాలానుసారముగ మానవసంఘము, దాని ఆచార వ్యవహారములు మార్పుచెందుట సహజము. సాంఘిక పరిణామము ననుసరించి దాని నాశ్రయించి బ్రతుకు కళలుకూడ మార్పు చెందుచుండును. భూత భవిష్యద్వర్తమాన కాలములకు అవినాభావ సంబంధము కలదు. కావుననే యొకటి లేక మరియొకటి యుండదు.

కవులు ఏకాలమునకు సంబంధించిన వారైనను, వారి రచనావిధానము మార్పుచెందినను, వారికి లోకమే ప్రమాణము. ప్రకృతిసౌందర్య వర్ణనము మానవ స్వభావ చిత్రణము వారికి ముఖ్యమైన విషయము. అందువల్లనే కాబోలు ఒక ఆంగ్లేయ విమర్శకుడు 'Nature is the Godess of poets'— 'కవులకు ప్రకృతి ఆరాధ్యదేవత'యని చెప్పినాడు.

పూర్వ కవిత్వములో అసంతృప్తిచెంది నవ్య కవిత్వము వ్రాయవలయునను కోర్కె ఈ నాటి కవులకు మాత్రమే సంబంధించినది కాదు. మన పూర్వులకును వారికంటె పూర్వులున్నారు. వారికిని వారి పూర్వుల కవిత్వముపై కొంత అసంతృప్తికలిగి నవ్యకవిత్వము వ్రాయవలయునని

ప్రయత్నించియే యున్నారు. శ్రీనాథుడు తన కవిత్వమును నవ్యమని చెప్పుకొనెను. తెనాలిరామకృష్ణకవి "స్కంద పురాణ నీరనిధి కౌస్తుభమై ప్రభవించి దేవకీనందను సత్కథోద్యమము నవ్యకవిత్వ కళాకలాపమున్ కుందనమున్ ఘటించి కడుక్రొత్త సొమ్మొనరించి" అని నుడివియున్నాడు. ఇచ్చట నవ్యకవిత్వ కళాకలాపము, క్రొత్తగు సొమ్ము అను మాటలు ముఖ్యముగ గమనింపతగినవి. చేమకూరు వెంకన్న తెలుగు కవిత్వమున క్రొత్తపద్ధతిని ప్రవేశపెట్టెను. ఆ రచనలోని నవ్యతను, అపూర్వతను తన సమకాలికులు మెచ్చుకొనవలసినంత మెచ్చుకొనలేదని పాప మానవ్యకవి "ఏ గతి రచియించిరేని సమకాలము వారలు మెచ్చరే గదా!" అని ఆశాభంగమును వేడినిట్టూర్పుతో ప్రకటించెను. మార్పులు కోరినది నేటికాలపు కవులు మాత్రమేనని పొరపడుటవలన మన చారిత్రకదృష్టి నశించి, పూర్వకవిత్వమన్నంతనే అసహ్యపడుట ఒక నాగరక ఆచారముగ పరిణమించినది. 1910 వ సంవత్సరము మొదలు ప్రారంభించిన నవ్య కవుల రచనలు 1935 వ సంవత్సరమునాటికే పూర్వకవిత్వముగా మారిపోయినదన్న విషయము నవ్యకవులు జ్ఞప్తిపెట్టుకొన్న యెడల పూర్వ కవిత్వమును అంతగా ద్వేషింపవలసిన అవసరముండదు. మొదటి నవ్యకవులకు పూర్వకవుల రచనలేగదా మానాలు. అభిరుచుల ననుసరించి కొందరకు తిక్కన, కొందరకు శ్రీనాథుడు, మరికొందరకు పింగళి సూరన పెద్దనలేగదా అభిమాన కవులు; తరువాత వారి వారి నైజ ప్రతిభ ననుసరించి మార్పులు చెందియుండవచ్చును.

ప్రకృతి రామణీయకము వర్ణించుటయందు పూర్వకవులకును ఆధునికులకును దేశకాల పాత్రభేదముల ననుసరించి కొంత తారతమ్యము కొంత విభిన్నత అగపడుచున్నది. దీనికి ఆలంకారిక మతముకూడ యొక కారణమై యుండును.

రసవాదము భరతముని నాట్యశాస్త్రమున నిర్వచింపబడినది. బహుశా ప్రభవించినదనికూడ చెప్పవచ్చును. నాట్యమునందు నాయికా నాయకులు ముఖ్య పాత్రలు. తక్కిన వెల్లను ఔపచారికములు. కావుననే ప్రకృతి మానవ చర్యలకు కేవలము భిత్తిమాత్ర ప్రయోజనము (Back ground) గా రెండవస్థానము నలంకరించినది. కావ్యములు కూడ క్రమ క్రమముగా ఈ పద్ధతినే అవలంభించినవి. వాని యందును మానవచర్యలే ముఖ్యములు. మానవచర్యలతో సంబంధములేని ప్రకృతివర్ణనమునకు తావులేదు. మానవ చర్యలకు సంబంధించి, రసపోషణకు కావలసిన మాత్రము ప్రకృతివర్ణనము గ్రాహ్యమని వారి మతము. అనాగరక జాతుల చర్యలు మానవేతరములైన పశుపక్ష్యాదిజంతువుల చర్యలలో రసాభాసముతప్ప రసమునకు పరిపూర్ణత చేకూరదని వారి తలంపు.

ఈ మతమును ప్రతిఘటించినవాడు ఆలంకారికులలో అభినవుడు జగన్నాథ పండితరాయలు. రమణీయార్థమును ప్రతిపాదించు శబ్దమే కావ్యమని నిర్వచించి కవితానర్తకి నాట్యరంగము సువిశాలమొనర్చి మహాకవుల రచనలకు గతికల్పించినాడు లేక, మహాకవుల ప్రతిభను పండితరాయలు గౌరవించినాడనికూడ చెప్పవచ్చును. అట్లు కాని

యెడల, రసవాదప్రకారము కాళిదాసుని కుమారసంభవము లోని "మధుద్విరేఫః కుసుమైకపాత్రే పపౌప్రియాం స్వామను వర్తమానః" అను శ్లోకమును, దానివంటి మరి కొన్ని రమణీయ శ్లోకములును రసాభాసమునకు దృష్టాంతములు కాగలవు. మను చరిత్రలోని "ఏ విహంగము గన్న యెలుగించుచునుసారె" అను చక్కని సీసపద్యము రసాభాసమగును. ఇంత యెందుకు రతి ఉభయనిష్టము కానందు వలన మనుచరిత్రకథే రసాభాసము. లోకము ననుసరింపని శాస్త్రమెట్లున్ననేమి, మనుచరిత్ర రమణీయముగ నుండుట లేదా? కావ్యలక్షణములు కొన్ని నాట్యశాస్త్రమునుండి దిగుమతి యగుటవలన యిట్టి యిబ్బంది కలిగినది. లోకము ప్రమాణమన్న సంగతి యేమైనది.

ఆధునిక కవులు అస్వాభావికపు కట్టుబాట్లను ఉల్లంఘించినారు గావున వారు కావించిన ప్రకృతివర్ణనములు ఒకొక్కప్పుడు నాయికా నాయక నిరపేక్షకముగాకూడ నుండును. ప్రొద్దుపొడుపులు, మునిమాపులు, సెలయేళ్లు, వనములు, కొండలు, మేఘములు, చంద్రోదయము, అవి యివి యననేల, రమణీయమైన బాహ్యప్రకృతి యంతయును మానవచర్యల సంబంధములేకున్నను తమంతతామె మనోహర దృశ్యములుగ నున్నవి. అవి కవికి ప్రత్యేక వర్ణనీయములు. ఇంగ్లీషువారి **Lake poetry, Nature poetry** ఈ తెగకు చేరినవి.

కవులు పూర్వులైనను, ఆధునికులైనను ప్రకృతిని వర్ణించుటయందు రెండుపద్ధతులను అవలంబించిరి. కవుల దృష్టికి ప్రకృతిలోని ప్రతి అణువును ప్రాణవంతముగ నగపడు చుండును. అందువలన ప్రకృతిని మానవీకరించుట, మానవుని కష్టసుఖములతో ప్రకృతి సహానుభూతి చూపుచున్నట్లు వర్ణించుట మొదలైనవి ప్రథమ విధానము. ప్రకృతి సౌందర్యమును స్వాభావికముగ వర్ణించుట రెండవ విధానము. ఈ రెండు విధానములను మన కవులు, ఇంగ్లీషు కవులు సమానముగ నవలంబించిరి. మనుచరిత్రమున "తరుణి ననన్యకాంత, నతిదారుణ పుష్ప శిలీముఖ వ్యథాభర వివశాంగి నంగభవు బారికి నగ్గముచేసి క్రూరుడై యలిగె మహీసురాధము డహంకృతితోనని రోషభీషణ స్ఫురణ వహించెనో యన నభోమణి 'దాల్చె కషాయ దీధితిన్'" ఇచ్చట సూర్యునకు మానవత్వ మారోపింపబడినది. వరూధిని దురవస్థకు మనసు మెత్తవడి, అందుకు కారకుడైన ప్రవరాఖ్యునిపై గోపముగల్గి "వీని మొగమునైన చూడ గూడద"ని సూర్యభగవానుడు అస్తమించుచున్నట్లుగ వర్ణింపబడినది. ఒక యాధునిక కవి, తన దుఃఖమున ప్రకృతి మిత్రునివలె పాల్గొనుచున్నదని రచించెను:

> చిత్తతాపంబు బాపుకోఁ జేలగట్ల
> కరిగి కూర్చుండ, మూకసహానుభూతి
> పైరు తలవంచు భారంబుపంచికొన్న
> ప్రాణసఖులట్లు; కవులకు ప్రకృతితోడు.

అపరదిక్కాంతసైతము, అస్తమించు
అరుణబింబంబుతోఁ గన్నులవియఁజేయు
తనదు పూజారియిక్కట్లు తలచి కుంద
ఎఱ్ఱవుండాయెనో యేమొ హృదయమనగ.

ప్రకృతిని మానవీకరింపక స్వాభావికముగ వర్ణించిన రచనలు ఆధునిక కవులు చేసియున్నారు. అట్టి రచనలు పూర్వ కావ్యములందును అచ్చటచ్చట గోచరించుచున్నవి. ఆ రచనలసంఖ్య తక్కువ అనియే చెప్పవచ్చును.

రమణీయ వస్తువులు తమంత తామే వర్ణనా యోగ్యములయ్యును అవి మానవచర్యలకు భిత్తికయయి కావ్యవర్ణనములో మిళితమైనప్పుడు మరింత సుందరముగ నుండును. మానవ నాటకరంగమునకు బాహ్య ప్రకృతి పరదావంటిది. ఇందుకు వివిధ దేశములలోని మహాకవుల రచనలే సాక్ష్యము.

ఈ రహస్యమును కవులేకాక చిత్రకారులును గ్రహించిరి. వారు కొండలను, పచ్చిక బయళ్ళను, వనములను, సెలయేళ్ళను మాత్రమే చిత్రించి తృప్తిపడరు. ఆ దృశ్యమును ప్రాణవంతము చేయుటకు, మేయుచున్న ఆవునో, పూవులుకోసికొనుచున్న పిల్లనో లేక చలనశీలమైన ఏదేని జంతువునో చిత్రింతురు.

సముద్రము తరంగ సుందరమయ్యు దానిలో నొక యోడ త్రుళ్ళింతలాడుచున్నట్లు చిత్రింతురు.

ఒక పెద్ద తుపాను వీచుచున్నది. చెట్లు నిర్మూలములగుచున్నవి. ఇంటికప్పులు ఎగిరిపోవుచున్నవి. పెళ

పెళార్భటులతో మేఘములు గర్జించుచున్నవి. కుండపోతగా వర్షము కురియుచున్నది కాని ఈ భౌతిక దౌర్జన్యమునకు గురియయి నిస్సహాయుడై బాధపడుచున్న మానవుడు ఆ చిత్రములో కనిపించని యెడల అది మానవ హృదయమును ఆకర్షించదు. కవులు అవలంబించిన రెండు పద్ధతులు రమణీయములైనను మానవచర్యలకు సంబంధపడిన ప్రకృతి వర్ణనమె మరింత ప్రాణవంతముగను మనోహరముగ నుండును.

ఆధునిక కవులు చేసిన గొప్పమార్పు కథావస్తువునకు మానవస్వభావ చిత్రణమునకు సంబంధించి యున్నది. సామాన్య మానవ జీవితమునందు కూడ కవితార్హమైన రసోత్పాదక ఘట్టములున్నవని రుజువుచేయు కావ్యములను రచించిరి. మానవస్వభావ చిత్రమునకు అవకాశముకలిగించి, పాలిపోయి ప్రాతపడ్డ కవితా సరస్వతి యొడలు క్రొత్త నెత్తురు పెట్టుటకు తోడ్పడిరి. అందుకు వారు మనకందరకు వంద్యులు.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

సాహిత్యంలో వైచిత్రి

"యా వ్యాపారవతీ రసాన్రసయితుం కాచిత్ కవీనాం నవాదృష్టిః" అను ఆనందవర్ధనుని నిర్వచనమును, "క్షణే క్షణే నూతనైర్వైచిత్రైః జగన్త్యా సూత్రయంతి" అని 'నవ' అను విశేషణమును అభినవ గుప్తపాదులు వివరించినారు. అనుక్షణము నూతనమైన వైచిత్రులతో జగత్తులను సూత్రిస్తూ ఉంటుందట కవి ప్రతిభ.

ఈ "వైచిత్రి"నే **Romantic element** అనే మాటకు పర్యాయపదంగా నేటి విమర్శకులు రూఢి చేస్తున్నారు. ఈ వైచిత్ర్యమునే "లోకోత్తర చమత్కారము"ని పూర్వ లాక్షణికులు చెప్పియున్నారు,

ఈ **Romantic element**—వైచిత్రి అనునది కవిత్వమునకు సహజమైన జీవమువంటిదా, లేక అనుషంగికముగా వచ్చిన కావ్యశోభా హేతువులలో నొకటియా ?

యదార్థమైన కవిత్వమునకు వైచిత్ర్యము జీవము. నవ్యతయే యీ వైచిత్ర్యమునకు మూలము. **Romantic poetry** అంటే భావనాపటిష్ఠమైన స్వేచ్ఛాప్రియ కవిత్వమని మనము నిర్ణయించుకొను పక్షములో మహాకవుల కావ్యములన్నియు ఈ వర్గమునకే చెందును.

మహాకవి కవిత్వము స్వేచ్ఛాప్రియమని యంటివిగదా అట్లయిన అది లక్షణబద్ధముగాదా ? లక్షణబద్ధముకాని

కళయే ఉండదు. కాని ఆ లక్షణములు స్వయంకల్పితములు. ప్రతిభోచితములు. ప్రత్యేకములు.

కాళిదాసు, భవభూతి మున్నగు సంస్కృత కవుల యందును "భావాంబరవీధి విశ్రుత విహారిణి" అని సరస్వతిని ప్రశంసించిన నన్నయ మొదలు ఈ కాలమువరకు గల తెలుగు కవులయందును ఈ Romantic element దేశకాల పాత్ర భేదముల ననుసరించి కొద్దిగనో, గొప్పగనో గోచరించు చున్నది. నేటికాలపు కవులే Romantic కవులని చెప్పుటకు వీలులేదు. కాలభేదం, ఆచార వ్యవహార భేదం ఉండుటవలన అందుకు తగునైనవిధముగా ఈ Romantic element మారుతూ వచ్చినది.

18వ శతాబ్ది ఇంగ్లీషు వాఙ్మయ చరిత్రలో నీరస మైన ఘట్టమని కొందరి ఆంగ్లేయ విమర్శకుల అభిప్రాయము. ఆ కాలపు neo-classic పద్ధతికి ప్రతిస్పర్ధిగా Romantic కవితోద్యమము 19వ శతాబ్ది ఆరంభమున బయలుదేరినది. ఆకాలపు నవ్యకవులకు లక్షణ నిర్బంధములు, ఛందో నిర్బంధ ములు, వ్యాకరణపు కట్టుబాట్లు అసహ్యములుగా తోచినవి. పూర్వరచనపై అసంతృప్తి కలిగినది. ఈలాంటి స్వేచ్ఛా ప్రియత్వం కలుగుటకు ఫ్రెంచి విప్లవంవల్ల ఇంగ్లాండులో వ్యాపించిన నూతన భావముల ప్రభావమే కారణమని చెప్ప వచ్చును. బందాలు వదలించుకొని కాలుసేతులు హాయిగా చాపుకొన్నారు కవులు. ఈ మార్పు రచనలలో గోచరించినది.

**"A little noiseless noise among the leaves
Born of the very sigh that silence heaves"**

"నిశ్శబ్దమైన కంఠధ్వని ఆకులలో వినబడుచున్నది. నిశ్శబ్దత ఊర్చిన నిట్టూర్పువలె నున్నది" అని ఒకచోట 'కీట్సు' (Keats) అంటాడు. అప్పటి Neo-classic కవులు యీ విధముగా వ్రాసియుండరు. నిశ్శబ్దమైన శబ్దమేమి? దానిని చెవి యెట్లు గుర్తించును? దానిని శబ్దమనుటెట్లు? ఈలాటి మీమాంసలోపడి తుదకు దానిని తప్పని త్రోసిపుచ్చెదరు. శబ్దము లేని కంఠస్వరం అను ప్రయోగము హేతువాదమునకు నిలువలేకపోయిననూ పంచేంద్రియాతిరిక్తమైన యేదోయొక రహస్యేంద్రియముద్వారా బుద్ధివ్యాపార నిరపేక్షకముగ హృదయములో ప్రవేశించి అనూహ్యమైన నిశ్శబ్దతను కల్పించి మనలను రసతన్మయులను చేయుచున్నది. "వినిన మధురగీతికలు ఆనందదాయకములే కాని వినని మధుర గీతికలు, మరీ ఆనందదాయకములు" అని పాడిన కవికి నీరవవాణిని విను దివ్యశ్రోతస్సు ఉండవలెను. ఆనందవర్ధనుడు నిర్వచించినాడు.

> "శబ్దార్థ శాసనజ్ఞాన మాత్రేణైవ నవేద్యతే,
> వేద్యతేనహి కావ్యార్థ తత్త్వజ్ఞై రైవ కేవలం

మహాకవుల వాక్యములలో పదాతిరిక్తములైన భావములు స్ఫురించుచుండును. వానిని తెలుసుకొనుటకు శబ్దార్థ శాసన జ్ఞానముమాత్రమే చాలదు. కావ్యార్థ తత్త్వజ్ఞత అవసరము.

వైచిత్ర్యమునకు మూలము నవ్యత్వమంటిరిగదా? మానవుని రసావేశము లలితకళల మూలమున బహిర్గత

మగుటకు మొదలుపెట్టి కొన్ని వేల సంవత్సరములైనవి. ఇంకను క్రొత్తదనమేమి ఉండును? అని సంశయమా? ప్రకృతి అనంతము. అనుక్షణ పరిణామశీలము. దేశకాలపరిస్థితుల మార్పులు, కవుల ప్రత్యేక ప్రతిభావిశేషములు ఈ నవీనత్వమునకు హేతువులు. ఒకే విషయము పదిమంది కవులు చెప్పినయెడల తలకొక విధముగనుండును. కవిత్వముపుట్టినప్పటినుండి స్త్రీవర్ణనము కవిత్వములోనికి దిగినది. ఎన్ని వేల సంవత్సరములనుండియో కవులు స్త్రీలను వర్ణించుచున్నారు. ఆ కళ్ళు, ఆ ముక్కు, ఆ మొగమె కాని యిన్ని వేలమంది కవులకు పరిమితమైన స్త్రీశరీరము కవితాలంబము కావడమెట్లు? వస్తువు ఒకటే అయినను భావప్రకటన వివిధత్వము వలన చమత్కారమువలన నవ్యముగా కనపడును.

తేనెవాకలంకల్లో పెరిగిన చేమకూర రుచి చూస్తాం!

కడుహెచ్చు కొప్పు, దానిం
గడవం జనుదోయి హెచ్చు, కటియన్నిటికిఀ
గడుహెచ్చు, హెచ్చులన్నియు;
నడుమే పసలేదుగాని నారీమణికిఀ.

సాధారణమైన భావమే. సాధారణమైన వర్ణనయే. కాని భావప్రకటనలో చమత్కారమున్నది. తిట్టినట్టు తిట్టి పొగడినాడు కవి.

ఇక, 'యతి విటుడు గాకపోవుటెట్లని' ప్రతిజ్ఞ చేసిన సంకుసాల కవి :

"ఒత్తుకొనివచ్చు కటికుచోద్వృత్తి చూచి
తరుణి తనుమధ్యమెచటికో దలగిపోయె."

అని చెప్పి, అంతటితో తనవి సనక "ఉద్ధతులమధ్య పేదల కుండదరమె" అని లోకోక్తిప్రాయంగా నిలిచిపోయేటట్లు ఒక అర్థాంతరన్యాసం విసరినాడు.

శ్రీనాథుడు "అస్తినాస్తి విచికిత్సాహేతు, శాతోదరి" అని యింకొక తీరున నడుమును వర్ణించినాడు. ఈవర్ణనములన్ని ఒకే విషయమును గురించి వెలసినప్పటికిని భిన్నత్వమువలన, నవ్యత్వమువలన, చమత్కారమువలన రసవంతములయి అనుభోగ్యములగుచున్నవి.

ఉన్నది ఉన్నట్లే చెప్పుట కవిత్వముగాదు. న్యూసు పేపరు రిపోర్టు కావచ్చును. కేవలము వార్తలను ప్రకటించడం కావచ్చును. లోకోత్తర వర్ణనానిపుణ కవికర్మ కావ్యమని మమ్మటుడు నిర్వచించినాడు. ఈ అభిప్రాయము లాక్షణికులందరు అంగీకరించినదే. లోకోత్తరత్వమనగా అనుభవసాక్షికమైన ఆహ్లాదగత చమత్కారమని పండితరాయలున్నూ, చమత్కారమనగా చిత్తవిస్తార రూపమగు విస్మయమని విశ్వనాథుడును వివరించినారు. ఇట్లనుటవలన చమత్కార రహితములగు కేవల శబ్దార్థములకు కావ్యయోగ్యత సిద్ధింపదు. కావుననె చేమకూర వెంకట కవి:

> "ప్రతి పద్యమునందు జమ
> త్కృతి గలుగం జెప్పనేర్తు వెల్లెడ, బెళుకే
> కృతి వింటి మపారముగా
> క్షితిలో నీమార్గ మెవరికిఁ రాదనుమీ"

అని రఘునాథరాయలు తన్ను నుతించినట్లు చెప్పుకొనియున్నాడు. ఇది ప్రగల్భముగా కనబడినప్పటికిని ఈ కవి

పట్ల సత్యమే యని యనవలయును. ప్రతి పదరసోదయముగా కవిత్వము చెప్పిన తెలుగు కవులలో చేమకూరు వెంకన్న ముఖ్యుడు ఆయన మార్గం నిజంగా యెవరికీ అబ్బలేదు. మహాకవుల పోకడలు అనుకరణ సాధ్యములుగావు.

> చిత్తజుడల్లి తూపుమొన చేసినఁ జేయగనిమ్ము పై ధ్వజం
> బెత్తిన నెత్తనిమ్ము వచియించెదఁ గల్గినమాట గట్టిగా
> అత్తరళాయతేక్షణకటాక్ష విలాసరసప్రవాహముల్
> కుత్తుకబంటి తామరలకుఙ్ దలమున్కలు గండుమీలకుఙ్.

ఈ పద్యము

> ప్రతీయమానం పునరన్యదేవ
> వస్త్వస్తివాణీషు మహాకవీనాం
> యత్తత్ ప్రసిద్ధావ యవాతిరిక్తం
> విభాతి లావణ్యమివాంగనాను.

అను లక్షణమునకు ఉదాహరణ ప్రాయముగనున్నది. అంగనలయందు అవయవాతిరిక్తమైన లావణ్యమువలె మహాకవుల వాక్యములందు నిఘంటు అర్థములకు మించిపోవు భావస్ఫురణలు ఉన్నవనుట నిజమె.

సత్యభామకడకు కృష్ణుడు రావడము పారిజాతాపహరణములో తిమ్మన ఈ విధంగా వర్ణించినాడు.

> అరదమునెక్కి కేతన పటాంచల చండలమైన తాల్మితో
> దురగజవంబు మున్గడవద్రోచి కడంగెడు తత్తరంబుతో
> దిరిగెడు బండికండ్లపగిదిఙ్ భ్రమియించుమనంబుతోడ నా
> హరి ననుదెంచె సత్యనముదంచిత కాంచనసౌధవీధికిఙ్.

ఈ పద్యమున కృష్ణుని యాతురత మనఃస్థితి అద్భుతముగ వర్ణింపబడినది. కంటికి గోచరింపని తాలిమి, మనస్సు,

తత్తరము, దృగ్గోచరములగు కేతన పటాంచలము, తురగ జవము, బండికండ్లు వీని సంబంధమువలన మూర్తిమంతము లయినవి. రథమును దానిలోనున్న కృష్ణుని ఒక్కసారిగా మనము చూచుచున్నాము. కృష్ణుని మనస్థితితో పోల్చ బడిన ఉపమానములును రథములోనివె. ఫిలిముల్లో రెక్కల్లు చూపించే Super in p‹sed dıssohes లాగా ఇది శోభించు చున్నది. దీనిలోని వస్తుసామగ్రి సర్వసామాన్యమైనదే. కాని వానికి కల్పింపబడిన పరస్పర సంబంధము కవి భావనా పటిష్టతను చాటుచున్నది.

Romantıc కవులకు ప్రకృతి అనుసరణముకంటె భావ సృష్టి అత్యంతప్రియము. పూర్వరచనలపై అసంతృప్తికలిగి నప్పుడు నవ్యరచనకు దారి యేర్పడును. ప్రాణముకలిగిన వేవైనా ప్రతికూల పరిస్థితులు సంభవించినప్పుడు తిరుగ బడుచు. కాలార తిరుగనేర్చిన బిడ్డ దాది నిర్బంధములకు ఎదురుతిరుగును. ప్రబంధరచనా విధానముపై కలిగిన అసం తృప్తియే యీనాటి కవుల క్రొత్తపోకడలకు హేతువైనది.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

నా కవితానుభవములు

కవుల అనుభవాలను వినడానికి లోకం ఉవ్విళ్ళూరుతుంటుంది. కవికి కావ్యానికి అవినాభావసంబంధం ఉంటుంది. కవి మనస్తత్వం, భావప్రపంచం తన కావ్యాలలో ప్రతిఫలించడం సహజం. కవి జీవితం కావ్యాలకు, కావ్యాలు కవి జీవితానికి వ్యాఖ్యాప్రాయంగా కనిపిస్తాయి. అందువల్ల నే కవిజీవితానుభవాలను తెలుసుకొని రెంటిని సమన్వయపరచుకొని ఆనందం అనుభవించడానికి రసికలోకం ఆశపడుతుంటుంది, ప్రోగ్రాం డైరెక్టరుగారు కాకతాళీయంగా నా కిటువంటి అవకాశం కలిగించడం సంతోషకరం.

నాకు ఒక కుగ్రామం నివాసం. ఇప్పటివరకు నాజీవితమంతా ఆ గ్రామములోనే కొనసాగిపోయింది. ఆ పరిసరాల ప్రభావంవల్లనో ఏమో నా జీవితంలోను కవిత్వంలోను గ్రామీణత్వం పరిస్ఫుటంగా అంకితమై ఉంటుంది. ఒకయువకవికి కవితాకన్యకు జరిగిన సంభాషణములో ఒకప్పుడు నే నీ విధంగా వ్రాసినాను:

"గ్రామవాసిని, ఎఱుఁగను గైతవంబు,
ప్రకృతి తల్లి స్తన్యంబునఁ బ్రబలినాఁడ;
బొలముల విహరించుచుఁ బ్రొద్దుఁబుచ్చుచుందు
నట్టి నా ముద్దువలపును నరయలేవె?"

తనకు దైనందిన చర్యగా ఉన్న కవితాపూజను గురించి ఉత్కంఠను గురించి ఈవిధంగా అన్నాడు:

"ప్రత్యూషస్సుల నూత్నపత్రములువిచ్చి
విమల హిమబిందువులురాల్చు సుమవితతుల
తోడఁ బ్రణమదాశ్రువులు వీడి పాడుచుందుఁ,
గలికి, నీమనంబంటెడు గానములను."

"సందెమబ్బుల చిఱువేరు చాయదీసి
పండువెన్నెల పసరునఁ బదనుచేసి
తరుణి, నీ పట్టుమునుగు నద్దకమువైవ
విఫలయత్నంబులంజల్పి వెఱ్ఱినైతి"

"పారిజాతపుష్పంబులు పవనహతిని
మృదులతృణములరాలెడు నెడల, నీదు
చరణవిన్యాస కోమల శబ్దమనుచు
నడుగుగుర్తులఁ బలుమాఱు నరయుచుందు."

నా మిత్రులు కొందరు నా కావ్యాలు కొంతవరకు ఆత్మచారిత్రస్ఫోరకాలుగా ఉంటవని అంటున్నారు. పూర్వం నేను వ్రాసేటప్పుడు అజ్ఞాతంగా నాకాభావము ఉండినదో లేదో చెప్పలేనుగాని మిత్రుల వ్యాఖ్యానాలవల్ల యిప్పుడు నాకానమ్మకం కలుగుతున్నది.

నాకు కవిత్వం యాదృచ్ఛికంగా లభ్యమైనది. అంటె Love at first sight అన్నమాట. ప్రథమ కవితా సందర్శ నానికి దారితీసినవి యీ క్రింది పరిస్థితులని స్ఫురిస్తున్నది.

"గూళులకువచ్చు పక్షుల కూజితములు
సంజకెంజాయ గారడి చక్కదనము
పిరుల వినవచ్చు కీటకావ్యక్తగీతి
కాపువానిని సైతము కవినొనర్చు."

నా కవితావధువు సంపన్నుల యింటి ఆడపడుచు. అందువల్ల నా పెట్టుపోతల్లోను చెప్పుచేతల్లోను అణిగిమణిగి ఉండదు.

పిలిస్తే రాదు. వస్తే నిలవదు. తలవని తలంపుగా వస్తుంది. సగములో ఏమో పుట్టిమునిగిపోయినట్లు వెడలిపోతుంది. ఒక్కొక్కప్పుడు అలక్ష్యంగా వచ్చిపోయిన జాడకు యా పరాగ రంజిత పదాంకాలే దుఃఖకరమైన సాక్ష్యంగా నిలిచి ఉంటవి.

" పొలతి రానూవచ్చె పోవనుం బోయె
పచ్చిలత్తుక పూతఁ బైదలియడుగు
ముద్రలు వాకిటి ముంగలం దనరె!
సకియ మేలు మునుంగు నందడివినియు
పవనకంపితపర్ణ రవమనుకొంటి
ప్రేయసిచేతి దీపక కాంతిగాంచి
యమల తారాశోభయని భ్రాంతిపడితి
వింతముగ్ధుడనైతి — ఎంత పొరపడితి."

భాగ్యవంతుల యింటి బిడ్డను పెళ్లి చేసుకొన్న నిరుపేద సంసారికి ఏ అవస్థ కలుగుతుందో నాకూ అదే అవస్థ పట్టించినది. చూచారా, నాకూ ఆవిడకు ఎంత తారతమ్యముందో—

" నీవు రాణివె యౌదువు; నేను బిచ్చ
మెత్తు పిచ్చిబికారినె; యిద్దఱకును
దారతమ్యంబు కొండంత; తరుణి యింత
పోల్చ లేనైతి; నినునమ్మి మోసపోతి."

" జలదపథంబునందిరుగు చక్కనిచుక్కవెయయ్యు నాపయిం
గల ప్రణయంబునం బసిఁడిగద్దియడిగ్గి పొలానఁ బచ్చకం
చెలకడఁ గూరుచుంటివి కృషీవలబాలికయట్లు; గడ్డిపూఁ
దలిరుల కానుకతోఁ బ్రథమదర్శన ముత్సవమయ్యె దొయ్యలీ."

అంటూ పలవిస్తూ ఉండేవాణ్ణి. ఒక వేళ నేను ఎంతే బీదవాణ్ణి అయినప్పటికి నేను మనిషినే కాబట్టి నా భార్య నాకు లోబడి ఉండవలెననే కోరిక, నేను భర్తనుగదా అన్న అహంకారము ఉంటుందిలేండి. నీవేమన్నా నాకు తాళిగట్టి మంత్రపూతంగా నన్ను పెండ్లి చేసుకొన్నావా! అనేమాట ప్రత్యక్షంగా ముఖాముఖి యెత్తిపొడవదు. యిక్కాంత అహంభావ Ultra Modern wife తత్వం పట్టు పడనందువల్ల కొంచెం చాటుమాటుగా హావభావాలచేత నా మనస్సుకు తగిలేటట్లు స్ఫురింపచేస్తూ ఉంటుంది.

అయితే మనలో మాట చెబుతున్నాను. నేనూ అంత నిరపరాధుణ్ణి కానులేండి "కంఠాశ్లేష ప్రణయినిజనేకిం పునర్దారసంస్థే" అని భార్యా వియోగంవల్ల యక్షుడు దుఃఖించినట్లు నేనూ దుఃఖించి :

రసపిపాసలనడచు నీరమ్యమూర్తి
మెరుపువలెనైన గనుపించి మరగిపొమ్ము

అని చాల దీనంగా వేడుకొన్నాను. వేడేకొందీ యింక కొంత బిగిసి ఏదో కొంతకాలం కుదురుగా కాపురం చేశాము. సంతానంకూడా కలిగింది. కాలంగడిచి పోతున్నది. కాస్త యింటిపట్టున వుంటే బాగుంటుందని నాకోరిక. కాని నాకోరిక నిష్ప్రయోజనమైంది. కసితీర్చుకో దలచుకొని 'వెంకటచలం' గారి నవలలు, కథలు అన్నీ పట్టుపట్టి చదివాను. వ్యభిచరించడం ఒక గుణమని సిద్ధాంతం చేసుకొని, అందుట్లో మావివాహం Convenience Marriage కాబట్టి, అంత చచ్చు దనంగా ఉండడం మరీ లోకువగా వుంటుందని అహంభావ

కవులవద్ద కొంత అహంభావం ఎరువుతీసుకొని సాహసం సంపాదించి, చిత్రలేఖను చేరదీశాను.

చూచారా మానవస్వభావంలో ఉండే చిత్రం. నా యిల్లాలికి మనసులో ఈర్ష్య పుట్టింది. నన్ను వేటాడడం మొదలుపెట్టింది. నేను కొంచెం మూతిబిగింపు చూపినాను. మౌనము ధరించాను.

నేటికైనను నా యున్కి నీకుఁదలఁపు
వచ్చె; నది కొంతభాగ్యంబు మెచ్చుకొఁడ,
బహుళ సంతానవతియైన భార్యవలపు
సాటిగాదయ్యెఁ గొందగు లాటమునకు.
ప్రేమసూత్రాలఁ ద్రెంపెడి బిగువునదలి
బిచ్చకత్తియపోల్కి నీ పిలుపులేక
వచ్చినిలిచితి ముంగిట, నిచ్చకాల
కైనఁ దలయెత్తి చూడవు మౌనివైతె?

అంటూ పూర్వప్రేమను తోపింపజేస్తూ, బొటన వ్రేలు నేలరాస్తూ కన్నీరునింపింది. చిత్రలేఖకు నాకు కలిగిన సాంగత్యం ఫలప్రదం కాకపోయినప్పటికినీ కవితకు నామీద ఉన్న పూర్వప్రేమ యింకా మాసిపోలేదని ఋజువుచేసింది. బయటికి తెచ్చికోలు బిగింపుచూపినా లోలోపల నా హృదయం వెన్నవలె కరగిపోయింది. అన్నానుగదా :

నిలునిలు మోనకీ, మనసు నీరయిపోయె; నవజ్ఞగాదు; నీ
వలె ననుజేరవచ్చె బహువర్ణ సుశోభిత చిత్రలేఖ; నే
వలదనఁ జాలనైతి; నెలప్రాయము మోనముఁజేసె; నిక్కముం
దెలిసిన నీవునుం జెలినిఁ దియ్యని కౌగిటఁజేర్తు వింతకుఁ.

అని వోదార్చినాను. ఇద్దరం భాయి భాయి అను
కొన్నాము. విరహాంతరమువల్ల మా సమాగమం ప్రణయ
సక్షణంగా కనిపించింది. తర్వాత ఫలిత కేశం కనుపించి:

చెలువలు ప్రేముడిం గదుము చిక్కని కౌగిళులం సుఖించి ని
చ్చలు మధురాధరామృతరసంబున మత్తిలి యౌవనంబు ని
శ్చలమని యెంచి కామపరిచర్య యొనర్చుచు భావికాల చిం
తలు తలపెట్టబోని పశుతత్త్వని నిద్దురలేప వచ్చితిన్.

అంటూ హెచ్చరించింది. పాపం! నా యిల్లాలి
ముఖం మేఘాచ్ఛన్నమైంది చూచాను.

అతివ పాతపాట్ల ప్రహసనం బాడినాము
భరత వాక్యంబుగాఁబెట్టు వలపు ముద్దు;

అని ఒక ముద్దు ముద్రించాను.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

తిక్కన

మహాభారతాంధ్రీకరణముతోడ ఆంధ్రుల నాగరక జీవితము ప్రారంభమైనదని చెప్పవచ్చును. గాసట బీసటే చదివి సంతృప్తిపడు ఆంధ్రులకు సర్వలక్షణ సమన్వితమైన భాష కవిత్వము చేకూడినది. వైదికమతము వ్యాపింప జేయవలయుననే కోర్కెయే భారతాంధ్రీకరణమునకు మూల కారణము. రాజరాజు వైదికమతాభిమాని కావున నన్నయను ఆ మహాకార్యమున నియోగించి ఆదరించెను. మొట్ట మొదటి యుద్దేశమెట్టిదైనను ఆంధ్రులకు ఆంధ్రభాషకు మహోపకార మొనగూడినది.

అరణ్యపర్వము పూర్తి కాకపూర్వమె నన్నయ అస్తమించెను. ఆయన మరణము వింతవింత కింవదంతులకూ ఊహలకూ ఆకరమైనది. "అసలు సంస్కృత భారతమును తెనుగు చేయడమే ఒక గొప్ప అపచారము. కాబట్టి దుఃఖ భాజనమైన అరణ్యపర్వము పూర్తిగాకమునుపే నన్నయ మరణించినాడు" అను నమ్మకము దేశమున వ్యాపించినది. దీనిలో ఆశ్చర్యమేమియు లేదు. నాగరకయుగమని చెప్పుకోబడే యీ యిరవయ్యోశతాబ్దమునకూడ ఇట్టి విశ్వాసములు నాటుకొనియున్నవి.

రెండువందల సంవత్సరములు గడచిన వెనుక తిక్కన యవతరించి ఈ యాంధ్రీకరణ భారము వహించువరకు ఈ పనికి పూనుకొన్నవారు లేరు. తలపెట్టినవారుండవచ్చును.

అథర్వణాచార్యుడు భారతము రచించెనని వినికిడి. అదేమైనది? దానినిగుఱించి కొన్నికట్టుకథలు ప్రబలినవి. అయితే యీ మధ్యకాలమున భారతమును తెనిగింపగల మహాకవి ఆంధ్రదేశమున లేడా? రామాయణమంతటి బృహత్కావ్యమును నిర్వహించిన భాస్కరాదులున్నారుగదా. బహుశా అరణ్యపర్వమును గుఱించిన మూఢవిశ్వాసము కొద్దిపాటి మార్పులతో తిక్కన నాటికికూడ వ్యాపించి యుండిన దేమొ? ఇటువంటి విశ్వాసములకు కారణభూతమైన అరణ్యపర్వ శేషమును వదలిపెట్టి విరాటపర్వము మొదలు పదునేనింటిని తెనిగించెను,

నన్నయకును తిక్కనకును షుమారు రెండువందల సంవత్సరముల కాలవ్యత్యాసమున్నది. ఈ మధ్యకాలమున రాజకీయ సాంఘిక విషయములందేమి, భాషావిషయము నందేమి. ప్రజల యాచార వ్యవహారములందేమి కొన్ని మార్పులు తప్పక జరిగియుండవలయును. నన్నయ తిక్కనల కావ్యప్రయోజన దృష్టిభేదములకు ఈ మార్పులే బాధ్యములై యుండవచ్చును. నన్నయ వైదిక దృష్టితోను, జగద్ధిత బుద్ధితోను భారత రచనకు పూనుకొనెను. తిక్కన శిల్పదృష్టితోను "ఆంధ్రావళి మోదముం బొరయించు" బుద్ధితోను భారత రచన కొనసాగించెను.

తిక్కన కాలముననే ఆంధ్రులు, ఆంధ్రత్వము అను నొక ప్రత్యేకత, సాంఘికజ్ఞానము అంకురించి యుండినది. ఈనాటి గ్రాంథిక, వ్యవహారిక భాషావాదములవలెనే

ఆనాడును మార్గకవితా దేశికవితావాదములు పుట్టియుండి నవి. దీనికి కారకులు శివకవులు. జాను తెనుగున కావ్యగతార్థము సామాన్యజనులకు బోధపడునట్లు వ్రాయుటయే వారి యుద్దేశము. అట్టి గ్రంథములే మత ప్రచారమున కనుకూలముగ నుండును. ఇట్టి యుద్దేశముగల కవులలో ప్రబంధ పద్ధతిని వ్రాసి ప్రబంధ రచనకు మార్గదర్శియైనవాడు నన్నెచోడుడను రాజకవి. నిర్వచనోత్తర రామాయణమున తిక్కన చేసికొన్న నియమములనుబట్టిన్ని తర్వాత కొంత కాలమునకు భారతమును రచించిన విధానమునుబట్టిన్ని ఈయనకూడ జాను తెనుగు ఉద్యమమునకు సంబంధించిన వాడేనని చెప్పవచ్చును. సంస్కృతశబ్ద బహుళమైన దీర్ఘ సమాసములకంటె "అలతి యలంతి తునియలుగ" విరుగు తెనుగు శబ్దములపైననే యీయనకు అభిమానము మెండు. "జాత్యముగాని నొప్పయిన సంస్కృత మెయ్యెడజొన్ప"డు. శివకవులవలెనే తిక్కనకూడ యిట్టి నియమములు చేసి కొన్నను ఆచరణలో మాత్రము విధిలేక కొంత ప్రతిజ్ఞా భంగము కలిగినది. ఇది కాలపరిస్థితినిబట్టి అనివార్యము కూడ. అదివఱకే సంస్కృతము ఆంధ్రమునందు తిలతండుల న్యాయముగ కలిసిపోయినది. అరబ్బీభాష మూలమున పారసీభాష మఱింత సంపన్నమైనట్లు సంస్కృత సంబంధము వలన తెనుగు భాషకు పదజాల సమృద్ధి కలిగినది. కాని ఆ కాలమున ఈ జాను తెనుగు ఉద్యమమే లేనట్లయిన తిక్కన కాలము నాటికే తెనుగు పద్యములు ఇనపగుండ్లుగా తయారై యుండెడివి.

కేతన రచించిన దశకుమార చరిత్రమువలన తిక్క
ననుగురించి కొంత తెలిసికొనవచ్చును. తిక్కన బహుకళా
సంపన్నుడు. వాక్పతినిభుడు. సకలాగమార్థ తత్త్వవేత్త.
ఉభయకవిమిత్రుడు ఇంతేకాదు. తిక్కన అభిరూప భావ
భవుడు. కామినీ చిత్తచోరుడు. ప్రజాతత్పరుడు. ధీరుడు.

తిక్కన నిర్వచనోత్తర రామాయణమున "నే
నుభయకావ్యప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుడం గళా
విదుడ"నని చెప్పియున్నాడు. కవిత్వము శాస్త్రముకాదనీ,
శిల్పమనీ, కళయనీ తిక్కన గ్రహించినాడు. తిక్కన మహి
మను పూర్ణముగ తెలిసికొన్న పూర్వకవులలో ఎఱ్ఱన
ప్రథముడు.

> తనకావించిన సృష్టి తక్కొరుల చేతంగాదునా, నేముఖం
> బునఁ దాఁబల్కినపల్కులాగమములై పొల్పొందునా, వాణిన
> త్తను నీతండెకరుండ నాఁజనుమహత్త్వాప్తిం గవిబ్రహ్మ నా
> ది నుతింతుం గవి తిక్కయజ్వ నఖిలోర్వీదేవతాభ్యర్చితున్.

తిక్కన కావించినది సృష్టి. అది యితరులచేత గానిపని.
ఆయన కవిబ్రహ్మ. ఇది యెట్లు? సంస్కృతమునుండి తెనిగించి
నది స్వతంత్ర సృష్టి యెట్లయినది? సంస్కృత మూలములతో
తిక్కన భారతమును సరిపోల్చి చూచినప్పుడే తాను కావించి
నది సృష్టియని గోచరించును.

ఒకటి రెండు వాక్యములలో సంస్కృత భారతము
నకును తిక్కన యాంధ్రీకరణమునకునుగల తారతమ్యము
చెప్పదలతుమేని — మూలము అస్థిపంజరము — తిక్కన ఆంధ్రీ
కరణము రక్తమాంసయుతమైన జీవన్మూర్తి.

కవియే కథ చెప్పినట్లుగాక పాత్రలే మన యెదుట నిలబడి వ్యవహారించునట్లు, వారి మనోవృత్తులు భావవికారములు, అభినయ వర్ణనమూలమున మూర్తీభవించునట్లు రచించుటె తిక్కనగావించిన గొప్ప మార్పు. నాటక పద్ధతి వలన తెలుగు భారతమునకు అపూర్వమైన చైతన్యము కలిగినది. తిక్కన యెక్కడెక్కడ రసాభ్యుచితముగ మూలాతిక్రమణము చేసెను, ఎక్కడెక్కడ ఔచిత్యమును పోషించెను అను చర్చకు నిదర్శనపూర్వకముగ పూనుకొందుమేని భారతమంత పెద్ద విమర్శన గ్రంథము వ్రాయవలసి యుండును. అయినను ఆ మహాకవి అవలంబించిన రచనా పద్ధతులను కొన్నిటిని చూచెదము.

(1) సంభాషణమూలకమైన నాటక పద్ధతిలో కథ నడుపుట.

(2) రసపోషణకుగా యథేచ్ఛముగ మూలము నతిక్రమించుట, అమూలకమును చేర్చుట, మూలమును మట్టగించుట.

(3) వస్తువుయొక్క ఐక్యమునకూ కథాగమనమునకూ అభ్యంతరములైన భగవద్గీతలవంటి వానిని వదలుట.

(4) పాత్రలు ప్రాణవంతములుగ స్ఫురించుటకు అంగవికారాద్యభినయములను కన్నులు గట్టినట్లు వర్ణించుట.

(5) పాత్రల వ్యక్తిత్వము భిన్నత్వము పరిస్ఫుటమగునట్లు శీలమును పోషించుట.

(6) ఔచిత్యమును పోషించుట.

(7) ఉదయాస్తమయాది వర్ణనములు కథలో మేళవించునట్లు చేయుట.

(8) భావరసానుగుణమైన శైలి.

వీని యన్నిటి సమిష్టి ఫలితమేమనగా ఆంధ్రీకరణము సంస్కృత మాతృకకంటె వేయింతలు కళావిశిష్టమయి సినిమా చిత్రమువలె అనుక్షణ భిన్న కార్యశీలమయి ఆంధ్ర సారస్వతమునకు పట్టుగొమ్మయయి నిలిచినది.

కొన్ని ఉదాహరణములు :

(1) విరహావిహ్వాలుడైన కీచకుని యవస్థావర్ణనములు, సంభాషణములు, ఆ ఘట్టములోని ద్రౌపదీవర్ణనములు చాల వఱకు అమూలకములు. అవి లేతపాకపు ప్రబంధధోరణిలో పడినను చాల మనోహరములై యున్నవి.

సుధేష్ణ వారుణి దెమ్మని ద్రౌపదిని కీచకుని యింటికి పొమ్మనినప్పటి స్థితి మూలమున "శంకమానారుదతీ" అని చెప్పబడియున్నది. ఇది కొంచ మించు మించు "ద్రౌపది సందేహిస్తూ వద్చును" అన్న Stage direction కు సరిపోవును. కాని యిక్కడ లోపించినది ఆ direction ననుసరించి అభినయించే పాత్ర. ఆ లోపాన్ని తిక్కన పూరించినాడు. అట్టి ద్రౌపది పాత్రను నాట్యరంగమున నిలబెట్టి మన కన్నుల యెదుట అభినయింపించినాడు.

"ఉల్లము తల్లడిల్ల దనువుద్గత ఘర్మజలంబు దాల్చుచుఁ డిల్లవడఁగ" ఇంతవఱకు ఈ చిడిముడిపాటంతా అభినయము. "నాకిది కడింది విచారముపుట్టె; అందుఁబో నొల్లననంగరా, దచటి కూరక పోవనురాదు,

నేర్పు సంధిల్లగ దీని బాపికొను దీమసమెట్టిదో'' — ఇది స్వగతము. మనసులోని ఉరిమాట. తలపోతల పోరాటము. To be or not to be—that is the question అనే మానసిక సంఘర్షణము. ఒక చిన్న Stage direction ను అభినయించు పాత్రగా మార్చగలిగిన తిక్కన యింద్రజాలమె తెలుగు భారతమునకు అనన్యమైన విశిష్టతను చేకూర్చినది.

(4) తిక్కన నిశితమైన లోకజ్ఞానము కలవాడు కావున ఔచిత్యములను చక్కగ పోషించెను. బృహన్నలను ఉత్తరకు ఆట నేర్పుటకు నియోగించుటకు పూర్వము అతడు నిజముగ నపుంసకుడా లేక పుంసత్వముకలవాడా అను సంగతి ప్రమదలచేత పరీక్ష చేయించి విరటుడు తన సంశయము తీర్చుకొన్నట్లు మూలమున నున్నది. ఇది చాల మొరటుగాను బూతుగాను కనిపించును. దీనిని "నైపుణంబున నుచితంబుమై నరసి'' యని తిక్కన నాజూకుగా మార్చి తన సున్నితమైన యభిరుచిని వెల్లడించెను.

(5) "నిగూఢ స్త్వం తథా పార్థ కీచకంతం నిషూదయ'' అని కీచకుని రహస్యముగ చంపవలయునని భీమునితో ద్రౌపది చెప్పినట్లు మూలమున నున్నది. దీనికి విరుద్ధముగా భీమ కీచకుల యుద్ధము ఇట్లు వర్ణింపఁబడినది.

"శబ్దసమభవద్ఘోరో వేణుస్ఫోట సమోయుధి''అనిన్ని అన్యోన్యం ప్రతిగర్జతాం'' "విరురావ మహాబలం'' అనిన్ని "నదంతంచ మహానాదం భిన్నభేరీ సమన్వితం'' అని —అంటే, పూరిండ్లు కాలునప్పుడు వెదురు బొంగుల గణు

పులు పగిలి పెట్లుదిమ్మలవలె శబ్దించును. అటువంటి శబ్దములతోను, అట్టహాసాది గర్జనముతోను, భేరి వాయించునప్పుడు దానిచర్మము పగిలిన ఎంత శబ్దమువచ్చునో అంత శబ్దముతోను వారు పోరినారట! ఈ అల్లకల్లోలమునకు రాజగృహములోని వారేకాక యూరివారందరు ఉలిక్కిపడి లేచి యుందురు. తిక్కన పూర్వాపర సందర్భవైరుధ్యము కలగకుండునట్లు—

తనయుగ పాటొరు తెఱుఁగుదు
రని సూతుఁడు, సమయభంగమగుటకు భీముం
డును గొంకుచుఁ జప్పుడుసే
యని గూఢవిమర్దన ప్రహారముల దగఁ౯.

అని యుచితముగ మార్చి రహస్య యుద్ధమునకు కారణములుకూడ చూపెను.

నూటికి నూలుపోగనునట్లుగా తిక్కన కావ్యగుణములను సూక్ష్మముగ తడవి యింతటితో విరమించుచున్నాను.

—(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో.)

విషాదాంతనాటకము - మీరాబాయి

(శ్రీ దువ్వూరి రామిరెడ్డిగారిచే రచింపఁబడిన "మీరాబాయి" అను వధాంత నాటకము నెల్లూరి వెంకటగిరిరాజాగారి కళాశాల "ప్రాంతవిద్యార్థి సంఘము" వారిచే తే (7-5-1933) దిన ప్రదర్శింపఁబడి సహృదయులగు ప్రేక్షకుల సంస్తుతికిఁ బాత్రమైనది. అప్పటినుండి కొంతకాలము వఱకు ఆనాటకమును - గుఱించినబాగోగుల వివాదములు స్థానిక పత్రికలయందుఁ బ్రచురింపఁ బడినవి. అప్పుడు నెల్లూరినుండి వెలువడుచుండిన "Scrutator" అను పత్రికయందు "రసలుబ్ధుఁడు" "మీరాబాయి"ని గురించి ఒక విమర్శనము రచించి ప్రకటించెను. శ్రీ దు. రామిరెడ్డిగారు "కళాప్రియుడు" అనుపేరుతో అదే పత్రికయందు "రసలుబ్ధుని" యాక్షేపములకుఁ బ్రత్యుత్తర మిచ్చెను. ఈ విమర్శనము పాఠకులకు ఉపయోగపడునను ఉద్దేశముతో ఈ సంపుటిలో చేర్చినాము. —సం.)

"శృంగార మేగాని వీర మేగాని ఒక టేరసము అంగి, కడమ రసములన్నియు అంగములు" అను నిట్టివి మఱికొన్ని సాహిత్యదర్పణములోని నాటక లక్షణముల నుదాహరించి, ఆ లక్షణములనుబట్టిచూడ మీరాబాయి నాటకమున రసాభాసము కలిగినదని తీర్మానించి, [రసాభాస మన్నంతనే, అదేదో గుణలోపమని పామరుల యూహ; అది యట్టిది కానేకాదు. అదియొక పారిభాషిక పదమని పెద్ద లెఱుఁగుదురు.) "ఇత్యాది శాసనవ్యాప్త సాహిత్య రాజ్యమున వశాణాది విదేశబల సాహాయ్యమున శాసనము లుల్లంఘించి పితూరీలు రేఁపుచున్నారుగదా ఇప్పుడు కవులు!" అని కాల విపర్యాసమునకు వగచి, ప్రాణమైన రసము దెబ్బతినఁగాఁ

కళేబరము నేల వ్రాలదాయనియు, ఒకవేళ అట్లు వ్రాలనీయక "బ్రాడ్లీ ప్రభృతుల ట్రాజిడీ సంచిలోని క్రొత్త సంజీవనిం దెచ్చిపోసి నిలుపఁ గలమా? ఆమందు త్రాగి కులము చెడినను ఎందేని బ్రతికి ఊర్జితముగా నుండు నేమొ" అని కులము చెడని తన పౌరాణిక మనస్తత్త్వమును, సందేహమును, రసలుబ్ధుఁడు వెల్లడించినాఁడు. ఈ పురాణ పురుషుని వగపునకును సందేహమునకును గారణము కాలానుగుణముగఁ దలసూపు మార్పులను గుర్తింప నేరమి యనియే నాతలంపు.

లక్షణములు శాసనములా? లాక్షణికులకు అను శాసించు అధికారము ఎవరివలనఁ గలిగినది? ఆ యధికారము వారు స్వయముగఁ దెచ్చిపెట్టుకొన్నదా ఇతరులిచ్చినదా? లక్షణములకు లక్ష్యములకుఁగల సంబంధమేమి? నాటక లక్షణము లిఁక మీఁదఁ బుట్టుటకు అవకాశము లేదా? సాహిత్య దర్పణములోని నాటక లక్షణములు ఇప్పటి నాటక రచయితల నెంతవఱకు బంధించును? శృంగార వీరములే నాటకమునఁ బ్రధాన రసములుగ నుండవలయునా? రసాభాస సిద్ధాంతము 'ట్రాజెడీ' లకును జెల్లునా? అను ఈ విషయములను మనము విచారించి నిగ్గుదేల్చిననే గాని "శాసనవ్యాప్త సాహిత్య రాజ్యమున పితూరీలు" లేఁపు స్వాతంత్ర్య ప్రియులైన నేఁటికాలపు కవుల యుద్యమముయొక్క గౌరవమును మనము గ్రహింపలేము.

కళలువోలె తదంతర్గతములగు లక్షణములును స్వయంభవములు. అవి ప్రతిభాశాలులైన కవుల భావ ప్రపంచమున నుద్భవించి రచనాముఖమున వ్యక్తమగును.

కొంతకాలము గడచునప్పటికి వివిధములగు రూపకము లేర్పడును. మొట్టమొదట రచియించువారికి మార్గదర్శకముగ లక్షణ గ్రంథము లుండనేరవుగదా! అందువలననే వివిధత్వమునకు అవకాశముండును. తరువాత కొన్ని నూఱుల సంవత్సరములకు (అనఁగా నిర్మాణయుగము దాఁటిన వెనుక) లాక్షణికులు తమకుఁ బూర్వము రచియింపఁబడియున్న రూపకములను బరిశీలించి నిర్మాణపద్ధతి, ఇతివృత్తము, నాయికానాయకులు, రసము మున్నగువాని యందలి భేదముల ననుసరించి రూపకములను గొన్ని వర్గములుగ విభజింతురు. లక్షణ గ్రంథములు వ్యాపించిన క్రమమిదియే. తరువాత స్వతంత్ర రచనము సన్నగిల్లి, అనుకరణములు బయలుదేరినవి. నేఁటి కవులు సాహిత్య రాజ్యమున పితూరీలు సలుపుట అన్యాక్రాంతమైన స్వారాజ్యమును దమపరము చేసికొనుటకే యని రసలుబ్ధుఁడు గ్రహించుఁగాక!

నాటక రచనముగూడ నొకప్పుడు ప్రభవించి క్రమక్రమముగ నభివృద్ధి చెందినదే. భరతముని నాట్యశాస్త్రమునకుఁ బూర్వము ఎట్టి ప్రేక్షణీయకము లుండినదియు మనమెఱుఁగము. కంసవధ, బలిబంధనము, అను రూపకముల పేరులు పతంజలి యుదాహరించెనేగాని యాపురాతన రచనల తత్త్వమెట్టిదో మన మెఱుఁగము, సౌమిల్లి కవిపుత్రాదుల రూపకములు మనకు లభింపలేదు. మన పూర్వ పుణ్యవశమున భాసుని రచనలు లభించినవి. భాసుని రూపకములకును దరువాతి కాళిదాసాదుల నాటకముల

కును గల తారతమ్య మరయుదుమేని కాలక్రమముగ వచ్చు మార్పులను మనము గమనింపఁగలము. తనకుఁ బూర్వము రచింపఁబడిన 'కంసవధ' యందువలెనె భాసుఁడు ను 'ఊరుభంగము' అను రూపకమున వధను 'స్టేజి'పై చూపించెను. కాని తరువాత నాటకములలో అట్టి సంవిధానము వర్జింపఁబడినది; ఇట్టి మార్పులు అనేకములు పొడకట్టును. మార్పులు అనివార్యములు. కళలకును మానవ సంఘమునకును సన్నిహిత సంబంధముగలదు. అందుఁ బొడసూపుమార్పులు కళలయందును ప్రతిబింబించుచుండును.

లక్షణ గ్రంథములలోని నియమములను బొల్లుపోక అనుసరించిన సంస్కృత కవుల నాటకములెన్ని యిప్పుడు ప్రదర్శనయోగ్యములై యున్నవి? పూర్వీకుల నియమములను అనుకూలమైనంతవఱకు గ్రహించి, వలయుచోట్ల క్రొత్త లక్షణములఁ దెచ్చుకొని రచియించు నేఁటికవుల నాటకములెన్ని ప్రజారంజకములుగ నుండుటలేదు ? లక్షణములు శాసనములుకావు; మార్గదర్శకములు. కాలము గడచుకొలఁది భిన్నమార్గము లేర్పడుచుండును. "భావి పరిణామ మెవ్వరు పలుకఁగలరు?"

నాట్యరంగ పరికరములయందు ఇప్పటికిని అప్పటికిని ఎంతయో తారతమ్యముగలదు. ఈ భేదము నాటకరచన యందును జూపట్టదా? నాయకుఁడు ఏ స్థలమున సంచరించు చుండునో ఆస్థలమును స్ఫురింపఁజేయఁగల ఆ లేఖ్యపటములు పరదాలు లేని యాకాలమున నటకులు వర్ణింపవలసిన అంశములు మెండుగనుండును. కావుననే కార్యసంచలన

మునకుఁ గథాప్రసరణమునకుఁ బ్రతికూలమైనను సంస్కృత నాటకములందుఁ గవిత్వభాగము హెచ్చుగనుండును. ఈ కాలపు నాటకములలో నట్టివర్ణనములకు అంతె యవసరముండదు. షేక్స్పియరు నాటకములకును, ఇబ్సన్, బియర్న్‌సన్, గాల్స్వర్థి, బెర్నార్డుషా మున్నగు ఆధునికుల నాటకములకునుగల "Technique" భేదమును గ్రహింతుమేని నాటకరచనాపద్ధతి యెంత అభివృద్ధియైనదో మన మెఱుంగకపోము. కాని అభివృద్ధిసూచకములుగా నున్నను మార్పులు గలిగినపుడెల్ల పూర్వాచారపరాయణులగు పండితులు ప్రపంచము తలక్రిందై పోవుచున్నదో యనునట్లు గగ్గోలు పడుచుందురు. క్రొత్తప్రాంతల సంధికాలమున నిట్టిపోరాటములు తప్పక సంభవించుచుండును.

ఇతర కళలవలెనే నాట్యకళసైతము రాజాశ్రయముననే యభివృద్ధిచెందినది. రాజప్రాసాదములందు నాట్యమండపము లుండెను. వసంతోత్సవ సమయములందు రాజుల యొక్కయు పండిత నాగరకులయొక్కయు వినోదముకొఱకు నాటకములు ప్రదర్శింపఁబడుచుండెను. రాజులు శృంగారప్రియులు; అంతఃపురములను స్వర్గతుల్యముగ నొనర్చుకొనిన సంపన్నులు. వారికి జీవితము సుఖమయము. కావుననే మనదేశమున శృంగార రసప్రధానములైన నాటకముల సంఖ్యయే హెచ్చుగనుండును. వీరరసము గ్రాహ్యమయ్యును దానికిఁ బ్రాధాన్యమొసఁగి వ్రాయఁబడిన నాటకముల సంఖ్య అల్పము. కాలక్రమమునఁ బరిస్థితులు మాఱినవి. శృంగార వీరములకన్న నన్యములగు కరుణ శాంతములు

నాటకమున ప్రాధాన్యము వహించుటకు ఆటంక మేమి యను విచారము బయలుదేరెను. భవభూతి కరుణము అంగిగా ఉత్తరరామ చరితమును రచించి 'రసేషు కరుణో రసః' అను ఆర్యోక్తికిఁ గారణభూతుఁడాయెను. శాంతరస ప్రధానముగ కృష్ణమిశ్రుఁడు ప్రబోధ చంద్రోదయ నాటకమును రచించెను. పాపము! ఉత్తరరామ చరితము లాక్షణికుల తత్తఱపెట్టినది. ఇందలి రసము శృంగారము కాదు; వీరముకాదు. ఇఁక ఉత్తరరామచరితము లక్షణ బాహ్యమనవలయును. ఇదెట్లు పొసఁగును? లోకము అంగీ కరించునా? భవభూతి నెట్లయిన లక్షణ బద్ధుఁడని తీర్మా నించుకొనకున్న లక్షణములకే గౌరవము తగ్గునుగదా! అందువలన లాక్షణికులు, ఉత్తరరామచరితమున ప్రధాన రసము కరుణము గాదనియు, అది విప్రలంభ శృంగార మనియు ధర్మవీరమనియుఁ దర్కవాదములు సలిపి కొంత ఆత్మ సంతృప్తివడసిరి. అట్లుగాక, లక్ష్యము ననుసరించి క్రొత్తలక్షణమును నెలకొలుపుకొని యుండిన భవభూతి స్వాతంత్ర్యమును మనము గౌరవించినవారమైయుందుముగద!

రతి ఉభయనిష్ఠము కానందువలన మీరాబాయి నాటకమున రసాభాసము గలిగినదని రసలుబ్ధుని వాదము. ఈపాటి విషయము కవియు నెఱింగియుండును. కాని, రసా భాస సంవిధానముకూడ ప్రదర్శన యోగ్యమని కవిమతము కాఁబోలు. కావుననే యీకవి "రస" సిద్ధాంతమును త్రోసిపుచ్చి "రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్య"మ్మను పండితరాయల నిర్వచనమునకు ఉదాహరణ ప్రాయముగ,

తాను రచించిన 'వనకుమారి', 'కడపటి వీడుకోలు' అను కావ్యములందును ఇట్టి 'రసాభాస' సంవిధానములను చేకూర్చి యున్నాఁడు. కవి మీరాబాయి నాటకమున శృంగారరసము పరిపూర్తిన్ సేయఁదలచుకొనలేదనుట స్పష్టము. రతి ఉభయ నిష్ఠము కానియపుడు చూపట్టు మానము, ద్వేషము, ఈర్ష్య, రోషము, వానిమూలమునఁ గలుగు దురవస్థలు, మనోవిప్ల వము కవి రూపింపఁ దలఁచుకొనెను. ఈ తెగకు సంబంధిం చిన ప్రబంధములు పూర్వమే రచింపఁబడియున్నవి. కీచక వధ, శుకరంభాసంవాదము, సారంగధర చరిత్రము, మను చరిత్రము మొదలయిన ప్రబంధములు ఈ కోటిలోనివె. ద్రౌపదీ కీచకులయందు రతి ఉభయనిష్ఠము కానందువలననే కీచకుఁడు దుర్మరణము పొందెను. చిత్రాంగి సారంగధరు లలోఁగూడ రసము ఉభయనిష్ఠము కానందువలననే సారంగ ధరునకట్టి పాటు గలిగెను. లాక్షణికుల సిద్ధాంతముల ననుస రించి యిట్టి కావ్యములు, నాటకములు, తగులఁబెట్టఁబడ వలసినవే గదా! వేయి సాహిత్యదర్పణములనైన బుగ్గిచేయ నోర్తుముగాని, లోకోత్తర రామణీయకము కనులగట్టించు మనుచరిత్రమును మంటవేయఁగలమా?

"It is that the artists as such must have no creed;... ...Rules, conventions, theories, principles, inhibitions of any sort *not born of his own immediate feeling* are no concern of his. They proceed from an inferior part of human nature, being the work of gapers and babblers."

—*J. W. Von Goethe*

రతి ఉభయనిష్ఠము కానిచో, రచన హాస్యాస్పదమగు నని రసలుబ్ధుఁడు లక్షణ గ్రంథములలోని కొన్ని ప్రమాణముల నుదాహరించెను. ఈ లాక్షణికులు 'శృంగారానుకృతిర్యాతుసహాసః' అను భరత నిర్వచనమునే యనుకరించి లక్షణము లల్లిరేగాని, స్వాంతముగ నాలోచించి యందలి భేదముల నరయరైరి.

రతి ఉభయనిష్ఠము కానియపుడు హాస్యము పుట్టుటకు నాయికా నాయకులలో నొకరియందో లేక యిరువురందో లాఘవము (frivolity) అగపడవలయును. అట్లుగాక, యుభయులందును గౌరవమును, seriousness of purpose పొడకట్టు నేని హాస్యము పుట్టదు. నాయికకైనను నాయకునికైనను మానము, ఈర్ష్య, క్రోధము; కసి తీర్చుకొన వలయునను తలంపు పుట్టును. ఈ భేదమును లాక్షణికులు (గతానుగతికులగుటవలన) గుర్తింప లేదు. ఇట్టి విషయములందుఁ గేవలము సచేతనుల యనుభవమేగదా ప్రమాణము!

II

"In short, tragedy is not history in dialogue. History is for tragedy nothing but a storehouse of names where with we are used to associate certain characters,... ......For the dramatic poet is no historian, he does not relate to us what was once believed to have happened, but he really produces it again before our eyes, and

produces it again not on account of mere historical truth, but, for a totally different and a nobler aim. Historical accuracy is not his aim, but only the means by which he hopes to attain his aim, he wishes to delude us and touch our hearts through this delusion."

G. E, Lessing.

మీరాబాయి నాటకములోని మీరా కుంభరాణా అక్బరు తాన్‌సేనులు చరిత్రకు సంబంధించిన వారయ్యు కథమాత్రము చారిత్రకము కాదు. అక్బరును కుంభరాణాయు సమకాలికులు గారు. రాణా క్రీస్తువెనుక 1419 మొదలు 1469వ సంవత్సరము వఱకును, అక్బరు 1516 మొదలు 1605వ సంవత్సరము వఱకును రాజ్యమేలిరి. రాణా సింహాసన మధిష్ఠించిన 137 సంవత్సరములకు అక్బరు పట్టము గట్టుకొనెను. కాని, సంప్రదాయానుగతముగ లోకమున వ్యాపించియున్న కథయందు మీరా అక్బరులకు సంబంధము కల్పింపబడియున్నది. మీరా కథ మూడు నాలుగు విధములుగ గ్రంథస్థమై యున్నది. ఒక కథకును మఱియొక కథకును భేదములున్నవి, అచ్చమాంబగారి "అబలా సచ్చరిత్ర రత్నమాల" యందును "మీరా గీతావళి" అను హిందీ గ్రంథమునందును, "భక్తవిజయము" నందును మీరా కథ గలదు "రాజస్థాన కథావళి" యందు రాణాచరిత్ర కనఁబడుచున్నదేగాని మీరావిషయమై అందుఁగానఁబడదు. కాలము మీరా కథకుఁ గొంత 'పౌరాణిక స్పర్శ' కలిగించినది; యథార్థచరిత్రము పురాణ గాథలలో లీనమైనది.

హిందూ దేశ చరిత్రాంశములను బోధించుటకు కవి యీ యితివృత్తయును గ్రహించి యుండఁడు; తాను రూపింపఁదలఁచుకొన్న భావస్పర్థకు ఈ యితివృత్తము అనుకూలముగ నుండునని యూహించి దీనిని గ్రహించి యుండును. పాత్రపోషణ సరణికూడ చారిత్రకముగాదు. అక్బరు ఒక క్రొత్త మతమును స్థాపించిన వాఁడయ్యు ఈ నాటకమునఁ జూపఁబడినంత భక్తితత్పరుఁడు కాఁడు. రాణా అంత హేతువాదియుఁగాఁడు. కథ చారిత్రకము కానియపుడు పాత్రపోషణము చరిత్ర సమ్మతమా కాదా యను విచారముతో మనకుఁ బనిలేదు. ఈ నాటకమున నాయికా నాయకుల పాత్రపోషణము 'ట్రాజెడి' లక్షణములకు సరిపోవునా లేదా యను విషయమే ప్రస్తుతము విచారింపవలసిన యంశము. ట్రాజెడి తత్త్వనిరూపణము దేశకాల పాత్రానుగుణముగ మాఱుచుండెను. గ్రీకు ట్రాజెడీలనుండి అరిస్టాటలు సమకూర్చిన లక్షణములె చాల కాలమువఱకు అనుసరింపఁబడుచుండినవి. స్థూలముగ, ఈ ట్రాజెడీలను గ్రీకులవి, ఎలిజబెతు కాలము నాటివి, ఆధునికులవి, అని మూడు వర్గములుగ విభజింపవచ్చును. గ్రీకు ట్రాజెడీయందు హాస్యజనకములగు సంభాషణము లుండకూడదు. వస్తువు కాలస్థల క్రియైక్యములను బొంది యుండవలయును. ఒక్క దినమున జరుగఁ గలవిషయమె నాటక నిబద్ధము కావలయును. కాలము చెల్లుకొలఁది ట్రాజెడీ రచనయందు కొన్ని మార్పులు అజ్ఞాతముగను, అనివార్యముగను గలుగు

చుండెను. కొందఱు పండితులు ఇట్టి మార్పులకు సాధుత్వము ప్రసాదించు కొఱకు అరిస్టాటలు లక్షణసూత్రములను సాగఁ దీసి క్రొత్తవ్యాఖ్యానములు చేయుచుండిరి. మఱింత లాగు నప్పటికి ఆసూత్రములు తెగిపోయెను. అప్పటినుండియుఁ బ్రాతలక్షణములు క్రొత్త నాటకములకు మార్గదర్శకములు కావు అను వాదము బయలుదేరినది. షేక్స్పియరును అతని సమకాలీనులును నాటకములను రచియించిరి. ఈ నాటకములలోని విశిష్టత యేమనఁగా: స్థలైక్యముండదు—కథ కొన్నేండ్లపాటు జరిగినదిగనైన ఉండవచ్చును. ట్రాజెడీ చూచునప్పుడు కలుగు జాలి, భయము, చిత్తసంక్షోభము మున్నగువానియొక్క యొత్తిడివలన జనించు మనోనిర్భరత్వమును సడలించు హాస్యము కొన్నిపాత్రలమూలమున సంపాదింపఁబడును. ఈ కాలముననే Tragi-Comedy అను మిశ్రనాటకము ప్రభవించినది. ఇటువంటి నాటకము గ్రీకు నాటక లక్షణములకు వ్యతిరేకము కావున గ్రాహ్యముకాదు అని కొందఱు ఆకాలపు రసలుబ్ధులు వాదించిరి. కాని, ఈ తరగతి నాటకము గ్రీకు లక్షణములకు వ్యతిరేకముగ నున్నను, మానవ జీవితమునకుఁ బ్రతిబింబకముగనున్నదనియు ఇట్లు రచించుట కళానైపుణ్యమనియు జాన్సను పండితుఁడు సిద్ధాంతము చేసెను. పూర్వలక్షణ విరుద్ధములయ్యును ప్రజానురంజకము లగునేని అంగీకృతములయి అట్టి నాటకములు భావినాటక లక్షణములకు లక్ష్యములై పెంపొందఁగలవు.

కొంతకాలము జరిగినది. రాజకీయ సాంఘిక విప్లవములు, మానవసంఘమునఁ జిరకాలము వేళ్ళునాటుకొని యున్న పూర్వనీతులను, భావములను, పెకలించివైచినవి. మానవుని విజ్ఞానప్రపంచము దినదినము విరివియగుచున్నది. ప్రజాస్వామ్యములు గుర్తింపఁబడినవి. ప్రజాప్రభుత్వమే ఆదర్శకమను మూలసూత్రము అంగీకరింపఁబడినది. సర్వమానవ సమత్వము నిరూపించుటకుఁ బ్రవక్తలు, వక్తలు, సంస్కర్తలు తమజీవితముల ధారవోయుచున్నారు. ఈ విప్లవము, ఈ సంచలనము కళలయందును బ్రతిఫలింపదా? ప్రతిఫలించినది. నవయుగ ప్రభాతమును సూచించు వేగుఁజుక్క యోయనునట్లు 1828–వసంవత్సరమున నార్వే దేశమున ఇబ్సన్ అను నాటకకర్త జన్మించెను. ఈతని సిద్ధాంతము లేవియనినః స్వగతము, జనాంతికము, ఆకాశభాషణము మొదలయిననాటకసమయములు రచనయొక్క బాల్యావస్థను దెలుపునవి. ఇట్టి అస్వాభావిక సాధనసంపత్తి సాహాయ్యమపేక్షింపకయె నాటకములు రచింపవచ్చును. ట్రాజెడీ కథానాయకుఁడు రాజుగా నుండవలసిన యవసరము లేదు. కడపటి రంగమున నెత్తురు కాలువలు పాఱింపకయె అద్భుతమైన ట్రాజెడీని సృజింపవచ్చును. సామాన్య మానవుఁడు సాంఘిక జీవితమునందుఁ బ్రతిదినముఅనుభవించు విషయములో నెంతో ట్రాజెడీకలదు. నాటకము వినోదముకొఱకై రచింపఁబడునది కాదు, సంఘమును శుద్ధిపఱచుటకు. ఈ సిద్ధాంతములే "Problem Plays" అను సాంఘిక నాటకములకు మూలము లైనవి. షేక్స్పియరు నాటకములలోని "విధి బలీయము"

అను ధ్వని యిబ్సన్ నాటకములలో "వంశపారంపర్యాగత మానసిక శారీరక గుణావగుణము"ల బలముగా మాఱినది. ఈవిధముగ౯ . ప్రాణవంతమైన మానవసంఘముయొక్క మార్పులననుసరించి శిల్పతత్త్వ నిర్ణయమునందును భేదములు తలయెత్తుచుండగా ఈ రహస్యమును గుర్తింపలేక, విత్తనము నుండి చెట్టు మొలచినను వేళ్ళకు నంటుకొని నిరుపయోగ మయి క్రుళ్లిపోవుచున్న ప్రాఁత బొఱియలను పట్టుకొని వ్రేలాడు రసలుబ్ధుల సంకుచితస్వభావము అనుకంపనీయము కదా!

ఇట్లనుట మన పూర్వికుల లక్షణ గ్రంథములనెల్లఁ ద్రోసిపుచ్చుట కాదు. వారి శక్తిసామర్థ్యములను గుర్తెఱుఁగక పోవుట కాదు. అనితరసాధ్యములగు వారిసిద్ధులను విస్మరించుట కాదు. వారి కీర్తికి భంగము కలిగింపవలయునను తలంపును కాదు. అట్లుచేయుట మన కాలి క్రిందికొమ్మను మనమే నఱకు కొనఁజూచుటయె. నేఁజెప్పవచ్చినది ఏమనఁగా: ఎవ్వరును—అందువలననే మన పూర్వికులును సర్వజ్ఞులు కారు. ఎప్పుడో వేయిసంవత్సరములకు జరుగఁబోవుమార్పులను ముందే యూహించి వానికెల్ల లక్షణములు వ్రాయుట మనుజులకు సాధ్యముకాదు. అందుకయి పూర్వులపయి ధ్వజమెత్తవలసిన యవసరమునులేదు. కాని, మనకులేనివి యితరులవలన గ్రహించినఁదప్పేమి? మనవిజ్ఞానమంతయుమనసొంతము దేనా? ఎన్నిజాతులు హిందూదేశముపై దాడివెడలినవి? ఎన్నివిధము లైన నాగరకతలతో మనకు సంబంధము కలిగినది? ఇట్టిసాంగత్యమువలన మనజాతియందును, విజ్ఞానమునందును, మార్పులు

కలుగ లేదా? ఇది క్రొత్తయా? కులము చెడుటకు రసలు బ్ధుడు ఇప్పుడు ఉలుక నేల! ప్రాఁతవానిపై గౌరవము క్రొత్త వానిపై ద్వేషముగ మాఱకూడదు. సనాతన లాక్షణికుల యజ్ఞవేదికల కడ ఆధునిక కవికుమారుల సృష్టులను బలి యీయరాదు. సృష్టికిఁ క్రొత్తప్రాఁతలు లేవు. అది యెప్పటి కిని అభినవమే.

III

నాటకము రచింపఁ దలఁచుకొన్నపుడు, కవి భావము నందు ముఖ్యపాత్రలు పొడకట్టి భావింపను భావింపను ప్రస్ఫుటములగును. వానిచుట్టును, అయస్కాంతముకడకు ఇనుప ముక్కలు పరుగెత్తునట్లుఁ దక్కినపాత్రలు మూఁగుదురు. ఈభావ ప్రసూనములు ప్రాణవంతములై యథార్థములట్లు తోఁచును. ఈరూపమున నాటకము బహిరాకృతి దాల్చఁబోవు నప్పటి యాలోచనమును, మనో నిర్భరత్వమును, సృష్టిప్రేరకములగుచు— ఆ సృష్టికి ఆదిమధ్యాంతములు గలవు. అది యవయవ సమన్వితమైన యాకృతి. అందు అవయవములకు అనురూప సౌష్ఠవము సహజముగఁ బొసఁగియుండును.

నాటక స్వరూపము "గోపుచ్ఛాకృతి" అని పూర్వులు నిర్వచించియున్నారు. నాటక వస్తువు ఏదియైన నొక స్పర్ధను (conflict) ఆశ్రయించుకొని యుండును. ప్రాణికిని విధికిని, వ్యక్తికిని సంఘమునకును, మంచితనమునకును చెడ్డతనము నకును, భిన్న సంకల్పములు గల మనుష్యులకును, భిన్న మత ములకును స్పర్ధ పుట్టినపుడు దాని యుత్పత్త్యున్మీలనోపసంహార ములే నాటకరూపమును ధరించును. ఈ పరస్పరస్పర్ధ విషాదాంత నాటకములయందు మఱింత వ్యక్తమగుచుండును.

ట్రాజెడీ లక్షణములను గొన్నిటిని వివరించి యాలక్షణములకు మీరానాటక మెంతవఱకు సరిపోవునో చూతము: కథానాయకుఁడు రాజుగాఁగాని లేక యంతటి గొప్పవాఁడుగాఁగాని యుండువలయును. ఇట్లనుట సర్వజనీనత సంపాదించుట కొఱకు. రాజు దురవస్థయు, మరణమును రాష్ట్రమునకెల్ల సంబంధించి యుండును. కావున అట్టి నాయకుని యధఃపతనముఁ జూచినపుడు మనకును సహానుభూతి కలుగును. నాయకునకు ధీరత్వము, ఉదాత్తత, దృఢ సంకల్పశక్తి, మానవ సహజము లగు గుణదోషములును ఉండవలయును. నాయకుఁడు సకల సద్గుణ సముపేతుఁడగా నుండెనేని మనకు జాలిపుట్టదు, వికర్షణము కలుగును. నాయకుఁడనుభవించు దుఃఖమునకు ఆతఁడును గొంతవఱకు బాధ్యుఁడను సూచన లేనిదె మనము సహించియుండలేము. ఎట్టి కొఱంతయు లేనట్లు నాయకుని శీలము చిత్రించుట నీతిమంతులకు గుణమైనను, శిల్పులకు అది అవగుణమనియె నామనవి. ముఖ్యముగ వధాంత నాటకముల లోని నాయకునకు ఏవైన కొన్ని గుణలోపములు లేనియెడల దురవస్థ సంభవింపదు; నాయకుని పూర్వసుఖస్థితిని బ్రదర్శింపవలయును, లేక, సూచింపవలయును. ఉత్తరోత్తరము సంభవించు దురవస్థకును మున్నటి సౌఖ్యమునకుఁ గల తారతమ్యము వలన నాయకుని కష్టపాటు మఱింత నిశితముగ మన మనస్సున నంకితమగును. ఈ వధాంత నాటక ప్రపంచమున నాయకుని యుద్దేశములు, కోర్కెలు, కార్యరూపమునఁ బరిణమించునపుడు విరుద్ధ ఫలప్రదములగును. "తానొకటి తలఁచిన దైవ మొకటితలఁచె" నను నానుడి యీనాయకుని యెడ

ముఖ్యముగ వర్తించును. తనకుగలుగు దురవస్థ ఆకస్మికముగ వచ్చును, కాని అందులోఁ దనకును గొంత బాధ్యతగలదు. నాయకునికిఁ గలుగు కష్టపరంపర వానిచేష్టలనుబట్టి అనివార్యముగను, ఒక్కొక్కప్పుడు విధి ప్రేరితమైనట్లును స్ఫురించును. ఉఱ్ఱూఁతలూఁచు సుడిగాలిలో గిరికీలుగొట్టు ఎండుటాకువలెఁ, దన్నేశక్తి ఆకర్షించుచున్నదో కనుఁగొనలేక, మనస్సులోని భావోద్వేగమును, బయట సంఘటనముల యుద్వేగమును ఏకమై ప్రవహింప, అందు చుక్కానిలేని నావికునివలె నాయకుఁడు పయనించి యెట్టకేలకు దుర్మరణము నొందును.

నాయకుఁడు తాను జేయుపని దుష్టమని విశ్వసించెనేని న్యాయమార్గ మవలంబించినట్లు నటింపఁడు; తాను పొరపాటుపడినను, దానిని పొరపాటని తెలిసికొనఁజాలక, న్యాయముకొఱకు, ధర్మముకొఱకుఁ బాటుపడుచున్నానను దృఢవిశ్వాసముతో దురవస్థకుఁ బాల్పడును. కావుననే మనకు జాలిగలుగును. ఒకేదృష్టియందుఁ బక్షపాతము, ఒకే మార్గమునందుఁ బట్టుదలయు నతనికి సహజము. ఇందేదియుఁ గార్యకారణ సంబంధమునకు వెలియై యుండదు. నాయకునకు సంభవించు కష్టములు దైవదత్తములుగావు; మానవచేష్టాజనితములు. నాయకుని యధఃపతనము, అతని దుష్టత్వము వలన కలుగునది కాదు; పొరపాటువలననో తొందరపాటు వలననో కలుగును. గొప్ప గుణములతోఁబాటు అజాగరూకతయు, కొన్నిటియందు అజ్ఞానమును, గర్వమును, ఉద్రిక్తభావమును, సంశయమును ఈ నాయకున కుండును. కావుననే

యొక యింగ్లీషు విమర్శకుఁడు షేక్స్పియరు ట్రాజెడీలలోని నాయికా నాయకులను గుఱించి యిట్లు చెప్పెను.—

"Hamlet, the "religious" and the lover, doomed to set the world aright; Othello, stupid and nnintellectual fiery in his passions, set opposite to Iago; Iago, unscrupulous and clever; literally tempted by Othello's imbecility; Lear conceited and proud, unobservant and credulous, faced by his evil daughters and Cordelia; Macbeth, emotional and weak, yet ambitious, met by the witches, and goaded on by his wife; Lady Macbeth hard and self seeking, confronted by temptation; Coriolanus over weening in his pride condemned to stoop to plebians; Antony, amorous and doting met by Cleopatra; all of these are placed in the exact situation which they are incapable of mastering"

నాయికా నాయకులలోని యిట్టి గుణాలోపములవలననే ట్రాజెడి సంభవించును.

"మఱియు యీ చావు నాటకముల మార్గమున మీరా నరయుదుమేని" అని రసలుబ్ధుని వ్యంగ్యచమత్కారము! "కుంభుని యుదాత్తత తటాలున ఉపస్థితముకాదు. నిపుణముగ చూచినను కాదు. ఎంత గొప్పవాఁడురా అని సూక్ష్మమైనను సూటియైన సూచన వినంబడదు. అభిమాని, విషయలోలుఁడు, ఉద్ధతుఁడు, మొండికట్టె, జాల్ముఁడు, అని గ్రహింపఁబడుచుండును. ఎంత పదోచ్ఛ్రితుఁడో అంత గుణోచ్ఛ్రితుఁడు. చిత్తమునం బాదుకొనని వాని పతనము ఏపాటి యుపదేశపటువు?" అని దోషారోపణము. ఈ రసలుబ్ధుఁడు

“ఉపపత్త్యుపన్యాసపూర్వకముగ వాగారంభముం బొర
యించు” వాఁడయ్యు నెకారణముం జూపక యిట నిట్లు
వాగారంభముం బొరయించుటఁ దనతర్కమునందే తనకుఁ
బ్రత్యయము చాలమిని సూచించుచున్నది.

రాణా హేతువాది (Rationalist) గా నగపడు
చున్నాఁడు. అతని యభిప్రాయములు కొన్ని హిందూమత
విరుద్ధములు. ఆతనికి స్వర్గనరకములయందు నమ్మకములేదు.
ప్రజలను భయపెట్టి ధర్మమాచరింపఁజేయుట కొఱకును,
బరలోక సుఖముపై నాసపెట్టుకొని యిహలోక కష్టములను
సహించియుండుటకును, నరకము స్వర్గము పౌరాణికులు
సృజించిన గాలిమేడలని ఆతని నమ్మకము. ఊహామాత్ర
మైన పాలసముద్రమునునమ్మి చేతిలోని పాయసపుఁ బాత్ర
జాఱవిడువఁడు. యౌవన సౌందర్యములెట్లు కాలబద్ధములో
మానవుని భోగాభిలాషకూడ నట్లే యనియు ఆకామ్యాను
రాగమె అనుభుక్తమయి వార్ధక్యమునందుఁ దప్తకాంచనము
వలె నిష్కల్మషమయి బహుకాల సహవాస జనిత బాంధ
వ్యముగ మాఱుననియుఁ దలంచుకొని సామాన్యగృహస్థ
ధర్మములను కుంభుఁడు ఆచరించుచుండెను. కపటగురువులు
లోకమును మోసగించు చున్నారనియు, వారి పలుకుబడి
సన్నగిల్లిననేగాని లోకులకు మూఢభక్తి నశింపదనియు
నాతఁడు తలంచెను. లోకాతీత ధర్మములు కుక్కమూతి
పిందియలని యాతని భావము. వైదిక మతమునకు విరుద్ధ
ములైన మతములు లేవదీసిన ఆచార్యులందఱు అవివేకులు
కారు, అవి వారి మతి విశ్వాసములు?

రాణా పౌరుషవంతుఁడు : మొగలాయీలు హిందూ రాజ్యమును ధ్వంసముచేయ నుద్యుక్తులైనపుడు వారికిఁ బ్రతిస్పర్ధిగనిల్చి రసపుత్ర గౌరవమును నిల్పిన మహా యోధుఁడు; మాన సింహాదులవంటి కొందఱు రసపుత్రులు అగ్బరునకు లోఁబడి చుట్టఱికములు కల్పించుకొని గులా ములైయుండ తానొక్కఁడే యగ్బరును ధిక్కరించెను. పౌరుషమునందును వీరత్వమునందును గొప్పతనము లేదా ? రాణా అగ్బరునకుఁ బ్రబల ద్వేషి. అతని నామము నుచ్చ రించుట గూడఁ దనరాజ్యమున అపరాధము. అగ్బరు హిందూమత పక్షపాతమను ఆచ్ఛాదనము మఱుగునఁ దాఁగి మెల్ల మెల్లగ హిందూరాజ్యములఁ గబళించు చున్నాఁడు; ఆతని రాజనీతి అతలస్పర్శి అని రాణా యెఱుంగును. కావుననే అతనిపై రాణాకు ద్వేషము. ఇది క్షత్రియ సహజము, వారు సన్న్యాసులు కారుగదా!

రాణా సంస్కరణాభిలాషి: ప్రజల మనస్సులే కాదు పాలనాయంత్రముకూడ సంస్కరింపఁ బడవలయును అని తలంచెను. లౌకిక విజ్ఞానమును, జీవితమును ద్వేషింపఁజేయు ప్రతిమతమును మానవుని మనోవికాసమునకు అంతరాయ మనియు, అట్టి సంకుచిత మతములను దనరాజ్యమున సమ్మా ర్జింప వలయుననియుఁ గుంభుని అభిప్రాయమును సంకల్ప మునై యుండెను. కాని, కాలము ప్రతికూలము, పాపము! ఈ సంస్కర్తలు ఎప్పటికిని 'Tragic hero' పాత్రములుగానే పరిణమించుచుందురు. ఏసుక్రీస్తు మతమును సంస్కరింపఁ బోయి "సిలువ" పైఁ బ్రాణములు విడిచెను. అమానుల్లా

సంఘమును సంస్కరింపఁబోయి రాజ్యభ్రష్టుఁడాయెను. ఇట్టి వీరి పతనమునందును గొప్పతనము గలదు!

రాణా మేవాడు రాజ్యాధిపతి యయ్యు సర్వసులభుఁడు. తలారి దర్శనము కోరినపుడు మంత్రులాటంక పెట్టినను "నా దర్శనముఁ గోరిన వారినెవ్వరిని ఆటంకపెట్టకుఁడు. నాకంతకంటె నుత్తమ కార్యమేమున్నది", అని వారిని మందలించి తన విధిపర్వతమును స్ఫురింపఁజేసెను.

రాణా ధీరుఁడు: న్యాయైక పక్షపాతి. "నిజమెఱింగిన వెనుక నా కర్తవ్యమును అనుకూలముగ మఱచు నంతటి భీరువును గాను; స్వార్థపరుఁడను గాను. నా సంకల్పము న్యాయ్యము. నా న్యాయ్యసంకల్పము శాసనము. నా శాసనము పొల్లుపోక కొనసాగి తీఱవలయును" అను వీరుని దృఢ నిశ్చయమున గొప్పతనము లేదా?

రాణా అభిమాని. అభిమానము దాసునియందు అవగుణముగ నుండవచ్చును; రాజునందు అది గుణమె యగును.

రాణా ఉద్ధతుఁడు. అవును. తప్పేమి? అగ్బరునంతటి వానిని యెదిరించి మొగలాయి ప్రభువులకు గుండెగాలమయి శిశోదియా వంశకీర్తి దిగంత విశ్రాంతము గావించిన కుంభ రాణాయందు గర్వము అస్థానికముగాదు. ఉచితమే.

రాణా విషయలోలుఁడా? సంస్కృత నాటకముల లోని నాయకులతో సరిపోల్చి చూచిన, వారికంటె రాణా విషయలోలుఁడు కాఁడు; వారికంటె నెల్లవిధముల

నుత్తముఁడు. వేఁటకుగాఁ దపోవనమునకుఁబోయి, బ్రాహ్మణ
ఋషియైన కణ్వుని యాశ్రమమున అపూర్వ లావణ్యవతిని
శకుంతలను జూచి కామప్రేరితుఁడై తండ్రి యనుమతిలేక
ఆమెను (అంతఃపురము దేవేరులచే నిండియున్నను) గాంధర్వ
విధిఁ బరిణయమాడి గర్భవతినిఁ జేసి, ఆర్యమైన మనసు ఉచిత
మైన దానినే కోరినదని తన తప్పును దుడిచివేసికొని, ధర్మ
ప్రకారము పట్టమహిషి కుమారునకే రాజ్యము చెందవలసి
యుండఁగా, మోహాంధీకృత చిత్తుఁడయి శకుంతల కుమారు
నకే రాజ్యము నొసఁగునట్లు వాగ్దానముచేసి, పరార్థియైన
దుష్యంతుఁడు విషయలోలుఁడు కాకుండుటెట్లు? ఏకపత్నీ
వ్రతుఁడయి, విరాగిణియైన తన భార్యను ఏయుపాయము చేత
నైనను దనవంకకుఁ ద్రిప్పుకొని పూర్వమువలె గార్హస్థ్య
జీవితము గడుపుకొన ప్రయత్నించిన రాణా విషయలోలుఁ
డగుటెట్లు? రాణా పరస్త్రీ పరాఙ్ముఖుఁ డైనందుననేగదా
మీరాకొఱకంత పాటుపడెను. గృహస్థులకుఁ దమ భార్య
లతో సంసారము చేయవలయునను కోర్కె విషయలోలత్వ
మైన యెడల ఇఁక గార్హస్థ్యము గతి యేమి యగును?

రాణా మొండికట్టెయా? కాఁడు; తనకు యథార్థమని
తోఁచినదానిని నిర్వహించుకొను పట్టుదలయు సంకల్ప
శక్తియుఁగల తేజశ్శాలి.

రాణా జాల్ముఁడా? జాల్ముఁడనుటకు మూడర్థములు
గలవు: యోచించి పనిచేయలేనివాఁడు. క్రూరుఁడు. అజ్ఞుఁడు.
అజ్ఞత యేదో యొకవిషయమునందు; అది తాత్కాలికము.
క్రూరత్వము కడపటి దశయందు వచ్చును; అదియుఁ దాత్కా

లిక మే, స్వభావముకాదు. తాను జేయు ప్రతికార్యము నిశ్చల మును నిర్వికారమునగు మనస్సుతో యోచించి చేయునేని 'ట్రాజెడీ' అసంభవము. ఈర్ష్యాగ్రస్తుని చిత్తము యోగి మనస్సువలె నిర్వికారముగ నుండదు. ఆ సమయమున నెట్టి వానికిని బుద్ధి మందగించును. బంగారు జింక లోకమున నుండునా యుండదా అను వివేచనముకూడ లేదాయెఁగదా రామునకు? రాక్షసుల మాయా తంత్రములు ఆయన యెఱుఁ గనివి కావు. రాముఁడా జింకనేల తరుముకొని పోవలయును? మొట్టమొదటినుండియు సీత లక్ష్మణుని భక్తివిశ్వాసముల నెఱుంగునుగదా! అతనిని శంకించి సీత యేల కర్ణకఠోరముగ దూషింపవలయును? అంతమాత్రము తెలియదా? వారిరువురు "నిశ్చలముగ నిర్వికారముగ" యోచించుకొని చరించి యుండిన సీత రావణాపహృతయై యుండదుగదా, దీనికి సమాధానమేమి? కాలము కానియపుడు ఎట్టివారికైనను బుద్ధిమాంద్యము కలుగును—అట్లనుటచేత వారు స్వాభావిక ముగ మందబుద్ధులని చెప్పుటకు వీలుకలదా?

రాణా యధఃపతనమునకు హేతువులైన స్ఖాలిత్యము లేవి?—అతిలోక మనస్తత్వమును గుర్తెఱుఁగలేని యజ్ఞానము, పౌరాణిక మతమునెడ సహానుభూతి లేకయుండుట, భావ ప్రకోపము, సంశయశీలత, అభిమానము, తొందరపాటు, అగ్బరుపైని ప్రబలద్వేషము, నిశ్చలన్యాయైకనిరతి, దృఢ సంకల్పము. వీనిలోఁ గొన్నిగాని అన్నియుంగాని కొఱఁతపడి యుండిన కుంభ రాణా జీవితము మఱియొక తీరుగా నుండి యుండెడిది.

IV

"ఆ మీరాదేవి సౌజన్య సతీత్వములు ఇతర స్త్రీజన విలక్షణములు; పతిదేవత కాకున్నను మీర కృష్ణైక నిరత చిత్త; మీర మహిమ యిల్లుదాటి ఊరుదాటి హిమశైల నలసేతువులందు విశ్రమించినది...మీర పాట భూలోక దుర్లభము...పతియెడ ఆమె కావించిన యుపచారము కాన రాదు. అట్టి తేజోమూర్తియందుఁ దొలుత అపరాగ శంకయుఁ దరువాత (కృష్ణగతమునందె) అన్యరాగశంకయు వహించి హిందువు, వివేకి, రాజు, ఉపశ్రుతి కులికినవాఁడు ఆస్తికుఁడు కానేకాఁడా? ఆమె సర్వముచేతను బవిత్రీకరింపఁబడిన భావముల నడుమ నుండువాఁడయ్యు కుంభుఁడు భ్రాంతిచెంది ఈర్ష్యపొంది ... దాని నిముడ్చుకొనఁజాలక ... అమాత్యులును బ్రజలును బెడిసిపోగా...మీరను ఆ చావునకు పాత్రీకరించెను. తరువాత ఒక యలంకారపేరఁచే కానునుం జచ్చెను— ఇదేమి ట్రాజెడి! దీన నేమి యుపదేశము? నాస్తిక పితయు ఆస్తిక పుత్రుఁడు హిరణ్య ప్రహ్లాదులు...మఱి పతియు పత్నియు మీరా కుంభులు...ప్రజామాత్య కింకరాది సర్వ జనాంగీకారానంగీకారములు వినంబడుచు పదరసిక విమర్శకు ఎడ మిచ్చుచునే యుండగా అట్లు చంపను చావను అంత అననురూపులా? అసంభావ్య వస్తువు చిత్తమున కెక్కదు." అని రసలుబ్ధుని వాదధోరణి. దీని నుండి కొన్ని సిద్ధాంతములు ప్రశ్నలు విడఁదీయవచ్చును.

మీరా భక్తురాలు; కృష్ణధ్యానపరాయణ. రాజు హిందువు, వివేకి; (ఇంతకుముందు జాల్మ్రుఁడని నిందించియుం

డెను) పవిత్రభావముల మధ్యనుండినవాఁడు ఆ స్థితిఁకెట్లు కాక యుండును? అట్టివాఁడు మీరాకు అట్టిచావు ఎట్లువిధించును? అట్టిసతిపై శంకయెట్లు కలుగును? ట్రాజెడి సంభవించుటకు కులభేదము, మతభేద ముండవయును. ఏడెనిమిది సంవత్సరములు సుఖజీవనము చేయుచుండిన భార్యాభర్తల నడుమ ట్రాజెడి పుట్టదు. రాణా నెమ్మదిగ నాలోచించుకొని తన భ్రాంతిని తొలగించుకొని యుండవలయును. అట్లు జరుగలేదు కావున ఇది అసంభావ్య వస్తువు, కావుననే ఈవస్తువు రసలుబ్ధునిచిత్తమున కెక్కలేదు!

రసలుబ్ధుఁడు మీరాను ఆటఁజూచు సామాజికుల దృష్టితోఁ జూచుచున్నాఁడేగాని కుంభరాణా దృష్టితోఁ జూచుటలేదు. ఇదిగొప్ప పొరపాటు. ఈ పొరయే రసలుబ్ధునిఁ 'ట్రాజెడీ'కి హేతువైనది. రాణాకు మీరా ఎట్లగపడును? ఆతని మనస్తత్త్వమేమి? అని విచారింపవలదా? పాండవులు, భీష్ముదు, విదురుఁడును శ్రీకృష్ణుని దైవస్వరూపమని తలంచినను, రాజబంధువు బంధించుటకుఁ దగినఁవాడు అనియే గదా దుర్యోధనుఁడు తలంచెను. వేనవేలు సంవత్సరములు ఘోర తపమాచరించి చావులేని వరముఁగొన్న హిరణ్యకశిపుఁడు పరమభక్తుఁడైన ప్రహ్లాదుని భక్తిప్రభావము నడుమనుండియు ఏల విష్ణుభక్తుఁడుగ మారలేదు? ఎవరి ప్రభావము నడుమనుండి విభీషణుఁడు రామభక్తుఁడాయెను? అదివారివారి మనస్తత్త్వములఁ బట్టియుండును హిందువుల కుటుంబములలోఁబుట్టినయందఱును ఆస్తికులు కావలయునను నియతియున్నదా? మతము వంశపారంపర్యాగతమగు ఆస్తి

వలె వారసులకు లభించునదిగాదు. అది వ్యక్తుల చిత్తసంస్కారముల ననుసరించి భిన్నభిన్నముగ నుండును. మీరా పరమ భక్తురాలని ప్రజలు అమాత్యులు తలంచిరి. రాణా మాత్రము "మతావేశము కూడ నొక మానసిక వ్యాధి" యని తలంచెను. 'Modern Psychology' 'Abnormal Psychology' అను మనస్తత్వశాస్త్ర గ్రంథములఁ జదువువారు మేని రాణా నిశ్చయమునకు హేతువులు కలవని తెలియకపోదు—మన మతాభిప్రాయములకును రాణా అభిప్రాయములకును భేదము కలిగినంత మాత్రమున నాటకమును నిందింపఁదగదు— నాటకమున నాయకుని కవి యెట్లు చిత్రించెనని మాత్రమే విచారింపవలయును.

ఈ సందర్భమున T. G. Wainewright గారి యభిప్రాయ మెంతయు సమంజసముగ నున్నది: "I hold that no work of art can be tried otherwise than by laws deduced form itself: whether or not it be consistent with itself is the question."

మీరారాణాలకు రసలుబ్ధుఁడు కోరిన మతభేదమును గలదు. కాని ఆమత భేదమే ఈ నాటకమున ట్రాజెడీకిమూల కారణము కాదు. అది ట్రాజెడీ బీజములు; సులువుగా నంకురించి వృద్ధిచెందుటకు దగిన ద్వేషమును బుట్టించి అనుకూల పరిస్థితుల సంపాదించినది. ఏడెనిమిదేండ్లు సుఖజీవనముసలిపి అన్యోన్యము మనసు కలసియుండిన భార్యాభర్తల మధ్య 'ట్రాజెడీ' సంభవించిననే అది మఱింత ఘోరముగ నుండును. మీరా యందు సద్గుణములేకాక యామె చరమదశకుఁ గారణమైన గుణలోపములుఁకూడఁ గొన్నికలవు. వాని ఫలిత

మేమి? అవి కుంభునెట్లు సంక్షోభపెట్టినవి? అనువిషయములే మనకుఁ జర్చనీయాంశములు. అతిలోక మతావేశము, నిశ్చల వైరాగ్యముగల కులకాంత సామాన్యగృహస్థుల కుటుంబములో ఇముడదు. పతి యిష్టానుసారము వర్తింపకుండుట, గృహకృత్యములందు నిరాదరణము, పతి హృదయమును తన మాటలు ఎట్లు నొప్పించునో దెలిసికొన నేరక తాను విన్న సంగతి దాఁపరికము లేక మాటలాడు అమాయకత్వము, విషయ పరాఙ్ముఖతచే అజ్ఞాతముగ నలవడిన తృణీకరణ భావము, మీరాశీలములోని రంధ్రములు. మీరామాటలు కొన్ని సామాన్య ధర్మ ప్రవచనములుగ నుద్దిష్టములయ్యును శాప ప్రాయములుగ నగపట్టును. ఈసంగతి మీరా యెఱుంగదు. బేడిసను గుఱించి చెప్పినపుడు ‘‘మీనరాజ, విధి యదృశ్యహస్తము వెనువెంట నంటి మృత్యుపదములకడకు నిన్నీడ్చు నయ్యో!’ అనియు మఱియొకచోట ‘‘పాలనా దండశక్తి నశ్వరమటన్న పిడుగువంటి సత్యంబును వినెదవెపుడో’’ అనియు మీరా యన్నపుడు రాణా ఏవిధముగ నర్థము చేసికొనును?

రాణా పదరక యేల ఆలోచింప లేదు అను ప్రశ్న అవిచార మూలకము. కొందఱు విమర్శకులు రాణాను ఒథెల్లోతో సరిపోల్చిరి. పాత్రపోషణమునందుఁ జూపట్టు ఇతర భేదము లేకాక వారిరువురకు ఈక్రింది భేదము కలదు: ఒథెల్లో యేమాత్రము విచారించినను ట్రాజెడి జరిగియుండదు. ప్లాటును కూలిపోయియుండును. డెస్ డెమోనాను ఒథెల్లో సంశయించుచుండెనే గాని అయాగోను ఒక్క క్షణమైన సంశయింప లేదు. ‘‘కాసియోకు నేను చేతిగుడ్డను ఈయ లేదు—విచారింపుము’’

అని భార్య చెప్పినను ఒథెల్లో విచారింపలేదు. అట్లు విచా రించిన అయాగో కుట్ర బయటబడును; డెస్‌డెమోనా చావదు. ఈనాటకమున అట్లుగాదు. రాణా విచారించెను. విచారించుకొలంది ఆతని సందేహము బలమగుచుండెను. ప్రత్యక్ష సాక్ష్యము దొరకినది. దానిని రాణా దృఢముగ నమ్మెను. అతఁడు న్యాయాధిపతివలె "నిష్పక్షపాతముగ" విచారించుచున్నానని యనుకొనెనేగాని సాక్ష్యమును మానేర్ష్యాసంక్షుబ్ధ చిత్తుఁడగు భర్తవలెఁ దనముక్కునకు సూటిగ సమన్వయము చేసికొనుచుండెను. మొగలాయి, అందులోఁ దనకుఁ బ్రబలవిరోధి, తనయంతఃపురము జొచ్చి రాజపుత్ర కులమునకె కళంకముఁ దెచ్చెను. మానవంతుఁడగు క్షత్త్రియుని చిత్తమెట్లుండును? పదరక యోచించుటకుఁ దగియుండునా? ఇది భ్రాంతిగాదాయని యనఁగనేమొ. అది భ్రాంతియని తెలిసినది యితరులకు. రాణా యథార్థమనియే గదా నమ్మియుండెను. అట్లయ్యు సహజముగ సంశయశీలుఁడు గాన తన్నుఁదానె శంకించుకొనెను. 'అందఱు వెడలిపోయిరి' అని కుమారసింహుఁడు చెప్పినపుడు "అమాత్యులు, ప్రజలు, సైనికులు, మీరాసతీత్వమును సంశయింపరు. నేనేమైనఁ బొరపడితినా?" అని యొక్కింత ఆలోచించును. తత్క్షణమె అక్బరు అంతఃపురమునుజొచ్చెనన్న స్మృతి ఆతని భావవీథినిఁ బిశాచనృత్యము గావించును. మనస్సులో సుడిగాలి రేఁగును; వేయి అగ్నిపర్వతములు ఒక్కుమ్మడి ప్రేలి యగ్నితప్త పాషాణద్రవమును బైకెగఁజిమ్మును. క్రోధానల జ్వాలలు ఊర్పులై బయటికి వెడలును; ఇఁక రాణా యెవ్వరి యభి

ప్రాయములను సరకుగొనఁడు "న్యాయమని తోఁచిన యెడలఁ బ్రపంచమునకుఁ బ్రతిస్పర్ధిగనైన నిలువగలను" అని గర్జించును. ఇట్టి మూర్తిని మనము భావించుకొనఁగలుగుదుమేని "passion rising to tragic grandness" అనువర నమునకు నుదాహరణప్రాయముగా నుండదా? మనసులో నిట్టివిప్లవము చెలరేఁగుచుండఁగాఁ రాణా "పదరక" యోచించుటకు అతఁడేమి జీవన్ముక్తికి యత్నించుచున్న యోగియా?

"ప్రహ్లాద భృగుపతన గరళ పానాదులంబోలె నే సౌజన్యము ఇట్లు పీడింపఁబడుచున్నదను జాలి కలుగక దౌర్జన్యము ఎట్లు భంగపడునో చూతము అను కుతూహలము వినోదము కలుగుచుండును. ఇదే అతిమానుష సంభావమునకు ఫలము! ఇందేమి ట్రాజెడి!......రాత్రి పడుకింట ఏకాంతమున కంఠమున తదాలింగనము ఎదురు సూచుచున్నట్టిది, అకాండముగ ఆకంఠమె ఆచేతనే నులుమంబడి చచ్చుట! అదిట్రాజెడి!" అనిరసలుబ్ధుఁడు డెస్ డెమోనాబాయిని స్మరించినాఁడు! మీరాబాయిపాత్రపోషణమునందు అమానుషత్వము లేదు. ఆమె పరమ భక్తురాలు; కృష్ణధ్యాన పరాయణ; గాన కుశల, అయినను అట్లుండుట యమానుషముగాదు. ఆమె మహిమలు (miracles) చూపింపలేదు. ప్రహ్లాదుఁడు ఏనుఁగులచేఁ ద్రొక్కింపఁబడియు, గొండచరులనుండి క్రిందికిఁద్రోయబడియు, విషమిప్పింపఁబడియుఁ జావలేదు. ఇదిగదా యమానుషత్వము! మీరాబాయి ప్రహ్లాదునివలె మత్యువును జయింపలేదు. ఆమెయందు మానవ సహజములగు కొన్ని లోపములును గలవు. అవి యింతకు ముందే ప్రస్తావింపఁ బడినవి.

డెస్ డెమోనా వధ అట్లు చూపింపఁ బడవలయునా లేదా అనువిషయమును గుఱించి ఆంగ్లేయ విమర్శకులలోనే భిన్నాభిప్రాయములు గలవు.

"To some readers again, Parts of Othello appear shocking or horrible. They think ..that in these parts Shakespeare has sinned against cannons of art, by representing on the stage a violence or brutality the effect of which is unnecessarily painful and rather sensational than tragic."

ఇట్టి విషయములందు సామాజికుల మనస్తత్వముల ననుసరించి భిన్నాభిప్రాయములు పొడసూపుచుండును.

"పురుషేర్ష్యాకారణమును" రచ్చకెక్కించి మంత్రుల యెదుట విచారించుట మందమనియు, ఇందు రహస్యముండ వలయుననియు మఱియొక యాక్షేపము. కుంభరాణా మంత్రులను బిలిపించినది పురుషేర్ష్యాకారణమును విచారించుటకు గాదు. అమూల్యమైన వజ్రహారము తన యంతఃపురదాసి సుశీల ధరించుకొనియున్నదను సంగతివిని, బలవంతరావు వలన కొన్నిసంగతులు తెలియఁగా, ఆ విషయములను విచారించుటకు మంత్రులను రావించెను. ఆవిచారణయందు వైద్యుల వృత్తాంతమును ఆ వైద్యులలో నొకఁడు అగ్బరగుటయుఁ దెలియవచ్చెను. పురుషేర్ష్యాకారణము రహస్యముగ నుండుటకు వీలులేదు. రాణా ఈర్ష్యాగ్రస్తుఁడగు భర్తయేగాదు; న్యాయాధిపతికూడ. ఈరెంటికింగల భేదమును గ్రహించుట వలననే రాణాగొప్పతనమును ధర్మబుద్ధియు గోచరించుచున్నవి. ఏదో యొకనాటకమును దీసికొని దానికిని ఈనాటక

మునకును సాదృశ్యము కల్పించి 'అందుండినట్లే యిందేల యుండలేదు' అని ప్రశ్నించుట కూడ ఒకవిమర్శన చమత్కృతికాంబోలు!

అగ్బరు తాన్‌సేనుల సంభాషణము మెట్టవేదాంతము కాదు—అసంభాషణమూలమున మనకు వారి మన స్తత్త్వము చక్కగస్ఫురించును ఇట్టిభాగములుచదువునప్పుడుఇంపుగనే యుండును. కాని ప్రదర్శన పరముగఁ జూచినపుఁడు, కార్య ప్రచలనము లేనందువలన, కొంత (విసువు) monotony గోచరించును. కవి యీ "సీనును" కొంత సంస్కరించిన బాగుగ నుండుననియే నాయాశయమును.

V

"కొన్నియసంభవములు" అనుశీర్షికక్రింద పదునేఁడు అసంభవములను మీరా నాటకమునందు రసలుబ్ధుఁడు చూపించెను. ఈ యసంభవములను గుఱించి కొంత తెలిసికొనవలయును. నాటకమును గొందఱు "ప్రతిసరంబునఁ దన్మయ భావమొంది" చదువుదురు. అట్టి పఠితలు, ఆటచూచునప్పుడు ఎట్టి యానందముంబొందుదురో అట్టి యానందమునే చదువునప్పుడును పొందుదురు, కొందఱు దోషనిరూపణము కొఱకే చదువుదురు. ఇట్లు చదువువారికి అసంభవములని తోఁచినవి ఆటచూచు వారికిగాని, మొదటివిధమునఁ జదివిన వారికిఁగాని తోఁపవు. నాటకముఁ జదువునపుడు కొన్ని సంభవములుగఁ దోఁచినవి ప్రదర్శింపఁబడినపుడు అసంభవములుగ నగపడును. ఉదాహరణము: ఉత్తరరామచరితమున, దండ

కాటవియందు రాముండు సీతను స్మరించుకొని దుఃఖించు ఘట్టమున, వనదేవతల ప్రభావముచే అదృశ్యమానయగు సీత రాముని ప్రక్క నిలఁబడియుండును. ఈ భాగముఁ జదువు నపుడు అసంభవ మేమియు గోచరింపదు...ఏలయన సీత అదృశ్యగానున్నదని యనుకొనుటకు మనభావము ఉపకరించును. కాని, యీఘట్టము ప్రదర్శింపఁబడినపుడు, సీత యగపడు చుండఁగా అగపడ లేదని భావించి మన కన్నులను వంచించు కొనఁజూచుట యసాధ్యము.

వ్యవహార సిద్ధమైన ప్రపంచము వేఱు; నాటక ప్రపంచము వేఱు; ఒకదానిని వేఱొక దాని దృష్టితో విమర్శించుట— ఉభయము నెఱుంగమికిఁ దార్కాణము. కొన్ని దినములు, నెలలు, సంవత్సరములలో జరిగిన విషయము మూఁడు నాలుగుగంటలలోఁ బ్రదర్శింపఁబడవలసిన రూపకముగ నిర్మితమగుటచేతఁ గొన్నిసమయములను నియమములను కవులు అంగీకరించిరి. సామాజికులు నాటక ప్రదర్శనములోని కాల సంకోచమునకు అలవాటుపడిన వారగుట అందు అసంభవత్వము గోచరింపదు.

ఒకప్పుడు సంభవములుకొన్ని అసంభవములుగ నగపడును "Truth is stranger than fiction" అను సామెత మనము విననిది కాదు. నాటకము చూచువారికిని జదువువారికిని అసంభవములని తోఁపఁదగువానినే కవి ఆలోచింపవలయును.

రసలుబ్ధుఁడు నాటకములోని విషయములను జ్ఞప్తి పెట్టుకొని యుండిన ఇన్ని సందేహములకుఁ బ్రశ్నలకు అవ

కాశముండి యుండదు; వ్యాసమును ఇంతనిడివిదైయుండదు. తన ప్రశ్నలకుఁ జాలవఱకు నాటకమునందె ప్రత్యుత్తరము లున్నవి. అసంభవముల విచారించునపుడు రసలుబ్ధుని సంఖ్యాక్రమమునే అనుసరించెదను

(1) ప్రబల శత్రువైన కుంభరాణా రాజ్యమునఁదాను బ్రవేశించుట సాహసకార్యమని అగ్బరెఱుంగును; అయినను మీరా సందర్శనము అవశ్యకర్తవ్యమని తలఁచెను. ఇందువలన అగ్బరుని సాహాసికత్వము (Adventurous spirit) మనకు గోచరించును. రహస్యముగఁ బరదేశమును బ్రవేశించువారు రాజులయ్యును మందుగుండు సామగ్రి వెంటఁ బెట్టుకొని పట్టపుటేనుఁగునెక్కి రారుగదా! అగ్బరు, విరోధిరాష్ట్రమున నిస్సహాయుఁడై కాలువెట్టఁడు అను ప్రజల నమ్మకమె వానికి రక్షక కవచమైనది. యూరపుదేశమున జరిగిన మహాసంగ్రామమున కైజరు పుత్రులలో నొకఁడు మాఱువేసమున, సీన్ నదిప్రక్క విడిసిన ఫ్రెంచి పటాలపు బిడారునఁ బ్రవేశించి కావించిన యద్భుత సాహసకార్యములు చదివిన అవి సత్యములా లేక కల్పితములా యను సందేహమునకుఁ బాల్పడుదుము.

అగ్బరు వజ్రహారమును గురుకట్నముగసమర్పించెను. తానట్లుచేయుట పొరపాటని వెనుక చింతించెను. ఇట్టి పొరపాటులుపడు మనుష్యులొకచోటఁ జేరినప్పుడే ట్రాజెడీ కలుగును.

(2) ఇచ్చట రసలుబ్ధుఁడు పొరపడినాఁడు. రాణా కుమారసింహుని మొదటితూరి పంపినపుడు అగ్బరును చంపు

టకుగాఁ బంపలేదు; మీరాను అనుసరించుటకు బంపెను. చంపుటకుఁ దనకు ఆజ్ఞ లేదుగావున రాణాయొద్దకు వచ్చెను. రసలుబ్ధుఁడు తలఁచినట్లు "చంపుమన్న యాజ్ఞను" దాను దాఁటలేదు. ఆ యాజ్ఞ రెండవతూరిది.

(3) రసలుబ్ధుఁడు తన సంచిలోని "రేచీకటి కాటుక"ను దాను కన్నులకుఁ జరుముకొన్నట్లు తోఁచదు. అట్లయిన అప్పటి పరిస్థితులు చక్కఁగ గోచరించియుండును. ఆసమయమున మంత్రులును ఇతర సేవకులును బెడిసిపోయి యుండిరి. కుమారసింహుఁడొక్కఁడే రాణాకుఁ బట్టుఁగొమ్మ. కావున వానినే పంపెను ఇదంతయు రాత్రికాలమున రాజప్రాసాదమున జరిగెను. బెడిసిపోయిన మంత్రులకును దండనాథునకును ఈసంగతి యెట్లు తెలిసి రాణాకు సహాయపడుదురు? రాణా సొంతముగ వారి సహాయ్యముకోరునా? అగ్బరు సిబ్బందితో రాలేదని రాణా యెఱుంగును. అట్లు వచ్చియుండిన వేగులవారు తెలిసికోకయుందురా? తలారి చెప్పినపుడుగూడ ఇద్దఱు బాటసారులనియొగదా చెప్పెను. అగ్బరును జంపుటకు ఒక్క రసపుత్రుని బంపుట తప్పుఁట! పద్మినీ సందర్శనమునకై వచ్చిన యల్లాయుద్దీనుని ముప్పదివేల సైన్యమును ఏడు వందలమంది రసపుత్రవీరులేగదా చించి చెండాడినది.

(4) సంభవమే. ఏలయన అగ్బరు 'మరణము రాజునకుఁ బ్రియము—ఆజ్ఞాతృణీకరణాపరాధమువలనఁ గలుగు నప్రియముకంటె ఈ వృత్తాంతము నెఱింగించుటవలన గలుగు ప్రియము హెచ్చుగానుండునని తలఁచి కుమారుఁడు రాణా యొద్దకి పరుగెత్తెను.

(5) ఇచ్చట గనబడిన సందేహము సహేతుకము. మీరా మరణవార్తను అగ్బరుచే నొకమాటలో చెప్పించి యున్న ఈ సందేహమునకుఁ దావుండదు.

(6) తన యాజ్ఞను నిర్వర్తించునను నమ్మకముచేతనే రాణా మీరాను ఆజ్ఞాపించెను. ఆమె తిరస్కృతియుఁ గాన రాదు. రెండవమారు కుమారుఁడు అగ్బరు ఉదంతము చెప్ప వచ్చినపుడు మీరా యమునామార్గమునఁ జనుచుండెనని చెప్పెను. రాణా సేనకవర్జితుఁడయ్యును ఆజ్ఞాపింపఁగల స్థితి లో లేకదా యున్నాఁడు. మీరా తన యాజ్ఞను తృణీకరించిన అప్పటి యతని నిర్ణయ మెట్లుండునో మన మెట్లూహింపఁ గలము ?

(7) కుమారసింహుఁడు ముందు బయలుదేరెను; అగ్బరు తానుసేనయున్న స్థలమున వెదకెను. వారచ్చట లేరు. అతఁడు వారిని వెదకుచుండెను. కుంభరాణా అతనికన్న అయిదు (లేక) పది నిముసములకు వెనుక బయలుదేరెను. అడ్డదారిబట్టి కుమారునికన్న ముందు ఆ స్థలమునకుఁ బోయి వెదకుచుండెను. వెనుక వచ్చు కుమారసింహునికి ముందుఁ బోవు రాణా యగపడుటయెట్లు అసంభవము? కుమారుఁడు "తండ్రీ, నీ వేల యింతలో నిచ్చటికి వచ్చితివి?" అనెను. తాను వచ్చుటకు ముందుగనే యెట్లు వచ్చితివను భావమె గదా ఆ వాక్యమున ధ్వనితమగుచున్నది.

(8) కుమారుఁడు తన్నుఁదాను పొడుచుకొనెను; పొడుచుకొన్నట్లు నటించి రాణాచేఁ బొగడించుకొనుటకుఁ గాదు, దుఃఖభారమును సహింపలేకయే, పొడుచుకొనెను.

తన్నుఁ దానే కుదురుపాటునఁ బొడుచుకొనెను గావున 'ఆయపుఁబట్టు' చూచి పొడుచుకొనెను. అప్పటికిని గ్రుక్కుమిక్కు మనక చావలేదు. తన విషాదమును వెలిపుచ్చు మాటలు పలికియే మరణించెను. ఇచ్చట కుమారుఁడు మహోపన్యాసము నొసఁగలేదని కాఁబోలు రసలుబ్ధుని కొఱంత!

కుమారసింహుఁడు కుంభుని చీఁకటిమఱుఁగునఁ బొడిచెను. ఆ సమయమునకుఁ దనవైపున కేప్రక్క కనఁబడుచుండెనో ఆ ప్రక్కనే పొడిచెను. బహుశః వెనుకప్రక్కగ నుండవచ్చును. ఆ పోటు సద్యోమరణసంపాదికాక పదినిమిషములు బ్రతుకనిచ్చునదిగా నుండును. ఇందేమి నిర్వహణంపు తబ్బిబ్బు కనఁబడుచున్నది? అది యెచటనున్నదో రసలుబ్ధుఁడు తన బుద్ధిని శోధించుకొనవలయును.

(9) (a) ఒకే విధమైన యాక్షేపములు చర్వితచర్వణముగ అందందుఁ దలయెత్తుచున్నవి. అందువలన నేనును బునరుక్తిదోషమునకు అగ్గము కావలసి యున్నది. రాణా హేతువాదియని యిదివఱకె తెలిపియుంటిని. మీరా మతము నెడ నతనికి సహానుభూతి లేదు; తన గార్హస్థ్య సుఖమునకు భంగము కలుగుటవలన మతద్వేషము మఱింత నిశితమైనది. కాని, యా మతద్వేషమొక్కటియే యైన ఇట్టి ట్రాజెడీ జరిగి యుండదు. అగ్బరు అంతఃపురములోనికి వచ్చుటయె ట్రాజెడీకి కారణము. మీరా ప్రసిద్ధభక్తి అగ్బరును రప్పించుటకు హేతువైనది. రాణా మీరాను శిక్షించుట తనమతము కన్న భిన్నమతము నవలంబించినందుకుఁగాదు; అగ్బరుపై మరులుగొన్నందుకు. అగ్బరు ఒట్టుపెట్టుకొని చెప్పిన మాటల

వలన మీరా నిరపరాధయనియుఁ దానే భ్రాంతి పడె ననియుఁ దెలిసికొని చింతించెను. కష్టములు తలదాఁకినపుడు మనస్సులోఁ గొంత మాఱుపాటు సహజమేగాని, అవి మనః ప్రకృతిని మునుముట్ట మార్పఁజాలవు. మతము మాఱదు— శైవుఁడు వైష్ణవుఁడు కాడు, వైష్ణవుఁడు శైవుఁడుకాడు. క్రైస్తవుఁడు మహమ్మదీయుఁడు కాఁడు, నాస్తికుఁడు ఆస్తికుఁడుకాడు. భ్రాంతిచే నిరపరాధను, భార్యను, చంపితినిగదా యను దుఃఖాగ్ని హృదయమును బరితపింపఁజేయుచుండ మతభేదముల మంచిసెబ్బరలు తలపోయుటకేమి యవకాశము గలదు ఆ దశలో?

(9) (b) రాణా మీరాను నిర్బంధమునందుంచినది తన భార్య వీథుల వెంబడి పిచ్చిపట్టి తిరుగుచున్నదను అపవాదము నుండి కాఁచి కొనుటకును, కృష్ణమందిరమునకుఁ బోనీయకుండుటకును. మిగతదానికి సమాధానము (9) (a) లోనే కలదు.

(10) ఇది స్టేజిలో సరియైన దీపసౌకర్యములు లేనందున కలిగిన లోపము. నాటకమున నట్లులేదు.

(11) ధ్యాన నిర్మగ్న చిత్తులై యొడలెఱుంగనివారు ఎల్లకాలమట్లే యుండరు; కొంతసేపటికి వారికి సామాన్య మనఃస్థితి గలుగును. రామకృష్ణ పరమహంసయు నిట్లె కొన్ని గంటలో (లేక)యొకటి రెండు దినములో ధ్యాననిర్మగ్నుఁడై యుండి మరల సామాన్య మనఃస్థితిని పొందుచుండెను. ఇది సహజమే. యమునాతీరమునకు వచ్చుచుండినపుడు

మీరాబాయి సామాన్య మనఃస్థితియందే యుండెను. కావుననే అగ్బరు తాన్‌సేనులతో సంభాషించెను.

(12) నాటకమునకు సంబంధింపని హల్లకల్లోలములో రసలుబ్ధునకుఁ బనియున్నను ఇతరులకుండదు—మీరాబాయి రాముఁడు కాదు. ఉదయపుర ప్రజలు అయోధ్యా ప్రజలు కారు.

(13) మేవాడ్ అనగా మధ్యదేశము. అంగరసపుత్రుల రాజ్యము చితోడ్‌గడు పూర్వరాజధాని, తరువాత రాజధాని ఉదయపురమునకు మార్చఁబడినది. యమున మేవాడులో ప్రవహించుటలేదు. బనాస్ నది ఉదయపురముప్రక్క ప్రవహించుచున్నది. ఈయుపనదియు యమునలో గలయును. ఈ నదికేమైన యమున యని మాఱుపేరున్నదో యేమొ తెలియదు—కథలో మాత్రము యమున యనియున్నది. కవియు ఆ యముననే గ్రహించి యుండునేమొ.

(14) సుశీల యెల్లపుడు దొంగలించు స్వభావము కలదియో కాదో చెప్పుటకు నాటకమున ఆధారములు లేవు. సుశీల తాను సొగసుకత్తెనను భ్రాంతికలది; తన్నలంకరించుకొనుటకా హారమును దొంగిలించియుండును. దానికి ఆ హారపు విలువ తెలియదు. సహజముగ దొంగ కాకపోయినను ఒక్కొక్కప్పుడు ఒకనికి దొంగలించుబుద్ధి కలుగుట అసంభవముకాదు. ఈ ప్రశ్నలు నాటక విమర్శకుఁడు అడుగవలసినవికావు—ఇట్టి ప్రశ్నలు పోలీసు స్టేషనులో ఉచితములుగా నుండును.

(15) తానెప్పుడో విన్న యుపశ్రుతి మరణసమయమున ఏల కుంభునకు జ్ఞప్తికి రావలయును? అట్లగునేని జ్ఞప్తికి రాఁదగినవికూడ చాలఁగలవు; నాటకములోని పాతిక భాగము పునరభినీతము కావలసియుండును! తన జీవితమును సింహావలోకనముగఁ జూచుకొన్న ఘట్టము ముందే దాఁటిపోయినది. ఈ మరణ సమయమునఁ దనమనము నాక్రమించు కొనఁదగిన భావములేవి? తన భ్రాంతి, మీరా మరణము, తన మరణము, వీనిని గుఱించిన తలపోఁతలేగదా సహజములును, సమంజసములును.

(16) మీరా పాటను గుఱించి యొకమాటైన కుంభుఁడు ప్రస్తావము చేయలేదఁట! ఇదియొక యసంభవమఁట! ప్రసక్తి లేనియపుడు ప్రస్తావ మెట్లువచ్చును— మీరా పాట కుంభునకుఁ గ్రొత్తది కాదు; లోకమునకు వింతగ నుండవచ్చును.

(17) ఇందలి యితివృత్తము సంప్రదాయాగతమై లోకమున వ్యాపించియున్నదనియుఁ జారిత్రకము కాదనియు ముందే తెలిపియున్నాను.

రసలుబ్ధుఁడు నాటక భాషను గుఱించియు నిట్లు విమర్శించెను: "మీరా నాటక భాషయందు ఉత్తమ మధ్యమ పాత్రలకిడిన యాంధ్రమందె ఇంగ్లీషు జాతీయము, వ్యాకృతాభాసము గ్రామ్యమును అందందుఁ జెవింబడుచుండెను. ఎన్ని వాక్యములో యింగ్లీషున కనువాదములు గాని తెలుగు జాతివి కావని తోఁచుచుండెను" శుద్ధ శ్రోత్రియుఁడై మడి

గట్టుకొన్న రసలుబ్ధుఁడే Tragic, conversion, అను ఇంగ్లీషు ముక్కలు వేయనిదే తన అభిప్రాయము వెల్లడింప లేని యపుడు ఇంగ్లీషు జాతీయము లేకయే వాక్యము రచింప లేని యపుడు ఇఁక ఇంగ్లీషు తెలుఁగులు నేర్చుకొన్న వారి విషయము వేఱుగఁ జెప్పవలయునా ? ఇంగ్లీషుభాష వ్యాపించి యున్న యీకాలమున నెందైన నొకచోట ఇంగ్లీషు జాతీయములు దొరలుటలో ఆశ్చర్యమేమియు లేదు. ఇంగ్లీషు జాతీయములు తెలుఁగు రూపముతో వాఙ్మయమునఁ బ్రవేశించి నపుడు అవి రమణీయములుగ నుండునేని అంగీకరించిన తప్పేమి? ఒప్పేయగును. ఇట్టి మార్పులు మనభాషలో నెన్ని జరిగియుండలేదు ? గుంటచిక్కుల సంస్కృతాన్వయము ధాటికే నాశనముగాని తెలుఁగుభాష ఇంగ్లీషు జాతీయములు కొన్ని చేరినంతనే చెడిపోవునా ?

Printed at the Weldun Press, Madras-21